


10.2.62
ఆంధ్రప్రదేశ్
సంపుటి: 6
సంచిక:
ఫిబ్రవరి. 1962
మాఘ-ఫాల్గుణ 1883



పువ్వులలో పంచతంత్రం: మర్కటం కిచకిచలు—మొసలి ధుమధుమలు

సంపుటి 6

సంచిక 4

ఆంధ్రప్రదేశ్

సచిత్ర మాస పత్రిక

రిపబ్లిక్ దినోత్సవ ప్రత్యేక సంచిక

ఫిబ్రవరి 1962

మాఘ-ఫాల్గుణ 1883 శకం

సంవత్సరచందా
3 రూపాయలు

విడిప్రతి వెల
25 నయాపైసలు

విషయసూచిక

ముఖచిత్రం :


హైద్రాబాదు సమీపంలో మీర్ ఆలం చెరువువద్ద నిర్మించబడుతున్న నూతనజంతు ప్రదర్శనశాలలో ప్రప్రథమంగా ప్రవేశపెట్టబడిన "జంతువు" ఈ హరిణాన్ని జనవరి 18 వ తేదీన యూనియన్ వ్యవసాయశాఖ మంత్రి డా. పంజాబ్‌రావ్ దేశ్‌ముఖ్ ప్రదర్శనశాలలోనికి వదిలారు.

వెనుకఅట్ట :

కృష్ణా జిల్లా కైకలూరు సమీపంలో ఉప్పుటేరువంతెనవద్ద ఉన్న ఒక గ్రామం. ఈ గ్రామంవద్ద చేపలుపట్టుతున్న దృశ్యం

రచయితలు

1. శ్రీ జె బాపురెడ్డి, ప్రొబేషను డిప్యూటీ కలెక్టరు విశాఖపట్నం.
2. "ఉదయభాను", హైద్రాబాదు
3. శ్రీ చల్లా రాధాకృష్ణ శర్మ, మద్రాసు
4. శ్రీ బోయి భీమన్న, ట్రాన్స్‌లేటర్ టు గవర్నమెంటు, హైద్రాబాదు.
5. శ్రీ. ఆవంత్స వేంకటరంగారావు, విజయనగరం విశాఖపట్ణం జిల్లా.
6. శ్రీ కె. ఉమాకాన్తరావు, జూనియరు తెలుగు పండితులు, వివేకవర్ధని విద్యాలయము, మట్టంపల్లి, నల్గొండ జిల్లా.
7. శ్రీ తాళ్లూరి నాగేశ్వరరావు, నన్నపనేనివారి వీధి తెనాలి, గుంటూరు జిల్లా.
8. శ్రీ కె. పురుషోత్తంరెడ్డి, ప్రెసిడెంటు, కేంద్ర సహకార బ్యాంకు, భువనగిరి, నల్లగొండ జిల్లా.
9. శ్రీ జి. వి. రామమూర్తి, దక్షిణ భారత హిందీ ప్రచార సభ. హైద్రాబాదు - 4.
10. "శాంతిప్రియ" హైద్రాబాదు.
11. పద్మశ్రీ శ్రీ సి. నరసింహం, ప్లానింగు అభివృద్ధి శాఖల కార్యదర్శి, అదనపు డెవలప్‌మెంటు కమిషనరు, ఆంధ్ర ప్రదేశ ప్రభుత్వం. హైద్రాబాదు.
12. శ్రీ నెల్లూరి కేశవస్వామి, హైడ్రాలిక్ రిసర్చి లెబొరేటరి. హిమాయత్ సాగర్, హైద్రాబాదు.
13. శ్రీ శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి, ప్రధానోపాధ్యాయులు, జిల్లాపరిషత్తు హయ్యర్ సెకండరీ పాఠశాల, పార్వతీపురం, శ్రీకాకుళం, జిల్లా.
14. శ్రీ తంగిరాల వేంకటసుబ్బారావు, తణుకు, పశ్చిమ గోదావరి జిల్లా.
15. శ్రీ కమ్మిశెట్టి వేంకటేశ్వరరావు, హైద్రాబాదు.
16. శ్రీ యర్రమిల్లి చలపతిరావు శ్రీవత్సవ, ఆదర్శ సాహితీ సమితి, తుని, తూర్పు గోదావరి జిల్లా.
17. శ్రీ పేరాల భరతశర్మ, దానవాయిపేట, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా.
18. శ్రీ కర్రా చంద్రశేఖర శాస్త్రి, తెలుగు పండితులు జిల్లాపరిషదున్నత పాఠశాల, రాయవరం, తూర్పు గోదావరి జిల్లా.



పద్మశ్రీ శ్రీ సి. నరసింహం ఐ. ఎ. యస్.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉన్నతోద్యోగిగా ప్రశంసనీయమైన సేవచేసినందుకు భారత రాష్ట్రపతి చేత "పద్మశ్రీ" బిరుదంతో గౌరవింపబడిన మన ప్రభుత్వ ప్రణాళిక స్థానిక పరిపాలనా శాఖల ప్రత్యేక కార్యదర్శి శ్రీ సి. నరసింహం ఐ. ఏ. ఎస్. 1905 ఫిబ్రవరి 23 వ తేదీన జన్మించారు. రామచంద్రపురం ఉన్నత పాఠశాలలోనూ, కాకినాడ పి. ఆర్. కళాశాలలోనూ, మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలోను విద్యాభ్యాసం చేశారు. గణిత శాస్త్రంలో ఆనర్స్ డిగ్రీ పొందారు. మద్రాసు న్యాయకళాశాల నుంచి బి. ఎల్. పట్టాపుచ్చుకున్నారు. జిల్లా పంచాయతీ అధికారిగా 1931 వ సం లో ఉద్యోగంలో ప్రవేశించారు. 1934 లో మునిసిపల్ కమీషనరు అయ్యారు. బరంపురం, నెల్లూరు, కోయంబత్తూరు, విజయవాడ మొదలైన అనేక ప్రదేశాలలో పని చేశారు. 1943 లో మద్రాసు కార్పొరేషను కమీషనరుకు పర్సనల్ అసిస్టెంటుగా నియమితులయ్యారు. 1946 లో డిప్యూటీ కమీషనరుగానూ, ఆ మరుసటి సంవత్సరం కమీషరుగాను నియమించబడినారు. 1952 లో ఇండియన్ ఎడ్మినిస్ట్రేటివ్ సర్వీసులో చేర్చుకోబడినారు. కార్పొరేషనులో సుమారు 10 సంవత్సరాలు పని చేసిన తరువాత మద్రాసు మతాదాయ ధర్మాదాయ శాఖ కమీషనరు అయ్యారు.

కర్నూలులో తాత్కాలిక రాజధానిని నెలకొల్పటానికై ఏర్పాట్లు చేసే నిమిత్తం 1953 ఆగష్టులో ప్రత్యేక కలెక్టరుగా నియమించబడినారు. 1953 అక్టోబరు 1 వ తేదీన హోంశాఖ సంయుక్త కార్యదర్శి అయ్యారు. 1955 మార్చిలో విద్యాశాఖ కార్యదర్శిగా నియమించ బడినారు. 1955 అక్టోబరులో డెవలప్‌మెంటు కమీషనరుగాను, ప్రణాళికా శాఖ కార్యదర్శిగాను నియుక్తులయ్యారు. రాష్ట్రాల పునర్నిర్మాణం తరువాత ఆంధ్రప్రదేశ్ ప్రణాళికాశాఖ కార్యదర్శిగా, అదనపు డెవలప్‌మెంట్ కమీషనరుగా నియమించ బడినారు.

1961 నవంబర్ 9 వ తేదీ నుంచి శ్రీ నరసింహంగారు ప్రణాళిక స్థానిక పరిపాలన శాఖ ప్రత్యేక కార్యదర్శిగా పని చేస్తున్నారు.

ఒక ఉన్నతోద్యోగిగా ప్రశంసనీయమైన సేవ చేసినందుకుగాను భారత రాష్ట్రపతి వీరిని రిపబ్లిక్ దినోత్సవసందర్భంగా "పద్మశ్రీ" బిరుదంతో గౌరవించారు.

అయిదు అయిదడుగులు

శ్రీ జె. బాపురెడ్డి

మానవుడు యంత్రమ్ము ఒకటై
మార్పు చక్రము త్రిప్పుచున్నవి
శ్రమము, త్యాగము భావిభారత
జాతి సౌధము నిల్పుచున్నవి
చేతన ప్రభపూచె నేడా
సేతుశీతాచలము వరకు
ఎన్నొ నవభావనల రాకెటు
లెగసినవి నాహృదయరోదసి.

చీకటుల చెండాడి వెన్నెల
వాకలను పండించి రదుగో
వెలుగు బాటలు వేసి భారత
వీరు లోకమ్మై నడిచి రదుగో
ఢిల్లిలో ప్రతి పల్లెలో రా
గిల్లె నవనిర్మాణ శోభలు
గనులలో క్షేత్రములలో కిం
కిణులు మ్రోసెను భాగ్య దేవత.

నదులు నదములు ప్రేమసాగర
హృదయలై, ఆ కొండకోనలు
వీడి వచ్చెను పల్లె సీమల
చూడగా, వేడుకలు హెచ్చెను
సాగరము పాలైన ఝురులే
శ్రమిక జీవుల నవ్య జీవన
సాగరములై నాగార్జున
సాగరములై పొంగివచ్చెను.

రూరుఖేల, భిలాయి ,దుర్గా
పూరులోన బిహారు లోన
భారతీయార్థిక విధాన ను
ధీర దాల్చెను 'ఉక్కు కవచము'
ఈతిబాధా రాక్షసులు సరి
యింతు రీశాంతి విప్లవమున
మన సమాజాబ్జమ్ము వికసిం
చెనదె రః అరుణోదయమ్మున.

నా ఎడదలో నాగృహమ్మున
నవ్వె విద్యుద్దీప మాలలు
నేడుప్రతి ఊరున స్థిరముగా
నిల్చెదీపావళి విలాసము.

ప్రతిభరత పౌరునికి విద్యా
మృతము త్రాపును నేడు శారద
జీవితాశలు పండగా వ
ర్షించెను ప్రజాస్వామ్య నీరద
మనదృఢమ్మగు ఏకతా బల
మునకు లోకము విస్తుపోయెను
మన సదాశయములకు తన సం
పదల నిచ్చెను ప్రకృతి దేవత.

అయిదు అయిదడుగులే ముందుకు
అదుగొ భారత జాతి సాగెను
అంతలోనే దివ్యసృష్టికి
ఎంతయో దగ్గరగ చేరెను.

వెలుగుబాటలు

"ఉదయభాను"

స్వాతంత్ర్యానంతరం మహిళా సంక్షేమానికి ప్రభుత్వపరంగా, స్వచ్ఛంద సంస్థలపరంగా ద్విగుణీకృతమైన కృషి జరుగుతున్నది. ప్రభుత్వపరంగా జరిగే కృషి, గత కొద్ది సంవత్సరాలలో అనేక రెట్లు పెరిగింది. అయితే జనాభాలో సగం ఉన్న స్త్రీ జనానికి యీ కృషి మాత్రమే సరిపోదు. ప్రభుత్వపరంగా జరిగే కార్యక్రమాన్ని మరింతగా విస్తృత పరచడానికి అంతగా అవకాశాలు లేకపోయినా స్వచ్ఛంద సంస్థలు ప్రజా విరాళాల ద్వారా తమకృషిని ఎన్నోరెట్లు విస్తృత పరచవలసిన అవకాశమూ, అవసరమూ ఉన్నది.

వరకట్న విధానంవలన ఎక్కువగా స్త్రీలే నష్ట పడుతున్నారు. అనేక మంది పిల్లల్ని కని, ఆ పిల్లలతో సరిగా నిద్ర లేకబలహీనులై అనారోగ్యంతో బాధపడుతున్నవారు స్త్రీలే. ఇలాంటి పరిస్థితులకు లోనయిన స్త్రీలు 30 ఏండ్లకే వృద్ధులైపోతున్నారు. బాల్య వివాహాల వలన యితర కారణాలవలన కొందరు స్త్రీలకు చిన్న వయస్సులోనే వైధవ్యం ఏర్పడుతున్నది. మరి కొందరు స్త్రీలు భర్తలచే విడవబడి అనాథలై పోతున్నారు. ఇలాంటి పరిస్థితులలో కొందరు స్త్రీలు జీవనాధారానికి పడుపు వృత్తి నవలంబిస్తున్నారు. సమాజంలో స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడం అనేక యిబ్బందుల్ని కల్గిస్తుంది. వ్యభిచారానికి ప్రధాన కారణం ఆర్థికమైనదేనని సర్వత్రా అంగీకరించబడింది. పడుపు వృత్తి నవలంబించిన స్త్రీలు చివరకు సుఖ వ్యాధులతో క్షీణించి పోతూ సమాజానికి భారంగా తయారవుతున్నారు. ఇలాంటివారందరినీ ఉద్ధరించ వలసిన అవసరం ఉన్నదని ప్రభుత్వం గుర్తించే స్త్రీ సంక్షేమ శాఖను వివిధ రూపాలుగా విస్తృత పరుస్తున్నది.

సామాన్య స్త్రీలకు కూడా మహిళా సంక్షేమ కార్యకలాపాల ద్వారా ప్రయోజనాన్ని కల్గించడం జరుగుతున్నది. ఉద్యోగాలు చేసే స్త్రీలకు తగిన వసతి గృహాలుమున్నగు సౌకర్యాల్ని కల్గించడం కూడా జరుగుతున్నది. మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక బాధల్ని నివారించడానికి స్త్రీలకు అదనంగా కొంత ఆదాయం వచ్చే మార్గాలు కల్పించడం జరుగుతున్నది. ఎన్ని ఆర్థిక యిబ్బందులకు లోనయినా కొందరు పేద కుటుంబాలలోని స్త్రీలు ఆదాయమార్గాల్ని గురించి అంతగా పట్టించుకోరు. పైగా అది కుటుంబ గౌరవానికి భంగ కరమనే అభిప్రాయాన్ని కూడా కలిగి ఉంటారు. అలాంటి వారికి మహిళా సంక్షేమ ఆర్గనైజర్లు పరిస్థితుల్ని వివరించి, నచ్చచెప్ప కోవలసి ఉన్నది.

వ్యభిచార వృత్తి నుండి స్త్రీలను రక్షించి రక్షణ గృహాలలో వారికి చేతి వృత్తులు, కుట్టుపని మున్నగు వాటిలో శిక్షణ గరపి ఆ గృహాల నుండి విడుదలైన తరువాత గౌరవ ప్రదమైన జీవితాన్ని గడిపేటట్లు చేయడంలో మన ప్రభుత్వ మహిళా సంక్షేమశాఖ కార్యకలాపాలు చాలా దోహదం చేస్తున్నవి. వారందరి ఆరోగ్యం కూడా పరిశీలించబడి తగు చికిత్సలు కూడా ఏర్పాటు చేయ బడుతున్నవి. అలాగే మధ్య తరగతి స్త్రీలు తీరిక సమయాలలో ఏదో చేతి వృత్తిని నేర్చుకోవడానికి శిక్షణ ఏర్పాట్లు చేయ బడుతున్నవి.

ఇలాంటి కార్యకలాపాల్ని నిర్వహిస్తున్న రాష్ట్రంలోని అనేక స్వచ్ఛంద సంస్థలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తున్నది. ఇలాంటి సంస్థలలో ముఖ్యంగా పేర్కొన దగినది ఆంధ్ర మహిళా సభ. ఈ సంస్థ కేంద్ర స్థానం మద్రాసే

అయినా ఆంధ్ర ప్రదేశ్ రాజధానిలో ఈ శాఖను నెలకొల్పి బర్కత్ పూరలోని మూడు భవనాలలో ప్రాంతీయ చేతి పనుల శిక్షణాలయం, చేనేత విభాగం, సంక్షిప్త విద్యా ప్రణాళిక, పట్టణ సంక్షేమ ప్రణాళికను అమలు జరుపుతున్నది ఈ సంస్థ నిర్వహించే శిక్షణ విభాగాలలోని వారికి వసతి గృహం కూడా ఉంది. ఆంధ్ర మహిళాసభకు హైద్రాబాద్‌లో స్వంత భవనాలు నిర్మించబడుతున్నవి.

బర్కత్‌పురాలోనే ఉన్న ఆంధ్ర యువతీ మండలి స్త్రీల సంగీత, నృత్య, హిందీ శిక్షణకు తగు సౌకర్యాల్ని కల్పించడమే గాక ఉద్యోగినులకు వసతి గృహం, పసిపిల్లలకు క్రెష్, స్త్రీలకు గ్రంధాలయం, క్లబ్‌లను నెలకొల్పి ఆటల పోటీలను కూడా అప్పుడప్పుడూ నిర్వహిస్తున్నది

భారత సేవక సమాజం కూడా పైలట్ విస్తరణ ప్రాజక్టు ద్వారా స్త్రీలకు చేతి వృత్తుల విభాగాన్ని నిర్వహిస్తున్నది భారత సాంఘిక సేవా సమితి మహిళా ఉద్యోగ పథకాన్ని ప్రారంభించి వివిధ ప్రాంతాలలో పారిశ్రామిక సహకార సంఘాలు, టేనీటి కేంద్రాలు, చక్కెర ప్యాకింగ్ కేంద్రాలు, కుట్టు పని కేంద్రాలు నిర్వహిస్తున్నది. అలాగే నారీ సుధార్ సొసాయిటీ, కస్తూర్బా గ్రామ సేవికా విద్యాలయం, అరుంధతీ శరణాలయంలాటి సంస్థలు యీ రంగంలో విస్తృత కృషి జరుపుతున్నవి.

రాష్ట్ర సాంఘిక సంక్షేమ సలహాసంఘం కేంద్ర సాంఘిక సంక్షేమ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వానికిమధ్య లయజన్‌గా పనిచేస్తూ స్వచ్ఛంద సంక్షేమసంస్థలకు గ్రాంటులు వయోజన స్త్రీలలో విద్యావ్యాప్తికి సంక్షిప్త కోర్సులు, పైలట్ సంక్షేమవిస్తరణ పథకాలు, కుటుంబ సంక్షేమ పారిశ్రామిక సహకార సంఘాలకు సహాయం, అలవాటు నేరస్థుల పునరావాసం లాటి కార్యకలాపాలలో శ్రద్ధతీసుకొంటున్నది. శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కేంద్రబోర్డు అధ్యక్షురాలు. రాష్ట్ర సలహాసంఘానికి శ్రీమతి ఎ. శ్యామలాదేవి అధ్యక్షురాలు.

మహిళా సంక్షేమానికి మహిళలు, బాలికలలో విద్యావ్యాప్తి ఆవశ్యకతను గుర్తించిన భారత ప్రభుత్వం 1959 లోనే మహిళా విద్యాజాతీయ సమితిని ఏర్పాటుచేసింది. దీనికి ప్రస్తుతం శ్రీమతి రక్షాశరణ్ అధ్యక్షురాలు. 1962 జనవరి నెలలో యీ సమితి పునర్నిర్మించబడింది. రాష్ట్రప్రభుత్వం కూడా శ్రీమతి చోడగం అమ్మన్నరాజా, ఎం. ఎల్. ఏ. అధ్యక్షతన రాష్ట్రస్థాయిలో మహిళా విద్యా సమితిని ఏర్పాటు చేసింది. కేంద్రసమితి లోగడనే భారత ప్రభుత్వానికి విస్తృతమైన నివేదికను సమర్పించింది. అది భారతప్రభుత్వ పరిశీలనలో ఉంది.

రాష్ట్రసమితి అధ్యక్షురాలు శ్రీమతి అమ్మన్నరాజా తమసమితిచేసే సిఫార్సుల అమలుకు ఒక ప్రత్యేకనిధి —యీ సంవత్సరం రు. 25 లక్షలు—అవసరమన్నారు.

ఈ సమితి స్త్రీలకు పార్టుటైం శిక్షణ ఏర్పాట్లు, ఉద్యోగ కల్పన, పారిశ్రామిక శిక్షణ కేంద్రాల స్థాపనలాటి అంశాల్ని పరిశీలించి గ్రామీణప్రాంతాలలో మహిళా ఉపాధ్యాయుల సంఖ్యను హెచ్చించాలనీ, బాలికల పాలీటెక్నిక్‌లను అధికం చేయాలనీ. గృహ శాస్త్రంలో డిప్లోమా కోర్సుల్ని విరివిగా ఏర్పాటుచేయాలనీ, స్వచ్ఛంద సంస్థలకు యథోచితంగా సహాయం చేయాలనీ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.

ఇటీవల పంచాయతీ రాజ్యం ప్రవేశపెట్ట బడటంతో సమాజాభివృద్ధి బ్లాకులలో ముఖ్యసేవికలు, గ్రామసేవికల ద్వారా గ్రామాలలో మహిళా మండలులను ఏర్పాటుచేసి స్త్రీలకు కుట్టుపనులు, అల్లికనేర్పి తీరికవేళలలో వారి ఆదాయాభివృద్ధికి దోహదం చేయడం జరుగుతున్నది.

తృతీయ పంచవర్ష ప్రణాళికలో మహిళా సంక్షేమానికి రు. 41,71 లక్షలు కేటాయించబడినవి. అందులో ప్రథమ సంవత్సరం అంటే 1961-62 కు రు. 5.37 లక్షలు ప్రత్యేకించబడినవి. రక్షణ గృహాలలో మొత్తం ఐదు ఉత్పత్తి కేంద్రాల్ని నెలకొల్పడానికి తృతీయ పంచవర్ష ప్రణాళికలో సంకల్పించబడింది. ప్రథమ ద్వితీయ ప్రణాళికల కాలంలో యిలాంటి ఉత్పత్తి కేంద్రాలు నెలకొల్పబడలేదు.

రాజమండ్రిలో ఉన్న మొదట వీరేశలింగంగారు నిర్మించిన అనాధశరణాలయంలో కూడా చాలా ప్రశంసనీయమైన కృషి జరుగుతున్నది. అనేకమంది అనాధులు అజ్ఞానాపకాశాన్ని పారద్రోలి విజ్ఞాన సముపార్జన జేస్తున్నారు, వివిధరకాల వృత్తివిద్యల్ని నేర్చుకుంటున్నారు.

బీద కుటుంబాలకు చెందిన అనాధస్త్రీల రక్షణగృహాలు ద్వితీయ ప్రణాళికా కాలంలోనే నెలకొల్పబడి పనిచేస్తున్నవి. అందులోని వారికి వైద్య సహాయం, సామాన్యవిద్యకు అవకాశం కల్పించబడుతుంది. సాధారణంగా ఇ. ఎస్. ఎల్. సి. వరకే

విద్యగరపబడుతున్నా అందులో తెలివైనవారికి మెట్రిక్యులేషన్ వరకూ విద్య గరప బడుతుంది. ఆతరువాత వారుపాధ్యాయ శిక్షణ, నర్సుల శిక్షణ, చేతివృత్తుల శిక్షణ. మున్నగు వాటిలో చేరి తమను తాము పోషించుకోగలరు.

మహిళా సంక్షేమశాఖ క్షేత్రసిబ్బందికి శిక్షణ పథకం అమలు జరపబడింది. ఏలూరు, కర్నూలు, అనంతపురం, కడప, శ్రీకాకుళం మున్నగు ప్రాంతాలలో వృత్తిశిక్షణ కేంద్రాల్ని ఏర్పాటుచేసి టైపురైటింగ్, సంక్షిప్త లేఖనం, అకౌంటన్సీ మున్నగు సౌకర్యాల్ని విద్యావతులైన నిరుద్యోగ బాలికలకు కల్పిస్తున్నది. దూర ప్రాంతాలనుండి యీ కేంద్రాలకు శిక్షణ నిమిత్తం వచ్చే స్త్రీలకు వసతిగృహాలుకూడా నెలకొల్పబడుతున్నవి. కడప, ఏలూరు, అనంతపురంలలో యిప్పటికే యివి నెలకొల్పబడినవి.

మహిళా సంక్షేమశాఖ కార్యకలాపాలు విస్తృతం కావడంతో సిబ్బంది యిటీవల బాగా విస్తృత పరచబడింది.

రక్షణగృహాలనుండి విడుదల చేయబడిన స్త్రీలకు పునరావాస కార్యక్రమాలు ఏర్పాటు చేయబడినవి. ఈ కార్యక్రమంలో వృద్ధులు, నిస్సహాయులు అయిన స్త్రీలకు అర్థికసహాయం కల్పించబడుతుంది.

ఆంధ్ర తెలంగాణ ప్రాంతాలలో గల 20 మహిళాసంక్షేమ శాఖలు, క్రమేల అభివృద్ధికికూడా ప్రభుత్వం పూనుకొన్నది.

ఈ పథకాలన్నీ అమలు జరగడంతో రాష్ట్రంలో మహిళా సంక్షేమ కృషివలన మరింతమంది స్త్రీలు లాభ పడగలరు.



మనిషి పుట్టినపుడె మనసు పుట్టినదిర

మనసు పుట్టినపుడె మనిషిపుట్టె

మదికిలేని కులము మనిషికేదర చూడ

జనసుతాంతరంగః వినురరంగః

—కృష్ణశతకము



భాషాసాహిత్యాలు

భాషైక్యతా సాధన

శ్రీ చల్లా రాధాకృష్ణ శర్మ

రాజకీయ, సాంఘిక, ఆర్థికసమస్యలతో పాటు భాషా సమస్యలు కూడా నేడు మనదేశంలో తలెత్తుతున్నవి. ఈ భాషా సమస్యలు కొన్నిచోట్ల వెర్రితలలు వేసి వికటాట్టహాసం చేయడం శోచనీయం. భావవ్యక్తీకరణకు సాధనంగా ఏర్పడిన భాషను పురస్కరించుకొని సాంస్కృతిక సమన్వయాన్ని, దేశసమైక్యాన్ని సాధించడానికి బదులు సంకుచితమైన భాషాభిమానం అలవరచుకొని భాషాప్రయోజనాన్ని తారుమారు చేయబూనడం మరింత శోచనీయం!

విభిన్నమత సంప్రదాయములకూ, విభిన్న ఆచారవ్యవహారములకూ మాత్రమే గాక విభిన్నభాషా సారస్వతములకు కూడా మనదేశం ఆటపట్టుగా ఉన్నది. కాగా విభిన్న సంస్కృతులు కూడా చోటు చేసుకున్నవి. అందువల్లనే విభిన్న సంస్కృతుల కొలువుకూటంగా మన దేశాన్ని కొందరు వర్ణించారు. కాని ఆశ్చర్యం, ఈ భిన్నత్వంలోనే మన పూర్వులు ఏకత్వమును సందర్శించారు. ఇందుకు కారణం వారి ఆధ్యాత్మిక దృక్పథమే లని కొందరంటారు. ఇది నిజమే. కాని యిదే సంపూర్ణ సత్యమని భావించడానికి వీలులేదు.

ఆనాళ్లలో సంస్కృత భాషా సాహిత్యాలు సాంస్కృతిక సమన్వయాన్ని సాధించడానికి చక్కగా తోడ్పడినవి. ముఖ్యంగా విద్యావంతు లందరినీ ఒక్క త్రాటిమీదికి తీసుకరావడానికి సహాయపడినది. ఈ కారణంవల్లనే కన్యాకుమారినుండి కాశ్మీరం వరకూ పండిత లోకంలో సంస్కృత భాషా వాఙ్మయాలపై అపారభక్తి విశ్వాసాలు ఏర్పడినవి. సంస్కృతభాషకు ప్రచురప్రచారమూ లభించింది అయినా నాటికీ నేటికీ సంస్కృతం పండిత భాషగానే నిలిచిపోయింది. కాని భావసమైక్యాన్ని, తద్వారా దేశసమైక్యాన్ని సాధించేందుకు భాషా సాహిత్యాలు ఎలా సహాయ పడగలవో అనే సత్యాన్ని సంస్కృతం బాగా నిరూపించింది.

సంస్కృతానికి తర్వాత, మనదేశంలో భావసమైక్యానికి ఆంగ్లం తోడ్పడిందని చెప్పవచ్చును. కాని యిది కూడా కేవలం విద్యావంతుల భాషగానే నిలిచిపోయింది. స్వాతంత్ర్యానంతరం ఆంగ్లభాషాధ్యయనం అవసరమా, అనవసరమా అనే ప్రశ్న ఒకటి బయలుదేరింది. ఈ విషయమై తర్జనభర్జనలు, ఖండనమండనలు అనేకం సాగుతున్నాయి. నానాటికీ యీప్రశ్న తీవ్రరూపం దాలుస్తున్నది. ఆంగ్లభాషాసారస్వతాలను అధ్యయనం చేయడం ఎంతైనా అవసరం అని కొందరంటే, అనవసరమని మరికొందరు

భావిస్తున్నారు. ఏదియేలా వున్నా, ప్రస్తుతపరిస్థితులను దృష్టిలో ఉంచుకొని చూచినప్పుడు, మనదేశంలో ఆంగ్లం ఇక చాలాకాలం నిలవదని తోస్తున్నది. పైపెచ్చు హిందీ అధికారభాషగా గుర్తింప బడింది. తత్ఫలితంగా ఈ భాషాసమస్య జటిల సమస్యగా తయార యింది. అయినప్పటికీ, ఈనాడు కాకున్నా రేపటికైనా హిందీ మన ఉమ్మడి భాషగా రూపొందగలదని చెప్పవచ్చు. కాని ఒక్క విషయం. సంస్కృతం పండిత భాషగాను, ఆంగ్లం విద్యావంతుల భాషగాను రూపొందినట్లుగా, హిందీ ప్రభుత్వోద్యోగుల భాషగా పర్యవసిస్తుందేమో అనే సంశయం సన్నసన్నగా ఏర్పడుతున్నది. కనుక ప్రస్తుత పరిస్థితులలో భావసమైక్యానికీ, సాంస్కృతిక సమన్వయానికీ ఆయా ప్రాంతీయ భాషలు తోడ్పడి నంతగా సంస్కృతాంగ్ల హిందీభాషలు తోడ్పడవని పేర్కొనవచ్చును.

ప్రాంతీయ భాషల ప్రాముఖ్యాన్ని మనదేశ నాయకులు గుర్తించకపోలేదు. భాషల ప్రాతిపదికపై రాష్ట్ర పునర్నిర్మాణం జరగాలనీ, అందువల్ల పరిపాలనా సౌలభ్యం ఏర్పడుతుందనీ వారు ఆశించారు. తుదకు వారనుకున్నట్లుగానే భాషా ప్రయుక్త రాష్ట్రాలు అవతరించాయి. కాని లాభం? పరిపాలనా సౌలభ్యం మాట అటుంచి యితర విషయాలు చూస్తే, రాష్ట్ర పునర్నిర్మాణం వల్ల ఆశించినంతగా లాభం కలుగలేదనే చెప్పవలసివస్తుంది. రోజు రోజుకు మనదేశంలో సంకుచితమైన భాషాభిమానం పెరిగిపోతు న్నది. ఏభాషను వ్యవహరించేవారు ఆభాషయే గొప్పదనీ, అందు లోనే గొప్ప సాహిత్య సంపద ఉన్నదనీ ఇలా వట్టిగొప్పలు చెప్పుకోవడం పరిపాటి అవుతున్నది. కాకిపిల్ల కాకికి ముద్దు; అంతమాత్రాన భాషా సహనం కోలుపోయి భాషా దురభిమానాన్ని అలవరచుకోవడం భావ్యంకాదు. ఇందువల్ల దేశసమైక్యం కూడా దెబ్బతినే అవకాశం ఉన్నది. కాగా, కలుష పూరిత మవుతున్న యీ వాతావరణంనుండి బయట పడడానికి మార్గం ఒక్కటే ఒక్కటి కనబడుతున్నది. భాషా సహనాన్ని అలవరుచుకోవడమే ఆ మార్గం ఇందుకు భావసమైక్యాన్ని మనం తొలుత సాధించాలి. అనగా ఇతరభాషలలోని సాహిత్యసంపదను మనదిగా చేసుకొని యితరుల్ని సరిగా అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాలి.

ఒక భాషలోని ఉత్కృష్ట సాహిత్యాన్ని మరొక భాషలోకి తీసుక రావడం అంతసులభమైన పని కాదనే విషయం అనువాదాలు చేసే వారికందరకూ తెలిసినదే. అసిధారావ్రతం వంటిది అనువాదం. తు.చ. తప్పకుండా ఒక విషయాన్ని అనువదించినట్ల యితే, అది పాఠకుడికి రుచించక పోవచ్చును. ఎందుకనగా ఒక్కొక్క భాషలోను రచనా విధానమునకు సంబంధించిన సంప్ర దాయాలున్నవి. నుడికానుడి, వాక్యనిర్మాణం, వ్యాకరణాంశములు— మొదలైనవి భాషలోని ప్రత్యేకతను తెలియజేస్తూ వుంటాయి. వీటిని చక్కగా తెలుసుకుని అనువాదకుడు అనువాదానికి పూను కోవాలి. లేకుంటే అనువాదం స్నిగ్ధ సుందరంగా కనబడదు. అందులో సహజత లోపించవచ్చు. ఒకవేళ అనువాదకుడు కొంచెం స్వాతంత్ర్యం వహించి మూలానికి మెరుగులు దిద్దుతూ రచన సాగించే పక్షంలో అది అనువాద మనిపించుకోదు. కనుక అనువాదం మూలవిధేయం గాను ఉండాలి; అదే సమయంలో పఠన యోగ్యంగాను ఉండాలి. పైగా అనువాదకుడు ఏభాషనుండి అనువాదం చేస్తున్నాడో ఆభాషతో తగినంత పరిజ్ఞానం సంపా దించి వుండాలి. అనువాదంచేసే భాషలో పైపువాటను లెరిగిన రచయితయై వుండాలి.

మరొక ముఖ్య విషయాన్ని ఒక చిన్న ఉదాహరణతో మనవి చేస్తాను. తమిళులు సాదం సాప్పిడు, టిఫిన్ సాప్పిడు, కాఫీ సాప్పిడు అని అంటారు. అన్నం తిను (భోజనం చేయు), టిఫిన్ చేయి, కాఫీ తాగు—అనడం తెలుగువారి సంప్రదాయం. 'నేను విన్నాను' అనుటకు మదరాసు తెలుగువారు 'నేను విన బడ్డాను' అని తమిళుల్ని అనుసరించి (నాన్ కేళ్విప్పట్టేన్) చెప్ప డం వాడుక. కనుక అనువాదకుడు వాడుక భాషలోని ప్రయోగా లను కూడా గుర్తించి తదనుగుణంగా అనువాదం సాగించాలి.

అనువాదం ఇంతకష్టంతో కూడుకున్నప్పుడు, నాలుగు కాలాలపాటు నిలువగలిగే ఉత్తమ సాహిత్యాన్ని అనువదించడం ఎంత కష్టమో మనం ఊహించుకోవచ్చు. ఈ దృష్టితో చూచి నప్పుడు మన ప్రాచీనాంధ్ర కవుల గొప్పతనం తేటతెల్ల మవు తుంది. వారు వెలయించినవి నిజమునకు అనువాదాలు కావు; అవి అనుసరణ రచనలు. రసౌచిత్యములకు ప్రాధాన్యమిస్తూ మన ప్రాచీనకవులు మూల గ్రంథాలలోని కొన్ని విషయాలను పరి హరించారు. మరి కొన్నిటిని కుదించారు. కొన్నిటిని పెంచి వ్రాశారు. అవసరమని తోచినప్పుడు కొత్త విషయాలు చేర్చి తమ రచనలకు మెరుగులు సంతరించు కున్నారు వారు.

పూర్వంమాట ఎలా వున్నా, ఈనాళ్లలో అనువాద రచనలు ఆవశ్యకమని దేశదేశాల రచయితలూ గుర్తించారు. ఇతర భాషల లోని ఉత్తమ రచనలను తమ తమ భాషలలోకి అనువదించు కుంటున్నారు. ఇది సంతసింపదగిన విషయం, భారతీయ సాహి

త్యంపట్ల పాశ్చాత్యులు ఆదరాభిమానాలు ప్రదర్శిస్తున్నారు. మన సంస్కృతిని తెలుసుకోవాలనే అభిలాష కలిగింది వారికి. తత్ఫలితంగా వివిధ భారతీయ భాషలలోని రచనలు ఆంగ్ల, రష్యన్ మొదలైన భాషలలోకి పరివర్తింప బడుతున్నవి. అనువాద కార్యక్రమాన్ని యూనెస్కో వంటి సంస్థ కూడా ప్రోత్సాహించడం గమనింపదగిన అంశం. పాశ్చాత్య భాషలలోకి అనువదింపదగిన గ్రంథాలుగా తెలుగు నుండి వేమన పద్యాలను, గురజాడవారి కన్యాశుల్క నాటకాన్ని కేంద్ర సాహిత్య అకాడెమీ యూనెస్కో వారికి సిఫార్సు చేసింది.

పాశ్చాత్య సాహిత్యంలోని తీరుతెన్నుల్ని తెలుసుకునేందుకు మన దేశంలోని రచయితలు కూడా ఉవ్విళ్లూరుతున్నారు. అంతే కాకుండా మనదేశంలో యిరుగు పొరుగు భాషలలోని సాహిత్యములను పరిశీలించాలని కూడ మన రచయితలు ఆశిస్తున్నారు. ఔత్తరాహులు దక్షిణాది భాషలలో ఉన్న ఉత్తమ గ్రంథాలను తమ భాషలలోకి అనువదించుకుంటున్నారు. ఉత్తరాది విశ్వవిద్యాలయాలలో కొన్నిట దక్షిణాది భాషలు బోధింపబడుతున్నవి. అట్లాగే దక్షిణాపథంలోనూ హిందీ, బెంగాలీ మున్నగు భాషలను పలువురు అభ్యసిస్తున్నారు. అభ్యసించడమే కాకుండా, ఉత్తమ గ్రంథాలను హిందీలోకి అనువదిస్తూ భావసమైక్యానికి తోడ్పడుతున్నారు. ఇది ఎంతైన మెచ్చుకోదగిన సంగతి. కాని దాక్షిణాత్యులు చేసే హిందీ రచనలకు హిందీ సాహిత్య ప్రపంచంలో తగినంత గౌరవ ప్రపత్తులు లభ్యం కావడం లేదు. దక్షిణాత్యుల హిందీ రచన అంత ప్రశస్తంగా లేదని విమర్శించేవారు కొందరున్నారు. ఇది కొంతవరకు నిజమే అని అంగీకరించినా. ఇందులో ఆశ్చర్యపడవలసిన విషయమేమీ లేదు. ఎందు కనగా, ఎంత అభ్యసించినా మాతృభాష పట్టుబడినట్లుగా పరభాష పట్టుబడదు. పైగా జాతి వార్తా చమత్కృతులు, పలుకుబళ్లు మొదలైనవి ఆయా భాషలు వ్యవహరించేవారికి తెలిసినంతగా ఇతరులకు తెలియవు. కనుక ప్రారంభదశలో అనువాదాలు అంత ప్రశస్తంగా ఉండవు. ఒకవేళ హిందీ రచయితలు గాని, బెంగాలీ రచయితలుగాని దక్షిణాది భాషలు నేర్చుకొని తమ భాషలలోకి మన గ్రంథాలను అనువదించుకుంటే, శైలికి సంబంధించినంత వరకూ వారు రచనలు రమణీయంగా ఉండవచ్చునేమో కాని అవి యెంతవరకు మూల విధేయంగా ఉండగలవనే విషయం సందేహాస్పదమే. అందువల్ల ఉత్తమ సాహిత్యాన్ని అనువదించే సందర్భంలోనూ నిష్ణాతులయిన యిద్దరు రచయితలు కనుక సహకరిస్తే, ఆ అనువాదం మూల విధేయంగానూ వుంటుంది; రమణీయంగానూ వుంటుంది.

వివిధ భారతీయ భాషలనభివృద్ధి పరుచుట, ఆయా భాషలలోని సాహిత్య కార్యక్రమములను సమన్వయపరుచుట_మొదలైన లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం సాహిత్య అకాడెమీని స్థాపించింది. ఇరువదవ శతాబ్దపు భారతీయ గ్రంథసూచిక, వాఙ్మయ చరిత్రలు, సంకలన గ్రంథములు, భారతీయ రచయితల పరిచయ గ్రంథము_మొదలైన బృహద్గ్రంథాల నిర్మాణానికి పూనుకొనడమే కాక అకాడెమీ అనువాద కార్యక్రమాన్ని కూడా చేపట్టింది. ఈ వివిధ గ్రంథాలూ వెలుగులోనికి వస్తే. యివి భారతీయ సాహిత్యానికి అమూల్యాలంకారములై ప్రతిభాసించగలవనడం అతిశయోక్తి కాదు. ఈ గ్రంథముల ద్వారా మన దేశంలో భావైక్యం ఏర్పడగలదని ఆశించవచ్చు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తమ రాష్ట్రాలలో సాహిత్య అకాడెమీలను స్థాపించి సాహిత్యాభివృద్ధివంటి ప్రముఖ సంస్థలను కూడా పేర్కొనక తప్పదు. ఉత్తమ సాహితిని అనువదించే కార్యక్రమంలోనే యీ సంస్థలన్నీ నిమగ్నమై వున్నవి. ఇట్లా కొన్ని సంస్థలే కాకుండా కొందరు వ్యక్తులు కూడా ఈ అనువాద కార్యక్రమాన్ని సదుద్దేశంతో నిర్వహించడం హర్షింపదగిన విషయం.

రాజకీయ స్వాతంత్ర్యం లభించినంత మాత్రాన లాభం లేదు. ఆర్థిక స్వాతంత్ర్యం కూడా లభ్యమయిననాడే మనదేశం నిజంగా అభ్యుదయపథం చేరుకున్నట్లవుతుంది_అని మన రాజకీయ నాయకులు పలువురు పదే పదే చెపుతున్నారు. ఆర్థిక స్వాతంత్ర్యంతో పాటు భావైక్యాన్ని కూడా మనం సాధించాలి, ఇందుకు భాషా సాహిత్యాలు తోడ్పడినంతగా ఇతరములేవీ తోడ్పడలేవు.

మతములు వేరైనా అవి ప్రవచించే సత్యం ఒక్కటే అన్నట్లుగా, భారతీయ భాషలు విభిన్నములైన భారతీయ సాహిత్యం మాత్రం ఒక్కటే అందువల్లనే ప్రతిభారతీయుడు పోతన్నను అర్థం చేసుకోగలుగుతున్నాడు; కంబకవిని మెచ్చుకుంటున్నాడు. తులసీదాసు హృదయాన్ని తెలుసుకుంటున్నాడు. త్యాగయ్యను, పురందరదాసును, కబీరును సభక్తికంగా సంస్మరింపగలుగుతున్నాడు. ఈ సత్యమును గ్రహించిన తమిళనవయుగ ప్రవక్త సుబ్రహ్మణ్యభారతి భారతిస్తవంలో ఇలా అన్నాడు:

"చెప్పుమొళి పదినెట్టు డైయాళ్ — ఎనిన్
సిందనై ఒన్డ్రు డైయాళ్ —"

పదునెనిమిది భాషలు వ్యవహారంలో ఉన్నా, వాటిలోని విషయాలు మాత్రం ఒక్కటే అని భారతి భారతీయ సాహిత్యంలోని ఏకత్వాన్ని తెలియజేశాడు. కనుక భాషా సాహిత్యాల ద్వారా భావ సమైక్యాన్ని సాధించ వచ్చుననుట సుస్పష్టం। * * *

బ్రతుకుదాం


శ్రీ బోయి భీమన్న

పువ్వుల కంటే లెక్కకు ముళ్లే ఎక్కువ
ఈ నా గులాబీ తోటలో;
అందుకని—
ముళ్ల తోట అననా దీన్ని?

కోయిల్లు నాలుగే, కీటకాలు లక్షలు
ఈ నా రసాల వనంలో;
అందుకని—
పరిత్యజించి పోనా దీన్ని?

వసంతం ఒక్కటే, తక్కురుతువులు ఐదు
ఈ నా మధురోద్యానంలో;
అందుకని—
పెరికి పారవెయ్యనా దీన్ని?

లక్ష ముండ్ల పొదల్ని భరించి
ఒక్క తోటైనపెంచుకొందాం;
లక్ష అపస్వరాల్ని సహించి
ఒక్క పాటైనా పాడుకొందాం;
లక్ష కోర్కెల్ని పరిహరించి
ఒక్క మాటైనా కలుసుకుందాం;



ప్రణాళికలు సాంఘిక సేవా కార్యక్రమాలు

శ్రీ చంద్రశేఖర్

త్రైవార్షిక జాతీయ ప్రణాళిక పెట్టుబడి రూ. 2068.78 కోట్లు కాగా దీనిలో 20.5 శాతం అంటే రూ. 424 8 కోట్లు సాంఘిక సేవ, పునరావాస కార్యక్రమాలకు ప్రత్యేకించారు. దరిమిలా ప్రణాళికా వ్యయం రూ.2248.9 కోట్లకు పెరగడంతో ఈ పద్దుకు కేటాయించిన మొత్తంకూడా రూ. 489.4 కోట్లకు పెరిగింది. ప్రణాళికా పెట్టుబడిలో ఈ మొత్తం 21.8 శాతం తరువాత ఈ వ్యయాన్ని రూ. 533 కోట్లకు పెంచటం జరిగింది. ఇది ప్రణాళికా వ్యయంలో 22.6 శాతం అంటే ఈ పద్దుకు ప్రణాళిక ముసాయిదాలో కేటాయించిన దానికంటే రూ. 108.19 కోట్లు లేదా 2 1 శాతం మొత్తం పెంచారన్నమాట.

దేశంలో సాంఘిక సేవా కార్యకలాపాలకు లభించిన ఈ ప్రాముఖ్యత, వ్యవసాయం సమాజాభివృద్ధి రంగాలకుగల ప్రాధాన్యతకంటే అధికం. ప్రణాళికావ్యయంలో వ్యవసాయం, సమాజాభివృద్ధి పథకాలకు 15.1 శాతం మొత్తాన్ని కేటాయించటం జరిగింది. ఈ పథకాలకు ప్రణాళిక ముసాయిదాలో 17.4 శాతం, తరువాత 16.6 శాతం చొప్పున మొత్తాలు ప్రత్యేకించడమైనది. ఈ పథకాలకు ప్రత్యేకించిన మొత్తం సాంఘిక సేవ, పునరావాస కార్యక్రమాలకు కేటాయించిన దానికంటే రూ. 176 కోట్లు లేదా 7.5 శాతం తక్కువ.

ఆంధ్రరాష్ట్ర మొదటి ప్రణాళిక 1953 అక్టోబరు మొదటి తేదీన ఆరంభమైంది. అవిభక్త రాష్ట్ర ప్రణాళికకు చేసిన కేటాయింపులోనుంచి రూ. 54.71 కోట్లు ఆంధ్రకు ప్రత్యేకించారు. 1954 వ సంవత్సరంలో ప్రణాళికా సంఘం ఈ ప్రణాళికను సవరించి పెట్టుబడిలో 3.95 కోట్లు హెచ్చించింది. తరువాత ప్రణాళికా వ్యయాన్ని రూ. 69.42 కోట్లకు పెంచటం జరిగింది. సవరించిన ప్రణాళిక, వివిధ పథకాల వాస్తవిక పురోగమనం, రాష్ట్రావసరాలు ఇత్యాది అంశాల ఆధారంగా లేని కారణంచేత సమగ్ర రూపాన్ని అది చిత్రించలేదు కాబట్టి ప్రణాళికలోలేని అభివృద్ధి పథకాలను ప్రణాళికా పరిధిలోనికి తేవటం ద్వారా ప్రధానంగా రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలపై జరుగుతున్న వ్యయాన్ని గురించి స్పష్టంగా తెలియజేసే నిమిత్తం ఈ విధంగా ప్రణాళికను సరుబాటు చేయటం అవసరమైంది. * సర్దుబాటుచేసిన పిమ్మట రాష్ట్ర ప్రణాళిక పెట్టుబడి రూ. 64.32 కోట్లకు స్థిరపరచబడింది.

సాంఘిక సేవా పథకాలలో (అ) విద్య. (ఆ) వైద్యం, (ఇ) ప్రజారోగ్యం, (ఈ) గృహవసతి. (ఉ) వెనుకబడిన వర్గాల ఉద్ధరణకు సంబంధించిన కార్యక్రమాలు చేరుతాయి. ఆంధ్రరాష్ట్ర

* రెండవ పంచవర్ష ప్రణాళిక, ఆంధ్రప్రదేశ్ పుట: 18.

ప్రణాళికలో కూడా ఈ పథకాలకు వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి పథకాలకంటే అధికతర ప్రాముఖ్యత లంభించింది. మనదేశ జనాభాలో నూటికి 70 వంతుల మందికి వ్యవసాయవృత్తే జీవనాధారం అనే విషయం గమనార్హం. ప్రణాళికలో వివిధ భారీ పథకాలకు లభించిన ప్రాధాన్యక్రమాన్ని దిగువ ఇచ్చిన పట్టికలలో తెలుసుకొనవచ్చును.

ప్రణాళికా పెట్టుబడి పంపిణీ

పథకం	ప్రణాళికా కేటాయింపు (రూ. లక్షలలో)		ప్రణాళికా కేటాయింపు శాతం
వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి ...	760.63	...	11.84
నీటి వసరులు, విద్యుత్ పథకాలు ...	3799.72	...	61.83
పరిశ్రమలు ...	79 82	...	1.25
రవాణా ...	224.22	...	3.48
సాంఘిక సేవ ...	1233 77	...	19.18
ఇతర పద్దులు ...	156.00	...	2,42
మొత్తం ...	6432.16	...	100.00

ప్రణాళికా పెటుబడిలో అత్యధిక భాగం అంటే 61.83 శాతం మొత్తం నీటువనరులు, విద్యుచ్ఛక్తి పథకాలకు కేటాయించారు. ఆ తరువాత స్థానం సాంఘిక సేవా కార్యక్రమాలకు లభిస్తుంది. ఈ పథకాలకు 19.18 శాతం మొత్తం ప్రత్యేకించారు. నీటి వసరులు, విద్యుచ్ఛక్తి పథకాల తరువాత ఇంత అధిక మొత్తం కేటాయించింది ఈ పథకాలకే. వివిధ ప్రణాళికాంశాలకు ఇచ్చిన ఈ ప్రాధాన్యతలనుబట్టి ఆర్థికరంగంలో దీర్ఘకాలిక మార్పులు కొన్ని తేవాలనే ఆసక్తి వున్నట్లు ద్యోతక మవుతుంది. ఆర్థిక వ్యవస్థలో దీర్ఘకాలికమైన మార్పులు తెచ్చే వాటిలో సాంఘిక సేవా కార్యక్రమాలు కూడా చేరుతాయి. రాష్ట్ర ప్రథమ ప్రణాళిక కేటాయింపు రూ. 6432.16 లక్షలు కాగా వ్యయం రూ. 6452.08 లక్షలు వుంది. అంటే 100.31 శాతం ఖర్చు జరిగిందన్నమాట.

మొదటి ప్రణాళికలో సాంఘిక సేవాకార్యక్రమాలకు చేసిన కేటాయింపులు ఈ విధంగా వున్నాయి:

పథకం		ప్రణాళికా కేటాయింపు రూ. లక్షలలో		ప్రణాళికా పెట్టుబడిలో కేటాయింపు శాతం
1. విద్య	...	310.59	...	4.83
2. వైద్యం	...	126.94	...	1.97
3. ప్రజారోగ్యం	...	429.05	...	6.67
4. గృహ వసతి	...	113.17	...	1.76
5. వెనుకబడిన వర్గాలనముద్ధరణ	...	254.02	...	3.95
మొత్తం	...	1233.77	...	19.16

ఆధారం (ఆంధ్రప్రదేశ్ రెండవ పంచవర్ష ప్రణాళిక 1956–61)

ఈ రంగంలో రెండవ ప్రణాళిక మరో అడుగుముందుకు వేసింది. జాతీయప్రణాళిక ఆశయమైనట్లుగా సామ్యవాద సరళి సమాజ నిర్మాణానికి అనుగుణంగా ద్వితీయ ప్రణాళికా లక్ష్యాలు రూపొందించబడినాయి. "ఆర్థిక లక్ష్యాలు సాంఘిక లక్ష్యాలు వేరుకాదు. లక్ష్యాలు సాధించటం సాధనాలు అన్వేషించటం ఏకోన్ముఖంగా జరుగాలి"

ఈ ప్రణాళిక మొత్తం పెట్టుబడి రూ. 175.37 కోట్లు. దీనిలో ఆంధ్ర. తెలంగాణా ప్రాంతాల వాటా వరుసగా రూ. 119.87 కోట్లు, రూ. 55.50 కోట్లు. భారతదేశంలోని ఇతర రాష్ట్రాలన్నింటి పెట్టుబడిలో ఇది సుమారు 7.8 శాతం. సాంఘిక సేవా పథకాలకు చేసిన కేటాయింపుల వివరాలు ప్రక్కపుట పట్టికలో ఇవ్వ బడినాయి.

సాంఘిక సేవలు	ఆంధ్ర: ప్రణాళికా కేటాయింపు రూ. లక్షలలో	ఆంధ్ర: ప్రణాళికా పెట్టుబడిలో కేటాయింపు శాతం	తెలంగాణా: ప్రణాళికా కేటాయింపు	తెలంగాణా: ప్రణాళికా పెట్టుబడిలో కేటాయింపు శాతం
1. విద్య	77) 48	6.47	·04.23	9.09
2. వైద్యం	360.84	3.01	217 26	3.91
3. ప్రజారోగ్యం	367.82	3 07	154.65	2.79
4. గృహవసతి	190.24	1.[illegible]	326 03	5.87
5. కార్మిక సంక్షేమం	47.5[illegible]	0.39	2 352	0.42
6. వెనుకబడిన తరగతుల సంక్షేమం	152.13	1.27	48.30	0.87
7. నిమ్న తెగల సంక్షేమం	181 25	1 52	19 26	0.35
8. మహిళా సంక్షేమం	24.36	0.20	—	—
9. సాంఘిక సం[illegible]సం	36.43	0 30	13 60	0.25
మొత్తం	2135.99	17 82	1306.85	23.55

విధానం (ఆంధ్రప్రదేశ్ రెండవపంచవర్ష ప్రణాళిక 1956–61)

సాంఘిక సేవా పథకాలకు ప్రథమ పంచవర్ష ప్రణాళికలో రూ. 1233.77 లక్షలు కేటాయించగా రెండవ ప్రణాళికలో రూ. 2135.99 లక్షలు కేటాయించారు. వివిధ అంశాలకు ఇచ్చిన ప్రాధాన్యత్రమాన్ని పరిశీలించినట్లయితే వ్యవసాయం, సమాజాభివృద్ధికి ద్వితీయ ప్రణాళికలో ప్రాముఖ్యత ఇచ్చినట్లు తెలుస్తుంది ఎందు చేతనంటే మొదటి ప్రణాళికలో ఈ అంశాలకు కేటాయించిన మొత్తం పూర్తి ప్రణాళికా వ్యయంలో 12.38 శాతం వుండగా రెండవ ప్రణాళికలో ఈ శాతం 21.79 కు పెరిగింది. ఆంధ్ర ప్రదేశ్ ప్రధానంగా వ్యవసాయరాష్ట్రం కావటమే దీనికి కారణం.

రాష్ట్ర తృతీయ ప్రణాళిక పెట్టుబడి రూ. 305 కోట్లు ఈ ప్రణాళికలో సాంఘిక సేవా పథకాలకు రూ. 35.51 కోట్లు అంటే ప్రణాళిక పెట్టుబడిలో 18.20 శాతం మొత్తం కేటాయించారు. అంతేగాక క్రిందటి ప్రణాళికలనుంచి రూ. 5.04 కోట్ల వ్యయంతో కూడిన పథకాలు కూడా ఈ ప్రణాళికలో చేరాయి. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ప్రణాళికలలో సాంఘిక సేవా కార్యక్రమాలకు చేసిన కేటాయింపుల పెరుగుదలను దిగువ పట్టికలలో తెలుసుకొనవచ్చు:

మొత్తం పెట్టుబడి (రూ. లక్షలలో)	మొదటి ప్రణాళికా కేటాయింపు (రూ లక్షలలో)	పెట్టుబడిలో కేటాయింపు శాతం	రెండవ ప్రణాళిక: పెట్టుబడి (రూ. లక్షలలో)	రెండవ ప్రణాళిక: కేటాయింపు (రూ లక్షలలో)	రెండవ ప్రణాళిక: కేటాయింపు శాతం	మూడవ ప్రణాళిక: పెట్టుబడి (రూ. లక్షలలో)	మూడవ ప్రణాళిక: కేటాయింపు (రూ. లక్షలలో)	మూడవ ప్రణాళిక: కేటాయింపు శాతం
6432.19	1233.77	19 88	1198.06	2135.99	17.82	305.00	55.51	18 20

ప్రథమ ప్రణాళికా కాలంలో విద్యారంగంలో గమనార్హమైన అభివృద్ధి జరిగింది. పాఠశాలల్లో పిల్లలను అధికసంఖ్యలో చేర్పించటానికి కృషి జరిగింది. విశ్వవిద్యాలయ సంస్థలు, స్థానిక సంస్థలు అభివృద్ధి చెందటంతోపాటు నిర్బంధోచిత విద్యావిధానాన్ని వ్యాప్తం చెయ్యడానికి తృతీయ ప్రణాళికలో తలపెట్టారు. వైద్య సౌకర్యాలను పెంపొందించటంద్వారా గ్రామీణప్రాంతాలలో ఆరోగ్యాభివృద్ధిని సాధించటానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. ఈ రంగంలో మొదటి రెండు ప్రణాళికలలోనూ గమనించదగిన అభివృద్ధి జరిగింది. ముఖ్యంగా ఈ కాలంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను కుటుంబ నియంత్రణ కేంద్రాలను ఇతోధికంగా నెలకొల్పారు. వైద్య సదుపాయాలను విస్తరింపజేశారు. మంచినీటి సరఫరా పథకాలు. జాతీయ గ్రామీణ మంచినీటి సరఫరా పథకాలకు సముచిత ప్రాధాన్యం లభించింది. సహకార సంస్థలు. పంచాయతీలు. పురపాలక సంఘాలలో కలిసి నిర్దిష్ట పథకాలను అమలు పరచటం ద్వారా గృహావసరాలు తీర్చటానికి జరిగినకృషి ప్రశంసార్హమైనది. ప్రణాళికలలో కార్మికులు, వారిసంక్షేమంపట్ల ప్రత్యేక శ్రద్ధచూపిన కారణంగా ఉపాధిసమస్య క్రమంగా తగ్గగలుగుతుంది. నిమ్నజాతులు, నిమ్నవర్గాలు, వెనుకబడిన తరగతుల సంక్షేమానికి, సాంఘిక సంక్షేమానికి ఉద్దేశించిన పథకాలు జనాభాలో ఎక్కువ భాగం ప్రజలకు ప్రయోజనం చేకూర్చగలుగుతుంది. ఈ అభివృద్ధి అంతా ఇన్ని రాష్ట్రాలలో తక్షణ ఆర్థిక సమస్యలను ఎదుర్కొనటంతో గురుతరమైన పాత్రవహిస్తూ జాతీయ లక్ష్యాల సాధనకు మార్గం ఏర్పరుస్తాయి.

(ఆంగ్లమూలానికి తెలుగు అనువాదం)



మనసుమనసు కలసి తనువులు కలియక
తనువుతనువు కలిసి మనసు లేక
ప్రాయములున్న యపుడె వర్ణాలెసున్నరా!
జననుతాంతరంగ! వినుర రంగ!

కృష్ణ శతకం.

భారతీయ-పాశ్చాత్య కావ్యలక్షణములు

శ్రీ ఆవంత్స వేంకట రంగారావు

మొట్టమొదట కావ్యమన నెట్టిదో తెలిసికొనిన గాని దాని యభ్యుదయ లక్షణములు తెలిసికొనుట కవకాశముండదు. కాంటిబట్టి ప్రముఖ సంస్కృతాలంకారికులు "కావ్యము" అనఁగాఁ గవిత్వము నేవిధముగా నిర్వచించినారో గమనింపవలసి యున్నది.

అలంకార శాస్త్ర మెప్పుడు ప్రారంభమైనదో చెప్పుటకాధారములు లేవు. కాని భరతముని తన నాట్యశాస్త్రమందు కావ్యార్థము *రసమని చెప్పఁగా లోకమునందుఁగల 1 షడ్రసములకును గావ్య రసమునకుగల భేదములు తెల్పుడని తనను ప్రశ్నించిన మునుల కతఁడు రసస్వరూపమును నిర్వచించెను: నాట్యశాస్త్రములో 2 ఎనిమిది రసములు, 3 పది గుణములు, పది దోషములు, నాలుగు అలంకారములు మాత్రము పరిగణింపఁబడినవి. (శాంత రసము తరువాతఁ జెప్పబడినది)

తరువాత భామహుఁడు "కావ్యాలంకారము" అను తన గ్రంథమునఁ బ్రథమ పరిచ్ఛేదమంతయుఁ గావ్యశరీర వర్ణనముతో నింపినను గావ్య నిర్వచనము చేయలేదు గాని కావ్య శరీరము శబ్దార్థ రూపమనియు, నది పద్యము గద్యమునను రెండువిధములుగ నుండుననియు నభిప్రాయము వ్యక్తపఱచెను. "శబ్దార్థౌ సహితౌ కావ్యమ్। గద్యంపద్యం చ తద్ద్వివిధా॥". తరువాత నతఁడు కావ్య శరీరము నలంకరించుట వలన వక్రోక్త్యాద్యలంకారములే ప్రధానములని కూడఁ బల్కెను.

ఆచార్యదండి తన "కావ్యాదర్శ" ప్రథమ పరిచ్ఛేదములోఁ గావ్య శరీరమనఁగా "ఇష్టార్థవ్యవచ్ఛిన్నా పదావళీ" యనియు "పద్యంగద్యం చ మిశ్రంచ తత్ త్రిధైవ వ్యవస్థితమ్" అనియు నిర్వచించినాడు. అనఁగా వాచ్య, లక్ష్య, వ్యంగ్య, భేదములచే వివిధములై మనోహరార్థము పదసముదాయమునిచ్చు కావ్యశరీర మగుననియు, నది పద్యముగగాని, గద్యముగగాని, పద్యగద్య మిశ్రమముగగాని మూఁడు విధములుగా నుండుననియు దాని తాత్పర్య మగుచున్నది. ఈ నిర్వచనములో నతఁడు దోషములను గుఱించి చెప్పలేదు గాని సుందరమైన శరీరము బొల్లి మచ్చచే నెట్లు ద్వేషింపబడునో ఆ ప్రకారముగాఁ గావ్యము దోషముచే ద్వేషింపబడును గాన దోషము స్వల్పమైన నేవిధము చేతనైన దాని నుపేక్ష చేయరాదని నొక్కి వక్కాణించెను. ఇతఁడు గుణములకుఁ బ్రాధాన్య మిచ్చెను. బాహ్య శరీరమునకు సౌందర్యమును గల్గించునవి అలంకారములైన నంత సౌందర్యమును గల్గించునవి గుణములే యగుచున్నవని దండిమతము. ఇతఁడు రసాదులను రసవదాద్య లంకారములుగ భావించెను.

వామనుడు గుణముల చేరికవలన రీతి (Style) యేర్పడు

---

* "రస్యంతే ఇతి రసాః" (రుచి చూడబడునవి. మనస్సుచే ననుభవింపఁబడినవి)

1 కషాయము, మధురము, లవణము, కటువు, తిక్తము ఆమ్లము,

2 శృంగారము, హాస్యము, కరుణము, రౌద్రము, వీరము, భయానకము, భీభత్సము, అద్భుతము. (శాంతము)
"శృంగార వీరకరుణా రౌద్రవీర భయానకాః। భీభత్సాద్భుత సంజ్ఞౌచేత్యష్టౌ నాట్యేరసాఃస్మృతాః॥

3 శబ్దగుణములు, అర్థగుణములు — శబ్దాలంకారములు, అర్థాలంకారములు — శబ్దదోషములు, అర్థదోషములు.

ననియు రీతియే కావ్యాత్మయనియుఁ బల్కెను. "రీతిరాత్మా కావ్యస్య" (కావ్యాలంకార సూత్రవృత్తి, 2–6).

మొత్తముమీఁద తొమ్మిదవ శతాబ్దములో నానందవర్ధనుఁడు చెప్పువఱకు సంస్కృతాలంకారికులు కావ్యమున "కాత్మ" అలంకారమో, గుణమో, రీతియో, మరేదియో తోఁచుకొనలేని స్థితిలో నుండిరి. ఇతఁడు గొప్పకవియుఁ బండితుఁను గూడ నగుటచేత తన "ధ్వన్యాలోకము" అను గ్రంథములో నీక్రింది విధముగఁ జెప్పెను:–

*కావ్యస్యాత్మా ధ్వనిరితి బుధైర్యస్సమామ్నాత పూర్వ
స్తస్యాభావం జగదురపరే భాక్తమాహుస్తమన్యే।
కేచిద్వాచాం స్థితమవిషయే తత్త్వమూచుస్తదీయమ్.
తేనబ్రూమః సహృదయమనః ప్రీతయేతత్స్వరూపమ్॥

కావ్యతత్త్వవేత్తలైన గురుపరంపరచేతఁ గావ్యముల కాత్మధ్వని యని బాగుగ బోధింపఁబడినను. ధ్వనిలేదని కొందఱును, నది లక్షణచేతనే సిద్ధించునని వేఱొకరును, దాని స్వరూపమును దెల్పుటకు వీలుండదని యింకొకరును జెప్పుచున్నారు. కాఁబట్టి సహృదయుల మనఃప్రీతి కొఱకు "ధ్వని" స్వరూపమును దెల్పుచున్నాము, అని పల్కి క్రమక్రమముగా నుదాహరణములు చూపుచుఁగవితా కాంతకు ఆత్మ (రసాది) ధ్వనియనియు, శబ్దార్థములు శరీరమనియు, నలంకారము లలంకారములనియు, గుణములు గుణములనియు విస్పష్టముగ వక్కాణించెను, మనోరథుఁడు మొదలగు వారి యాక్షేపణములను ఖండించి తనవాదమును నిలుపుకొనఁ గల్గెను.

ఆనందవర్ధనుని తర్వాత భట్టనాయకుఁడను అలంకారికుఁడు "హృదయదర్పణము" అను గ్రంథము రచించి ధ్వనివాదమును ఖండించెను. కాని యానందవర్ధనుని "ధ్వన్యాలోకమునకు" లోచనము అను వ్యాఖ్యానము వ్రాసిన అభినవగుప్తుఁడు భట్టనాయకుని మతమును ఖండించి ధ్వనివాదమును నిలిపెను. తరువాత రాజభోజుఁడు తన "సరస్వతీ కంఠాభరణము" అనుగ్రంథములో 1 "నిర్దోషం గుణవత్కావ్యమ లంకారై రలంకృతమ్। రసాత్మకం కవిఃకుర్వన్ కీర్తిం ప్రీతించ విందతి" అని పల్కినాడు. దోషరహితమును గుణాలంకార భూషితమును, రసాత్మకమునగు కావ్యమును జేసి కవి కీర్తిని ప్రీతిని బొందుచున్నాఁడని ఆ శ్లోక తాత్పర్య మగుచున్నది.

తరువాత మమ్మటుఁడు తన "కావ్య ప్రకాశము"లో నానంద వర్ధనుని ధ్వనివాదమును బునరుద్ధరించుటయేగాక కావ్యము నిట్లు నిర్వచించినాడు." తదదోషౌ శబ్దార్థౌ సగుణావనలంకృతీ పునఃక్వాపి" అనఁగా గుణము గల్గినట్టియు, దోషరహితములైనట్టియు శబ్దార్థములు ఒకానొకచోట అలంకార భూషితములు కాక పోయినప్పటికిని కవిత్వమగునని దాని యర్థము. అతఁడింకను ఈ క్రింది విధముగవర్ణించినాఁడు. **"నియతికృత నియమరహితాం హ్లాదైకమయీ మనన్య పరతంత్రామ్। నవరసరుచిరాం నిర్మిత మాదధతీ భారతీ కవేర్జయతి" (బ్రహ్మదేవుని సృష్టికంటెఁగవి సృష్టి గొప్పదని యుచటఁజెప్పుచున్నాడు) బ్రహ్మసృష్టి మను జుల పూర్వజన్మకర్మ ననుసరించి చెయ్యఁబడును. కాని యట్టి బంధకములులేక ఆనందమే ప్రధానముగాఁగల్గినట్టి. (బ్రహ్మసృష్టిలో దుఃఖము, అజ్ఞానము' మొదలగు లోపములు గలవు.) స్వతంత్రమైనట్టి నవరసములలో మనోహరమైనట్టి నిర్మాణము కలదై (బ్రహ్మసృష్టిలో ఆఱు రసములే కలవు.) కవి వాక్కు జయించు చున్నదని దాని భావము,

2 "ప్రతాపరుద్ర యశోభూషణము" అను దనగ్రంథములో విద్యానాథుఁడు కవిత్వమును నిర్వచించుచు" గుణాలంకార సహితౌ శబ్దార్థౌ దోషవర్జితౌ గద్యపద్యోభయమయం కావ్యం కావ్య విదోవిదుః"॥ అని యతనికిఁ బూర్వులైన అలంకారికులలోఁ గొందఱిమార్గమునను సరించియు "ఏకో హి దోషోగుణసన్నిపాతే నిమజ్జతీందోః కిరణేష్వివాంకః" (కు–1–3) గుణ సముదాయమందు ఒక దోషము చంద్ర కిరణములో (చంద్రుని మచ్చవలె మునిగిపోవు చున్నది) అను కాళిదాసుని" కుమారసంభవములోని యభిప్రాయమును బాటింపకయు మరల గుణాలంకారములను దోషరాహిత్యమును బేర్కొని దోషము లున్నయెడల కావ్యము కాదను నభిప్రాయము కల్గునట్లు సూచించెను.

తరువాత విశ్వనాథుఁడు "సాహిత్య దర్పణము" అను తన

* ఆంధ్రధ్వన్యాలోకము– ప్రథమోద్యోతము. సంస్కృత ధ్వన్యాలోకము ననువదించి శ్రీ పంతుల లక్ష్మీనారాయణ శాస్త్రి గారు ఆంధ్రులకు మహోపకారమొనరించినారు.

1 ప్రథమ పరిచ్ఛేదము–శ్లో 2

** ప్రథమోల్లాసము. 2 కావ్యప్రకరణము

గ్రంథములలో మానవ నిర్మాణములు దోషరహితములుగా నుండ వనియు, పిట్టి కతిపతమ నిబంధనముల ప్రకారముసమీక్షించినచో, గొలఁది కావ్యములు మాత్రమే నిలుచుననియు, గీటాను విద్ధమైన రత్నము రత్నము కాకపోదనియు (రంధ్రములు గల రత్నమును రంధ్రములు లేని రత్నమును దరితమ భేదములతో పిలుపఁబ గల్గి యుండునని గ్రహింపవలెననియు) జెప్పి కావ్య నిర్వచన మీ క్రింది విధముగఁజేసెను. *"వాక్యం రసాత్మకం కావ్యమ్". అనఁగా రస ప్రధానమైన వాక్యమే కావ్యమగునని దానియర్థము. ఇచ్చట వాక్య మనఁగా వాక్యోచ్చయము (మహావాక్యము) అని నిరూపించి యుదాహరణములుగా రామాయణము, భారతము, రఘువంశము లను జూపినాఁడు. చక్కని వస్తుమాత్ర వ్యంగ్యత్వముండి అలంకారములను వాచ్యముగాఁ జెప్పు కావ్యములుకూడ రసాభాసము (Semblance of flavour) చేతఁ గావ్యము క్రిందఁ బరిగణింపఁ బడవచ్చునని కూడఁ జెప్పెను.

పూర్వ నిర్వచనములను బాగుగఁబరిశీలించి జగన్నాథ పండితరాయలు (ఆంధ్రుడు) తన "రసగంగాధరము"లో "రమణీయార్థప్రతి పాదకః శబ్దః. కావ్యమ్" అని కావ్య నిర్వచనము చేసెను. క్లుప్తముగాఁ జెప్పవలసి వచ్చినపుడు అలౌకికమైన ఆనందమును మనస్సునకుఁ గల్గఁజేయు చమత్కారకారియగు భావనలో విషయ మగునర్థమును అనఁగా రసాదికమును వ్యంజనా వ్యాపారము చేతఁ బ్రతిపాదించు 1 శబ్దమే కవిత్వమగునని దాని తాత్పర్య మగుచున్నది.

కాబట్టి సంస్కృతా లంకారికుల దృష్టిలో శబ్దార్థములు కవితాసరస్వతియొక్క శరీరము మాత్రమే యనియు, వానిచే స్ఫురింప జేయఁబడి మానవ హృదయములకు లోకోత్తరానందమును గల్గఁ జేయు రసభావాదులు కవిత్వమునకు ఆత్మయనియు నవగతమగుచున్నది. అదియునుఁగాక కవిత్వము పద్యమునందైనను గద్యమునందైననుండవచ్చునని. క్రీ. శ. 19 వ శతాబ్దములో Coleridge అను నాంగ్లకవి వెల్లడించిన యభిప్రాయమును అంతకు గొన్ని పందల సంవత్సరములకు మున్నే మన సంస్కృతాలంకారికులే గ్రహించినట్లు కూడ విశదమైనది.

ఇఁక రమ్యమైన దృశ్యములను వర్ణించుట వలననే యీ యలౌకికానందము గల్గునా? అను ప్రశ్న. యీ సందర్భములో మనము వేసి కొనిన ప్రశ్నకు (జగన్నాథ పండితరాయలకుఁ జాల కాలము పూర్వమే) ధనంజయుఁడను నింకొక యాలంకారికుఁడు తన "దశరూపకము"లోఁ జెప్పిన క్రింది శ్లోకమును మనము జ్ఞప్తికిఁ దెచ్చుకొన వలసి యుండును.

> రమ్యం జుగుప్సిత ముదార మథాపి నీచమ్
> ఉగ్రం ప్రసాది గహనం వివృతంచవస్తు।
> యద్వాప్యవస్తు కవిభావక భావ్యమానం
> తన్నాస్తి యన్న రసభావము పైతిలోకే ॥
>
> (పరి॥ 4-89)

అనఁగా నందమైనదిగాని యసహ్యమైనది గాని గొప్పది కాని నీచమైనది గాని భయంకరమైనది గాని ప్రసన్నమైనది గాని గూఢమైనది గాని స్పష్టమైనది గాని వస్తువు మరి వస్తువు కానిదైనను (సరియే) భావనాశక్తిగల కవి భావించినప్పుడు రసముగాఁబరిణమింపని దేదియు నీలోకమున లేదు.

పాశ్చాత్యము

What is poetry? అనుప్రశ్న? St. Augustine యేదోసందర్భంలో నింకొక విషయమునుగూర్చి పల్కినమాటలను "An Introduction to the study of literature అను గ్రంథము రచించిన William Henry Hudson తృతీయాధ్యాయములో వి వి ధ నిర్వచనములకు ము ం ద ఱ పేర్కొనెను.

St. Augustine: (1) If not asked I know,

* సాహిత్యదర్పణము-ప్రథమపరిచ్ఛేదము "ఇత్థం వాక్యం ద్వివిధామతమ్। (వాక్యము, మహావాక్యము)' – C. T. Aristotle's poetics- chapt. XX "But a sentence is one in a two fold respect; for it is either that which signifies one thing, or that which becomes one from many by Conjunction. Thus Iliad is one by coujunction. (మహావాక్యమున కుదాహరణముగా గ్రీసు ఆలంకారికుఁడగు Aristotle "ఇల్లియడ్" గ్రంథమును పేర్కొనెను.)

1 రమణీయ, అర్థ, ప్రతిపాదక, శబ్ద, అను ఈ నాల్గుపదములును ప్రత్యేకమైన యర్థముకలవియని నిరూపించి యేకేకాంశము కలవానిని కావ్యముగా వ్యవహరింపరాదని జగన్నాథుఁడే చెప్పుటచే "శబ్దము" అనఁగా నిచట నొకపదము అని అర్థముకాదని తెల్లమైనది. ఏలయన ఒక్కపదము వలన రమణీయార్థ ప్రతిపాదకత్వము చేకూరదు.

if you ask me I know not. (2) Johnson:- Metrical Composition – The art of uniting pleasure with truth by calling imagination to the help of reason and its essence is "invention" (3) Mill:- The thought and words in which emotion spontaneously embodies itself. (4) Macaulay:- The art of employing words in *such a manner as to produce an illusion on* the imagination–the art of doing by means of words what the painter does by means of colours. (5) Carlyle:- Musical thought. (6) Shelley:- In a general sense the expression of the imagination. (7) Hazlitt:- The language of the imagination and the passions (8) Leigh Hunt:- The utterance of a passion for truth, beauty and power embodying and illustrating its conceptions by imagination and fancy and modulating its language on the principal variety in unity. (9) Coleridge:- Poetry is the antithesis of science having for its immediate object, pleasure, not truth. (10) Wordsworth:- It is the breath and finer spirit of all knowledge and the impassioned expression which is in the countenance of all science (11) Mathew Arnold:- Is simply the most delightful and perfect form of utteranee than human words can reach – is nothing less the most perfect speech *of man that in which* he come*s* nearest to being able to utter the truth– i*s* the criticism of life under the condition fixed for such a criticism by the laws of poetic-truth and poetic beauty. (12) Edger A llen Poe:- Rhythmic Creation of Beauty. Ruskin:- The suggestion by the imagination of noble grounds for the noble emotions.

పై నిర్వచముల నన్నిఁటిని ఆంధ్రీకరింప నక్కఱలేదు. అదియునుగాక Translator is a traitor (అనువాదకుఁడు ద్రోహి) అను నిందయుండనేయున్నది. కొన్నిఁటియొక్క సారాంశమును మాత్రము తెల్పెదను.

నీవడగని యెడలఁ దెలియును, అడిగిన యెడలఁ దెలియదు – ఛందోబద్ధమైన రచన – సత్యానందమును సమ్మిశ్రితము చేయుకళ – అది సృజనాత్మకము – అప్రయత్నముగా మనోవికారములతో బయల్వెడలిన ఆలోచనాత్మక పదసముదాయము– మనస్సునకు విభ్రమముఁ బుట్టించుకళ– చిత్రకారుఁడు రంగులతో నే పనిచేయునో ఆపని పదములతోఁ జేయుకళ– సంగీతాన్వితమైన ఆలోచన– భావముల యొక్కయు మనోవికారముల యొక్కయు భాష–సత్యము, సౌందర్యము, శక్తి వీనికొఱకు చేయఁబడిన యుచ్చారణము–కవిత్వము శాస్త్రమునకు విరుద్ధమైనది– దానియుద్దేశము సద్యఃపరనిర్వృతి గాని సత్యము కాదు– లయాన్వితమైన సౌందర్యసృష్టి– అమితాహ్లాద కరమైన సంపూర్ణస్వరూపముగల యుచ్చారణము– భావనాశక్తిచే నుదార మనోవికారములను ధ్వనింపఁజేయుట. ఈ వాక్యములు ప్రాచ్య పాశ్చాత్య కావ్యలక్షణముల సారమొకటే యని తెలియఁజేయుచున్నవి. ధనంజయునియభిప్రాయమున కనుగుణమైన పాశ్చాత్యుల యభిప్రాయము మున్ముందుదహరింపఁబడును.

సంస్కృత మహాకావ్య లక్షణములు

నాత్యంతవిస్తరః సర్గత్రింశతో ౽వా నచోనతా।
ద్విశత్యానాధికం కావ్యమే తత్పదస్యలక్షణమ్॥
అష్టసర్గాన్నతు న్యూనం త్రింశత్సర్గాచ్చనాధికమ్।
మహాకావ్యం ప్రయోక్తవ్యం మహాపురుష కీర్తియుక్॥
(ఈశాన సంహిత)

ఆశీర్నమస్క్రియా వస్తునిర్దేశోవాపి తన్ముఖమ్।
చతుర్వర్గఫలోపేతం చతురోదాత్తనాయకమ్।
నగరార్ణవశైలర్తు చంద్రార్కోదయ వర్ణనైః
ఉద్యానసలిలక్రీడా మధుపానరతోత్సవైః॥
విప్రలంభైర్వివాహైశ్చకుమారోదయ వర్ణనైః।
మంత్రద్యూత ప్రయాణాజి నాయకాభ్యుదయైరపి।
అలంకృతమ సంక్షిప్తం రసభావనిరంతరమ్॥
......కావ్యం కల్పాంతరస్థాయి జాయేత సదలంకృతి॥
(కావ్యా 1–14–19)

ఏ షామష్టాదశానాంయైః కైశ్చిదూనమపేష్యతే॥
(ప్రతాప–కావ్యప్రకరణము–71.)

సర్గబంధోమహాకావ్యం తత్రైకోనాయకఃసురః।
సద్వంశఃక్షత్రియోవాపి ధీరోదాత్తగుణాన్వితః॥
ఏక వంశభవాభూపాః కులజా బహవోౕపివా।

శృంగారవీరశాంతానా మేకోఽంగిరస ఇష్యతే॥...

....

ఏకవృత్తమయైః పద్యైరవసానేఽన్య వృత్తకైః॥
నాతిస్వల్పానాతిదీర్ఘాః సర్గా అష్టాధికా ఇహ।
నానావృత్తమయః క్వాపిసర్గః కశ్చన దృశ్యతే॥
(సాహి॥ 6_559)

ఈశాన సంహితలోను సాహిత్య దర్పణములోను జెప్పఁబడినట్లు మహాకావ్యములో మిక్కిలి పెద్దవియు మిక్కిలి చిన్నవియుఁగాని సర్గలుండును. ఒక సర్గలో రెండువందల పద్యాలకన్న నెక్కువయుండవు. ఎనిమిదికిఁ దక్కువఁగాని, ముప్పదికెక్కువగఁగాని సర్గలుండకుండునటు మహాపురుషుని గీర్తించుచు మహాకావ్య నిర్మాణము సేయదగును.

సర్గలతోఁగూడిన మహాకావ్యమునందు నాయకుడు నిర్జరుఁడుగాని గొప్పవంశమునందుఁ బుట్టిన ధీరోదాత్త గుణవంతుడుగాని, ఒకే వంశమునందుఁబుట్టిన బహురాజ్యపాలకులుగాని అయి యుండురు. శృంగార వీర శాంతరసములలోనొక రసము ప్రధానముగా నుండును. పద్యములు ఒకే వృత్తమునందు వ్రాయఁబడి అంతమందు వేరువృత్తములు కలిగియుండును. అయినను వివిధ వృత్తములతోఁగూడిన సర్గయొకానొకటి యొకానొకచోట నుండవచ్చును.

ఆశీర్వాదముతోఁగాని, నమస్కారముతోఁగాని, చెప్పఁబోవు విషయమును సూచించిగాని, మహాకావ్యము ప్రారంభింపబడును. ధర్మార్థకామమోక్షములను బురుషార్థ ఫలముఁతోడను, ధీరలలిత, ధీరశాంత, ధీరోదాత్త, ధీరోద్ధతులను చతుర్విధములైన నాయకులతోఁడను, నగరములు, సముద్రములు, పర్వతములు, ఋతువులు సూర్యచంద్రోదయములు, ఉద్యానవనములు, జలక్రీడలు, మధుపానములు, రతులు, వివాహములు, భార్యాభర్తల యెడబాటులు, కుమారజననములు, రహస్యాలోచనలు, జూదములు, ప్రయాణములు, యుద్ధములు, నాయకాభివృద్ధులు, వీని వర్ణనములతోడను నలంకరింపఁబడినదై రసభావబంధురమై విపులముగానున్న కావ్యము శాశ్వతముగా నుండును.

ఈ పదునెనిమిది వర్ణనములలో నేవియో కొన్ని లోపించినను లోపించవచ్చును.

* పాశ్చాత్య మహాకావ్యము (Epic Poetry)

For purposes of historical study this again has to be sub-divided into primitive epic and later epic. The former called the "Epic of growth........is not in its entirity the work of a single author......but per-existing material in the shape of floating legends and earlier folk poems and sagas, is gathered up into its Composition.....scattered ballads gradually clustering to-gether about a common character into ballad cycles (like the English Robin Hood cycle). Their themes are deeds of heroes......heroes of a race, and vast bodies of immemorial traditions provide the basis of their structure.... the supernatural element is more or less prominent. In the style there is directness and simplicity.

The later, the "Epic of art"....is the product of individual genius working in an age of scholarship and literary culture. Its subject matter is of the old heroic and mythical trend. It makes free use of the supernatural, it follows the same structural plan and reproduces many traditional details of composition, with greatly as it necessarily differs in style, it often adopts the formulas,

* మనకు సంస్కృత భాషయెట్టిదో ఐరోపావారికి గ్రీకు లాటిన్ (ఇటలీ) భాషలట్టివి. వాల్మీకియు. వ్యాసుఁడును సంస్కృత భాషలో రామాయణమును, భారతమును రచించినట్లు గ్రీకుభాషలో Homer "ఇల్లియడ్" ఒడిస్సేలను రెండు మహాకావ్యములను లాటిన్ భాషలో Virgil అనుకవి "ఈనియడ్" అను మహాకావ్యమును రచించినారు. కాని మన మహాభారతమంత విపులమైన గ్రంథము ప్రపంచములో లేదు. "ఇలియడ్" ఒడిస్సే"లు రెండింటిని జేర్చినను ఇంకను ఏడు రెట్లు భారతము పెద్దదట. దీనిని అరబ్బీ భాషలోనికి (దర్జుమా చేసిన Wadie Bouatany అనువాదానికి మన కేంద్రప్రభుత్వము 1953 లో రూ 80,000 ఇచ్చి సన్మానించినారు.

fixed epithets, and stereotyped phrases and locutions which are among the marked features of the earlier type.

Another division of Narrative Poetry

The metrical romance signified a story told in one of the romance languages, and dealing, as all such stories did, with chivalry, knight errantry, fighting adventure, enchantments, love. (*An Introduction to* the study of Litrature—chap. III. P. 138.by William Henry Hudson.)

చారిత్రకముగాఁ బాశ్చాత్య మహాకావ్యాలు రెండు రకములు. (1) 'Epic of Growth' అనునది ఒకే కవి నిర్మితము కాదు. చాల కాలమునుండి ప్రజలలో నితిహాసములుగనో, పాటలుగనో వీరగాధలుగనో నిలిచియున్నవి ప్రోగుచెయ్యఁబడిన నిర్మాణము అంగ్లదేశపు Robin Hood ను గూర్చి పుట్టిన గీతావళి వంటివి. వీర కావ్యములు కావ్యవస్తువులు. ఒకే జాతికిఁజెందిన యనేక వీరుల కార్యములు కావచ్చును. అమానుషకార్యములకుఁ గొంత ప్రాముఖ్యము కలదు. ఈ కావ్యరీతి సరళముగను నిరాడంబరముగను నుండును.

రెండవది "Epic of Art" అనఁబడునది. ఇది పాండిత్య ప్రకర్షములకు విద్యావ్యాసంగములకుఁ బేరుగాంచిన యుగమునకుఁ జెందిన ఒక కవి ప్రతిభానిర్మితము. దీని వస్తువు కూడఁ బురాణవీర గాధవంటిదే. నిర్మాణములోనిదికూడఁ బైదానివలెనే అమానుష కార్యములను, బూర్వపద్ధతులను, సంప్రదాయములను, సూత్రములను, మార్పులేని గుణవాచకములను, సంభాషణములను నుపయోగించుకొనును. దీనికిని మొదటిదానికి రీతిలో భేదముండుట తప్పదు.

Metrical Romance (చందోబద్ధ కల్పితకథ) అను పేరుగల యింకొక మహాకావ్యము కలదు. ఇది వీర శౌర్యసాహస కృత్యములు, యుద్ధము, వశీకరణములు, ప్రేమ వీనిని గురించి ప్రస్తావించును. "రొమాన్స్" భాషలని వ్యవహరింపఁబడు భాషలలో నొకభాషలో రచింపఁబడును.

E. M. W. Tillyard మొదలగువారు * Epic గురించి "High quality, high seriousness, Amplitude, Breadth, tragic effect, Choric effect" అను పదములుపయోగించుటచేత మహాకావ్యము. భావౌన్నత్యము, గంభీరత్వము. విపులత్వము మహత్వము. విషాధగాథగలిగి ప్రజా చిత్తవృత్తులను దెలియజేయునదిగా నుండవలెనని విశదమగుచున్నది. అది Hexameter అను ఛందోబద్ధమైయుండును.

పై విషయములనుబట్టి మనమహాకావ్యములను బాశ్చాత్య మహాకావ్యములకును జాలవఱకును బోలికలు గలవని తెల్లమైనది.

కావ్యవిభాగములు

తరువాత మన సంస్కృతాలంకారికులు కావ్యమందలి తరతమ భేదములనెటు విభాగించి చెప్పినారో తెలిసికొనినచో పాశ్చాత్య నవ్యకవులననుసరించి ప్రస్తుతము మనవారు కొందరు తమ రచనలు చక్కని కవిత్వమని యెటు భ్రమపడుచున్నారో తెలియును.

మమ్మటుఁడు కావ్యమును ఉత్తమము, మధ్యమము, అధమము అని మూఁడు విధములుగ విభాగముచేసినాఁడు. కాని జగన్నాథ పండితుఁడు తన "రసగంగాధరము"లో నాల్గు భాగములుగా వర్ణించినాఁడు.

"శబ్దార్థౌ యత్రగుణీభావితాత్మానౌ కమప్యర్థమభివ్యక్తం స్తదాద్యమ్". అనఁగా నెచ్చట శబ్దార్థములు అప్రధానములై చమత్కారమును గల్గఁజేయు నొక మనోహరార్థమును వ్యంజనా వ్యాపారము చేత స్ఫురింపఁజేయునో యదిమొదటిది. (ఉత్తమోత్తమము).

2 "యత్ర వ్యంగ్యమ ప్రధాన మేవసచ్చమత్కార కారణం తద్వితీయమ్" ఎచ్చట వ్యంగ్యార్థము అప్రధానమగుచు నది చమత్కార కారణమగునో యది రెండవది. (ఉత్తమము)

3 "యత్ర వ్యంగ్య చమత్కారా సమానాధి కరణో వాచ్య చమత్కారస్తు తృతీయమ్" ఎచట వ్యంగ్య చమత్కారములేకయే వాచ్య చమత్కారమునకుఁ బ్రాముఖ్యము కలదో అది మూఁడవది. (మధ్యమము)

4 "యత్రార్థ చమత్కృత్యు ప్రస్కృతా శబ్దచమత్కృతిః ప్రధానం తచ్చతుర్థమ్" ఎచ్చట అర్థచమత్కారముచే నలంకరింపఁ

* Ref. "Aristotle's Poetics and Rhetorics"—Every Men's Library series.

బడిన శబ్ద చమత్కారము ప్రధానమగునో అది నాల్గవది. (అధమము)

కేవలము శబ్దచమత్కారము మాత్రముగల కావ్యమధమాధమమని జగన్నాధపండితరాయలు వ్రాసియుచ్చినాఁడు.

పైనిర్వచనములను దృష్టియందుంచుకొని ప్రపంచవిఖ్యాతిఁ గాంచుటకు రామాయణ భారతాదులయందుఁ గల యభ్యుదయ విశేషములను గొంచెము తెలిసికొనినచో వాని శాశ్వతత్వ కారణములు మనకుఁ గోచరమగును.

* శ్రీమద్రామాయణము "వేదోపబృంహణార్థాయ" అనఁగా వేదము చక్కఁగా వృద్ధిఁజెందుకొఱకుద్దేశింపఁబడినది. ఆమహా కావ్యము "వేదైశ్చసమ్మితమ్" అనఁగా వేదసమానమైనదనియు నీక్రింది శ్లోకములోఁ జెప్పబడినట్లు వేదము కూడనయినది

"వేదవేద్యేపరేపుంసి జాతేదశరథాత్మజే।
వేదః ప్రాచేతసా దాసీత్సాక్షాద్రామాయణాత్మనా॥

అనఁగా వేదముచేతఁ దెలియదగిన పరమపురుషుఁడు (భగవంతుఁడు) రామునిగాఁ బుట్టగా వేదము వాల్మీకివలన రామాయణ రూపముగాఁ బుట్టినది" అని దాని యర్థమగుచున్నది.

రామాయణము మహా కావ్యమేకాక ధర్మశాస్త్రము కూడనైయున్నది. రాజధర్మము, ప్రజాధర్మము, మిత్రధర్మము, పతిధర్మము, సతీధర్మము, భ్రాతృధర్మము, పుత్రధర్మము, భృత్యుధర్మము. నందిమిడియున్నవి. అదియునుగాక రామాయణము "తపస్స్వాధ్యాయ" అని "త" వర్ణముతోఁ బ్రారంభింపఁబడి "జనశ్చశూద్రోపిమహత్వమీయాయత్" అని "త్" అను నక్షరముతో నంతమందుటచేతను, గాయత్రీ మంత్రములోని యిరువది నాల్గక్షరములలో నొక్కొక్కయక్షరము నొక్కగ్రంథసహస్రమున కాదియందుంచి రచింపఁబడుట చేతను మంత్రశాస్త్రము కూడా నగుచున్నది. మఱియు శ్రీమద్రామాయణము సాంఖ్యశాస్త్రమని తజ్ఞులు చెప్పుచున్నారు. ఇట్టి విశేష గుణములు గలిగి వైదర్భీ రీతిలో రచింపఁబడుటచేత సంస్కృతము తెలియనివారికి గూడఁ గొంతవఱకు నర్థమగునంత సులభముగా నుండి దానియందుఁ బ్రపంచజనులకుఁ బ్రీతిగల్గి ఆదికావ్యముగాన మహాకావ్యములకు మాతృకయై విలసిల్లినది. వేదవ్యాసునంతటివాఁడు వాల్మీకి శ్లోకముల ననువదించెనని విందుము. అదియునుంగాక కాళిదాసు కాళిదాసగుటకును, భవభూతి భవభూతియగుటకును రామాయణమే కారణము గదా!

ఇఁక భారతమును గూర్చి తెలిసికొనుటవసరమై యున్నది. ఆదిపర్వము కథాప్రస్తావన సందర్భములో నన్నయ్యగారు భారతవైలక్షణ్యమును గుఱించి వ్రాసిన యీ క్రింది పద్యము మనము జ్ఞప్తికిఁ దెచ్చుకొనవలసి యున్నది

సీ॥ ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని, యధ్యాత్మవిదులు వేదాంతమనియు
నీతివిచక్షణుల్ నీతిశాస్త్రంబని, కవివృషభులు మహాకావ్యమనియు।
లాక్షణికులు సర్వలక్ష్యసంగ్రహమని యైతిహాసికులితిహాసమనియుఁ
బరమపౌరాణికుల్ బహుపురాణ సముచ్చయంబని మహిఁ గొనియాడుచుండ

వివిధవేదతత్త్వవేది వేదవ్యాసుఁ
డాదిముని పరాశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై
పరఁగుచుండఁజేసె భారతంబు.

మహాకవి లక్షణాలు-ప్రాచ్యము-పాశ్చాత్యము

పైని బేర్కొనబడినట్టి మహాకావ్య నిర్మాతలు మహాఋషులై విష్ణునితో సమానమైన వారని తెలిసినది. ఉపనిషత్తులు "నానృషిఃకురుతేకావ్యమ్" అని పల్కినవి అనఁగా ఋషికానివాఁడు కావ్యము చెయ్యజాలడని దాని అర్థము. మహర్షులు కాఁబట్టి వాల్మీకియు వ్యాసుఁడును యశశ్శరీరులై ఆచంద్రార్కము జీవించియుందురు. కవి ధీరుఁడనియు, మనీషియనియుఁ బ్రాజ్ఞుడనియు సంఖ్యావంతుఁడనియు, సమరసింహుఁడనియు, నిర్వచించినాడు. అనఁగా కవిమంచి పండితుడనియు, బుద్ధిమంతుఁడనియు స్వాతంత్ర్యప్రియుఁ డనియు, ధైర్యశాలియనియు, జ్ఞానవంతుడనియు నర్థము. కవయతేసర్వంజానాతి, సర్వంవర్ణయతి, సర్వంసర్వతో గచ్ఛతివాకవిః" అని శబ్దకల్పద్రుమకారుఁడు వచించినాఁడు. అనఁగా రవిగాననిచోఁగవి గాంచునేకదా! అనులోకోక్తికి నిదర్శనుఁడని తాత్పర్యమగుచున్నది. ఇట్టివాఁడే విశ్వశ్రేయముగాఁ గావ్యమురచింపఁగలడని మనము తెలిసికొనవచ్చును.

* చూ॥ ఆంధ్రవాల్మీకి రామాయణము. వావిలికొలను సుబ్బారాయ విరచితము.

Browning కవి "Makers-see" అని మహాకవు లను నిర్వచించినాఁడు – Carlyle "Gifted to descern the Godlike mysteries of God's universe— అని అన్నాడు. Mathew Arnold, Wordsworth కవి గురించి చెప్పుచు "A priest to us all of the wonder and bloom of the world" అని పల్కినాఁడు— Coleridge" No man was even yet a great poet without being at the same time a profound philosopher అని అన్నాడు —Emerson "The great poets are judged by the frame of mind they induce అని యుద్ఘాటించినాఁడు.

William Hudson యిట్లన్నాడు From time to time we hear more than enough of "Art for art's sake....The really great poets of the world have never taken any account of it. One and all they have been substantial men. They have always recognised that poetry is made out of life, belongs to life, exists for life." (An Introduction to the study of literature of Henry Hudson Chap. III) అతి నవ్యుఁడైన T. S Eliot కూడ "The greatest poets have been concerned with moral virtues." అనిఅన్నాడు. ("The Hindu" Sunday, July 28 1940.)

పై నిర్వచనములను సమన్వయము చేసి చూసినచో మన వారును పాశ్చాత్యులునుగూడఁ గవికిని వేదాంతమునకును, సత్యజీవనమునకునుగల అవినాభావ సంబంధమును గుర్తించి "కళకళ కొరకే" యను నభిప్రాయము విలువైనది కాదని త్రోసిపుచ్చినారని మనకు విశదమగుచున్నది.

రవీంద్రనాధ టాగూరుగారికి విశ్వకవియనుఖ్యాతి యెందులకు లభించినదో మనము తెలిసికొనవలసియున్నది. "Poets are judged by the frame of mind they induce" అని Emerson చెప్పినట్లు రవీంద్రుని "గీతాంజలి" చదివిన వారికి భగవంతునితో మాటలాడుచున్నట్లుండును. అంతియేగాక యీ క్రింది కావ్యపఠనమువలన నతని సార్వలౌకికదృష్టి మనకు స్ఫురించును

Would you put your wreath of fresh flowers on my neck, fair one?

But you must know that the one wreath that I had woven is for the many, for those who are seen in glimpses, or dwell in lands unexplored, or live in poet's songs.

It is too late to ask my heart in return for yours There was a time when my life was like a bud, all its perfume was stored in its core.

Now it is squandered far and wide. Who knows the enchanment that can gather and sheet it up again. My heart is not mine to give to one only.

It is given to the many.

(Tagore's Garden–37 th Poem)

దీని తాత్పర్యమేమనఁగా "ఓ సుందరి! నీవు నా కంఠమునఁ బూలదండవైచెదవా? కాని నేనల్లినదండ అందరికొరకు నుద్దేశింపఁబడినది నిన్నుఁ బ్రేమింపుమని నన్నుకోరుట చాల ఆలస్యమై పోయినది. ఒకప్పుడు నా జీవితమొక మొగ్గవలెనుండి యుండు దాని సౌరభము నిలువజేయబడియుండెను. ప్రస్తుతము దాని సౌరభము దూరదేశములకు వెదజల్లఁబడినది. ఆ సౌరభమును మరల గ్రహింపఁగల గారడియెవ్వరికి తెలియును. ఒకరికే యర్పింపఁబడుటకు నా హృదయము నాది కాదు, అది అందరికి నియ్యఁబడినది

పై పద్యమునుబట్టి రవీంద్రుఁడు తన కావ్యములను విశ్వశ్రేయముగా రచించినాఁడన్న సంగతి విశదమే. దీనికే ఆంగ్లములో "universality" అని యందురు.

తరువాత కావ్యమునకు దీర్ఘాయువు నిచ్చు నింకొక యపూర్వలక్షణము "క్రాంతదర్శనము". అనఁగా భవిష్యద్దర్శనమై యున్నది. కవయఃక్రాంతదర్శినః. దీనినింగ్లీషులో Prophetic utterance అని యందురు ఈ సందర్భములో రామాయణ ప్రారంభమునుగూర్చి జ్ఞాపకము తెచ్చుకొనవలెను.

వాల్మీకి క్రౌంచపక్షిద్వయములోని మగపక్షిని జంపినబోయవానిని "మా నిషాద" శ్లోకముతో శపించి దానిని గురించి చింతలో మునిఁగి యుండగా బ్రహ్మదేవుడు వాల్మీకిని గలిసి యిట్లు పల్కెను: ఋషే ప్రబుద్ధోసి వాగాత్మని బ్రహ్మణి తద్బ్రూహి

రామచరితమ్। అవ్యాహతజ్యోతిరార్షంతే ప్రతిభాచక్షుః। ఆద్యః కవి రసి భవభూతి (ఉ॥ రా॥ 2-5) అనఁగా "ఓ ఋషీ! నీవు శబ్ద రూపముగానున్న బ్రహ్మయందు మేల్కొలుపఁబడినవాడవైతివి. కాఁబట్టి రామచరిత్రమును జెప్పుము. వేద ఋషులకుండినటు వంటి నీ ప్రతిభా నేత్రము అప్రతిహతమైనది. అడ్డులేనిదనఁగాఁ గ్రాంతదర్శనశక్తి కలది. నీవు ఆదికవివైతివి" అని యర్థము, అంతకుముందు నారదుఁడు వాల్మీకికి రామకథ చెప్పెనుగదా!

పై విషయములను దృష్టినిడికొని 1945 సం॥ లో జయపురములో జరిగిన యఖిల భారతీయ రచయితల సమావేశములో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణ పండితుఁడీ క్రింది విధముగా నుపన్యసించెను. "Great literature appeals not to reason but to spiritual perception........If a poet is lacking in intensity of vision, inward grace, in chastity of spirit, he fails as a poet. Creation implies suffering for the creator......Man rises to Godhead through tapas. Before creation sets in there is tapas or austerity. Valmiki our first great poet is a tapaswin, a seer, and he from whom he derives illumination is the prince of seers—

"తపస్స్వాధ్యాయ నిపుణం తపస్వీవాగ్విదాంవరమ్।
నారదం పరిపప్రచ్ఛ వాల్మీకిర్మునిపుంగవమ్॥

తపస్సునందును, వేదాధ్యయమునందును, నిపుణుఁడైనవాడును, సరస్వతీ జ్ఞానసంపన్నులలోను మునులలోను శ్రేష్ఠుడైనవాడును, అయిన నారదుని వాల్మీకిముని యడిగెను. అని దాని తాత్పర్యము.

మహాసాహిత్యము హేతువాదమునకుఁగాక ఆధ్యాత్మిక దృష్టికి హృద్యముగానుండును. ఒక కవికి దివ్యదృష్టియు, భగవద్భక్తియు నాత్మశుద్ధియులేనిచో నతఁడు కవికాడు. కవి సృజింపవలెనన్నచో నతఁడు సృష్టికర్తకొరకుఁ గష్టములు పడవలెను... సుఖదుఃఖాతీతుఁడగుటవలన మానవుఁడుదైవత్వముఁ బొందుచున్నాఁడు. కవిసృజించుటకుమున్ను సుఖదుఃఖాతీతుఁడు కావలెను, మనకాదికవియైన వాల్మీకి యొక తపస్వియు, ద్రష్టయు నయియున్నాఁడు. అతఁడెవరివలన విజ్ఞానముబడసెనో యతఁడు ద్రష్టలలో నగ్రగణ్యుఁడు అనిరాధాకృష్ణగారు పల్కిరి.

పైనిబేర్కొనబఁడిన క్రాంతదర్శన విషయమును బాశ్చాత్యులంగీకరించినారేమో తెలిసికొందుము. * Thoughts have gone forth, where powers can sleep no more" అనియు "Poets are the unacknowledged legislators of humanity" అనియు Shelley కవి అన్నాడు. అనఁగా భావములు బయల్వెడలినవి, వారి శక్తులిఁక నిద్రాణములుగ నుండలేవు. కవులకు దివ్యదర్శనము గలిగినప్పుడు మానవావసరసూచకములగు సత్యములను బల్కగలరని యర్థము. దీనిని బట్టి యేసన్నివేశమెప్పుడు జరుగునోతిథులతో జోతిష్కునివలెఁగవిచెప్పవలెనని యర్థము కాదు. "It is the proportion of this power of foresight, of prophecy, in poet's worth the lifts it towards or above the dividing line between major and minor in poetry," ఈ భవిష్యద్దర్శనశక్తిని బట్టి మహాకవిత్వమునకును, గవిత్వమునకు భేదము తెల్లమగునని పైవాక్యముల తాత్పర్యము.

తరువాత ప్రతి కవియు భవిష్యద్దర్శన శక్తిమంతుఁడు కాలేడనియు నొకానొక కవికాదృష్టియున్నను నతఁడు చెప్పిన విషయములు మున్ముందు జరుగక పోవచ్చుననియుఁ గూడ మనము తెలిసికొనవలసి యున్నది. ఆంగ్లేయకవి Wiliam Watson "The man who saw" అను కావ్యమును బ్రకటించినాఁడు. అందులోఁ గవిత్వముగాని భవిష్యద్దర్శనము లేదని విమర్శకులాక్షేపించినారు. ఆంగ్లదేశీయాస్థాన కవియగు Alfred Tennyson ప్రథమ ప్రపంచ యుద్ధానంతరమేర్పడిన నానారాజ్యసమితిని (League of nations) గూర్చి ముందుగానే యీ క్రింది విధముగా సూచించినాఁడు.

For I looked into the future, as human eye could see, saw the vision of the world and all the wonder that should be...... Till the wardrum throbs no longer and the battle flag is furled In the parliament of man, the Federation of the world.

మానవ దృష్టి చూడగల్గినంత వఱకు భవిష్యద్దర్శనము సేయఁగా నద్భుతముగా నాకుఁ బ్రపంచశాసనసభ కనపడినది. అప్పుడు యుద్ధదుందుభులు మ్రోయలేదు. యుద్ధపతాకలు ముడుచు

* New ways in English Literature" Chap. V by James H. Cousins.


కున్నవి. అని పైవాక్యముల తాత్పర్యము కాని యీతఁడు కేవల మాంగ్ల దేశీయౌన్నత్యస్తోత్ర పారీణుఁడగుటచేతఁ బ్రపంచశాసన సభయనఁగా "Glorified West Minister"(మహాంగ్లశాసన భయే) యని ఐర్లాండు వారు సంశయించుటకుఁ దావిచ్చినది.

Thomas Hardy అనునింకొక ఆంగ్లకవి "Dyn asts" అను మహా దృశ్య కావ్యముకు రచించినాఁడు. అందులోఁ గ్రాంతదర్శనశక్తి చక్కఁగ ప్రదర్శింపఁ బడినది. Walt whitman అను నమెరికాకవి భవిష్యద్దర్శనము గూర్చి విమర్శకు లిట్లన్నారు. "Whitman trumpeted himself as the beginner of a new American Literature but so for there has been only one Whitman" "హ్విట్‌మన్ తానొక నవ్యవాఙ్మయ సృష్టికర్తయని యుద్ఘోషించినాఁడు కాని యిప్పటికొక్కఁ హ్విట్‌మన్ మాత్రమున్నాడని యర్థము. కాని అమెరికాయధ్యక్షుఁడు అప్పుడు జర్మనీకిఁ బంపి సంధిషరతులలో హ్విట్‌మన్ యొక్కఁ భావప్రభావ మున్నదని యంగీకరింపఁ బడినది.

అరవింద ఘోషురచించిన వ్యాసములు "Future of Poetry" (కవిత్వము యొక్కఁ భవిష్యత్తు) అనుపేరు 1953లోఁ బ్రకటింపఁబడినవి. ఇది 400 పుటల గ్రంథము. ఇందు నవ్యకవితా మార్గదర్శకుఁడు హిందూదేశములో హిందువుడై యవతరించుట బహుశః తథ్యమనియు. ఆనందము, సౌందర్యము, అను పదముల పరమార్థమేమియో అతఁడు విశదీకరించుననియుఁ దెలియఁజేసియున్నాడు. పాశ్చాత్యదేశములోనే యీ నవ్యకవితాప్రారంభము జరిగినదని పల్వురభిప్రాయపడుచున్నారు.("The Hindu" Nov. 8, 1953)

(సశేషము)

* New ways in English Literature by James H. Cousins



కీచులాడినారు క్షేత్రమా? బీజమా?
ఏదిముఖ్యమనుచు ఆదిరుషులు
అంతరాత్మముందు ఆరెండుయొంతరా!
జనసుతాంతరంగ! వినురరంగ!

కృష్ణశతశతి:—

ప్రగతిలో

నల్లగొండ

"ఉమాకాంత్"

నల్లగొండా లోని వాడ
నందికొండాకట్టువాడ

నీపాటావిన్పింపరో
నీప్రగతీచూపింపరో

మహిళలేలే మఠంపల్లీ
కాల్వత్రవ్విన వెంపూరూ
గొప్పవూరూ ముంగోడూ

నేడువెలుగునుచూపినారూరో
సాటివారినికల్పినారూరో

హరిజనులకు పొలములిచ్చె
దేశమందున పోచంపల్లీ

కులభేధం తుడిచినారూరో
సమత భావంచూపినారూరో

నల్లగొండాలోనివాడ
నందికొండా కట్టువాడ

నీపాటా విన్పింపరో
నీప్రగతీ చూపింపరో *

---

* వివరణ

1. మఠంపల్లి:– హుజూర్నగర్ తాలూకాలోని గ్రామం మహిళలే గ్రామ పంచాయతీ సభ్యురాండ్రుగా ఎన్నికయ్యారు. అధ్యక్షురాలు శ్రీమతి మన్నెం చూడమ్మ.
2. వెంపూరు:– వేంపూరు ప్రాజెక్టు సమీపగ్రామస్థులు ప్రభుత్వమునుండి ఏ విధమైన సహాయము పొందకుండానే రు. 10,000ల ఖర్చుతో ఒక పెద్ద కాలువ త్రవ్వారు. ఈ గ్రామస్థుల కృషివల్ల 251 ఎకరాల అదనపు భూమి సాగులోనికి వచ్చింది.
3. మునుగోడు | ముంగోడు | నారాయణపురం పంచాయతి సమితిలోని గ్రామం 1960–61 సంవత్సరం నల్లగొండ జిల్లాలో ఉత్తమ గ్రామంగా ఎన్నికైంది.
4. పోచంపల్లి:– నల్లగొండకు 50 మైళ్ళ దూరంలో భువనగిరి తాలూకాలో నున్నది. తెలంగాణాలో భూదానవుద్యమానికి జన్మస్థానమై యావత్ప్రపంచాన్ని ఆకర్షించింది. పోచంపల్లి జమీందారు వెదిర రామచంద్రారెడ్డిగారు వంద ఎకరాల భూమిని వినోభాభావేకు భూదానంగా ఇచ్చారు. దానిని అచ్చటి హరిజనులు సహకార సూత్రాలపై వ్యవసాయం చేస్తున్నారు.
5. నందికొండ:– దీనినే నేడు 'నాగార్జునసాగర్ ప్రాజెక్టు' అని వ్యవహరిస్తున్నారు. ఇది నల్లగొండ జిల్లాలోనిది.

ఉదాత్త ధ్యేయాలతో ఉన్నతంగా జీవించండి

గవర్నర్ రిపబ్లిక్ దిన సందేశం

1962 జనవరి 26వ తేదీన భారత రిపబ్లిక్ 12వ వార్షికోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గవర్నర్ డాక్టర్ భీమసేన్ సచార్ ఈ క్రింది సందేశాన్ని ఇచ్చారు.

"ప్రస్తుతంకొంత కాలంనుంచి ప్రజా బాహుళ్యాన్ని జాతీయ సమైక్యతాదృక్పథం అమితంగా ఆకర్షిస్తున్నది. అది ఫలప్రదమైన చిహ్నమేగాక మన చురుకుతనానికి నిదర్శనం. మన రాజకీయ రంగంలో కొన్ని అసాంఘిక శక్తులు తమ ప్రాబల్యాన్ని అధికం చేసుకోడానికి ప్రయత్నిస్తున్న సంగతిని మనం కాదనలేము. ఈ దుష్టశక్తులను అలక్ష్యంచేస్తే మనం మన జాతీయ ధర్మాన్ని విస్మరించిన వారవుతాం. అందరి క్షేమంకోసం ప్రజాబాహుళ్యపు దృక్కులు అన్నీ ఈ దుష్టశక్తుల హానికర ఫలితాలవైపు కేంద్రీకృతమైనాయి.

"అంతేమనం ఈ దుష్టశక్తుల గుప్పిటలో చిక్కుకున్నామనిగాదు. మనం సకాలంలో మేల్కొనకపోతే ఆ దుష్ట శక్తులు మనలను పతనం చేయగలవనే భయం ఒక్కటే మనకున్నది దేశక్షేమానికి అవసరమైన శక్తి సామర్థ్యాలు బలహీనమైనపుడే దేశ విచ్ఛిన్నకర శక్తులు తల ఎత్తుతాయి. కనుక మనశక్తి సామర్థ్యాలను ఎన్ని వ్యయప్రయాసలకు ఓర్చియైనా పెంపొందించుకోవాలి. సమైక్యతకు అవసరమైన నిర్మల వాతావరణాన్ని మనం ప్రోదిచేస్తే అనైక్యత అనే దానికి ఇక నెలవు వుండదు కనుక మనం ఈ సమస్యను ఎదుర్కొనే అనుకూల వాతావరణానే కల్పించడానికి ప్రాముఖ్యత ఇవ్వాలి.

"మనం ఐక్యతను ఎందుకు వాంఛిస్తున్నాం? ఎన్నో కష్టనష్టాలకోర్చి సంపాదించిన స్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకోడానికి ఎన్నో సంవత్సరాల తర్వాత జాతీయ, వ్యక్తిగత వ్యక్తిత్వాలను పెంపొందించుకునే మహద్భాగ్యం మనకు లభించింది. మనసీడను చూచుకుని దడుచుకునేటంత అపనమ్మకాలతో మనం చిన్న చిన్న సంఘటనల పట్లకూడా ఎంతో మెలకువతోను, జాగరూకతతోను మెలగుతున్నాం. ఈ మెలకువ, జాగరూకత మంచిదేగాని చెడ్డదేమీకాదు. మనం ఈ విషయంలో ఎంత శ్రద్ధవహిస్తే అంత జాతీయాభివృద్ధిని సాధించగలం.


"ప్రజల మనసులు, హృదయాలు గాఢమైన దేశభక్తితో పునీతం కావాలి. మాతృభూమి రక్షణ, ప్రతిష్ఠల పట్ల మనం ఎంతో భక్తిశ్రద్ధలను పెంపొందించటమేగాక మనకు మనమే అసూయ పడేటంత రాగాభిమానాలను ప్రదర్శించాలి.


స్వేచ్ఛా దేశంయొక్క పౌరుడంటే ఎలాప్పుడూ ప్రతిపౌరుని హృదయాలలో హత్తుకపోవాలి. దేశంపట్ల మన ప్రేమను ఒక ప్రత్యేక స్థాయికి పెంపొందించడానికి వీలుగా ప్రజల ఆశయాలను నైతిక విలువలతో ముడిపెట్టాలి. భారతమాత పట్ల ప్రేమతో ప్రజలు సారసశ్యంచెంది దేశప్రతిష్ఠను రక్షించడానికి ఎన్ని కష్ట నష్టాలకైనా ఓర్చి త్యాగాలు చేయాలి.

"మనదేశ రక్షణలో ఎదుర్కొన వలసింది. ఒక్క విదేశీ దురాక్రమణయేగాదు. లోపలనుండి ఉత్పన్నమయ్యే అపాయాలు కంటే దేశంలో తల ఎత్తే దుష్టశక్తులే ఎంతో హానికరమైనవి. కనుక మనము సాంఘిక ప్రవర్తనకు అనుకూలమైన సద్గుణాలను మనలోమనం ప్రచారంచేసుకోవాలి. భారతమాత సంతతిగా ఉండ రం సన్నిహిత సంబంధాలతో పట్టుదాళ్ళతో బంధితులైనట్లు ప్రజలు తెలుసుకోవాలి. విశాల దృక్పథాన్ని అలవరచుకొని ఉదాత్త శయాలతో ఆలోచించే అలవాటును మనం పెంపొందించుకోవాలి. మన ఆలోచనలను క్రమబద్ధంచేస్తే మన చర్యలు నూతనోత్సాహాన్ని రేకెత్తించవు. ఎవరి సాంఘిక ప్రవర్తన దేశపౌరుని కనీసపు ప్రవర్తనకు కూడా తక్కువ స్థాయిలో వుంటుందో అట్టివారిని అవమాన పరిచే విధంగా దేశ వాతావరణాన్ని మనం నిర్మలంచేయాలి. ఈ ఆశయం పరిపాలనా, రాజకీయ రంగాలకే పర్తించదు. జీవితానికి సంబంధించిన ప్రతి రంగంలో కూడా మనం నిర్మలమైన ప్రవర్తన కనీస ప్రమాణాలకు ప్రాముఖ్యతనివ్వాలి. నిత్యజీవితంలో ప్రాథమిక సుగుణాలైన న్యాయం, సత్యం, సహనాలనే మనం గుర్తించడంలేదు. ఇటువంటి మనం దేశానికేదైనా క్లిష్టసమస్య ఎదురైనపుడు మనలను ఉన్నత మానవులుగా ఉన్నతదృక్పథాలను ఆశయాలను, అలవాట్లను ఒక్కసారిగా అలవరచుకోగలమా అన్నదే సంశయం. హృదయాలలో మంచితనాన్ని, గొప్పతనాన్ని, నిస్వార్థసేవాగుణాన్ని మనకు మనమే అలవరచుకోవాలి. యావద్భారతదేశం శ్రేయస్సు దృష్ట్యా వ్యక్తిగతంగా ఉన్నతంగా జీవించాలనే కాంక్ష ప్రజల హృదయాలలో నాటుకు పోయేట్టుచూడాలి. ఈ సద్గుణాల నలవరచుకోడానికీ మనం ఒక క్రమబద్ధమైన ప్రచారాన్ని చేయడానికి, సిగ్గుపడరాదు. దేశభక్తి, అహింస, సత్యాలవంటి సుగుణాలను మనం పెంపొందించుకోవాలి. అవన్నీ ఒక్కసారిగా అలవడేవికావు. ఒక వేళ ఆ సద్గుణాలు అలా అబ్బినా అట్టేకాలం వుండవు. ఆ సద్గుణాలవల్ల మనకు ముందు అత్యావసర సమయాల్లో సహాయం కావలసివస్తుంది. అందుకై ఆ సద్గుణాల వ్రేళ్ళు మనలో పటిష్ఠంగా నాటుకు పోవాలి. వాటిని ప్రతిరోజు, ప్రతినిత్యం నిశ్చలంగా ఆచరణలో పెట్టడం అవసరం.

"భారత రిపబ్లిక్ 12 వ వార్షికోత్సవం శుభ సందర్భంగా నాతోటి ప్రజలకు ఇవే నా శుభాకాంక్షలు. మన హృదయాలలోని సంకుచిత, వ్యక్తిగత మత దురభిమానాలు సంఘటనలుగా మాత్రమే విస్మరించే భరతమాత అనుంగు సంతతిమికాగల మన్న కోరిక సఫలం కావాలని ఆశిస్తున్నాను.

'జై హింద్'





మర్రిచెట్టు

శ్రీ తాళ్లూరు నాగేశ్వరరావు

ఈ మధ్య జరిగిన జనాభా లెక్కల ప్రకారం ఆవూరి జన సంఖ్య ఆరు వేల అయిదు వందల పదిహేను. ఆవూరికి నడిబొడ్డు అని నిస్సందేహంగా చెప్పగల ఓ చిన్న చెరువుంది. ఆ చెరువు తూర్పు గట్టున ఓ పెద్ద మర్రిచెట్టున్నది. ఆ మర్రిచెట్టు ఎదురుగ్గా మాధవయ్యగారి మేడ ఉన్నది. మాధవయ్యగారంటే ఆవూరి పంచాయతీ బోర్డు ప్రెసిడెంటు. అంతేగాకుండా దానాలకూ, ధర్మాలకూ, మంచితనానికీ ఆ చుట్టుప్రక్కల ఇరవై ముప్ఫై గ్రామాలలో అందరి నోళ్లల్లో అహర్నిశమూ నానే వ్యక్తి.

మాధవయ్యగారి ముత్తాత కాలం నాటిది ఆ మర్రిచెట్టు కూడా అప్పటిదే. మాధవయ్యగారి తండ్రి డెబ్బైయేళ్ళ క్రితం నాటిన మొక్క యీనాడు పెరిగి పెద్దదై, ఎన్నో వూడల్ని దించి, ఐదు వందల గజాల మేరకు ఆక్రమించి, మహావృక్షమై కలిసివున్న హైందవ కుటుంబంవలె ఎంతో గంభీరంగా వున్నది మాధవయ్య గారికి ఆ మర్రిచెట్టు మీద ఎంతో ప్రేమ, ఎంతో అభిమానము, ఎంతో మమకారం. చిన్నతనంలో ఆ మర్రిచెట్టు క్రిందనే ఆడుకొనేవాడు. "ఈ మర్రిచెట్టుమాదే" అని పిల్లల ఎదుట గర్వంగా చెప్పుకొనేవాడు ఒకోక్కసారి ఆ మర్రిచెట్టు క్రిందే ఆటలు ఆడుతూ నిద్రవచ్చి పడుకుంటే ప్రొద్దుపోయాక పాలేరు వచ్చి భుజాన వేసుకొని ఇంట్లోకి తీసుకెళ్లేవాడు. తను పెద్దవాడై, ఇంటికి పెత్తనదారై ఊళ్ళో, సంఘంలో ఒక విశిష్ట స్థానాన్ని నిలదొక్కుకున్నాక ఆ తీరని అభిమానంతో, వదలని మమకారంతో ఆ చెట్టు చుట్టూ రెండు వందల రూపాయలు స్వంత డబ్బు ఖర్చుబెట్టి చక్కగా రాతి అరుగు కట్టించాడు. ఇప్పటికీ రోజూ వీధిలోకి వెళ్లే ముందూ, ఇంటికి వచ్చే ముందూ ఆ చెట్టుకేసి చూడనిదే వుండలేడు. ఆ చెట్టు క్రింద నిత్యమూ చిన్నలూ పెద్దలూ కాలక్షేపం నిమిత్తం చేరుతూ వుంటారు. జాతీయ అంతర్జాతీయ రాజకీయాలు, నైతిక సాంఘిక సాంస్కృతిక సమస్యలు, సినిమా వ్యావసాయిక పారిశ్రామిక విషయాలు—వాళ్ళ చర్చల్లో, కబుర్లలో దొర్లుతూ ఉంటాయి. తరుచు మాధవయ్యగారు ఆ చర్చలకూ, కబుర్లకూ అధ్యక్ష స్థానాన్ని అలంకరిస్తూ వుంటారు. పై పెచ్చు ఆయనగారే పంచాయతీ బోర్డు రేడియో స్పీకర్ను ఆ మర్రిచెట్టు క్రింద ఏర్పాటు చేయించారు. ఆ దగ్గర వీధుల్లోని గ్రామస్థులంతా ఆకాశవాణి కార్యక్రమాల్ని శ్రద్ధగా వింటూ తీరిక వేళల్లో ఖులాసాగా కాలక్షేపం చేస్తూ వుంటారు.

పూర్వం నుంచీ మాధవయ్యగారి వంశం మోతుబరి వంశం. ఆ సాంప్రదాయమే మాధవయ్యగారి హయామ్‌లో కూడా

సాగుతూ వస్తున్నది. ఆయన గారికి నలుగురు కొడుకులు. కూతుళ్ళు లేరు. పెద్దకొడుకు నానాకాలపు చదువు చదివి పొలం పనులు చూస్తున్నాడు. రెండో కొడుకు విశాఖపట్నంలో మెడిసిన్ చదువుతున్నాడు. మూడో వాడు కాలేజీలో ప్రీ యూనివర్సిటీ చదువుతున్నాడు. చిన్నవాడు హైస్కూలు చదువులోనే ఈస్తీపడు తున్నాడు. మాధవయ్యగారు భారీ మనిషి. ఆరడుగుల పొడవూ రెండు వందల పౌన్ల బరువూ, సూర్యుని ఆఖరి కాంతి వంటి శరీరచ్ఛాయ, చిరునవ్వు మార్కు గల ముఖమూ గరిసి—ఆయన ఆకారం చూడగనే ఎంతో దయా స్వభావుడనీ, కరుణామూర్తియనీ వెనుక చూపులేని వ్యవహార జ్ఞానియని ఇట్టే గ్రహించవచ్చు. ఆయన మంచితనానికి, ఉదార బుద్ధికి సవాలక్ష ఉదాహరణ లున్నాయి. బీద విద్యార్థులకూ, నిరుద్యోగులకూ, నిరుపేదలకూ, దిక్కులేని దీనులకూ, కూటికీ గుడ్డకు కరువైన కూలివాళ్ళకూ—ఎంతో సహాయం చేశాడు. ఎన్నో కుటుంబ కలహాల్లో మధ్యవర్తిగా వ్యవహరించి వాటిని సులభంగా పరిష్కరించి పెద్దమనిషిగా ఖ్యాతి గడించాడు. ఊళ్ళో కొన్ని కులాల మధ్య, వర్గాల మధ్య అనాదిగా కరుడుగట్టుకొని పోయిన కక్షల్నీ, కార్పణ్యాల్నీ—నేర్పుగా, మృదువైన మార్గాలతో కాలదోషం పట్టించిన సత్కీర్తి కూడా ఆయనకే దక్కింది. ఆ గ్రామంలోని ఎన్నో సాంఘిక సమస్యలకూ, నైతిక తీర్పులకూ,—ఆయన సలహాలు పెన్సిలిన్ మందువలె పనిజేసిన దృష్టాంతరాలున్నాయి. మాధవయ్యగారు ఆ వూళ్ళో ప్రముఖ వ్యక్తి. ఇతర్ల చేత ఆదర్శంగా చెప్పుకొనబడే మహనీయుడు. మంచితనాన్ని సమర్థతతో మేళవించిన సద్వర్తనుడు. ఆ గ్రామ సాంఘిక రాజకీయ చరిత్రలో సంవత్సరాలకొలదీ నిలబడేకీర్తి ప్రతిష్ఠలు గల వ్యక్తి. అట్లాగని ఆవూళ్లో ఆయనగారి మాటలకూ, చేష్టలకూ, ఆజ్ఞలకూ—చుక్కెదురు లేదని చెప్పడం సబబుకాదు. ప్రజాస్వామ్యానికి ప్రతిపక్షం అత్యవసరం అని కాక పోయినా—అన్ని గ్రామాల్లో వలె ఆ గ్రామంలో కూడా మొదట్నుంచీ రెండు పార్టీలు జీవిస్తూ వచ్చాయి. రెండు ఓట్ల తేడాతో మాధవయ్యగారి ముఠా పంచాయతీ పాలనాధికారంలోకి వచ్చినది. అందుకు మాధవయ్యగారి ప్రత్యేకమైన కృషీ, మంచితనపు వినియోగమూ, వాగ్దానాల పటుత్వమూ అని చెప్పక తప్పదు. ఏమైనా ఆయనగారు ఆ వూరి పంచాయతీ బోర్డు ప్రెసిడెంటుగా అధికారాన్ని చేపట్టి, తన వ్యక్తిత్వానికి మెరుగులు దిద్దుకున్నారు. ఆయనగారి నీడలో కష్టాల్ని మర్చిపోయి సుఖాలకోసం చేతులు చాచేవాళ్ళున్నారు; ఆయనగారి మంచితనంతో గాడి తప్పిన జీవితాల్ని సక్రమ మార్గంలోకి పెట్టుకొనేవాళ్ళున్నారు; ఆయనగారి చేతిక్రింద నీళ్లలో చప్పిక తీర్చుకొని భవిష్యత్తు మీద నమ్మకాన్ని కుదుర్చుకొనేవాళ్ళున్నారు. మాధవయ్యగారు ఆ వూరికి గర్వకారణం. అట్లాంటి మనిషి వల్లనే ఆ వూరు పేరు తెచ్చుకొంటూ న్నది. ఆ వూరి పేరు చెప్పగానే స్ఫురణకు వచ్చేది—మాధవయ్యగారూ, మర్రిచెట్టే !

ఒక రోజు మధ్యాహ్నం మాధవయ్యగారు మేడ వరండాలో పడక కుర్చీలో కూర్చుని చేత్రోలు పుగాకు చుట కాలుస్తూ, పేపరు చదువుకొంటూ వుండగా, నలుగురు యువకులు వచ్చి వినయంగా నిలబడ్డారు. వాళ్ళను మర్యాద జేసి కూర్చోబెట్టాడు. ఒక యువకుని చేతిలో ఏదో చందాలు వసూలు చేసే పుస్తకం కూడా వున్నది. అతనే కాలయాపన చేయకుండా తాము వచ్చిన పనిని సంగ్రహంగా నివేదించాడు.

"ఇంతపెద్ద గ్రామానికి గ్రంథాలయం లేకపోవడం తీరని లోటని ఎప్పుడో గుర్తించాము. కాని అశ్రద్ధ చేత మెదలకుండా వూరుకున్నాము. ఇప్పుడు పదిమంది యువకులం పట్టుబట్టి ఏమైనా యీ నెలాఖరుకు వూళ్ళో చిన్న గ్రంథాలయాన్ని స్థాపించాలని దృఢంగా నిర్ణయించుకున్నాం. తమలాంటి పెద్దలంతా హృదయపూర్వకంగా విరాళాలిస్తే యిట్టే లైబ్రరీ యేర్పడిపోతుంది. ఈ పుస్తకం మీద ముందు మీ చేతనే "శ్రీరామ" పెట్టించాలని ఎంతో ఉత్సాహంతో వచ్చాము."

ఆ మాటలు విని మాధవయ్యగారు నిగూఢంగా చిరునవ్వు నవ్వారు. ఆ తర్వాత యిట్లా అన్నారు: "ఈ మాత్రానికే యింత తతంగమెందుకోయ్! ఊళ్ళో గ్రంథాలయం పెట్టటానికి విరాళాలు పోగుచేయాలా ? నయాపైసా మనం యిచ్చే పనిలేకుండా ఊళ్లో లైబ్రరీ పెట్టే ఏర్పాటు నేను చూస్తాను. ఆ బాధ్యతను నా భుజస్కంధాలపైన నిర్విచారంగా వదిలేయండి ! ఈ జిల్లా లోకల్ లైబ్రరీ అథారిటీ ఛైర్మన్ నా చిన్ననాటి స్నేహితుడు. నేను కాకితో కబురు చేస్తే—ఊళ్లో లైబ్రరీ వూడిపడదూ !...మీరు వృథాగా ప్రయాసపడకండి."

ఆ నలుగురు యువకులూ నిప్పులమీద వర్షం కురిసినట్లు చప్పగా దిగజారిపోయారు నిరాశతో. ఒకళ్ళముఖాలొకళ్ళు పేలవంగా చూసుకుంటూ వెళ్లారు.

ఇంకో రోజు ఉదయం ఓ అరడజను మంది రైతులు వరద వొచ్చి పడ్డట్టుగా మాధవయ్యగారి దగ్గరకొచ్చారు. పిళ్ళం

దర్శి ఆయన బోడి పుర్యావలతో చదును చేసి, అసలు సంగతేమిటన్నాడు. అందులో ప్రాతినిధ్యం వహించిన ఓ రైతు తాము తలపెట్టిన ఘనకార్యాన్ని వివరించాడు.

“పడమటి పొలాన రెండో నంబరు బ్రాంచీ పైన వంతెన లేకపోవటాన ఏటా రైతులూ, గొడ్లూ ఎంత యిబ్బంది పడిపోతూన్నది చూస్తూనే వున్నావు గదా బాబాయ్! మరీ మాసూలు కాలంలో కాలువ ఎండక బళ్లు కుండల మేరకు దిగబడుతూ—పశువుల ప్రాణాలు అలిసిపోతున్నాయి. దాని మీద వంతెన కట్టాలని మనవాళ్లమంతా అనుకున్నాము. ఎకరానికి పదిరూపాయల కాడికి చందా యివ్వటానికి కూడా అందరూ సిద్ధంగా వున్నారు. మీ సలహా కోసం కాచుక్కూచున్నాం”

మాధవయ్యగారు తాపీగా ఆలోచించి, అందరూ గమనించేట్టు గంభీరంగా చిరునవ్వు నవ్వారు.

“ఆ కాలువ మీద వంతెన ఎంతైనా అవసరమే. బాగానే వుంది. కాని ఆ మాత్రపు దానికి యింత హంగామా ఎందుకూ? నేను కట్టించలేనూ! పంచాయతీ సమితి అధ్యక్షుడు మన పార్టీ వాడేనాయె. బ్లాకు డెవలప్‌మెంటు ఆఫీసరు మన బంధుకోటికి చెందినవాడాయె! నేను చెబితే నిముషాల మీద వంతెన పైకిలేవదూ! ఆ బరువూ భారం నా భుజాలపైన వేయండి. మీరు అనవసరంగా పతిదానికీ చందాల వ్యవహారం పెట్టి సన్నకారు రైతును వేధించకండి” అన్నారు మాధవయ్యగారు,

ఆ రైతులంతా ఒక్కసారి గాలిపోయిన రబ్బరు బెలూన్‌ల వలె చప్పబడ్డారు. వ్రేళ్ళాడే ముఖాలతో మెదలకుండా వెళ్ళిపోయారు.

మరో రోజు సాయంత్రం పంచాయతీ బోర్డుకు కో ఆప్టు చేసికోబడిన స్త్రీ సభ్యురాలు నాగరత్తమ్మ నలుగురు స్త్రీలను వెంటబెట్టుకొని-ఎంతో ఆవేశంతో మాధవయ్యగారి దగ్గరకు వచ్చింది. వాళ్ళను మెత్తగా ఫ్రేం కుర్చీల్లో కూర్చోబెట్టి, కాఫీలు యిప్పించి-వచ్చిన పనేమిటన్నట్టు వాళ్ళకేసి చూశారు మాధవయ్యగారు. నాగరత్తమ్మ గొంతు సవరించుకొని యిట్లా అన్నది.

“సాంఘికాభ్యుదయ పథకాల్లో స్త్రీలకు తనన ప్రాతినిధ్యమివ్వాలని దేశంలో అందరూ అంటున్న మాటలే. మన వూళ్లో మహిళా మండల్ని స్థాపించి, స్త్రీల సమస్యల్ని ఎప్పటికప్పుడు పాటివారికి తెలియజేస్తూ, వాటి పరిష్కార మార్గాన్ని స్వేచ్ఛగా చర్చించే అవకాశాన్ని కల్పించాలనీ; వంటగదికే స్త్రీ అంకితమైపోరాదనీ; విజ్ఞానాన్ని అలవర్చుకొనే వసతీ, వినోదాన్ని అనుభవించే అనుకూల వాతావరణమూ అందుబాటులో పెట్టాలనీ-ఎన్నో యేళ్లుగా కలలు గంటున్నాను. ఆ కలలు యీ నాటికి నిజరూపాలు ధరించే శుభసమయమొచ్చింది. ఊళ్ళో చాలా మంది స్త్రీలతో సంప్రదించాను. అందరూ మహిళామండలి స్థాపనకు తృణమో పణమో యిచ్చి సభ్యురాండ్రగా చేరతామని వాగ్దానాలు చేశారు. ఇందులో మీ సహాయమెంతైనా అవసరమని గుర్తించి మీ దగ్గరకొచ్చాము.”

మాధవయ్యగారు కొంచెంసేపు కనుబొమ్మలు దగ్గరకు చేర్చి, ఆలోచించి—సరళంగా సలహా యిచ్చారు.

“ప్రతివారూ ఏవో చందాలు వేసికొని ఏమేమో స్థాపించుదామని ఆరంభ శూరత్వంతో ముందుకు దుముకుట సమంజసం కాదు. ఏ పని తలపెట్టినా ప్రభుత్వ సహకారాన్ని పొందటం శ్రేయస్కరం. ఆంధ్రమహిళాసభలోనూ, ఉమన్స్ సోషల్ వెల్‌ఫేర్ బోర్డులోనూ నన్ను ఎరిగినవాళ్ళున్నారు. వాళ్ళను సంప్రదించిన మీదట ఊళ్ళో మహిళామండలిని పటిష్ఠంగా స్థాపించటం మేలు. ఏమంటారు?”

ఇంక నాగరత్తమ్మ ఏంమాట్లాడుతుంది? నిప్పురవ్వకు మల్లే నిట్టూర్చి నెమ్మదిగా కుర్చీలోంచి లేచింది, మిగతా స్త్రీలు ఆమెను అనుసరించారు.

ఆవిధంగా అప్పుడప్పుడూ ఎందరెందరో ఏవేవో ఉద్దేశ్యాలతో, ఆశలతో, ఏమేమో చేద్దామనే ఉత్సాహంతో మాధవయ్యగారి దగ్గరకు వస్తూవుంటారు. ఒక్కొక్క పనిద్వారా సాంఘిక సేవలో తమ వ్యక్తిత్వానికి విలువను పెంచుకొని కీర్తిప్రతిష్ఠల వెలుగులోకి రావాలని వాళ్ల ఆశయం, ఆలోచన, ప్రయత్నం కాని మాధవయ్యగారు మటుకు ఎప్పటికప్పుడు ఏవేవో చెబుతూ తన ఆధిక్యతనూ, పలుకుబడినీ, సమర్థతనూ, విశాలదృక్పథాన్నీ ప్రకటిస్తూ—వాళ్లలో నిరాశా నిస్పృహల్ని పెంపొందింప జేస్తూ వుంటారు. ఆయన మీదగల గౌరవంతో, భక్తితో, నమ్మకంతో, వినయంతో — ఎవ్వరూ ఎదురు చెప్పటానికి ప్రయత్నించరు. తమలోతాము సర్దుకొని సంతృప్తిపడేందుకు సతమతమవుతారు.

రోజులు సిమ్మెంటు రోడ్డుపైన రబ్బరు చక్రాలు దొర్లి

నట్లు దొర్లుతున్నాయి. మాధవయ్యగారు జిల్లా లోకల్ లైబ్రరీ అథారిటీ ఛైర్మన్‌తో ఊళ్లో లైబ్రరీ కొత్తగా స్థాపించే విషయమై మాట్లాడారు. రెండోనెంబరు బ్రాంచికెనాల్ పైరైతుల ఉపయోగార్థమై వంతెన నిర్మించేందుకు పంచాయతీ సమితి అధ్యక్షునితోనూ, బ్లాక్ డెవలప్‌మెంటు ఆఫీసరుతోనూ సమాలోచనలు జరిపారు. ఊళ్లో మహిళా మండలి స్థాపనలో ఆంధ్రమహిళా సభవారుగానీ, ఉమెన్స్ సోషల్ వెల్‌ఫేర్ బోర్డువారు గానీ—చేసే సహాయాన్ని గూర్చి ఉత్తరాల ద్వారా వ్రాసి తెల్సుకున్నారు.

మర్రిచెట్టు క్రింద కాలక్షేపపు సమావేశాలు, చర్చలు, కబుర్లూ యథావిధిగా కొనసాగుతూనే ఉన్నాయి. మాధవయ్యగారు గ్రామంలో ప్రముఖవ్యక్తిగా పరిగణింపబడుతూనే ఉన్నారు.

ఒకరోజు సాయంత్రం మాధవయ్య గారు తూర్పు పొలం తోటలదగ్గరకు వెళ్లారు. ఆయన గారు తరుచు షికారుగా వెళ్లినట్టు పొలం వెళ్లివస్తూ వుంటారు. పంటల మంచి చెడ్డలు స్వయంగా చూసి, రైతులతో ముచ్చటించి, —అవసరమైతే ఎగ్రికల్చరల్ డిపార్టుమెంటు వార్ని పిల్చికొని, పైర్లకు వ్యాధిసోకితే తగిన మందులు సత్వరం లభించే ఏర్పాట్లు అధికారుల సహాయంతో చేస్తూవుండటం పరిపాటి. ఆరోజు తమ రెండున్నర ఎకరాల అరటితోటనుచూసి, ప్రక్కనున్న భూషయ్యగారి నిమ్మతోట చూస్తూ, మాధవయ్యగారు గట్టుప్రక్కన పచ్చగడ్డిలో పడుకొని వున్న గోధుమవన్నె త్రాచుపాముమీద కానక కాలు వేశారు. అంతే, ఆ కోడెత్రాచు బుస్సున నిమ్మమొక్క ఎత్తున లేచి కసికొద్దీ ఆయన గార్ని కఠినంగా కాటువేసింది. 'అబ్బా!' అంటూ అంత దూరం తూలుతువెళ్లి కూలబడ్డారు మాధవయ్యగారు గోధుమవన్నెత్రాచు జరజరా దాపుననున్న పుట్టలోకి వెళ్లింది. నిమ్మచెట్లకు పాదులు చేస్తూన్న ఇద్దరుకూలీలు గాబరాగా పరుగెత్తుకొనివచ్చారు. అప్పటికే మాధవయ్యగారు స్పృహలేకుండా పడిపోయి, నోటివెంట నురుగును కక్కసాగారు. వెంటనే మాధవయ్యగార్ని ఆకూలీలు ఎడ్ల బండిమీద ఇంటికి చేర్చారు.

పాము మంత్రానికి ప్రసిద్ధిగాంచిన పాముల పాపయ్యను ప్రక్కగ్రామం నుంచి పిలిపించారు.

మాధవయ్యగారు పొలాన పాముకరచి మాటలేకుండా పడిపోయారన్న వార్త ఊళ్లో పొగలాగ వ్యాపించింది. ప్రజలంతా మేడచుట్టూ చేరారు. పాముల పాపయ్య తన మంత్ర శక్తితో మాధవయ్యగార్ని పాముకాటు విషప్రమాదాన్నుంచి తప్పించాలని విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు.

సాయంత్రం పూర్తిగా వాలిపోయింది. కాని ఆకాశంపైన మబ్బులు కుట్రపన్ను తున్నట్టు దట్టంగా పట్టి, నిరుపేదల కష్టాల పగిది అశాంతిగా తిరుగాడ జొచ్చినయ్, గాలికూడా తీవ్రంగా పచార్లు చేయసాగింది. పెద్ద గాలివాన వచ్చే సూచనలు విశేషంగా కనబడుతున్నాయి.

అట్లాగే ఆరాత్రి పెద్ద గాలివాన వచ్చింది. వాతావరణం నానాబీభత్సరూపం దాల్చింది. గత దశాబ్దంలో అట్లాంటి గాలివాన రాలేదని అనుకున్నారంతా.

తెల్లరేపాటికి ఆపెద్ద గాలివాన చప్పగా సమసిపోయింది. వాతావరణం చావునుంచి బయటపడ్డట్టు ప్రశాంతస్థితిలోకి వచ్చింది. మాధవయ్యగారి మేడలోంచి బిగ్గరగా ఏడ్పులు వినరాగా ఇరుగూ పొరుగూ, ఆ వీధిలోని వారూ, క్రమేపీ ఊరంతా ఆ మేడదగ్గరకు చేరారు. ఆ తెల్లవారయూమునే పంచాయతీబోర్డు ప్రెసిడెంటూ ఆగ్రామానికి ప్రముఖవ్యక్తీ, ధర్మాత్ముడూ సహృదయుడనీ పేరుగడించిన మాధవయ్యగారు దుర్విధికి బలియై, పాముకాటువల్ల కన్నుమూశారు.

అక్కడ జేరిన జనానికి కనిపించిన మరొక విపరీతమేమిటంటే ఆ రాత్రివచ్చిన ఘోరమైనగాలివానకు ఊరి నడిబొడ్డునున్న మర్రిచెట్టు వ్రేళ్లతో పెకలి చెరువులోకి ఏటవాలుగా పడిపోయింది. దానిచుట్టూవున్న రాతిఅరుగు నెర్రెలుగావిచ్చింది. ఊరి ప్రజలంతా మాధవయ్యగారి ఆకస్మిక మరణానికీ, మర్రిచెట్టు మాయగా గాలివానకు పడిపోవటానికీ దుఃఖించారు.

"మర్రిచెట్టులాంటి మనిషితోపాటే మర్రిచెట్టుకూడా కన్ను మూసింది" అన్నాడొకాయన.

"అవును, మాధవయ్యగారు మర్రిచెట్టులాంటి మనిషే. మర్రిచెట్టు మంచీచెడూ విచక్షణలేకుండా అందరికీ చల్లని నీడనూ, ఆశ్రయాన్నీ యిస్తుంది మాధవయ్యగారు అట్లాంటి జీవితోద్దేశ్యంతోనే, ఆదర్శంతోనే బ్రతికి మంచివాడుగా పేరుతెచ్చుకున్నాడు. కాని మర్రిచెట్టు తననీడను ఏమొక్కనూ ఎదగనివ్వనట్టి ఆయన తనక్రింద ఎవ్వర్నీ తలఎత్త నివ్వలేదు. సాంఘికంగా, రాజకీయంగా ఊళ్లో ఎవర్నీ ఎదగనివ్వలేదు. పైకి రానివ్వలేదు. మాధవయ్యగారు అక్షరాలా మర్రిచెట్టులాంటి మనిషే!" అన్నాడింకొకాయన.

— ❀ —

ప్రభుత్వ ముఖ్య నిర్ణయాలు


రాష్ట్ర ప్రభుత్వం గ్రామోద్యోగులు, గ్రామనౌకర్ల జీతాలను 1962 జనవరి 1వ తేదీ నుంచి 5 రూపాయలనుంచి 10 రూపాయల వరకూ పెంచడానికి నిర్ణయించింది. ఇందువల్ల 80 లక్షల రూపాయలు అదనంగా ఖర్చు అవుతుంది.

ఈ నిర్ణయానికి రాబోయేముందు ఉన్నితన్ కమిటీ సమర్పించిన నివేదికను ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించింది.

ఆంధ్రలో ప్రతి గ్రామకరణానికి 10 రూపాయలు, మునసబుకు 8 రూపాయలు, గ్రామ నౌకరుకు 5 రూపాయలు అదనంగా లభిస్తాయి. గ్రామకరణానికి 10 రూపాయలు, మునసబుకు 5 రూపాయలు, నౌకరుకు 3 రూపాయలు పెంచవలసిందని ఉన్నితన్ కమిటీ సిఫార్సు చేసింది. ఆంధ్రలో 11 వేలమంది గ్రామ మునసబులు, 10 వేల మంది కరణాలు, 27 వేల మంది గ్రామ నౌకర్లు వున్నారు. ఈ మూడు తరగతుల ఉద్యోగులు పొందుతున్న జీతాలు ఇవి: గ్రామ కరణాలుకు 23 నుంచి 27 రూపాయల వరకు, మునసబులకు 20 నుంచి 25 రూపాయలవరకు. నౌకర్లకు 18 నుంచి 22 రూపాయల వరకు ముట్టుతాయి.

తెలంగాణా ప్రాంతానికి సంబంధించినంత వరకూ ఈ కమిటీ చేసిన సిఫార్సుల నన్నిటినీ ప్రభుత్వం ఆమోదించింది. దీనివల్ల గ్రామకరణాలకు (పట్వారి) 10 రూపాయలు, మాలి పటేళ్ళకు 5 రూపాయలు, పోలీస్ పటేళ్ళకు 5 రూపాయలు, గ్రామనౌకర్లకు 9 రూపాయలు అదనంగా ముడతాయి. తెలంగాణాలో కరణాలు, మాలి పటేళ్ళు పోలీస్ పటేళ్ళు పదేసి వేల మంది చొప్పునవున్నారు. గ్రామనౌకర్లు 26 వేల మంది ఉన్నారు. తెలంగాణాలో గ్రామోద్యోగులకు భూమిశిస్తు ఆధారంగా నూటికి కొంత చొప్పున జీతాలనిస్తారు.

గ్రామోద్యోగుల వారసత్వపు హక్కును, వారి జీతాల విషయాన్ని సుప్రీంకోర్టు త్రోసిపుచ్చిన మీదట వారి సాధక బాధకాలను గురించి సిఫార్సులు జేసే నిమిత్తం ప్రభుత్వం ఉన్నితన్ కమిటీని నియమించింది.



మనసువిడిచి వేరు మార్గాన వర్ణాలు
నిర్ణయించినారు నియతిలేక
మనసముఖ్యమైన మానవత్వ మెసున్న
జననుతాంతరంగ! వినురరంగ!

—కృష్ణశతశతి

సహకారం

శ్రీ కె. పురుషోత్తం రెడ్డి

సహకార జీవనంబె స్వర్గసౌఖ్యమిచ్చురా
        మనదేశపు నిర్మాణము కాదేశమిదేరా

బట్ట పొట్ట కొరకు నీవు బాధపడుదువోయ్
పెట్టుబడికి ధనము లేని పేదరైతువోయ్

        సమిష్టిశక్తి సంఘటించి సాగవలెనురా
        మనదేశపు నిర్మాణము కాదేశమిదేరా

నీవూరిలో ఒక పరపతి సంఘమును నిలుపవోయ్
ఆపైన నీకు అవసరమగు అప్పుదొరకునోయ్

        నవీన పద్ధతులతో కృషిని నడుపవలెనురా
        మనదేశము నిర్మాణము కాదేశమిదేరా

సహకార సేద్యమునకు మంచి సమయమిదేనోయ్
చిన్నరైతు చేయుచున్న ఒడికిపోవునోయ్

        చేయి చేయి కలిపి కృషిని చేయవలెనురా
        మనదేశము నిర్మాణము కాదేశమిదేరా

నీటి పంపులును, యెరువులు నేడు మందులోయ్
ఆబోతులు విత్తనాలు అన్ని దొరుకునోయ్

        కష్టపడిన రైతు కెపుడు కరువులేదురా
        మనద్దేశము నిర్మా.........

స్వల్పకాలమధ్యకాల దీర్ఘకాల ఋణములోయ్
భూపరిమితి ననుసరించి బ్యాంకు లిచ్చునోయ్

గడువు మీరకుండ చెల్లగట్టవలెనురా
మనదేశము నిర్మా.........

నీధనమే బ్యాంకులలో నిండియున్నదోయ్
సద్వినియోగము చేయుచు సంస్కరించవోయ్


పొదుపు జేసి ధనము కొంత పోగుజేయరా
మనదేశము నిర్మా.........

నీధాన్యము గోదాములో నిల్వజేయవోయ్
ముప్పావుల ధనము నీకు ముందె దొరుకునోయ్

ధరపెరిగే వరకు నీవు దాచియుంచరా
మనదేశపు............

నీకష్టమె పాడిపంట నీద్దే పశుపోషణోయ్
ఆదర్శము నీమార్గము అన్నదాతవోయ్

అజరామర జీవితమును అనుభవించరా
మనద్దేశపు..............



వర్ణధర్మములిల భ్రష్టమై నష్టమై
కూలెననుచు పెద్ద గోల లేల?
గాలిమేడలవ్వి కూలకేమౌనురా?
జనసుతాంతరంగ! వినుర రంగ!

— కృష్ణశతశతి

సవరలు వివాహ పద్ధతులు

శ్రీ జి. వి. రామమూర్తి

(గత సంచిక తరువాయి)

పెళ్ళిళ్ళు జరిగే తీరు

"ఫలానా అమ్మాయిని మీ అబ్బాయికి చేసుకొంటారా?" అని ఏ ఆడపిల్ల తండ్రీ ఎవర్నీ అడగడు. "మీ అమ్మాయిని మా అబ్బాయికి యిస్తారా?" అని పిల్లవాడి తండ్రి అడగవలసినదే. ఈ పద్ధతి కొండజాతివారు కాని హిందువులలో దిగువ జాతి వారిలో ఉంది. ఈ ఆచారాన్ని తెలియజేసే సామెత మన తెలుగు వారిలో వినబడుతుంది. "నిన్నెవరు అడగవస్తారే?" అని గాని "నీకూతుర్ని ఎవరడుగుతారు?" అనిగాని అంటూ ఉంటారు.

కాబోయే దంపతులు యువతీ యువకులయితే ముందుగానే ఒకర్నొకరు ప్రేమించుకుని, పెళ్ళికి నిశ్చయించుకుని తర్వాతనే వారి తల్లి తండ్రులతో చెప్తారు. ఆడపిల్ల తరచుగా తల్లితోనే చెబుతుంది. పెళ్ళికొడుకు బాలుడే అయితే తల్లిదండ్రులే తగిన సంబంధం వెతికి చూస్తారు. పిల్లను మొదట ఏదో చూసినట్టు చూసి, ఆ పిల్ల నచ్చితే తర్వాత ఆ విషయాన్ని ఆ పిల్ల తల్లి, తండ్రులతో కదిపి చూస్తారు.

మంచి రోజు చూసి, పిల్లవాడి తాలూకు చుట్టాలుగాని, స్నేహితులుగాని, ఒక కుండెడు కల్లు, రెండు అంబులు, రెండు వేలిదుల్లు తీసికొని ఏ సందడీ లేకుండా ఆ రోజు ఉదయమే పిల్లవారున్న గ్రామానికి వెళ్తారు. ఇలా వెళ్ళేటప్పుడు ఆడవాళ్ళు వెళ్ళకూడదు. పెళ్ళికూతురు యింటి తలుపు తీసి ఉంటే తిన్నగా యింట్లో దూరి, యింట్లో మధ్యనుండే రాట ప్రక్కను కల్లు కుండను ఉంచి, దాని ప్రక్కను కూడా తీసుకువెళ్ళిన అమ్ములను నేలమీదగాని, లేక చూరులోగాని గుచ్చుతారు. కుండలోని కల్లును ఆకు దొప్పల్లో పోసుకుని కాస్త, కాస్త వారంతా తాగి, అవసరమయితే పెళ్ళికొడుకు విషయమూ, వాడి తల్లితండ్రుల విషయమూ చెప్పి మరే యితర విషయములూ మాట్లాడకుండా వచ్చేస్తారు. వీళ్ళు వెళ్ళేసరికి ఆడపిల్లవారి యింటి తలుపులు మూసి ఉంటే తలుపు కొడతారు. ఇంట్లో ఎవరూ లేకపోతే కబురుపంపి వాళ్ళు వచ్చేవరకూ వీళ్ళు వేచి ఉంటారు. సాయంత్రం వరకూ ఆ యింటి వారు రారని తెలిస్తే ఆ యిరుగు పొరుగు వారిని పిలిచి ఆ యింటి తలుపు తీసి లోపలకు వెళ్తారు. తలుపులు తీయడానికి వీలు లేకపోతే ఆ యింటి అరుగు మీదనే వచ్చిన పనిని చేసుకు పోతారు. సాధారణముగా, ముందుగానే కబురు చేయడంవల్ల ఆడపిల్లవారు యింట్లో ఉండక పోవడమంటూ జరుగదు. ఆడపిల్లవారికి వచ్చే సంబంధం ఒకవేళ నచ్చకపోతే వారు ఉండక పోవచ్చును

సాధారణముగా మగపెళ్లివారు వస్తారని కబురు తెలిస్తే 'వారు వచ్చే సమయానికి తలుపులు తీసి ఉంచుతారు. ఆడపిల్లవారు దీనిని బట్టి వారికి యిష్టమున్నదీ లేనిదీ మగపెళ్లివారికి తెలిసిపోతుంది.

మగపెళ్లి వారు వచ్చిన తర్వాత ఆడపిల్లవారు ఊరి గొమాంగ్, బుయ్యాలను యింకా యితర గ్రామ పెద్దలను పిలుస్తారు. వారంతా మగపెళ్లివారు తెచ్చిన కల్లును తాగుతారు.

ఇది జరిగిన అయిదారు దినాల తర్వాత ముందుగా కబురు చేసి మగపెళ్లివారి గ్రామంనుండి పిల్లవాడి తల్లితండ్రులు, గ్రామ పెద్దలయిన గొమాంగ్, బుయ్యాలు, చమత్కారంగా మాట్లాడగలిగిన ఒక పెద్దవాడు యింకా మరి కొందరూ, అంతా కలసి యిరవై మందివరకు బయలు దేరుతారు. ఆడుతూ, పాడుతూ రెండుకుండలతో కల్లు తీసుకు వెళ్తారు.

పిల్లతండ్రి తన గ్రామ గొమాంగ్ బుయ్యాలను యింకా యితర పెద్దలను, చమత్కారంగా తనతరపున మాట్లాడ గలిగే ఒక పెద్దను పిలుస్తాడు.

మొదట మగపెళ్లివారే మాటలు మొదలు పెడతారు. వారి గొమాంగ్ పిల్ల తండ్రితో "పయూయ్..." అంటూ ప్రసంగాన్ని ప్రారంభిస్తాడు. "పయూయ్" అంటే పెళ్లికొడుక్కు మామ, పెళ్లి కూతురుకు తండ్రి అన్నమాట. "...మీకు ఎంతకావాలి? ఎన్ని రూపాయలు కావాలి? ఎన్నికుండల కల్లు కావాలి? అని అడుగుతాడు.

"నేనేం ఎక్కువ అడుగుతానా? ఓ నలభై రూపాయలూ, యిరవైకుండల కల్లూ యిస్తేచాలు. అంతకన్నా ఎక్కువ అడగడం న్యాయంకాదు. "అంటాడు పెళ్లికూతురు తండ్రి.

"పెళ్లికొడుకు ఏం తప్పుచేశాడని అంత అడుగుతున్నారు. మీ అల్లుడ్నే మీరు కష్టపెడితే ఎలా చెప్పండి?ఓ యిరవై రూపాయలు పదికుండల కల్లు మాత్రమే మేము యివ్వగలము. దాంతో మీరు సంతోష పడండి." అంటాడు పెళ్లికొడుకు తండ్రి.

" ఏం లాభము లేదు. మేము అడిగిన దానికి పైసాకూడా తగ్గం. మీరు మేము అడిగింది యివ్వకొనలేక పోతే మీరిచ్చిన కల్లు మీకు యిచ్చేస్తాం, తీసుకపొండి" అంటాడు పిల్లతండ్రి.

దాంతో పిల్లవాడి తరపున వచ్చిన చమత్కారి బేరం మరో అయిదు రూపాయలు పెంచుతాడు. దానికి ఒప్పుకోడు పిల్ల తండ్రి. మరో అయిదు రూపాయలకు పెంచుతాడు. పిల్లవాడి తండ్రి దానికి సమ్మతించామంటాడు పిల్లతరపు చమత్కారి. దీనికి అందరూ సరేనంటే సరే అంటారు.

తర్వాత పిల్లగ్రామం తాలూకు గొమాంగ్ తన బుయ్యాను మిగిలిన తంతు కానిమ్మంటాడు ఆ బుయ్యా మగపెళ్లివారు తెచ్చిన కల్లును దొప్పలలో పోసి, తమదేవతలకు నైవేద్యం పెడతాడు. తర్వాత పిల్లతాలూకు పెద్దవారు ఆకుదొప్పలలో కల్లుపోసి అక్కడ ఉన్న వారందరకూ యిస్తారు. దాంతో ఆరోజు తంతు పూర్తవుతుంది,

తర్వాత అయిదువాయిదాలలో మగపెళ్లివారు యిస్తామన్న కల్లును యివ్వాలి. అంతవరకు పెళ్లికాదు,

పెళ్లి నిశ్చయమైన మరి పదిరోజులకు నాలుగుకుండల కల్లు తీసికొని మగపెళ్లివారు ఆడపెళ్లివారు ఊరికి బయలు దేరుతారు. అందులో మూడుకుండల కల్లుమాత్రమే ఆడపెళ్లివారికి, మిగిలిన కుండెడూకల్లూ వారు తోవలో తాగడానికి. ఈ మూడుకుండలకల్లూ వారి ఒప్పందంలోకి రాదు, కాని మరియొక సారి మాటఖరారు చేసికొనడానికే మగపెళ్లివారు ఈ మూడుకుండల కల్లూ ఇస్తారు.

ఒప్పందాలు జరిగిన ఒకనెల తర్వాతగాని, ఒకసంవత్సరం తర్వాతనైనా సరే అనుకున్న ప్రకారమూ వాయిదాలమీద కల్లు యిస్తారు. కాని యివ్వవలసిన డబ్బును, రెండుకుండల కల్లును, ఆఖరు వాయిదా యివ్వడానికి అపుచేస్తారు. సాధారణముగా యీ ఆఖరు వాయిదాను మామిడి పళ్ళ కాలంలో పెట్టుకుంటారు. ఆరోజున ముప్పై నలభై కుంచాల బియ్యం సిద్ధంగా ఉంచుకుంటారు. ఆడపెళ్లివారు వచ్చే అతిథుల కోసం అన్నంవండి, కందులు, వంకాయలు, చింతపండు మొదలయినవి వేసి పులుసుపెడతారు.

ఆఖరు వాయిదానాడు పెళ్లికొడుకు, అతని తల్లితండ్రులు వారిగొమాంగ్, బుయ్యాలు, యితర పెద్దలు, బంధువులు, స్నేహితులు అంతాకలసి చాలామంది బయలుదేరుతారు. వెళ్లేటప్పుడు వాద్యాలతో గూడా పాడుతూ నృత్యంచేస్తూ వెళ్తారు వారు యింకా యివ్వవలసిన రెండుకుండల కల్లూ, డబ్బు, 20 కుంచాల బియ్యం వారితో తీసుకు వెళ్తారు. దారిలో వారు తాగడానికని అదనంగా మరోకుండెడు కల్లుకూడా తీసుక వెళ్తారు.

మగపెళ్ళివారు వచ్చినతర్వాత ఆడపెళ్ళివారు వారిగౌమాంగ్ బుయ్యాల,ను యితర పెద్దలను రమ్మని పిలుస్తారు. అందరి ఎదుటా మగపెళ్ళి వారి గౌమాంగ్ పెళ్ళికొడుకు తరఫున ఆడపెళ్ళి వారి గౌమాంగ్ ద్వారా యివ్వవలసిన డబ్బును లెక్కపెట్టి యిస్తాడు. రెండుకుండల కల్లునూ యిస్తాడు. మగపెళ్ళివారు తెచ్చిన 20 కుంచాల బియ్యంకొల్చి ఆడపెళ్ళివారికి యిస్తారు,

"అంతా పూర్తిగా ముట్టిందా? అని ఆడపెళ్ళివారి గౌమాంగ్ పెళ్ళికూతురు తండ్రిని అడుగుతాడు. ముట్టిందంటాడు అతడు.

ఇదివరకు దేవతలకు నైవేద్యం పెట్టినట్టె బుయ్యా మళ్లా దేవతలకు కల్లు నైవేద్యం పెడతాడు తర్వాత ఆ బుయ్యా, యితర బుయ్యాలు, గౌమాంగ్‌లు అంతాకలిసి కల్లుతాగుతారు. ఇతర పెద్దలు తాగుతారు తర్వాతనే ఆడవారు తాగాలి, తాగడ మయిన తర్వాత విందు జరుగుతుంది.

వచ్చిన చుట్టాలు, అతిథులు విందారగించి వెళ్లిన తర్వాత మగపెళ్ళివారు పెళ్ళికొడుకును కాబోయే అత్తవారింట్లో విడచి తమ గ్రామానికి వెళ్తారు పెళ్ళికొడుకు చిన్నవాడయితే అతనితో తల్లికూడా వుంటుంది పెళ్ళికొడుకు అత్తవారింట్లో ఏడు రోజులు ఉంటాడు. ఆ ఏడు రోజులు అత్తవారింట్లో అతడు అన్నిపనులూ చేయాలి. కాబోయే భార్యతో కలసిమెలసి తిరగవచ్చును. కాని రాత్రుళ్లు ఆమెతో కలసి పడుకోకూడదు. ఒకవేళ రహస్యంగా పెళ్ళికూతురినికూడిన అతడు కూడవచ్చును. అత్తమామలకు తెలిసినా వారు తప్పుపట్టరు. ఎనిమిదవ రోజున పెళ్ళికొడుకు తిరిగి తన గ్రామం చేరుకుంటాడు. అతని తోకూడా తల్లితండ్రులు యితర గ్రామపెద్దలు ఎవరైనా వెళ్లవచ్చును.

ఆఖరు వాయిదాలో యివ్వవలసిన డబ్బునూ, కల్లునూ యిచ్చిన నెల తర్వాత పెళ్ళికొడుకు తండ్రి ఓ నలుగురి పెద్దలను, పెళ్లి ఎప్పుడు చేయదలచుకున్నారో కనుక్కొని రమ్మని ఆడ పెళ్లి వారింటికి పంపిస్తాడు. సాధారణముగా పెళ్లి మగపెళ్లి వారింట్లోనే జరుగుతుంది.

"వచ్చే నెల పౌర్ణమి శుక్రవారంనాడు పెళ్లికూతుర్ని తీసుకుని పెళ్లి చేయడానికి వస్తా" మని ఆడపెళ్లివారు అంటారు.

"అయితే ఆ రోజున ఉదయమే వచ్చేయండి. ముందు రోజునే మీరు బయలుదేరుతున్నట్టు ఎందుకైనా మంచిది ఒకకబురు చేయండి. ఎంత మంది మీ తరఫున వస్తున్నారో కూడా తెలియజేయండి. మీ కబురు అందిన తర్వాత మేము విందు ఏర్పాట్లు చేయవలసి ఉంటుంది. మళ్లీ మేము యిక్కడకు రాము సుమండీ" అంటారు ఆ వచ్చినవారు.

"అలాగే, తప్పకుండా ముందురోజునే కబురు చేస్తాము. మరి మీరు రానక్కరలేదు. ఒకవేళ మీకు కబురు రాకపోతే మీరు విందు ఏర్పాట్లు చేయనవసరము లేదు," అంటారు పెళ్లికూతురు తండ్రి.

ఆ వచ్చినవారు ఆ పూటకు అక్కడే భోజనము చేసి వెళతారు.

పెళ్లిరోజుకు ముందురోజునే అనుకున్న ప్రకారం పెళ్లి కూతురు తండ్రి వివరంగా మగపెళ్లివారికి కబురు పెడతాడు. పెళ్లికి తయారుగా ఆ మరునాడు మగపెళ్లివారు ఉంటారు.

పెళ్లికి బయలుదేరే ముందు పెళ్లికూతురు, ఆమె స్వగ్రామములో ఉండే పెద్దలందరి యింటికి వెళ్లి "అయ్యా! అత్తవారింటికి వెళుతున్నాను, అమ్మా! అత్తవారింటికి వెళుతున్నాను. నన్ను దీవించి పంపడి. నన్ను మరచిపోకండి" అని పేరు పేరున చెప్పి మరీ బయలు దేరుతుంది.

"మంచిదమ్మా, అత్తవారింట్లో మంచిపిల్ల వనిపించుకో. అత్తమామలు చెప్పినట్టూ విను, వారిని మర్యాదతో చూడు, గౌరవించు, వెళ్లిరావమ్మా" అని ఆశీర్వదించి ప్రతి యింటి పెద్ద ఒక కొత్త గుడ్డయిస్తాడు.

పెళ్లి కూతురుతో ఆమె తల్లిదండ్రులు, బంధువులు, మిత్రులు, యిరుగు పొరుగు వారు, యితర గ్రామాలలోని వారికి కావలసినవారు అంతా కలసి ఊరేగింపుతో వాద్యాలతో ఆడుతూ పాడుతూ బయలు దేరుతారు, మగపెళ్లివారికి యివ్వడానికని 21 కుంచాల బియ్యం తీసుకు వెళ్తారు. తోవలో తాగడానికని ఒక కుండెడు కల్లును కూడా తీసుకు వెళ్తారు.

మగపెళ్లివారి గ్రామం దగ్గరపడుతున్న కొద్దీ వాద్యాల మోత ఎక్కువవుతుంది. ఆటాపాటా పైస్థాయి అందుకుంటుంది. మగ పెళ్లివారు కూడ వాద్యాలతో ఆడుతూ, పాడుతూ ఆడపెళ్లి వారికి ఎదురుకోలు వెళతారు. వారు, వీరూ గ్రామ పొలిమేరల్లో కలుసుకుని, అక్కడ అంతా కలసి, పాటలు పాడుతూ, నాట్యం చేస్తూ కొంతసేపు ఆనందిస్తారు. ఆ వేడుకలతోనే అంతాకలసి మగ పెళ్లివారి యిల్లు చేరుకుంటారు.

మగపెళ్లివారి బియ్యా ఆయింట్లో మధ్యను రాటవద్ద కూర్చుని, దొప్పల్లో కల్లుపోసి దేవతలకు నైవేద్యం పెడతాడు. తర్వాత పెళ్లికూతురు ఆ యింట్లో అడుగు పెడుతుంది మగ పెళ్లివారు. ఆడపెళ్లివారు ఒకరిమీద ఒకరు బియ్యం (అక్షితలు) జల్లుకుంటారు.

పెళ్ళికొడుకు తరపు ఆడవారు, ఆడపెళ్ళి వారి తరఫున వచ్చిన ఆడవారికి పసుపు రాస్తారు. ఈ ఆచారం యీ మధ్యనే వచ్చింది. ఇది ఒరయా (ఒడ్రుల) వారి వద్ద నుండి వీరు నేర్చుకుని ఉంటారు లోమన్యాలలో యీ ఆచారం లేదు.

పెళ్ళి తంతు అంటూ మరేమీలేదు. అంతటితో పెళ్ళి అయినట్టే. తర్వాత విందు చేసుకుని ఆ రోజున ఆనందంగా గడుపుతారు.

వితంతు వివాహాలు

సవర స్త్రీ మగడు పోతే మళ్ళా పెళ్ళి చేసుకోవచ్చును. సర్వసాధారణముగా తన మరిదినే ఆ వితంతువు పెళ్ళిచేసుకుంటుంది బావను మాత్రం చేసుకోకూడదు. ఆమెకు మరిది లేక పోయినా, ఉన్న మరిది ఆమెను చేసుకొనడానికి యిష్టపడక పోయినా, పైవాడ్ని ఎవరినైనా చేసుకొనవచ్చును. తనను పెళ్ళి చేసుకునే రెండవ మగడు ఆ వితంతువును విడుదల చేసుకొనడానికి మొదటి మగడు తాలూకు వారికి కల్లు యివ్వాలి. ఒక పోతునో, పందినో కూడా యివ్వాలి. అంతే కాదు మొదటి మగని ప్రేతకు ఒక పందిని ఉవారం పెట్టాలి.

విడాకులు

సవర దంపతులలో ఒకరికొకరు విడాకులు యిచ్చుకొనడం జరుగుతూనే ఉంటుంది. తన పెళ్ళాము తనకు ఏ విషయములోనైనా నచ్చకపోతే మగడు విడాకులు ఇస్తాడు. తన మాట వినక పోయినా, ఖర్చు ఎక్కువగా చేస్తున్నా మరి ఏ యితర కారణమున్నా విడాకులు ఇస్తాడు మగడు.

ఏ తప్పూ లేకుండా మగడు విడాకులు ఇస్తే పెళ్ళాం గ్రామాధికారి గొమాంగ్‌కు ఫిర్యాదు చేస్తుంది. తనను ముమ్మందు పెళ్ళి చేసుకోబోయేవాడు మొదటి మగనికి అట్టే నష్టపరిహారం యివ్వనవసరము లేకుండా అటువంటి తగవులతో ఏర్పాటు చేస్తాడు గొమాంగ్.

మగడు తనను పోషించలేకపోయినా, అతడివలన తనకు పిల్లలు కలుగకపోయినా తరచుగా తనను కొడుతున్నా, దీర్ఘ వ్యాధితో మగడు బాధపడుతున్నా మగనికి విడాకులిస్తుంది సవరిది. ఒక్కొక్కప్పుడు యింకొకడ్ని ప్రేమించి, వాడ్ని పెళ్ళి ఆడవలెనని కోర్కెకలిగితే సవరస్త్రీ విడాకులిస్తుంది. ఆమె రెండవ మగడు, మొదటి మగనికి నష్టపరిహారంగా ఒక పందినో, పోతునో యివ్వాలి. విడాకులు ఇచ్చి యింకెవరిని పెళ్ళి చేసుకోకుండా పుట్టింటికి పోతే ఆమె మగనికి ఏమీ యివ్వనవసరములేదు

తనకు విడాకులు యివ్వకుండా, యింకొకడితో తన భార్య వ్యభిచరిస్తున్నట్టు తెలిస్తే మగడే విడాకులిచ్చి తనకు రావలసిన పందినో, పోతునో తన భార్య ప్రేమిస్తున్న వాని వద్ద నుండి తీసుకుంటాడు. వాడు యివ్వకపోతే వాని తాలూకు జంతువును చంపి తీసుకుంటాడు.

కాని సాధారణముగా యిటువంటివి వారిలో జరుగవు. ఎందువల్లంటె వాళ్ళలో వ్యభిచారం లేదు. వారికి వ్యభిచరించవలసిన అవసరం లేదు. ఎవరు ఎప్పుడు విడాకులివ్వాలంటే అప్పుడు యిచ్చుకోగలరు. పెళ్ళానికి విడాకులు యివ్వకుండా భర్త మరి యిద్దరు, ముగ్గుర్ని పెళ్ళి చేసుకోవచ్చును. ఇంకొకని భార్యను చేసుకోవాలని బుద్ధి పుడితే, ఆ స్త్రీ అంగీకరిస్తే ఆమె మొదటి మగనికి యివ్వవలసినది యిచ్చి ఆమెను తెచ్చుకుంటాడు. మొదటి మగడు తన భార్యకు ఎన్నినగలు పెడితే అన్ని నగల విలువను యిచ్చి రెండవవాడు తీసుకు వెళ్ళాలి. అందుకనే గొమాంగ్ సర్వసాధారణంగా మరి ఎవ్వడూ యివ్వలేనన్ని నగలను తన భార్యకు పెడతాడు.

భార్య కడుపుతో ఉండగా విడాకులిస్తే పుట్టబోయే బిడ్డ పోషణకు మగడు డబ్బు యివ్వాలి. తల్లిపాలను బిడ్డ విడిచిపెట్టిన తర్వాత మగడు కావాలంటే ఆ బిడ్డను తల్లి యిచ్చివేయాలి. అక్కరలేదంటే తనవద్ద ఉంచుకోవచ్చును. బిడ్డను కన్న తర్వాత సవరది మారుమనువు చేసుకుని తన మొదటి మగడు, రెండవ మగడు కూడా ఆ బిడ్డను తమ వద్ద ఉంచుకొనడానికి యిష్టపడక పోతే తన పుట్టింటికి ఆ బిడ్డను పంపించేస్తుంది. (అయిపోయింది)

* * *

పచ్చని ప్రకృతి సంపద

"శాంతిప్రియ"

వృక్షం ఒక కర్మాగారం వంటింది.
అదిభూమిని సస్యశ్యామలంచేస్తుంది.
అది వ్యవసాయానికెంతో అవసరం.
అది మన నీటిపారుదలకు సహాయం చేయవచ్చు.
లేదా నాశనం చేయవచ్చు.
దుఃఖ భాజని ఐన నదిని అడవులు.
సంపద్విలసితంగా చేయగలవు!

"మహర్షులు ఎక్కడ నివసించేవారు?" ఉపాధ్యాయుడు ఎనిమదేళ్ళ నా మేనకోడల్ని ప్రశ్నించాడు.

"అడవులలోని పర్ణశాలలో" అని సమాధానమిచ్చింది.

"వారు పట్టణ ప్రాంతాలలోగాక అటవీ ప్రాంతాలలో ఎందుకుండే వారు?" ఇది రెండవ ప్రశ్న.

ఎనిమిదేళ్ళ ఆ బాలిక కళ్ళలో మెరుపు మెరిసింది. "వారు ఏకాంతమైన ప్రశాంతవాతావరణాన్ని కోరుతారు గనుక" అని సమాధాన మిచ్చింది.

ఈ సంభాషణ నన్ను ఆలోచనా తరంగాలలోకి తరిమింది. అవును మరి! ఈ అటవీ ప్రాంతాలలోనే మన భారతీయ నాగరికత జన్మించింది. అవి ఒక రకమైన నిర్మల వాతావరణాన్ని కల్పించి ఐక్యతాభావాన్ని ఉద్దీప్తం చేశాయి జీవిత సమస్యల పట్ల మనకున్న దృక్పథాలను. మన సంస్కృతిని అవి ప్రభావితం చేశాయి. ఒకసారి విశ్వకవి టాగోర్ "భారతదేశం సకలసిరి సంపదలతో తులతూగుతున్న రోజులలోకూడా పవిత్రగుణమైన ఆత్మపరిశీలనను, అటవీ ప్రాంతాలలోని పర్ణకుటీరాల నిరాడంబర జీవితాన్ని విస్మరించలేదు" అన్నారు.

మరొకసారి గౌతమబుద్ధుడు ఇలా ప్రవచించాడు " అటవీ ప్రాంతాలు అపారమైన దయకు, కారుణ్యానికి ఆసరాలు అవి తమ జీవితకాలంలో పూయించిన ఫల పుష్పాదులను ఉదారంగా ప్రజలకు అందిస్తాయి. మహీరుహాలను నరికి వాటిని అంతంచేసి జీవించే కష్టజీవానికి కూడా అవి నీడను ఇచ్చి ఆశ్రయమిస్తాయి "

అడవులు, నేల, నీరు. ఇవి మూడు మూర్తిత్రయాలు. ప్రపంచ జీవనగతి అంతా నేల, నీరు యొక్క దయా దాక్షిణ్యాల పైననే ఆధారపడివుంది. అడవులు నేలను పరిరక్షించడమే గాక నీటి ప్రవాహాన్ని ఆపుతాయి. సర్వకాలాలలో అన్ని దేశాలు అడవుల ప్రభావానికి లోనయ్యాయి, అడవులను రక్షించడం ద్వారా భూసారాన్ని అధికం చేయడమే నేడు దేశాన్ని, రాష్ట్రాన్ని కూడా ఎదుర్కొంటున్న బృహత్తర సమస్య.

మన నిత్య జీవితంలో అడవుల స్థానం అత్యంత గణనీయమైంది. మన ప్రాథమిక అవసరానికి వలసిన కలప సరఫరాకు అవి ఒక్కటే మూలాధారం. గృహ నిర్మాణానికి, రక్షణకు, రాకపోకల సౌకర్యాలకు అవసరమైన ముడి వస్తువులు అడవులవల్లనే లభ్య మవుతాయి. మన పశువులకు అవసరమైన పచ్చిక

బయళ్ళు అడవులలోనే లభిస్తాయి.

అట్టి అడవులను విచక్షణా రహితంగా నరికివేసి నాశనము చేయడానికి కొన్ని సంవత్సరాలు కాదు కొన్ని రోజులే చాలు: గాని వాటిని అభివృద్ధి చేయాలంటే దశాబ్దాలు, శతాబ్దాల కాలం పడుతుంది కనుక శతాబ్దాల పరంపరగా వస్తున్న ఈ సంపదను నాశనం చేయకుండా వాటిని రక్షించటమే ప్రతి ఒక్కరి విద్యుక్త ధర్మం. దండకారణ్యంలో ఎక్కువ భాగం ఆంధ్రప్రదేశ్‌లో గోదావరికి ఇరుప్రక్కలా వుంది. మన అడవులకు ఎంతో చెప్పుకో వలసిన గాథ, చరిత్ర వున్నది.

మన రాష్ట్రంలో అడవుల విస్తీర్ణం 24,878.17 చదరపు మైళ్ళు ఇది మన రాష్ట్ర విస్తీర్ణంలో 23.5 శాతం.

మన అడవులనుంచి వీలైనంత ఎక్కువ సంపదను పొందడానికి తగిన నిర్వహణ, అడవులను సక్రమంగా అభివృద్ధి చేయడం అవసరం. దీన్ని రాష్ట్ర అటవీశాఖద్వారా సాధించాలి.

అటవీ శాఖ క్రింద అభివృద్ధి ఈ కార్యక్రమాలున్నాయి:—

1. అడవుల క్రింద వున్నభూమిని విస్తరింపచేసి అభివృద్ధి చేయడం

2. అనుక్షణం పెరుగుతున్న అవసరాలైన వంటచెరకు, కలప మొదలైన అడవులో లభించే వాటిని ముమ్మందు విరివిగా సరఫరా చేయడం.

3. అటవీ సంపదాభివృద్ధికై దీర్ఘ ప్రణాళికను రూపొందండం.

ఇంతకు ముందు దుర్వినియోగం చేయబడి, పంచాయతీ అడవులక్రింద వున్న సువిశాల ప్రదేశాలను మొదటి ప్రణాళికా కాలంలో రాష్ట్ర అటవీ శాఖ తనస్వాధీనం చేసుకొని "కార్యాచరణ పథకాలను" రూపొందించి కోస్తా జిల్లాలలో 1500 ఎకరాల ప్రాంతంలో సరుగుడు చెట్లను నాటారు. పునరుద్ధరణ భూఖండాలను అన్ని జిల్లాలో 16,880 ఎకరాలవరకు పెంచారు అటవీ సంపద సులభంగా రవాణా జేయడానికై కర్నూలుజిల్లా, ఏజన్సీ ప్రాంతాలలో 47 మైళ్ళ పొడవున కొత్తరోడ్లను వేశారు.

ద్వితీయ ప్రణాళికలో 123.59 లక్షల రూపాయల వ్యయంతో 53 పథకాలను (ఆంధ్రలో 31, తెలంగాణాలో 22) అమలు జరిపారు. ఈ 53 పథకాలలో అటవీ పథకాలకు 97.13 లక్షలరూపాయలు, సస్యరక్షణపథకాలకు 15.72 లక్షలరూపాయలు సహాయకార్యక్రమపథకాలకు 2.26 లక్షల రూపాయలు, కేంద్ర పథకాలకు 8.48 లక్షల రూపాయలు ఖర్చయినవి

ద్వితీయ ప్రణాళికలో చేపట్టిన పథకాల ముఖ్యాంశాలు, ఫలితాలు ఇవి :—

ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న అటవీ ప్రాంతాలకు నూతన కార్యాచరణ పథకాలను సిద్ధం చేయడం, అమలులో వున్న కార్యాచరణ పథకాలను పునః పరిశీలించడం.

"కార్యాచరణ పథకం" అనేది ఒక నిర్ణీత విధానంతో అడవుల నియమబద్ధమైన అభివృద్ధికి ఏర్పాటు చేసిన ఒక ప్రణాళిక. అడవులను శాస్త్రీయ పద్ధతులలో నిర్వహించడానికి ఈ ప్రణాళికలు పునాది రాళ్ళు. ద్వితీయ ప్రణాళికా కాలంలో నూతన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయబడటమే గాక విశాఖపట్నం ఉత్తరం, విశాఖపట్నం దక్షిణం, చిత్తూరు తూర్పు, చిత్తూరు పడమర డివిజన్లలో కార్యాచరణ పథకాలు 9.12 లక్షల రూపాయల వ్యయంతో పూర్తయినవి.

ఆర్థిక లాభాన్ని ఇచ్చే టేకు, సరుకు, యూకలిప్టస్, జీడి చెట్ల కృత్రిమ పునరుద్ధరణ.

ద్వితీయ ప్రణాళికలో ఈ క్రింది ఆర్థిక, భౌతిక లక్ష్యాలను సాధించారు.

వివరం	ఎకరాలు	వ్యయం (లక్షల రూపాయలలో)
1. కలప వృక్షాలు (టేకు, మొ॥)	3693	1.88
2. వంట చెరకు చెట్లు (సరుగు మొ॥)	4001	2.17
3. వాణిజ్యానికి సంబంధించిన చెట్లు :—		
జీడి చెట్లు	24143	6.30
వేము, వెదురు	287	0 39
మొత్తం	32,124	10.74

ఈ కొత్త చెట్లను నాటడమే గాక, వలు ప్రాంతాలలో

భూసార సంరక్షణకు అడవులనుఅభివృద్ధి చేశారు.

కడప జిల్లాలో అడవుల అభివృద్ధికై 0.56 లక్షల రూపాయల వ్యయంతో 320 ఎకరాలలో వృక్షాలను నాటారు. రిజర్వు అడవులలో వున్న 555 ఎకరాల కొండ ప్రాంతాలను, ఇదే విధంగా రిజర్వు అడవుల బయట వున్న కొండ ప్రాంతాల 700 ఎకరాలలో కొత్త వృక్షాలను వరుసగా 53, 1.85 లక్షల రూపాయల వ్యయంతో నాటారు. ప్రభుత్వం అధీనం చేసుకున్న పంచాయతీ, ఎస్టేటు అడవులలోని 10,708 ఎకరాల భూసారంలేని భూమిలో 8.77 లక్షల రూపాయల ఖర్చుతో అడవులను వేశారు. ఈ విధంగా అడవులను తిరిగి పెంచడం, మెట్ట భూములలో భూసారం కొట్టుకుపోకుండా చేయడానికి 11.373 ఎకరాలలో రూ 5.02 లక్షల వ్యయంతో కొత్త పథకాలను చేపట్టారు.

అడవుల పెంపకానికి, అభివృద్ధి కార్యక్రమాలకై వాణిజ్యానికి ఆర్థికంగా ఉపయోగించే మొక్కల నిల్వలను పెంపొందించడానికి అనేక మొక్కల నిల్వల స్థలాలను ఏర్పరిచారు.

అడవులలో లభ్యమయ్యే చిన్న తరగతి ఉత్పత్తులను ఉపయోగించుకొనడానికి ద్వితీయ ప్రణాళికలో ఒక పథకాన్ని రూపొందించారు. ఇందుకై కొందరు ప్రత్యేకోద్యోగులను నియమించి 0.50 లక్షల రూపాయల ఖర్చుతో సర్వే చేయించారు దుర్గమారణ్య ప్రాంతాలను సక్రమంగా జేయడానికి, అడవులలో లభించే ఈకు మొదలైన వాటి రవాణాను పెంపొందించడానికై ఆంధ్రప్రాంతంలో వున్న 191 మైళ్ళ మైదానపు రోడ్లను, ఏజన్సీ ప్రాంతంలో 189 మైళ్ళ పొడవున తెలంగాణాలో 45 మైళ్ళ పొడవున రోడ్లను బాగు చేయడానికి, అడవులలో కొత్త రోడ్లను వేయడానికి వరుసగా 11.28, 12.70, 1.92 లక్షల రూపాయల ఖర్చయ్యే పథకాలను అమలు జరిపారు. అడవులలోని రోడ్లు, అడవులను కొట్టివేయదాన్ని ఇతర నేరాలను కనుగునే ఉద్యోగులకు ఎంతో ఉపకరించ గలవు.

అడవుల కార్యక్రమములను సక్రమంగా నిర్వర్తించడానికి వాహనాలు అవసరం. ఇందుకై జిల్లా అటవీ శాఖాధికారులకు జీపులను సరఫరా చేసే పథకాలను చేపట్టి ద్వితీయ ప్రణాళికలో దాన్ని అమలు జరిపారు. ఈ పథకం క్రింద 4.16 లక్షల రూపాయిల ఖర్చుతో 28 జీపు కార్లను సరఫరాచేశారు.

కలప రవాణా నిబంధనలను అమలు జరపడానికి, అటవీ సంపదను రక్షించడానికి రెండవ ప్రణాళికా కాలంలో 94 లక్షల రూపాయల వ్యయంతో అటవీ ప్రదేశాలలో 117 ఠాణాలను ప్రారంభించే పథకాన్ని కూడా అమలుజరిపారు

కంట్రాక్టర్లు కలపను అన్యాయంగా కొట్టివేయదాన్ని నివారించడానికి, అటవీ శాఖ ఆదాయాన్ని అధికం చేయడానికై కలపను కొట్టివేసే పథకాలను ఆ శాఖ చేపట్టింది. ఈ పథకాన్ని వరంగల్ డివిజన్‌లో 1960_61 లో 1 16 లక్షల రూపాయల వ్యయంతో ప్రారంభించారు.

ఆదిలాబాద్ జిల్లా అడవులలో లక్క ఉత్పత్తిని ప్రారంభించారు. 2.26 లక్షల రూపాయల ఖర్చుతో 374 మణుగుల లక్క లభించింది. 0.18 లక్షల రూపాయల ఖర్చుతో 4400 విద్యుత్ స్తంభాలను సరఫరా చేశారు. హైదరాబాద్ వద్ద వన్య మృగ ప్రదర్శనశాలను స్థాపించే ఒక పథకాన్ని రూపొందించారు. ఈ పథకానికి 12.78 లక్షల రూపాయలను ఖర్చు చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో అభయారణ్యాన్ని ప్రారంభించారు. వరంగల్ మెదక్ జిల్లాలలోవున్న అభయారణ్యాలకు రక్షణ ఉద్యోగులను ఏర్పాటు చేశారు. ఈ పథకానికి 1.91 లక్షల రూపాయలు ఖర్చు అయింది.

ప్రథమ పంచవర్ష ప్రణాళికా కాలంలో సాహిబ్‌నగర్ వద్ద నెలకొల్పిన భూసార పరిశోధనా కేంద్రంలో ప్రారంభించిన పరిశోధన ద్వితీయ ప్రణాళికలో కూడా సాగింది భూమి కోతబడ్డ ప్రాంతంలో భూసార రక్షణకై 1.06 లక్షల రూపాయల వ్యయంతో ప్రయోగాలు జరిపారు.

మొదటి ప్రణాళికలో చేపట్టిన ప్రచార పథకాన్ని రెండవ ప్రణాళికలో కూడా కొన సాగించారు. లెక్కల భోగట్టాను సేకరించడానికి ప్రయోగాత్మక పరిశోధన జరిగింది. హైద్రాబాద్‌లో వున్న సిల్వికల్చరిస్టు లైబ్రరీలో అటవీ సంపదకు సంబంధించిన ఆధునిక సాహిత్యం, సామగ్రివున్నాయి.

అడవుల పెంపకానికై 1.14 లక్షల రూపాయల ఖర్చుతో 860 ఎకరాల ప్రైవేట్ భూమిని స్వాధీనం చేసుకున్నారు.

రాజమండ్రి వద్ద ఎగువ గోదావరి అటవీ ప్రాంతంలో ఒక రంపపు మిల్లును రక్షణ ఫ్యాక్టరీ, వర్క్‌షాప్ మొదలైన వాటితో ఒక యూనియట్‌ను ప్రారంభించారు. దీనిని నెలకొల్పడానికి 25 ఎకరాలను సేకరించడమే గాక, దాని

ర్మాణం త్వరితగతిని సాగుతున్నది. ఈ పథకం తృతీయ ప్రణాళికలో కూడా కొనసాగుతుంది. ఇందుకై ద్వితీయ ప్రణాళికలో 1.18 లక్షల రూపాయలను ఖర్చు చేశారు.

కేంద్ర పథకాల కార్యక్రమం క్రింద ఏజన్సీ ప్రాంతాలలో కాఫీతోటల పెంపకాన్ని చేపట్టారు. ఇది గిరిజన ప్రజలకు కొంత పనిని కల్పిస్తుంది. ఈ తోటల పెంపకాన్ని చేపట్టడానికై అవసరమైన మొక్కల నిల్వలను అధికం చేశాయి. 3.34 లక్షల రూపాయల ఖర్చుతో 70 ఎకరాలలో కాఫీ తోటలను నాటారు.

రాష్ట్రంలోని మూడింట ఒకవంతు అటవీ ప్రాంతమంతటిలో టేకు మొదలైన చెట్లను నాటారు అటువంటి అడవులు కర్నూలు జిల్లాలోని నల్లమలలోను, భద్రాచలం రంపంగూడెం ఏజన్సీ ప్రాంతాలలో వున్నాయి. తృతీయ ప్రణాళికా కాలంలో 11,500 ఎకరాలలో టేకు చెట్లను వేయడానికి తీర్మానించారు అలాగే ఆర్థికంగా లాభాన్నిచ్చే యుకలిప్టస్, సరుగు, మొదలైన వాటిని 19,760 ఎకరాలు వేయాలని కూడా ప్రతిపాదించారు. తెలంగాణా ప్రాంతంలోని ఎస్టేట్లు, పంచాయతీల నుంచి స్వాధీనం చేసుకున్న అడవుల రిజర్వేషన్‌కు త్వరితం చేయడానికి, సర్వే అయిన తరువాత సరిహద్దు స్థంభాలను నాటడానికి, వాటి సరిహద్దులను గుర్తించడానికై 2 50 లక్షల రూపాయలతో వ్యయమయ్యే ఒక పథకాన్ని తృతీయ ప్రణాళికలో చేర్చారు

అడవులలోని వివిధ వనరుల గురించి సర్వే జరపడానికి, వాటి గురించి సరియైన సమాచారాన్ని సేకరించడానికి 3 30 లక్షల రూపాయల వ్యయమయ్యే "అటవీ సంపద సర్వే" అనే పథకాన్ని రాష్ట్ర స్థాయి పథకంగా తృతీయ ప్రణాళికలో అమలు జరుప నిశ్చయించారు

ఎక్కువ కార్యాచరణ పథకాల తయారుకు, అవి అంచనాలను మించినపుడు వాటికి మరికొంత ధనాన్ని కేటాయించడానికి 2 00 లక్షల రూపాయలను ప్రత్యేకించారు.

వన్యమృగ రక్షణ అడవుల నిర్వహణలో అంతర్భాగం. భారతదేశంలో అనాదిగవస్తున్న వన్యమృగ రక్షణను అధికం చేసే దృక్పథంతో దీనికి ప్రాముఖ్యతనిస్తున్నారు. ఈ వన్యమృగ రక్షణవల్ల ఇప్పుడిప్పుడే రిజర్వ్ అడవులు తన పూర్వ వైభవాన్ని పుంజుకుంటున్నని అభయారణ్యాలు, జాతీయ ఉద్యానవనాలు, వన్యమృగశాలలు వన్యమృగ రక్షణకు కృషి చేస్తున్నాయి. కొన్ని అభయారణ్యాలను అప్పుడే ప్రారంభించారు. మరి కొన్నింటిని త్వరలో ఏర్పాటు చేయనున్నారు. 3 96 లక్షల రూపాయల వ్యయంతో వన్యమృగ అభయారణ్యాల స్థాపన పథకాన్ని తృతీయ ప్రణాళికలో అమలు జరుపనున్నారు.

హైదరాబాద్ వద్ద వన్యమృగ ప్రదర్శనశాల స్థాపనకు తృతీయ ప్రణాళికలో 24 09 లక్షల రూపాయలను ప్రత్యేకించారు. ఈ పథకం క్రిందటి ప్రణాళికలో అసంపూర్తిగా వుండిపోయింది.

రంపపు మిల్లులు, భద్రతా కర్మాగారాలు మొదలైన వాటిని స్థాపించడానికి నిశ్చయించారు. ఈ పథకానికై 33 15 లక్షల రూపాయలను ప్రత్యేకించారు. రాజమండ్రి వద్ద స్థాపించే కలప సీజరింగ్ కర్మాగారం కూడా ఈ పథకం లోకే వస్తుంది. క్షేత్రారణ్య పథకాన్ని అమలుజరపడానికి 5 00 లక్షల రూపాయలను ప్రత్యేకించ నిశ్చయించారు.

అనుకున్న ప్రకారం అభివృద్ధి పథకాలను అమలు జరపడానికి తీవ్రతర పరిశోధన అత్యవసరం. ఇందుకై అటవీ సంపదాభివృద్ధిని అన్ని రంగాలలో సాధించడానికి, సత్ఫలితాలను సాధించడానికి తగిన సాంకేతిక సలహాలకుగాను 150 లక్షల రూపాయలు వ్యయమయ్యే ఒక పథకాన్ని ఏర్పరిచారు. అటవీశాఖ మరింతగా అభివృద్ధి చెందడానికి, లోతట్టు అడవులను తొలగించడానికి 192 మైళ్ళ పొడవున రోడ్లు వేయడానికి తీర్మానించారు.

అడవుల ప్రాముఖ్యతను గురించి ప్రజలలో ప్రచారం చేయడానికి తృతీయ ప్రణాళికలో ఒక పథకాన్ని చేర్చారు. ఈ పథకానికి లక్ష రూపాయల ఖర్చు అవుతుంది. ఆర్థిక లాభానికి, వాణిజ్యానికి తోడ్పడే పంటలను అధికంచేయడానికి సాంస్కృతిక పద్ధతులను భారీ ఎత్తున ప్రారంభిస్తారు. అటవీ రక్షణ పథకాలన్నిటినీ అమలు జరపడానికి తృతీయ ప్రణాళికలో 14 37 లక్షల రూపాయలను ప్రత్యేకించారు.

ఈ విధంగా తృతీయ ప్రణాళికా కాలంలో అడవుల అభివృద్ధికి సంబంధించిన ప్రణాళిక మొత్తం కేటాయింపు 145 లక్షల రూపాయలు

ఇది మన రాష్ట్రంలోని అటవీ సంపద—పశు సంపదకు సంబంధించిన గాథ.

ఒక ప్రశాంత శీతాకాలపు సాయం సమయాననా ఎనిమిదేళ్ళ మేనగోడలు నన్నడిగింది.

"నువ్వెప్పుడు చెబుతుంటావే—అడవిలో వున్న బంగళా గురించి—అక్కడకు నన్నెపుడు తీసుకువెడుతావ్?" అని.

"వెళ్దవమ్మా! వసంత కాలం రాని మరి! అన్నాను నేను,

ఒకరోజు...ఆ పచ్చని అడవుల వైభవం ఆ పసిదాని హృదయంలో చిరస్మరణీయ స్థానాన్ని సంపాదించుకుంటుంది.

(ఆంగ్ల వ్యాసమునకు అనువాదము)

* * *

తై ఋ ప్ర న ఋ ప్ర

పద్మశ్రీ
శ్రీ సి. నరసింహం
ఐ ఏ యస్.

మనకు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, ప్రజల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఆత్రుత ఆసక్తి యెక్కువయ్యాయి. అలా కావడం సహజమే. అయితే విదేశాలతో పోల్చిచూచుకుంటే మనము ఆర్థికంగా చాలా వెనక బడివున్నాం గనుక, కొద్ది కాలంలోనే ఇతర దేశాల స్థాయిని అందుకోవాలంటే అంత తేలికైన పని కాదు. ఏ మాత్రం మనం అభివృద్ధి చెందాలన్నా మనకున్న సాధన సంపత్తిని ప్రణాళికల ద్వారా కాలానుగుణ్యంగాను, జాగ్రత్తగాను సంపూర్ణంగాను సద్వినియోగం చేసుకోవాలి మన పంచవర్ష ప్రణాళికల ముఖ్యోద్దేశం కూడా యిదే. సమగ్ర ఆర్థికాభివృద్ధిని సాధించటమేగాక జీవన ప్రమాణాన్ని కూడా పెంపొందించడం ప్రణాళికా లక్ష్యం. కాని, యిది ఒక పంచవర్ష ప్రణాళికతో సాధ్యమయ్యే పని కాదు. మన ప్రస్తుత పరిస్థితినిబట్టి చూసుకుంటే యే ఐదారు ప్రణాళికలో అమలు జరిపిన తర్వాతనే దేశంలోనూ, ప్రజల జీవిత ప్రమాణంలోనూ ఎక్కువగా చెప్పుకోతగ్గ అభివృద్ధి కన్పిస్తుంది.

ఇట్టచివరకి మనం ప్రణాళికల ద్వారా ఆశించేది దేశ సంపద అయినప్పటికీ ప్రతి పంచవర్ష ప్రణాళిక ఆశయాలలోను, కొద్దిగానో, గొప్పగానో తేడాలు వుండక తప్పవు. ఈ తేడాలకు కారణం దేశంలో యెప్పటికప్పుడు మారుతూవున్న ఆర్థిక పరిస్థితులే. ఉదాహరణకు మన మొదటి పంచవర్ష ప్రణాళికే తీసుకుందాం దాని లక్ష్యాలు రెండు. ఒకటి, రెండవ ప్రపంచ యుద్ధంవల్లా, దేశవిభజనవల్లా, ఆర్థిక పరిస్థితులలో కలిగిన ఒడుదుడుకులను సరిచేసుకోవటం, రెండు, ముందుముందు దేశ సంపద పెంపొందడానికి అవసరమైన పునాది వేసుకోవడం. అప్పటి పరిస్థితులను బట్టి యీ ఆశయాలు తప్పనిసరి అయినాయి. అప్పుడు మనకు అవసరమైన తిండి గింజలలో చాలా లోటు కన్పించింది. వ్యవసాయ ముడి పదార్థాల వుత్పత్తి కూడా చాల వరకు తగ్గిపోయింది. పరిశ్రమలన్నీ చాలా హీనస్థితిలో వుండిపోయాయి. దీనికి తోడు మన సరిహద్దు నుండి వలస వచ్చిన వారి సంఖ్య రోజురోజూ పెరిగి పోతూ వచ్చింది. ఇవి అన్నీ కలిసి, ఆర్థిక, సాంఘిక, మానసిక సమస్యలై దేశాన్నెదుర్కొన్నాయి. ఇవి చాలనట్లు, 1950 లో కొరియాలో యుద్ధం వల్ల ధరలు విపరీతంగా పెరిగాయి, 1950–51లో పంటల్లో కూడా నష్టం కల్గింది. అయినప్పటికీ ప్రజల సహకారం తోను, వారు దేశంపట్ల, ప్రణాళికలపట్ల చూపిన వుత్సాహం వల్లనూ మొదటి ప్రణాళిక యొక్క రెండు లక్ష్యాలు పూర్తిగా నెరవేరాయి.

మొదటి ప్రణాళికలో కల్గిన అభివృద్ధిని ఆధారంగా చేసుకొని, రెండవ పంచవర్ష ప్రణాళికను రూపొందించాం. ప్రథమ పంచవర్ష ప్రణాళికలో ప్రారంభమయిన పథకాలను కొనసాగించడమే ద్వితీయ ప్రణాళిక స్థూల లక్ష్యమయినప్పటికి, ప్రాధాన్యతల విషయంలో రెండు ప్రణాళికలకూ కొంత తేడా వుంది. రెండవ ప్రణాళికా లక్ష్యాలు మొదటి ప్రణాళిక లక్ష్యాలకంటే కొంచెం హెచ్చు స్థాయిలో ఉన్నాయి. ఒకటి, జాతీయాదాయాన్ని నాల్గింట ఒక వంతు వృద్ధి చేయడం, రెండు, సత్వర పారిశ్రామికాభివృద్ధిని సాధించడం, మూడు యితోధికంగా ఉద్యోగావకాశాలను కల్పించడం, నాల్గు, ప్రజల రాబడులలోను, సంపదలోనూ కన్పిస్తున్న హెచ్చుతగ్గులను వీలైనంత తగ్గించడం.

ద్వితీయ ప్రణాళికలో పరిశ్రమలకు, ముఖ్యంగా ప్రాతిపదిక పరిశ్రమలకూ, యెక్కువ ప్రాధాన్యమివ్వబడింది పారిశ్రామికాభివృద్ధితో పాటు అందుకు అవసరమైన రహదారులవంటి యితర సౌకర్యాలను యితోధికంగా కల్పించేటందుకు కృషి కూడా జరిగింది.

ప్రణాళిక ఆశయాలు ఎన్ని అయినప్పటికీ అవన్నీ కూడా పరస్పర సంబంధం కల్గి వుంటాయి.

పెట్టుబడి, వుత్పత్తి అధికం కాకపోతే జాతీయాదాయం యెక్కువ కాజాలదు, అదే విధంగా, వ్యవసాయాభివృద్ధిలో కల్గిన రాబడిని సద్వినియోగం చేయాలంటే పారిశ్రామికాభివృద్ధి యెంతో అవసరం. అల్లే మన కెక్కువగాయున్న ప్రజాశక్తిని పూర్తిగా వినియోగించుకుంటేనే. మనం సమగ్రమైన అభివృద్ధిని సాధించుకుంటాం. ఈ లక్ష్యాలన్నీ కూడా ఆర్థిక లక్ష్యాలే. వీటితో పాటు, సాంఘిక లక్ష్యాలు కూడా సమన్వయించుకుంటేనే గాని యీ రోజున మన సంఘంలో కన్పించే హెచ్చు తగ్గులను సవరించుకోలేం.

ఇక రెండున్నర నెలలలోపుగా ద్వితీయ పంచవర్ష ప్రణాళిక పూర్తి అవుతుంది. ఇప్పటి అంచనాలను బట్టి రెండవ ప్రణాళిక కూడ విజయవంతమైనదనే చెప్పాలి. మొదటి రెండు ప్రణాళికలవల్ల జాతీయ సంపద 42 శాతమున్నూ, వ్యక్తి సగటు ఆదాయం 16 శాతమున్నూ పెరిగింది ఇంతేకాదు, గత రెండు ప్రణాళికలలోను సాధించిన అభివృద్ధికరంబె యిక ముందు జరిగే అభివృద్ధి కార్యక్రమం త్వరితగతిలో అమలు జరుపుటకు అవకాశం కూడా కల్గింది గడచిన పది సంవత్సరాలలోను, ప్రణాళికలు అమలు జరుపడంలో సంపాదించిన అనుభవాలను బట్టి మూడవ ప్రణాళిక కూడా తయారయింది. ఈ ప్రణాళిక లక్ష్యాలు కూడా జాతీయాదాయాన్ని ప్రతియేటా 5 శాతం చొప్పున పెంచుకోవడం, వ్యవసాయోత్పత్తి మనకు సరిపోయేటంతగా అభివృద్ధి చేసుకోవడం, యంత్రోత్పత్తి సాధనం అధికంగా చేసుకోవడం. మనకున్న ప్రజాశక్తిని పూర్తిగా వినియోగించుకోవడం సంఘంలోవున్న ఆర్థిక హెచ్చు తగ్గులను తగ్గించడం.

ఈ ఆశయాలన్నీ కూడా ముఖ్యావసరమైనవే. వీటిని ఎంత త్వరితగతిని సాధిస్తే దేశానికంత మంచిది. మన జాతీయాదాయం పెంచుకుంటేనే తప్ప మన రాబోయే పంచవర్ష ప్రణాళికల ప్రగతి కుంటుపడకుండా నడవదు. మన దేశంలో విపరీతంగా పెరుగుతూ వున్న జనాభాకు కావలసినంత ఆహార ధాన్యాలు, పరిశ్రమలకు తగినంత ముడి పదార్థాలు, యెగుమతికి కావలసిన వ్యవసాయ పంటలు అభివృద్ధి చేసుకోవాలి. వీటితో పాటు పారిశ్రామికంగా పురోగమించడానికి అవసరమైన ప్రాతిపదిక పరిశ్రమలను కూడా వృద్ధి చేసుకోవాలి. రోజురోజూ పెరుగుతూ ఉన్న నిరుద్యోగ సమస్యను యెదుర్కోవా లంటే కావలసినంతగా ఉద్యోగ అవకాశాలను కల్పించాలి ఉద్యోగం అంటే, కేవలం బస్తీలలోనూ, కార్మాగారాలలోనూ, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ పనిచేయడమే కాదు. గ్రామంలో వీలైనంత వరకూ కుటీర పరిశ్రమలను నడపడం. శాస్త్రీయ పద్ధతులలో వ్యవసాయం చెయ్యడం. సామాజిక వికాసానికి తోడ్పడే సంఘసేవ చేయడం కూడా వుద్యోగమే ఇదేగాక. మనం అనుకున్నట్లుగా సోషలిస్టు సమాజాన్ని యేర్పాటుకోవాలంటే వీలైనంత త్వరలో ప్రస్తుతం మన సమాజంలో కన్పించే హెచ్చు తగ్గులను నిర్మూలించుకోవాలి మరం త్వరలో అమలు జరుపుకోబోతున్న మూడవ పంచవర్ష ప్రణాళిక చాలా ముఖ్యమైనది మన భవిష్యత్తు యీ ప్రణాళికా కాలంలో మనం సాధించగలిగే విజయంపై ఆధారపడి వుంటుంది. ఇందులో మనకు కలిగే జయాపజయాలు మనదేశ పురోగమన తిరోగమనాలను నిర్ణయిస్తాయి.

మూడవ ప్రణాళికలో వ్యవసాయాభివృద్ధి, ముఖ్యంగా శాస్త్రీయ పద్ధతులను అవలంబించడంపై ఆధారపడి ఉంటుంది. దానితోపాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ సహకార పద్ధతులలో నడపడానికి చర్యలు తీసుకోబడుతాయి ఈ సహకార పద్ధతులు, అప్పులివ్వడంలోనూ, క్రయవిక్రయాలలోనూ, వుత్పత్తి విధానాల్లోను తదితర రంగాల్లోనూ విస్తృతంగా అవలబించ బడతాయి.

ఈ లక్ష్యాలను, సాధించడానికి సుమారు పదకొండు వేల అయిదువందల కోట్లు రాబోయే ఐదు సంవత్సరాలలోను వ్యయమవుతుంది ఇందులో నాలుగువేల కోట్లు ప్రయివేటు రంగంలోను. మిగిలిగ ఏడువేల ఐదు వందల కోట్లు ప్రభుత్వ రంగంలోనూ ఖర్చవుతుంది. రాష్ట్ర ప్రణాళిక ద్వారా మూడువేల ఏడు వందల కోట్లు వెచ్చింప బడుతాయి రాష్ట్ర ప్రణాళికపై వ్యయం కొద్దిగా హెచ్చించే సూచనలు కూడ కన్పడుతున్నాయి.

ఈ లక్ష్యాలన్నీ కూడా హర్షింప తగ్గవే. కాని వీటిని సాధించడానికి ప్రతిపౌరుడు యెంతైనా కృషి చెయ్యాలి. రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వం చేయ గలిగిందల్లా సూచనలు మాత్రమేకాదు. దానికి కావలసినశక్తి - సామర్థ్యాలను ఏవిధంగా సమకూర్చుకోవాలో కూడా ప్రభుత్వం పరిశీలించి అమల్లో పెడతాయి. ప్రణాళికా పథకాలలో కొన్నింటికి ప్రభుత్వం శాస్త్రీయ సలహాలు మాత్రమే యివ్వగలదు. మరి కొన్నింటికి సలహాలతోపాటు సిబ్బంది సహాయం కూడా చేయగలదు. ఇవి గాక చాలాపథకాలను ప్రభుత్వం సహాయం లేకుండానే ప్రజల పరస్పర సహకారంతో సాధించవలసి వుంటుంది. ఈ అన్ని రకాల పథకాలలోనూ ప్రజల పాత్రే ప్రాధాన్యమైనది. ప్రతి ఒక్కరూ పూర్తి సహకారం పరిపూర్ణమైన వుత్సాహం ప్రణాళికల పట్ల చూపకపోతే మనం

నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించలేం. యిప్పుడు ముఖ్యంగా మన రాష్ట్రంలో ప్రజలే యెన్నుకొన్న పంచాయతీలు ఉన్నవి. వారి ప్రతినిధులే సమితి స్థాయిలోనూ వ్యవహరిస్తున్నారు. అభివృద్ధి కార్యక్రమంలో ఈ సంస్థలకే యెక్కువ బాధ్యతలు అప్పగించబడ్డాయి. ఈ సంస్థలను సద్వినియోగం చేసుకొని, ప్రతి వ్యక్తికీ సమాన అవకాశాలనూ, పనిచేయగలిగిన ప్రతి ఒక్కరికీ తగినంత పనులను, పనిచేసేవారికి తగినంత తిండీ, బట్ట సమకూర్చకలిగే సమాజాన్ని మనం నిర్మించుకోవాలి.

స్వచ్ఛంద సేవలో ఆసక్తిగల వ్యక్తులను, సంస్థలను ఆకర్షించాలి. ప్రభుత్వం, ప్రజాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పూర్తిగా పనిచేయాలి. శతాబ్దాల తరబడి విదేశీ పరిపాలనలో మ్రగ్గి అన్ని విధాల వెనుకబడ్డ దేశపు సర్వతో ముఖాభివృద్ధిని ఒక్కుమ్మడిగా ఒక్కసారిగా సాధించడం సులభంకాదు. కాని మనమందరమూ స్వార్థ రహితమైన కృషిచేయడంతో పాటు త్యాగనిరతిని కూడా ప్రదర్శిస్తే మనం సాధించలేనిదంటూ యేదీ ఉండదు. ప్రజలు ప్రజా సంస్థలు చూపుతున్న ఉత్సాహం అభినివేశాలే మన మహత్తర లక్ష్యాలు జయప్రదమవ్వడానికి శుభసూచనలని చెప్పక తప్పదు.



కులములేని జగతి కూలిపోవుటయేడ?

సంకరమ్ము లేద? పంకలేద?

అసలు పుటమె లేదె అంతఃపుటమ్మేడ?

జనునుతాంతరంగ! వినుర రంగ!

—కృష్ణశతశతి

ప్రకాశం: [వస్తూ] — అమ్మా ..

బామ్మ: ఆరి నీ యిల్లు బంగారం కాను, సరిగ్గా తలుచుకుంటున్నప్పుడే వొచ్చావురా నాయనా —తగ్గుస్వరంలో— ఆ అబ్బాయి కూడా వొచ్చేశాడా ఏమిటి?

ప్రకాశం: లేదు, లేదు ఇప్పుడే కారు పంపించాను తీసుకురావటానికి. వచ్చేస్తాడు. టీ వగైరాలు అంతా రెడీ యేనా అమ్మా.

బామ్మ: ఓ, అంతా చేయించేశాను సుబ్బన్న చేత.

ప్రకాశం: మరి అమ్మాయి సంగతి చూడు. నేనీలోగా కాస్త బట్టలు మార్చి వస్తాను

బామ్మ: సరే, అమ్మాయి సరూ...సరూ, [వాయిస్ దూరంగా] [వెళ్లి తిరిగి దగ్గరికి వస్తుంది] సరూ...ఓసి నీ ఇల్లు బంగారం కానూ, అటు నిక్షేపంలాంటి వరుడు నిన్ను వెతుక్కుంటూ వస్తోంటే, ఇటు టింగురంగా అని పడుకుని చదువుతున్నావా?

నాటిక: పొగమంచు

శ్రీ నెల్లూరి కేశవస్వామి

సరోజ: చూడు బామ్మా, అప్పట్నించీ చెబుతూంటే వినటం లేదు అక్కయ్యా! నన్ను చూడు ఏం చక్కా ముస్తాబయ్యానో...

బామ్మ; మా అమ్మే, మా బంగారు తల్లే, [మెటికలు విరిచి] నీకు ఇంకంటే ముద్దైన మొగుణ్ణి తెచ్చి పెడ్తా లేమ్మా.

సరోజ: నిజంగానా బామ్మా, అయితే ఎప్పుడూ?

బామ్మ: కానీ, మీ అక్కయ్య పెళ్లి కానీ...

సరోజ: బామ్మా, 'నాకు అచ్చంగా తాతయ్యలాంటి మాడల్ మొగుణ్ణి తెచ్చిపెట్టాలి మరి ఆఁ.

బామ్మ: ఓసి నీ ఇల్లు బంగారం కానూ, నన్నే ఎగతాళి చేస్తున్నావటే? కానీ, కానీ, ఇప్పుడే తెలుస్తుందిలే...చచ్చి స్వర్గాన వున్నాడు ఆ మహారాజు, ఆయనలాంటి మొగుడు దొరకటం ఎంత అదృష్టమోనీకేం తెలుసు?...లే అమ్మా, సరూ, లే, ఆలస్యమవుతోంది...

సరోజ: [విసుగ్గా] అబ్బబ్బ ఏవిటే నీ పోరూ?...

బామ్మ: దొంగాయి అబ్బాయి వస్తున్నాడే.

సరోజ: వస్తేరానీ, నేనేం చేయనూ?...

బామ్మ: ఓసి నీ ఇల్లు బంగారంకానూ, నిన్ను చూట్టానికే ఇంత దూరం వస్తోంటే నేనేం చేయనంటావేమిటే పిచ్చితల్లీ... లే అమ్మా! లేచి కాస్త మొహం కడుక్కుని, చీరకట్టుకునీ...

సరోజ: [వక్రోక్తిలో] ఇప్పుడూ కట్టుకునే వున్నాను ఇది చాలు. ఆయనగారు నన్నీ చీరలో వరించకపోతే మాన్లే.

బామ్మ: అయ్యో! విడ్డూరమా! ఇదేంపొయ్యేకాలం వచ్చిందమ్మా.

సరోజ: అయితే బామ్మా! మీ కాలాల్లో ఎలాగుండేదే...? తాతయ్య నిన్ను చూట్టానికి వచ్చినప్పుడు నువ్వెలా ముస్తాబయ్యావ్ బామ్మా?

బామ్మ: మా కాలాలకేమొచ్చిందే తల్లీ, మహారాజుల కాలాలు. ఈ చూసుకోడాలూ, గీసుకోడాలూ వుండేవి కావు, ఎవరి అదృష్టం వాళ్లది. మీ తాతయ్యా నేను మా పెళ్లయ్యాక నాలుగేళ్లకి గాని ఒకరి మొహాలు ఒకరం తేరిపార చూసుకోనేలేదు తెలుసా?

సరోజ: తారుమారు జరిగిందేమోనన్న అనుమానం కూడా కలగలేదా బామ్మా?

బామ్మ: నీ మొహం! తారుమారేవిఁటే? వెధవ ప్రశ్న?

సరోజ: అవున్లే బామ్మా! ఆ రోజుల్లో మొదటే దేవుడి సన్నిధిలో పెళ్లి చేసుకుని మరీ పుట్టేవాళ్లట. ఇప్పుడు విడాకులు వచ్చాక ఎటుపోయి ఎటొస్తుందోనని మొదటే పుట్టేసి ఆ తర్వాత చూసి చూసి చేసుకుంటున్నారు.

బామ్మ: అబ్బబ్బ! ఎన్నెన్ని మాటలు నేర్చావే తల్లీ!...సరే కాని, నేను వెళ్తాను, అక్కయ్యని కాస్త ముస్తాబు చేయించి తీసుకురా అమ్మా.

సరోజ: నేను కూడానా?

బామ్మ: మరీ? ఈ ముస్తాబంతా దేనికీ?

సరోజ: [పెద్దగా నవ్వి] బావుంది, ఆయనగారికోసమే ముస్తాబయ్యాననుకున్నావా?...అయితే బామ్మా! ఇంట్లోవున్న సరు

కింతా చూపించాలని వుబలాటంగా వుందా నీకూ? ఇది పొటాటో. ఇది టామాటో. ఇది ముల్లంగి. ఇదీ క్యాబేజీ ఇందులో నీకు ఏది ఇష్టపదార్థమో దాన్ని ఎత్తుకో నాయనా అంటావా?—— సరైతే బామ్మా! మాతోబాటు నువ్వూ ముస్తాబై కూచోరాదూ? ఎవరి అదృష్టం వారిదీ, ఎవరి రుచి వారిదీ...

బామ్మ: ఓసి నీ ఇల్లు బంగారం కానూ, నీ నోటికి హద్దూ పద్దూ లేదల్లే వుంది అసలు నీతో వాదానికి దిగడం నాదే బుద్ధి పొరపాటు.

ప్రకాశం: —దూరాన్నుంచి—అమ్మా!...అమ్మా!...ఎక్కడున్నావే?

బామ్మ: ఓయ్...ఇక్కడే. అమ్మాయి గదిలో...వొచ్చేశాడా అబ్బాయి.

ప్రకాశం:— —వచ్చి— లేదులే. వస్తూనే వుంటాడు. కాని నువ్వు ఇంకా ఇక్కడే ఏంచేస్తున్నావ్?

బామ్మ: ఏముంది బాబూ, వీళ్లతో వేగలేకుండా వున్నాను. పెద్దది మూతి ముడుచుకొని కూచుంది. చిన్నది మాటలు మలుపుతోంది,

ప్రకాశం: ఏమ్మా! ఏమిటి సంగతి?

సరోజిని: ఏంలేదు నాన్నా! అనవసంగా కంగారు పడుతోంది బామ్మ.

బామ్మ: ఓసి నీఇల్లు బంగారం కానూ, నేను కంగారు పడుతున్నానటే? కాస్త లేచి బట్టలు మార్చుకోవే, అబ్బాయి వస్తున్నాడు అన్నాను...అంతేనా?

సరోజిని: నేనుకున్నట్టుగానే బావున్నావని చెబుతుంటే వినిపించుకోదు బామ్మ.

ప్రకాశం: సరేలేమ్మా. నీఇష్టం. (బైట హారన్ మోత) ఇదిగో కారు వచ్చేసింది. రామ్మా! నువురా! అమ్మాయి వస్తుందిలే...

బామ్మ:— పద బాబూ.

* * *

ప్రకాశం: హల్లో మిస్టరు చలపతీ...?

చలపతి: గుడ్ ఆఫ్టరునూన్ సర్! హౌడుయుడూ?

ప్రకాశం: హౌడుయుడూ? .. అరె కారులో రాలేదూ, పంపించానే ..

చలపతి: ఫరవాలేదు లెండి. టాక్సీ చేసుకు వచ్చేశాను. సరిగ్గా ఫైవోక్లాక్‌కి వస్తానని అన్నాను. కదూ...

ప్రకాశం: ఇల్లు వెతకాలిసి రాలేదుకదా?

చలపతి: అబ్బే ప్రకాశం గారంటే ఈ సిమ్లా మొత్తం తెలుసుల్లే వుంది.

ప్రకాశం: రండి, ఇలా లోపలికిరండి... ఇదిగో వీరు మా అమ్మగారు...

చలపతి: నమస్కారాలండీ అవ్వగారూ!

బామ్మ: నూరేళ్లు చల్లగా బ్రతుకు నాయనా!... ఇటు, ఇటు ఈ సోఫామైనా కూచో బాబూ! .. అదేమిటి బాబూ! ఏదో హోటల్లో మకాం పెట్టావటగా? ..

చలపతి: అవునండీ, ప్యారడైజ్ హోటలనీ ..

బామ్మ: నీ ఇల్లు బంగారము కానూ, నిక్షేపంలా ఈ బంగళా వుండగా ఆ వెధవ హోటల్లో వుంటమేం ఖర్మ నాయనా!...

చలపతి: ఇది చాలా గొప్ప హోటలండీ?...

బామ్మ: ఎంతైనా ఇల్లు ఇల్లే. హోటలు హోటలే, అయినా మేము పరాయివాళ్ల మనుకున్నావా బాబూ? నీకు తేలీదుగాని మీ అమ్మ నాకు అట్టే దూరపు బంధువు కాదు, మా పింతల్లి సవతి కూతురి అల్లుడికి స్వయానా మేనకోడలే...

చలపతి: ఓహో అలాగండి...?

బామ్మ: మీ అమ్మకు అంతా తెలిసే వుంటుంది. వారణాసి వారంటే వైజాగ్‌జిల్లా అంతా మారుమ్రోగేది...అన్నట్లు అలసి పోయినట్టున్నావు బాబూ. మంచీళ్లు కావాలా?...

ప్రకాశం: మంచీళ్లేమిటే, సుబ్బన్నను టీ తెమ్మను......... అమ్మాయియేదీ?

బామ్మ: సుబ్బన్నా! టీలు పట్రారా...అమ్మాయి సరూ: త్వరగా రామ్మా! ఇంటికి అతిధులొచ్చారు...

ప్రకాశం: సిమ్లాకు రావడం ఇదే మొదటి సారా మీకూ?

చలపతి: లేదండీ, ఇదివరకొకమాటు వచ్చాను.

ప్రకాశం: హౌ డు యు లైక్ ఇట్?

చలపతి:— ఫరవాలేదు. బాగానేవుంటుంది. సమ్మర్‌లో ప్లెజెంటుగా వుంటుందనుకుంటాను, కాని ఇప్పుడు కాస్త చలి...

బామ్మ: అయ్యో! చలిమాటా చెప్పనాబాబూ, చచ్చిపోతున్నాను. మావాడికదేఇష్టమో, దక్షిణానికి బదిలీ చేయించుకోరా అని ఎంత చెప్పినా వినిపించుకోలేదు...అదుగో అమ్మాయి వచ్చే రా అమ్మా! రా, మన వాళ్ల అబ్బాయేలే...అలా వెళ్లి కూచో...

సరోజిని: నమస్కారాలు,

చలపతి: నమస్కారాలు.

ప్రకాశం: దిస్ ఈజ్ మై డాటర్, సరోజిని, ప్రస్తుతం హైద్రాబాదులో చదువుతోంది, బి ఏ. ఫైనల్ ఇయర్. శలవుల కొచ్చింది. ... సరూ! టీ కలుపమ్మా!... ఇడిగో ఈ బిస్కెట్స్ తీసుకోండి...

చలపతి: థాంక్స్.

బామ్మ: మా చిట్టితల్లి తల్లిప్రేమకి నోచుకోలేదు బాబూ! అయిదేళ్లప్పుడే కోల్పోయింది. అప్పట్నించి నా చేతులమీదుగానే పెంచి పెద్ద జేశాను... —తగ్గుస్వరంలో.— మా పిల్లఅని చెప్పుకోవడం కాదు. కానీ బాబూ! ఇంత మంచి పిల్ల యోగ్యురాలు, గుణవంతురాలు. నాకు తెలిసినంతలో ఎక్కడా లేదనుకో. దీనికి రానివిద్య అంటూలేదు. సంగీతం, అల్లకం కుట్టుపనీ...

సరోజిని: బామ్మా...

బామ్మ: ఏంవిటే? నన్ను చెప్పనీ. ఆ అబ్బాయి కొత్తవాడాయెనూ, చెప్పకపోతే ఎలాతెలుస్తాయి? ఏమంటావు బాబూ:...

చలపతి: అవునండి నిజమే...బి.ఏ. లో మీ సబ్జక్ట్స్ ఏంవిటండీ?

ప్రకాశం: (కాసేపాగి) నిన్నే అమ్మా! సరూ!...

సరోజిని: ఆఁ... నన్నా?...

బామ్మ: ఓసి నీ ఇల్లు బంగారంగానూ, మరి నన్నడిగాడను కున్నావుటే?...

సరోజిని: హిస్టరీస్. ఎకనామిక్స్ అండ్ పాలిటిక్స్.

చలపతి: బి.ఏ. తర్వాత ఏం చేద్దామనుకుంటున్నారు.

బామ్మ: అదేం ప్రశ్న బాబూ! ఏం చేస్తుంది? సలక్షణంగా పెళ్లి చేసుకుంటుంది.

చలపతి: అదికాదండీ, యమ్. ఏ. చెయ్యాలని వుందేమోనని...

బామ్మ: ఆఁ ఆడవాళ్లకు ఎమ్మేలూ ఎప్పేలూ ఎందుకు బాబూ!...

(ఫోను మోత)

ప్రకాశం: ఇప్పుడే వస్తాను.........

బామ్మ: రాత్రి వంట సంగతి చూసి వస్తాను. మీరు మాట్లాడు కుంటూండండి...

చలపతి; (కొద్ది క్షణాలాగి) ఏంవండీ అంత మౌనంగా వున్నారేం?

సరోజిని: ఏంచెయ్యమన్నారు?

చలపతి: నేనెందుకొచ్చానో తెలుసుగా?...

సరోజిని: తెలుసు.

చలపతి: మరి నన్నేమీ అడగరేం?

సరోజిని: ఏమడగనూ?

చలపతి: మీ ఇష్టం...

సరోజిని: అయితే ఒక ప్రశ్న.

చలపతి: ఒక్కటేం, ఎన్నేనా అడగొచ్చు...

సరోజిని: ఒక్కటిచాలు ... మీరెప్పుడు వెళ్తున్నారు?...

చలపతి: (చకితుడై) ఆఁ ఎక్కడికి?

సరోజిని: తిరిగి బొంబాయికి...మీది బొంబాయే కదూ?

చలపతి: అవును...కాని ఇదేం ప్రశ్న?

సరోజిని: ఏం...ఎప్పుడూ ఈ సిమ్లాలోనే వుండిపోరు కదా...

చలపతి: (నీరసంగా) ఓ...సరే, రేపు పొద్దున్నే వెళ్తాను...

సరోజిని: సంతోషం.

చలపతి: (మరీ చకితుడై) ఆఁ? ఏమన్నారూ?...

సరోజిని: ఏంలేదు...

బామ్మ: (వస్తూ) అదేవింటర్రా, చిలకా గోరెంకల్లాగా ఏంచక్కా మాట్లాడుతూన్నవాళ్లూ నేను రాగానే చప్పున ఆగిపోయారేం? అయితే నే వెళ్తానులే...

చలపతి: అబ్బెబ్బే! ఏమీ లేదండీ అవ్వగారూ! రండి.

ప్రకాశం: (వస్తూ) ఏవింటమ్మా?...

చలపతి: వస్తానండీసార్! శలవు.

ప్రకాశం: ఆఁ అదేవింటీ కాసేపుండండి.

చలపతి: లేదండీ, కాస్త పనుంది వెళ్లాలి...

బామ్మ: అయ్యో అయ్యో అట్లా వెళ్లిపోతాసంటావేమిటి బాబూ? రాత్రికి భోజనం ఇక్కడే. అన్ని ఏర్పాట్లూ చేసి వచ్చాను.

చలపతి: క్షమించాలి, వుండలేనండీ...

ప్రకాశం పోనీ ఇప్పుడెళ్ళి రాత్రి భోజనానికి రండి...

చలపతి: లేదండీ క్షమించాలి. ఒక స్నేహితునికి వాగ్దానం చేశాను. భోజనానికి వస్తానని. రేపు ప్రొద్దున్నే మళ్లీ తిరుగు ప్రయాణం.

బామ్మ: నీ ఇల్లు బంగారం కానూ, ఇంత దూరం వచ్చి ఒక్క పూట భోంచేయకుండా వెళ్తావుటయ్యా బాబూ.

చలపతి: మరేం ఫరవాలేదండీ అవ్వగారూ, క్షమించాలి. వస్తాను. వస్తానండీ...

ప్రకాశం: కారు తీసికెళ్లండీ.

చలపతి: థాంక్స్. అక్ఖరలేదు టాక్సీ వుంటుంది లెండి...

ప్రకాశం: అదేవిటమ్మాయ్! అలా సడన్‌గా వెళ్లిపోయాడే?

సరోజిని: ఏమో నాన్నా? నాకేం తెలుసూ?...

బామ్మ: ఏవిటో అమ్మా! నా కివేమీ అర్థం కావు...
(కొద్ది క్షణాల నిశ్శబ్దం, తర్వాత కిలకిలా నవ్వు)

సరోజ: ఎక్సెలెంట్, బావుంది సీను...

సరోజిని: అరే, సరోజా! నువ్విక్కడే వున్నావుటే?...ఎక్కడికో వెళ్తానన్నావుకదూ...

సరోజ; వెళ్తాలే. ఈ నాటకం చూడకుండానే...

సరోజ: టెలిఫోన్‌లో హలో! హోటల్ పేరడైజ్?...ప్లీజ్ కనెక్ట్ రూమ్ నెం. నైన్...హలో! చలపతిరావుగారా?... నమస్తే! నేను ప్రకాశంగారింటినుంచి మాట్లాడుతున్నాను. యస్, యస్, ఇందాక మీరొచ్చిపోయారే ఆ ప్రకాశం గారే...నేనాయాన కూతుర్ని... ఇవాళ సాయంత్రం క్వీన్స్ గార్డెన్స్ కొస్తారా? మీతో కొన్ని ముఖ్యవిషయాలు మాట్లాడాలి. తప్పకుండా వస్తారు కదూ? మెమోరియల్ స్టాట్యూ దగ్గిర కలుసుకుందాం. బై బై...

* * *

చలపతి: ఇంత పెద్ద గార్డెన్స్‌లో ఎక్కడని వెతకనూ?.. అబ్బ! ఈ పొగమంచొకటి, మనుషుల మొహాలే పోల్చుకో లేనందా వుంది.. మెమోరియల్ స్టాట్యూ అంటే ఇదే గామాల్ను, అక్కడెవరో అమ్మాయి వున్నట్లుందే ఆమే కాదు కదా? . అవును, ఆమే ..హలో! మిస్ సరూ!....

సరోజ: ఎవరూ?

చలపతి: నేనండి, నేను చలపతిని?

సరోజ: ఓహో నేనెవరో గుర్తుపట్టారా?

చలపతి: గుర్తుపట్టక పోవట మేవిటి? నాకు చత్వారం లేదు.

సరోజ: అయినా ఈ పొగమంచులో పొరబాటు పడొచ్చుగా ...?

చలపతి: ఛీ ఛీ! ఇదేం వేళాకోళం. నన్ను చిన్న పిల్లాణ్ణి చేసి ఆడిద్దామనుకున్నారా? ఇందుకేనా పిలిపించిందీ?....

సరోజ: అరెరే, ఇంతమాత్రానికి ఇంతకోపమా? శాంతించండి.... రండి! ఇలా కూచోండి ...చూడండి చలపతిరావుగారూ, నేను వేళాకోళానికి కాదు, చాలా సీరియస్‌గా మాట్లాడ్డానికే మిమ్మల్నిక్కడికి రమ్మన్నాను...

చలపతి: చెప్పండి.

సరోజ: కోపమంతా కక్కేసి శాంతంగా మాట్లాడాలి మరి....

చలపతి: నాకేకోపమూ లేదు, చెప్పండి.

సరోజ: ...బొంబాయి నించి మీరు ఇంతదూరం ప్రయాణం చేసి వచ్చారే దేనికోసమండీ?...

చలపతి:—దేనికోసమేవిటి, మీనాన్న పిలిపిస్తే నే వచ్చాను.

సరోజ:— అదే దేనికోసమూ అని...

చలపతి:— పెళ్లి సంబంధం చూసిపోదామని, అంటే మిమ్మల్ని చూసిపోదామని, సరేనా?...

సరోజ:— చూశారుగా, మరి మీ అభిప్రాయమేవిటీ?

చలపతి:— ... నిజం చెప్పమన్నారా? .. మీరు పొత్తిగర్విష్ఠులు....


సరోజ:. . కావచ్చు, అయితే?

చలపతి:— నాకీ సంబంధం అఖ్ఖర్లేదు.


సరోజ:— అదేవిటీ, నావ్యక్తిగత గుణానికి ఈ పెళ్లిచేరానికీ సంబంధమేవిటి?

చలపతి:— అంటే?....


సరోజ:— మీరు ఐ. ఏ. యస్. ప్యాసయారు. రేపో మాపో




మెదక్ జిల్లా సిద్దిపేట పంచాయతీ సమితికి డిశంబరు 22 వ తేదీని ప్రారంభోత్సవం జరిగింది. ఈ ఉత్సవానికి హాజరైన ప్రజలను పై చిత్రంలో చూడవచ్చు



అఖిలభారత కుష్టు నివారణ కార్యకర్తల ఎనిమిదవ సమావేశం జనవరి 6 వ తేదీన హైద్రాబాదు జూబిలీహాలులో జరిగింది. సదస్యులను ఈ చిత్రంలో చూడవచ్చు




ఉప రాష్ట్రపతి డాక్టర్ ఎస్. రాధాకృష్ణన్ జనవరి 4వ తేదీన తిరుపతిలో కేంద్రీయ సంస్కృత విద్యా పీఠానికి శంఖుస్థాపన చేశారు.




వరంగల్‌లో ఇటీవల ప్రవేశ పెట్టబడిన టూరిస్టు బస్సు.




దక్కన్ మిశ్రమజాతి మొక్కజొన్న. (86 వ పేజీ చూడుడు)




హైద్రాబాదులోని లాల్జీ మేఘ్జీ ఉన్నత పాఠశాల నూతన భవనానికి జనవరి 1వ తేదీన యూనియన్ ఆర్థిక మంత్రి శ్రీ మొరార్జీ దేశాయ్ ప్రారంభోత్సవం చేశారు.




మాచ్‌ఖండ్ విద్యుత్కేంద్రం ఒక దృశ్యం.




మునిసిపాలిటీల అధ్యక్షులు, కమీషనర్ల వార్షిక సమావేశాన్ని డిశంబరు 21వ తేదీన హైద్రాబాదులో ముఖ్యమంత్రి ప్రారంభించారు.




ప్రణాళికా సప్తాహం సందర్భంగా కడపలో జరిగిన "శ్రమదానం"లో అధికార్లు, అనధికార్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాల పథకం సలహా మండలికి డిశంబరు 23వ తేదీన హైద్రాబాదు సచివాలయంలోని కమిటీ హాలులో ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు.



యూనియన్ ఆర్థికమంత్రి శ్రీ మొరార్జీ దేశాయ్ జనవరి 1వ తేదీన హైద్రాబాదులో అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనాన్ని ప్రారంభించారు.




జూబిలీహాలులో డిశంబరు 16 వ తేదీన "మార్పుచెందుతున్న జిల్లాధికార్ల పాత్ర" అనే విషయంపై గోష్ఠి జరిగింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎడ్మినిస్ట్రేషన్ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ శాఖవారు ఈ గోష్ఠిని నిర్వహించారు.



సచివాలయం కమిటి హాలులో డిశంబరు 10 వ తేదీన సహకార వ్యవసాయం బోర్డు ప్రారంభోత్సవంలో ధర్మాదాయాలు, సహకార శాఖల మంత్రి శ్రీ కల్లూరి చంద్రమౌళి ప్రసంగించారు.

ఈ ప్రణాళిక ద్వారా మీకు
కలిగిన ప్రయోజనం



ప్రతి కుటుంబానికీ

రూ. 275 అదనంగా

మూడవ ప్రణాళిక పూర్తి అయేసరికి ప్రతి కుటుంబానికీ సాలుసరి సగటు ఆదాయం 1960—61లో వుండే రూ 1,650 కి బదులుగా రూ. 1,925 కి పెరుగుతుంది.

ఈ ప్రణాళిక విజయవంతము కావడానికి తోడ్పడి, తద్వారా మీ ఆదాయాన్ని అభివృద్ధిచేసుకోండి

మూడవ
పంచవర్ష
ప్రణాళిక

ప్రతి ఒక్కరికీ ఆనంద దాయకమైన జీవితం

DA 61/614

ఉద్యోగంలో చేరబోతున్నారు. ప్రకాశంగారు ఐ.సి.యస్. ఇండియా ప్రభుత్వంలో ఒక గొప్ప ఉద్యోగి. ఆయన ప్రాపకం వుంటే మీరు ఎంతైన పైకి రావచ్చని మీ ఆశ. ఐ. సి. యస్ ఆఫీసర్‌కి అల్లుడు కనీసం, ఐ. ఏ. యస్ ఆఫీసర్ ఐనా కాకపోతే ఆయనకీ నామోషీ. మీ ఇద్దరి స్వార్థాలమధ్య నన్ను కీలుబొమ్మలా వాడుకొందామని చూశారు. అలాంటప్పుడు, నేనెలాంటి దాన్నైతే ఏం? ఈ పెళ్లి బేరంలో నా వ్యక్తిగత గుణగణాలకు తావేదీ? నిజంగా నేనూ ఒక మనిషినై, నాకూ ఒక హృదయం. ఇష్టాయిష్టాలు అనేవి వుంటే కేవలం నా కోసమే నన్ను కోరి పెళ్లి చేసుకునే భర్తను ప్రేమించి పూజించగలను గాని, ఇతర్లంటే నాకేం గౌరవంవుంటుందో చెప్పండి?... అందుకే ఇవాళ అలా మోటుగా ప్రవర్తించాను మీకు కష్టంకలిగి వుంటుంది. క్షమించాలి మీ క్షమాపణ వేడు కోరడానికీ,సంజాయిషీ ఇచ్చుకోడానికిమాత్రమే మిమ్మల్ని పిలిచాను. వస్తాను, సెలవు......

చలపతి: అరెరే. ఆగండి, ఆగండి...మీరు చెప్ప దలుచుకున్న దంతా చెప్పేశారు. మరి నన్నుకూడా చెప్పనీండి...నేను మీరు అనుకున్నంత స్వార్థ పరుణ్ణి కాను ఓ ఉన్నతోద్యోగి కూతుర్ని పెళ్ళిచేసుకుందా మనుకున్నానంటే, మంచి సంస్కారంగల భార్య లభిస్తుందనే గాని నా స్వార్థంకోసం కాదు. నాకాళ్లపైనే నేను నిలబడాలని నాదృఢ సంకల్పం. మీనాన్నగారిని ఎప్పుడూ ఏవిధంగానూ వుపయోగించుకునే దురాశ నాకుఏకోశాన లేదని దైవసాక్షిగా చెప్పగలను.

సరోజ: మీరు కోరుకోక పోవొచ్చు. ఆయనే తన పరువు ప్రతిష్టల కోసం చెయ్యొచ్చు.

చలపతి: అలాంటి అవకాశం ఎప్పుడూ రానీయకుండా నా సర్వ శక్తులా ప్రయత్నం చేస్తాననికూడా వాగ్దానం చెయ్యగలను

సరోజ: అయితే నన్నే పెళ్ళి చేసుకోవాలని వుందన్నమాట.

చలపతి: మీకు అభ్యంతరం లేక పోతే...

సరోజ: మీరిప్పుడన్నదంతా అక్షరాలా విలబెట్టుకుంటానని చేతిలో చేయివేసి వాగ్దానం చెయ్యండి.

చలపతి: సరే, ఇదిగో. [చేతిలో చేయి వేస్తాడు]

సరోజ: ఈ వాగ్దానంతో బాటు మరో చిన్న త్యాగం చెయ్యాలి. రేపు మీ ప్రయాణం కట్టిపెట్టాలి. మనం ఇంకా ఎంతో మాట్లాడుకునేదుంది.

చలపతి: సరే, ఎప్పుడూ? ఎక్కడా?

సరోజ: ఇక్కడే, రేపు ఇదే సమయానికి .... వస్తాను, పొద్దు పోయింది, బయట డ్రైవరూ, కారూ వేట్ చేస్తుంటారు. బై ... బై ..

* * *

మెయిన్ బజార్ హడావిడి

చలపతి: (ఉత్సాహంగా) హలో! సరూ! ఇక్కడేం చేస్తున్నావ్?

సరోజిని: ఆఁ ఎవరూ?

చలపతి: నేను, సరూ! నేను ...

సరోజిని: ఓ మీరా? చలపతిరావుగారు కదూ?

చలపతి: అరే, అప్పుడే అంత మరుపా సరూ?....

సరోజిని: (తీవ్రంగా) ఎక్స్క్యూజ్‌మిమిస్టర్ చలపతిరావు: మీ ధోరణి నాకర్థం కావటం లేదు. ఈ ఏకవచన ప్రయోగమేవిఁటి?

చలపతి: అదేవిఁటి సరూ! నిన్న చేసుకున్న వాగ్దానాలన్నీ అప్పుడే మరిచిపోయావా సరూ ?

సరోజిని:(కోపంగా) వాగ్దానాలా ? ఏ వాగ్దానాలు ? ఏవిఁటి వాగుడు ?

చలపతి: నిన్ననేగా మనం క్వీన్స్ గార్డెన్స్‌లో......

సరోజిని: షటప్! యూ ఫూల్!... డ్రైవర్ కారు పోనీ...

(కారు తలుపు దభాలున వేసి కారు స్టార్టు చేసిన శబ్దం)

సరోజిని: (కోపంగా వస్తూ) నాన్నా! నాన్నా! ఆ బ్రూటు ఏం చేశాడో చూశావా ?...

ప్రకాశం:(ఆదుర్దాగా) ఆఁ! ఎవరమ్మా? ఏఁవయిందీ?...

సరోజిని: వాడేనాన్నా! నిన్న ఇక్కడికి రాలేదూ ? చలపతి...నడి బజార్లో 'సరూ, సరూ' అంటూ నా వెంటపడ్డాడు.

ప్రకాశం:(ఆశ్చర్యంతో) నిజంగానే ?....

సరోజిని:అవును నాన్నా! ఏవిఁటో వాగ్దానాలు, నిన్న మేము క్వీన్స్ గార్డెన్స్‌లో కలుసుకొన్నామట. ఏవిఁటేవిఁటో పిచ్చిగా వాగుతున్నాడు బ్రూట్.

సరోజ:(కిలకిలా నవ్వి) ఓహో ! అయితే బాగా పాకంలో పడ్డ దన్న మాట.

సరోజిని: (కోపంతో) ఛీ! నోర్ముయ్! ఏవిఁటా వాగుడు?

సరోజ: అదేవిఁటక్కయ్య నేనేం చేశానని...

ప్రకాశం: పొరపాటేమీ జరగలేదు కదమ్మా

సరోజిని: లేదు నానా: వాడే, తప్పకుండా వాడే

ప్రకాశం: ఏవిఁటో చిత్రం? ఆ అబ్బాయిలో అలాంటి లక్షణాలేవీ కనిపించలేదే?... పైగా ఇవాళ పొద్దునే వెళ్ళిపోతా నన్నాడు మరి

సరోజ: పొరపాటే నాన్నా! పొగమంచు పొరపాట్లే వుంటుంది. ఎవర్ని చూసి ఎవరనుకున్నదో... ....

సరోజిని: నాన్నా! నేను హైద్రాబాదు వెళ్ళిపోతున్నాను. రేపే ప్రయాణం

ప్రకాశం: అదేవిఁటమ్మా! అంత సడెన్‌గా

సరోజిని: నేనిక్కడ వుండలేను నాన్నా! ఏఁ చిన్నీ! నువ్వు వస్తావా?

సరోజ: తొందరేవిఁటి అక్కయ్యా: మరో నాలుగు రోజుల తర్వాత వెళ్ళొచ్చుగా?

సరోజిని: లేదు, రేపే వెళ్ళాలి. నీ ఇష్టం, నువు రాకపోతే నేను వెళ్తాను.

ప్రకాశం: అదేవిఁటమ్మా! ఇద్దరు కలిసే వెళ్ళాలి గాని ఒంటరిగా ఎట్లా వెళ్తారూ?

సరోజిని: అయితే రేపు మార్నింగ్ ట్రైన్‌కి సీట్స్ రిజర్వు చేయించేసేయ్ నాన్నా! ఆ అఖ్ఖర్లేదు, నేను బజారు వెళ్తున్నాను, నేనే చేయించేస్తాలే చిన్నాలే, తయారు కా. షాపింగ్ కెళ్దాం ఆ వెధవ కనిపించి ఏమీ కొన్లేక పోయాను....

సరోజ: ఫోనులో హల్లో! హల్లో! చలపతిరావుగారా? నేను సరూను మాట్లాడుతున్నాను అరెరె వినండి వినండి అంత కోపమేవిఁటి, కాస్త కూల్‌గా ఆలోచించండి, మీకే తెలుస్తుంది. ఎవరి పొరపాటో ఆ నడి బజారులో నన్ను 'సరూ, సరూ' అంటూ అంత చనువుగా ప్రవర్తిస్తే మా నాన్న పరువు ప్రతిష్ఠ ఏమై పోను అందరూ ఏమనుకుంటారు? అక్కడే మా డ్రైవరు కూడా వున్నాడు. మీరలా తొందరపడితే ఎలాగా? అందుకే నేనలా బిహేవ్ చేశాను. క్షమించాలి. నేనన్న మాటలన్నీ విత్‌డ్రా చేసుకుంటున్నాను, విత్ ఎపాలజీస్. క్షమిస్తారు కదూ, మీరు చాలా మంచివారు! నాకు తెలుసు క్షమిస్తారని. హల్లో మరో ముఖ్య విషయం నేను రేపే హైద్రాబాదు తిరిగి వెళ్ళిపోతున్నాను. అదేమిటో మా నాన్న అలా సడెన్‌గా నిర్ణయం చేశారు. ఇప్పుడెళ్లి సీట్ రిజర్వ్ చేయిస్తున్నాం. ఇవాళ సాయంత్రం మిమ్మల్ని కలుసుకోలేను నాన్న షాపింగ్‌కి తీసుకెళ్తున్నాడు. వచ్చేసరికి రాత్రయిపోతుంది. క్షమించాలి. మీ బొంబాయి అడ్రసుకు లెటర్స్ రాస్తాగా.... ఏవిఁటీ, మీరూ రేపటి ట్రెయినుకే బయలుదేరుతారా? కాని బొంబాయికి కదూ, అవునవును ఢిల్లీ వరకూ ఒకే ట్రైన్ కదూ, సంతోషం. తప్పకుండా రండి అడిగో నాన్న పిలుస్తున్నారు. వస్తా. బై, బై....

(రైలు కూత, విజిల్, స్టార్ట్‌అయి నడుస్తూన్న శబ్దం)

సరోజిని:(ఎక్సైటెడ్‌గా) చిన్నీ! చిన్నీ! చూశావా! వాడే... వాడేనే

సరోజ: ఏవిఁటక్కయ్యా? ఏవిఁటి?

సరోజిని: వాడేనే మొన్న మనింటికి రాలా, వాడు ఇంకా మనల్నే వెంబడిస్తున్నాడు...

సరోజ: నీ పిచ్చి గాని మనల్ని వెంబడించేదేవిఁటే, రైల్లో ప్రయాణం చేస్తోంటే?

సరోజిని: రైల్లోనేనే...అదిగో ఆ వెనక డబ్బాలో నిలుచుని చేయి వూపుతున్నాడు అమ్మా ఎంతకైనా తగును వాడు! అప్పుడే అనుమానం వేసింది, ప్లాటుఫారం పైనే దూరంగా కనుపించాడు. కాని వాడు కాదేమో ననుకుని వూరుకున్నాను. అప్పుడే నాన్నకు చెప్పాల్సింది....

సరోజ: ఏదీ నన్ను చూడనీ... అవును, అతనే... (పెద్దగా నవ్వి) ఇకనే మీ ప్రణయం ధూమశకటవేగంతో ప్రయాణం చేస్తోందన్న మాట....

సరోజిని: ఛీ! ఆ వెధవతోనా ప్రణయం?

సరోజ: ఏఁవయిందమ్మా అతనికి?....

సరోజిని: ఇంకా ఏంకావాలేవిఁటి, ఒట్టి స్టుపిడ్ ఫెలో కాకపోతే, నడిబజార్లో నన్నలా అవమానపరుస్తాడా? అనాడు అన్ని చీవాట్లు పెట్టినా, సిగ్గులేక మళ్ళీ ఇప్పుడు వెంబడిస్తాడా?

సరోజ: ఏమో, నాన్న అన్నట్టు నిజంగా ఏదేనా పొరపాటు జరి

గిందేమో .. నీ పోలికలున్న మరొక అమ్మాయినీ పేరెట్టుకువెళ్లి క్వీన్స్‌గార్డెన్స్‌లో అతనితో రొమాన్సు నడిపించిందేమో. నువ్వేఅనుకుని అతను భ్రమలోపడ్డాడేమో,

సరోజిని: ఏవిఁటే కవిత్వమూ ? ..

సరోజ: మరి నీకెందుకే అంత గర్వమూ ? అతనికేఁలోటనీ ? ఐ. ఎ. యస్. ప్యాసయాడు రేపు నాన్న అంతటి గొప్ప ఉద్యోగి కావచ్చు, అందమైనవాడు, ఈడుజోడైన వాడు, బామ్మ అన్నట్టు మీరిద్దరూ చిలకా గోరెంకల్లాగా ఏఁచక్కా కాపరం చెయ్యొచ్చు .

సరోజిని: అబ్బో! ఒక్కసారే పొగడేస్తున్నావే .. పోనీ నువ్వే ఆ చిలకవు కారాదూ ?

సరోజ: ఏమో, నిజంగానే అవుతానేమో, ఆఖరికి అక్కమొగుడే దిక్కన్న సామెత లేదూ! .. కాని, నా సఁగతి కాదు, నీ సంగతి చెప్పు. అతణ్ణి ఎందుకు చేసుకోవు ?

సలోజిని: నా కిష్టం లేదు.

సరోజ: మరెవరిపై నుంది ?

సరోజిని:నీకెందుకే అవన్నీనీ .. ....

సరోజ: నన్ను చిన్నపిల్లలా తోసిపుచ్చను, నీ రహస్యాలేవీ నా దగ్గర దాగవులే ..

సరోజిని: ఏవిఁటే ఆ రహస్యాలూ ?

సరోజ: నీ సూటుకేసు తాళాలు ఇలా తే చూపిస్తాను.

సరోజిని: ఏవిఁటే నువు చూపించేదీ ?

సరోజ: నువు నాన్నకు రాసిన వుత్తరాలు. ఒకటి కాదు, నాలుగు "నాన్నా నేనూ, రాధాకృష్ణ ప్రేమించుకున్నాం, నేను రాధాకృష్ణను తప్ప మరొకార్ని పెళ్ళి చేసుకోలేను" అని ధైర్యం చాలక ఒక్కటీ పోస్టు చేయ్యలేదు. అవునా?

సరోజిని:అయితే నువ్వీ దొంగపనులు కూడా నేర్చావన్నమాట.

సరోజ: అదుగో మళ్ళీ మధ్య నా ప్రశంసెందుకూ?....ఆ రాధాకృష్ణ ఎవరో నాకు తెలీదు. కాని నిజంగా నువు అతణ్ణి ప్రేమించి, పెళ్ళిచేసుకో నిశ్చయించుకుంటే, ఈ ముసుగులో గుద్దులాట మానేయ్, ధైర్యంగా నాన్నతో చెప్పేయ్ కావాలంటే నేను రాస్తాను నాన్నకు . ఏమంటావ్ ?. (రైలు కూత) అదుగో మరో స్టేషన్ వస్తోన్నట్లుంది. నేనీ మూలకూర్చుని పేపరడ్డం పెట్టుకుంటాను. నీ హీరో వస్తే రావచ్చు....

సరోజిని: ఆఁ వస్తాడు; రానీ, చెప్పుచ్చుకుంటాను.

సరోజ: అంత పనిమాత్రం చేయకు అక్కయ్యోయ్, అనవసరంగా అల్లరిపాలవుతాం.

(రైలు స్టేషనులో ఆగిన శబ్దం—హడావిడి)

చలపతి: పరుగెత్తుకుంటూ వచ్చి హలో! సరూ! హియర్ ఐ యామ్!....

సరోజిని:ఆఁ ఎవరదీ ?.... ఏయ్ నీకు బుద్ధిలేదూ ? మళ్ళీ వచ్చావా?....

చలపతి: ఒక్కసారి నిశ్చేష్టుడై ఓ! మైగాడ్! మళ్ళీ ఇదే మార్పు! (తగ్గు స్వరంలో, రహస్యంగా) ఆ రెండో అమ్మాయి వుందని కాదు కదా ?

సరోజిని: నోర్మూయ్! ఇక్కడ్నించి కదులుతావా లేదా ? గార్డ్‌ని పిలిపించి ...

చలపతి:(వెళ్తూ) ఛీ! ఛీ! ఈ ఆడవాళ్ళని నమ్మరాదు...

సరోజ: (పేపరు తొలగించి, పెద్దగా నవ్వుతూ) ఏఁవండోయ్ చలపతిరావుగారూ! ఆగండి ఆగండి .. నన్ను పోల్చుకోలేదూ? నేనండీ "సరూనీ", అనవసరంగా మా అక్కయ్యని కంగారు పెడుతున్నారే...?

చలపతి: ఆఁ? అక్కయ్యా?...

సరోజ: అవును, ఇలా లోపలికొచ్చి కూచోండి.

సరోజిని: ఛీస్సీ! ఏవిఁటే ఇదంతా ?

సరోజ: నువ్వుండక్కయ్యా! చెబుతాగా ...రండి చలపతిరావుగారూ మరేం ఫరవాలేదు రండి....ఇదిగో చూడండి చలపతిరావుగారూ! నా పేరు సరోజ, ఈమె మా అక్కయ్య సరోజినీ ప్రకాశంగారి కూతుళ్ళం ఇద్దరికీ పెళ్ళీడు వచ్చినా, మా అక్కయ్య పెద్దది కాబట్టి ప్రస్తుతం ఆమె పెళ్ళి ప్రయత్నాలే జరుగుతున్నాయ్. ఆ సందర్భంలోనే మీరు మా ఇంటికి వచ్చారు. అయితే, మా అక్కయ్యకు కాస్త సిగ్గు మాల పైన మోజెక్కువ. దాంతో కొంత రొమాన్సులోకి దిగింది. ఒక మజ్నూ కూడా తయారయాడు....

సరోజిని: చిన్నీ!

సరోజ: ఉండక్కయ్యా, తొందరపడకు. విన్నేమీ స్టాంప్ వెయ్యనులే... విన్నారూ? ఈ రైలా ఆ మజ్నూను తప్ప మరో హార్ని ప్రేమించటానికి వీల్లేదు కాబట్టి, మరొహార్ని పెళ్లి చేసుకునే ప్రశ్న రాదు. అయినా నాన్నమాట తోసిపుచ్చలేక మీ పెళ్లి చూపులకి మాత్రం ఒప్పుకుంది అంతే... ఇక నేనో, అలాంటి రొమాన్సు లేవి నోచుకోని అభాగ్యురాలిని. మీ విషయం విన్నాక మిమ్మల్ని చూశాక, మీతో ఒక మంచి భర్త అయ్యే సులక్షణాలు కనిపించి, మీ భార్యనైతే బావుండుననిపించింది. స్వయం కృషిలోనే ఎక్కువ నమ్మకం ఉంది కాబట్టి, అక్కయ్య పేరిట కొంత నాటకం ఆడి, మొన్న మీ చేత కొన్ని వాగ్దానాలు చేయించుకున్నాను ఇదీ సంగతి, ఇప్పటికీ మించి పోయిందేమీ లేదు. మీరు సత్యహరిశ్చంద్రులు కాబట్టి నన్నే పెళ్లి చేసుకుంటామని చేసిన వాగ్దానం పైన నిలవనక్కరలేదు. నా హృదయ సంచలనం కూడా ఆగిపోదు. పోనీ, పరవాలేదు, పెళ్లి చేసుకుందాం అంటే నాకు అభ్యంతరం లేదు. [రైలుకూత] అదిగో రైలు కదలబోతోంది, చెప్పండి. జీవితయాత్ర మనం కలిసే ప్రయాణం చేద్దామా, లేక మీ కంపార్టుమెంటు మీకూ, నా కంపార్టుమెంటు నాకూనా?—[రైలు కదిలి నడుస్తూంటుంది] ఏఁవిటి? ఇక్కడే కూచుండిపోయారే?—అక్కయ్యా గెలుపు నాదే—

[రైలు కూత, వేగంగా రైలునడక—ఫేడవుట్]



రచయితలకు మనవి

అనేక మంది రచయితలు తమ రచనలు పంపిన తరువాత ఒక్క నెలన్నా గడవక ముందే మా రచనలు ప్రచురించేది లేనిది తెలియజేయవలసిందిగా కోరుతూ ఉత్తరాలమీద ఉత్తరాలు వ్రాస్తున్నారు. రచన ప్రచురణార్హం అయ్యేది కానిది తెలపడానికి కనీసం మూడు నెలలైనా వ్యవధి కావాలి. ఈ మాత్రమైనా వ్యవధి లేకుండా సమాధానం వ్రాయడం సాధ్యపడదు. ఈ విషయంలో రచయితలు కూడా మాతో సహకరించాలని కోరుతున్నాము.

ఎడిటర్
ఆంధ్ర ప్రదేశ్ (తెలుగు)

విశేషాలు

వీరోచిత కృత్యానికి అవార్డు

శ్రీకాకుళం పట్టణ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ శ్రీ పి. కొండలరావుకు ధైర్య సాహసాలు ప్రదర్శించినందుకు ప్రెసిడెంటు పతకం లభించింది. ఆత్మ రక్షణను లెక్క చేయకుండా తన విధ్యుక్త ధర్మ నిర్వహణలో చూపిన అసమాన ధైర్య సాహసానికి యీ పతకం యిచ్చారు.

ప్రణాళికాబద్ధమైన ప్రగతి

"మహారాష్ట్ర, మద్రాసు రాష్ట్రాలు మినహా రెండవ ప్రణాళికా అంచనాలను అందుకున్నది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒక్కటే.

లఘు పరిశ్రమలు, గనులు, చేతి పరిశ్రమలు చిన్న పరిశ్రమాభివృద్ధి కార్పొరేషనుల నెలకొల్పి, సహజసంపదలు విస్తారంగా లభించే యీ ప్రాంతంలోని పరిశ్రమాభివృద్ధికి దోహదం చేశారు.

"రాష్ట్రంలోని 8 పారిశ్రామిక వాటికల పారిశ్రామికులకు ఋణాలు మంజూరు చేయడంతోపాటు, భూమి, నీరు, విద్యుచ్ఛక్తి సరఫరా, రాకపోకల సౌకర్యాలను కలిగించి ప్రభుత్వం తగు విధంగా ప్రోత్సహిస్తున్నది. ఋణాలు యివ్వడమేగాక, కళాకారులకు శిక్షణ వసతుల కలిగించి, చేతి పనులు, చేనేత, పీచు మొదలగు గ్రామీణ పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నారు. రాష్ట్రంలో యీ అభివృద్ధి ప్రణాళికా బద్ధంగా నిర్వహింపబడుతూ వుంది. తమ భవిష్యత్తును దృష్టిలో వుంచుకొని ప్రజలు కూడా ఉత్సాహంగా యీ కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. అని ఫైనాన్షియల్ యెక్స్‌ప్రెసు 1961 డిసెంబరు 24వ తేదీ సంచిక సంపాదకీయంలో ఉదహరించారు.

లవంగి జగన్నాథము

శ్రీ శ్రీపాద లక్ష్మీనారాయణ మూర్తి

వివిధ దేశానీత విమలప్రబోధన
　　దివ్యవాసనలు నల్దెసలు నిండ
సానురాగాహూత సామంతమకుట ర
　　త్నానీకరుచి తళత్తళలు గుల్కియ
జీవద్రుమాస్పద శిల్పచిత్రక కళా
　　సంపత్తి చక్షురుత్సవము గూర్ప
సంస్కృతాద్యఖిల భాషాకవీశ్వర విమ
　　ర్శకపండితాళి యలంకరింప

రాజ్యతంత్రజ్ఞశేముషీ భ్రాజమాన
సచివులు వసింపగా బృహస్పతిని మించి;
నిరుపమానప్రభారమణీయ మయ్యె
షాజహాన్ చక్రవర్తి ఆస్థానసీమ

అదిఢిల్లీ మొగలాయిరాజుల అఖండైశ్వర్య శోభాకరమా
స్పదమౌకోట; సమస్త పండితులకున్ సత్కారముంజేయగా
మదినూహించిన షాజహాను ముదలన్ మాణిక్యరత్నాదులం
బదిలంబొప్ప లవంగి గైకొనుచు తత్పార్శ్వస్థయై కన్పడెన్

అది ఫాలభాగమా? విదితసంధ్యారాగ
　　సంశోభితవ్యోమ చంద్రరేఖ!
అది నేత్రయుగ్మమా? ఉదిత ప్రభాకర
　　దర్శనోత్ఫుల్ల పద్మద్వయమ్ము!
అది తనూవల్లియా? మదనసామ్రాజ్య సం
　　స్థాపనోద్యన్నవ్య జయపతాక!

అది మందహాసమా? హృదయాంధకారదూ
రీకృత్ప్ర పూర్ణచాంద్రీ విభూతి!

అది వచోరామణీయకమా? సమస్త
యువజనారాధ్య మధురపీయూషధార!
అనుచునెల్లరు కొనియాడ నా యౌవనాంగి
సభను నిలిచె లవంగి వీక్షణకురంగి!

ర॥ మాజన్మదినోత్సవావసర మందిచ్ఛోసమావిష్టులై
ప్రేమంజూపిన మీకుస్వాగత మిదే విఖ్యాతవిద్వత్కవుల్!
హేమామూల్యదుకూల రత్నతతితో నేనుంగు లశ్వంబులున్
భూముల్ మీకొసగందలంచితిమి మమ్మున్ ధన్యులంజేయరే

అనికడు గౌరవమ్మున ధరాధిపుడచ్చటివారికిన్ ముదం
బునుకలిగించి చంద్రునకు బోగుగ నీయదొడంగి సద్యలో
ఘనులగు నొక్కరొక్కరికి గాన్కల; పండితరాయలంగనుం
గొని తమకేదికావలెనో కోరుకొనుండని వేడెభక్తితో.

ఆరూపులో కట్టుతీరులో నచ్చమై
వెలుగొందుచున్నట్టి తెలుగుదనము,
ఆవాదపటిమలో భావనాద్రఢిమలో
దండిగానిండిన తర్కశక్తి,
ఆగ్రంథరచనలో వాగ్రసస్ఫూర్తిలో
మెఱయుచున్నట్టి బ్రాహ్మీవిభూతి,
ఆకార్యదీక్షలో చేకొన్నపదవిలో
ప్రస్ఫుటించెడు నంతరంగశుద్ధి,

తనరునాతడు "ముంగండ" జనపదమ్ము
నుండివచ్చు జగన్నాథ పండితుండు
భూతలాధీశ్వరాస్థాన భూషణుండు
అఖిలవిమత కవీభవ పంచాననుండు.

సతిచూపుల్ తనవీక్షణమ్ములు రహస్యమ్మేమి? భాషించెనో
సతిలేనవ్వుల సిగ్గుదొంతరల భాషల్ స్పష్టమెట్లయ్యెనో?
సతివ్రీడావనతాననేందిర నిజస్వాంతమ్మునన్ నిల్చెనో
అతడాత్మన్ కృతనిశ్చయుండగుచు నభ్యర్థించె ధాత్రీశ్వరున్

వద్దు కరీంద్రయూథములు, వద్దు జవాన్విత వాజిరాజులున్
వద్దు దుకూల హేమములు, వద్దు పొలాలును రత్నహారముల్
దిద్దినబొమ్మవోలె మదదృష్టపు దేవతయైతనర్చుని
మ్ముద్దియ నీయగోరెద ప్రఫూతలతాంగి లవంగినోప్రభూ!

అందమె దైవమందమె యథార్థముకావున నింపుసందమా
నందము దెందమందను ససన్యసుసాధ్య రసైకవేత్తయౌ
సుందరమూర్తి ఆయవనసుందరి నిమ్మనివేడ రాజసం
క్రందను దందుకియ్యకొనె; రంజిలి రెంతయు ప్రేయసీ ప్రియుల్

సతిపాణిన్ గ్రహియించె జాతిమతభాషా సాంప్రదాయాది భి
న్నతలొక్కించుక లెక్కసేయక జగన్నాథుండు ధైర్యమ్ముతో;
గతజన్మమ్ముల నెన్నిటంబ్రణయ మాంగల్యంబు వారిర్వురన్
జతగాగూర్చెనొ యంచుప్రేక్షకులకున్ సంతోషముప్పొంగగా.

అతడు కళానిధి సతతమాతనిని బా
యక వెల్గునిచ్చు చంద్రిక లవంగి
అతడు రసాంభోధి అతని సాంగత్యాన
తనివొందగల రసధుని లవంగి
అతడుషట్పదవరుండతనికి మకరంద
పరిమళమ్ములొసంగు విరి లవంగి
అతడు కవీశ్వరుండతని కావ్యమ్ముల
నమరత్వమొందు భావము లవంగి

అతడు గృహమేధి యతని జీవితమునెల్ల
అతిపవిత్రమ్మొనర్చెడు సతి లవంగి
దినమొక క్షణమ్ముగా కాలమునుగడుపుచు
సుతులఁ బడసిన పుణ్యదంపతులు వారు.

అతిపవినిర్మల ప్రణయ మందతిలోక రసానుభూతి పం
డితునకు గల్గనాతనికి నిత్యము సేవలుచేయుదీక్షలో
సతి బ్రతుకెల్ల ధన్యమయి సంతసమందగ దివ్యదంపతుల్
క్షితి నవతార మెత్తిరని చెప్పికొనంగ దొడంగి రెల్లరున్.

శచి లవంగియు దివస్పతిరాయలందమా
ఆతని జారత్వమడ్డువచ్చు
సిరి లవంగియును శ్రీహరి రాయలందమా
ఆమె చంచలవాసమడ్డువచ్చు
రతి లవంగియును తత్పతి రాయలందమా
అతని యసంగత అడ్డువచ్చు.
ఉమ లవంగి పురారియును రాయలందమా
ఆమె సపత్నీత్వ మడ్డువచ్చు

ననుచు జనులెల్లరును మెచ్చుకొనెడు రీతి.
నాలవంగీజగన్నాథు లనవరతము
రమ్య హర్మ్య స్థల సుందరా రామములను
బి: సిరాదర్శ దాంపత్య వైభవంబు.

ఒరులు సుఖించుచుండగని యోర్వక తప్పులనెన్నుటే మహా
త్తరమగు కార్యమంచు, విగతార్థములైనను సాంప్రదాయముల్
స్థిరమని నమ్మి సంఘము విధించెడు నాంక్షకు రాయలున్ మనో
హరియగు నాలవంగి గురియైరొక కొన్ని దినమ్ము లేగగా,

పురుషార్థమ్ములలోన మూడవదియే ముఖ్యంబుగా నెంచి భూ
సురవంశమ్మునకుం గళంకముగ నీచుండై తురుష్కాంగనన్
వరియింపంగ తెగించినాడని జగన్నాథున్ బహిష్కారదు
ర్భర శిక్షార్హుని జేసె సంఘమతి మూర్ఖంబై ప్రవర్తించుచున్

ఈ రీతిన్ దనకై మహీసుర వరుండిక్కట్లపాలై బహి
ష్కారమ్ముం బడయన్ లవంగి పటుదుఃఖాక్రాంతచేతస్కయై
ఊరుంబేరును లేక రాచకొలువందున్నట్టి తానేడ? నా
నా రాజార్చితుడాతడేడ? యనుచున్ దర్కించు యోచించుచున్

విన్నదనంబు దోపగ కవీశ్వరు మ్రోలను నిల్చె; నాతడున్
కన్నుల నీరు నింపుకొని కాంతను గన్గొని తన్మనోగతం
బున్నిఖిలంబెఱింగి ప్రియముం జనవున్ దళుకొత్త బల్కెనో
అన్నులమిన్న! బేలవయి ఆరడిచెందగ నేల దీనికిన్?

చిఱునవ్వు తాండవించెడు ముద్దునెమ్మోము
గలనీవు నాచెంత నిలిచియుండ
నెదఁబారవశ్యంబు నొదపించు సౌందర్య
ఖనివైన నీవు చెంతను వసింప
పలుకులో నమృతంబు నొలికింపగలనీవు
నాదానివగుచు సంతసముగూర్ప
నవనీతతుల్య మార్దవముతోనిండారు
నీనెమ్మదిని నాకు స్థానమొసగ

నింతకంటె సంతృప్తమింకేమిగలదు?
ఎన్ని జన్మాలలోన గావించినట్టి
పుణ్యము ఫలించెనో నిన్నుబొందగంటి;
సంఘమునుజూచి భయమేల? చాన! నీకు

సంకుచితస్వభావులగు స్వార్థపరుల్ సృజియించుకొన్న యీ
పంకిల సంఘమిట్టి అపవాదులు వేయుటలో రవంతయున్
జంకదు: ధిక్కరించి మనజాలిన వారికి నంజలించు; ప్రే
మాంకిత దివ్యజీవులము మానిని చింతిలనేల యీగతిన్.

కులమతజాతిభేదములకున్ నిలయమ్మగు నీ శరీరముల్
తొలగినవెన్క సత్యమయితోచెడు నాత్మలకీ విభేదముల్
కలుగునె? మూఢమానవులు కానగజాలని ప్రేమరాజ్యపున్
వెలుగులు లభ్యమై వేయివిధమ్ముల హాయిగూర్చెడున్

శిష్టధరామరున్ సుకవిశేఖరుఁ బండితరాయులన్ గుల
భ్రష్టునిజేసినట్టి యొకపాతకిగా ననుగూర్చి ముందుముం
దిష్టమువచ్చినట్లు జనులెల్లరు పల్కుచు నిందమోపరే?
దుష్టజగమ్ము నందనుచు తొయ్యలి ఏడ్వగ నాతడిట్లనెన్,

వంతయొకింతయున్ వలదు వారిజపత్రవిశాలనేత్ర! నీ
వెంతపవిత్రశీలవొ మహీజనులెల్లరు నమ్మగా నిరూ
పింతును; త్వత్కరగ్రహణమెంతటి యున్నతి నాకుగూర్చెనో
అంతయుజూచి విస్మయమునందుచు మెచ్చుకొనంగహెచ్చుగా.

తానెంత సంస్కర్త యైనను యవన సుం
దరిని జేపట్టుట ధర్మమగునె
శారీరకమ్మైన సౌందర్యమును గాంచి
వ్యామోహ పడుట సంభావ్యమగునె
కులమతాచార నిష్ఠల కనర్హమ్మైన
బ్రతుకుసాఫల్యమ్ము పడయగలదె
పురుషార్థములో నమూల్యమైనట్టి మో
క్షము నిట్లు జీవించి కాంచనగునె

అనిలవంగి లతాంగి పల్కినదికూడ
సత్యమని రాయలు గ్రహింపజాలె తుదకు;
సకల పాపోపశమనమ్ము జరుగునంచు
చేరి రాప్రేయసీ ప్రియుల్ వారణాశి.

క్రీడించె నేతరంగిణి వియత్పథమున
తొలుదొల్త దివ్యసంస్తుత్యయగుచు
ప్రణయాన నేతరంగిణి మహేశ్వరుజటా
జూటమ్మునకు వింతసొబగుగూర్చె
కృపజూపి యేతరంగిణి భగీరథుతాత
ముత్తాతలకు స్వర్గమునుఘటించె
అణగించె నేతరంగిణి బ్రహ్మహత్యాది
పాపసంతతి నిజస్పర్శవలన

తనపవిత్ర జలాల నే ధుని సమస్త
భరతదేశమ్మును పవిత్రతర మొనర్చె
నట్టిపుణ్యంపు నదిని రాయలులవంగి
కాంచిమురిసిరి కన్నుల కరువుదీర.

స్నానార్థంబరుదెంచు దంపతుల యుత్సాహంబు వీక్షించి ప్రా
చీనాచారపరుల్ పురప్రముఖులాక్షేపించిరీ తుచ్ఛపున్
మేనుల్ సోకగ నీపవిత్రజలముల్...మ్లేచ్ఛత్వముం బొందు; దూ
రానన్ నిల్వుడు చేరరాకుడని మూర్ఖత్వంబు రూపింపగా

పరమపవిత్రమౌ ప్రణయబంధము అర్థముకాని మూర్ఖులౌ
నరులకు నచ్చజెప్పజతనమ్ము వృధాయని నిశ్చయించి అ
య్యెరువదిమెట్లగట్టుపయి సంగనతో నిలుచుండిసత్కవీ
శ్వరుడు నుతింపగాదొడగె జాహ్నవి నాశుకవిత్వ సంపదన్.

వసుధామండలికిన్ సమృద్ధయగు సౌభాగ్యమ్ము;లో కాలగ్రై
వసముంజేసికొనంగ జాలుశివునై శ్వర్యమ్ము; వేదాలలో
పిసలౌసారము: దేవతాళి సుకృత శ్రీరూపమంచత్ సుధా
రసమౌ నీజలమందు మావృజిన మెల్లన్ క్షాళితంబయ్యెడిన్


ప్రాతఃకాలమునన్ మృగీమదల సద్వక్షోజసౌందర్యవై
నీతోయమ్ముల స్నానమాడు వనితానీకమ్ముతోతన్మ ఏగ
వ్రాతమ్ముల్ విమలాంగయుక్తముగ స్వర్గమ్మున్ ప్రవేశించునో
మాతా! నీ అసమానమైనకరుణన్ మాపై ప్రసారింపుమా

భూసుర వంశగౌరవము బూడిద పాలొనరించి గర్వినై
చేసినపాపమంతయు నశించును నీకృపనంచు నమ్మితిన్
నీసరియెవ్వరమ్మ? కరుణించి కృతార్థుని జేయుమీపరీ
క్షసమయాన నీవు ననుగాదనినన్ మఱి నిస్సహాయుడన్.

ఒక్కొకపద్యమిట్లు మధురోక్తుల నాశువునన్ పఠింపగా
నొక్కొకమెట్టు ప్రేక్షక జనోత్కర మచ్చెరు వందనెక్కుచున్
దిక్కులయందు దివ్యమగు తేజము నిండగ పుష్పవృష్టిలో
నక్కునజేర్చె గంగవిమలాంగి లవంగిని తన్మనోహరున్.

ఏలలితాంగి పాణిగ్రహించి కులంబున భ్రష్టుడయ్యెనో
ఆలలితాంగికోసమయి అత్యధికమ్మగు భక్తితోడ గం
గాలహరిన్ రచింపగ జగమ్ములు కేల్మొగిడ్చి మెచ్చ, గం,
గాలహరిన్ పునీతులవగల్గిరి నిక్కపుప్రేమ శక్తిచే,

వలచి మనస్సునిచ్చి తనభాగ్యమునాథుడె యంచు నమ్మికం
దలచి వరించినట్టి వనితంబ్రతికూలతలెన్నివచ్చినన్
గలగక జీవితాంతమును గాటపు ప్రేముడి నాదరించుటల్
తెలుగుల లక్షణంబనుచు తెల్లముజేసెను రాయలీగతిన్



ప్రగతిపథంలో

(జిల్లాల నుంచి అందిన వివిధ అభివృద్ధి కార్య క్రమాలను గురించిన సంక్షిప్త వార్తలు)

ఆదిలాబాద్

మత్స్య పరిశ్రమాభివృద్ధి

తెలంగాణా ప్రాంతంలో మత్స్య పరిశ్రమాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తృతీయ ప్రణాళికలో 21 లక్షల రూపాయలను ప్రత్యేకించింది. ఇందుకై ఆదిలాబాద్ జిల్లాలో పథకాల అమలుకు 2.23 లక్షల రూపాయలను కేటాయించారు. దీనితో మత్స్య పరిశ్రమ 70 టన్నుల నుంచి 80 టన్నులకు పెరుగుతుంది.

అనంతపురం

హరిజన దినోత్సవం

ముదిగుబ్బ పంచాయతీ సమితిలోని ఉప్పలపాడులో 1961 నవంబర్ 30 వ తేదీన హరిజన దినోత్సవం జరిగింది. ఈ సందర్భంలో పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో 130 మంది ప్రజలు పాల్గొన్నారు.

చిత్తూరు

శ్రమదానంద్వారా రోడ్డు నిర్మాణం

మదనపల్లి సమితికి చెందిన కోటవారి పల్లె వద్ద 1961 నవంబర్ ఒకటవ తేదీన రెండు మైళ్ళ పొడవుగల రోడ్డును శ్రమదానంతో నిర్మించారు.

తూర్పు గోదావరి

1200 ఎకరాల బంజరుభూమి పంపకం

శంకవరం పంచాయతీ సమితిలో కటిపురి గ్రామంలో 1961 డిసెంబర్‌లో జరిగిన ఒక ప్రత్యేకోత్సవంలో భూమిలేని పేదవారికి బంజరు భూముల పట్టాలనిచ్చారు. 16 గ్రామాలకు చెందిన 240 నిరుపేదలకు 1200 ఎకరాలను పంచిపెట్టారు.

చేపల పంపకం

బలవర్ధకాహారం అవసరమైన స్త్రీలకు, పిల్లలకు ఉచితంగా చేపలను పంచి పెట్టే కార్యక్రమాన్ని కొత్తపేట పంచాయతీ సమితిలోని ర్యాలి గ్రామంలో 1961 డిసెంబర్ నెలలో ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యం క్రింద విస్తృత బలవర్ధకాహార కార్యక్రమం సాగుతున్నది. ఈ కార్యక్రమానికి "యునిసెఫ్" సహాయం లభిస్తున్నది.

రాజమండ్రికి మత్స్యపరిశ్రమ శిక్షితుల రాక

కలకత్తాలోని కేంద్ర మత్స్య పరిశ్రమ సంస్థలో శిక్షణ పొందుతున్న 38 మంది విద్యార్థులు డిసెంబర్ 13 వ తేదీన రాజమండ్రి వచ్చారు. వారి వెంట ట్రైనింగ్ సూపరింటెండెంట్లు కూడా వున్నారు. ఈ బృందం రాష్ట్ర మత్స్య పరిశ్రమ సంస్థను, మత్స్య పరిశ్రమకు ముఖ్యమైన కాకినాడవంటి ప్రాంతాలను కూడా సందర్శించింది.

సహకార చక్కెర ఫ్యాక్టరీ

తునిలో సహకార చక్కెర ఫ్యాక్టరీకి ముఖ్యమంత్రి శ్రీ డి. సంజీవయ్య జనవరి 9 వ తేదీన ప్రారంభోత్సవం జరిపారు. ఈ ఫ్యాక్టరీ తాండవ సహకార వ్యవసాయ పారిశ్రామిక సంఘం క్రింద వుంది భవనాల నిర్మాణానికి, ఇతర సామగ్రి స్థాపనకు ఇంతవరకు 27 లక్షల రూపాయలను ఖర్చు చేశారు.

సత్యనారాయణ సాగర్

అన్నవరం వద్ద పంపా రిజర్వాయర్ ప్రాజెక్టుకు పబ్లిక్ వర్క్సు మంత్రి శ్రీ అల్లూరి సత్యనారాయణ రాజు జనవరి 9 వ తేదీన ప్రారంభోత్సవం చేశారు. 34 లక్షల రూపాయల ఖర్చు అయ్యే ఈ ప్రాజెక్టు పూర్తిఅయిన తర్వాత 8 వేల ఎకరాలకు నీటి సౌకర్యం లభిస్తుంది. అన్నవరం వద్ద శ్రీ సత్యనారాయణ స్వామి పేరుతో దీనికి సత్యనారాయణసాగర్ అని పేరు పెట్టారు.

గుంటూరు

బాలికల ఎ. సి. సి శిబిరం

1962 జనవరి రెండవ వారంలో అమరావతి వద్ద ఎ. సి. సి. సోషల్ సర్వీస్ శిబిరం ఒకదాన్ని బాలికలకై నిర్వహించారు. ఏడు పాఠశాలలకు చెందిన రెండు వందల మందిపైగా బాలికలు ఈ శిబిరంలో పాల్గొన్నారు. ఇట్టి శిబిరం నిర్వహింప బడటం ఇదే ప్రథమం.

కీలక గ్రామీణ కేంద్రం ప్రారంభం

నిడుబ్రోలు సమీపంలోగల అప్పికట్ల వద్ద రెండవ కీలక గ్రామీణ ఉపకేంద్రాన్ని 1961 డిసెంబర్ లో ప్రారంభించారు.

సాంఘిక సేవా శిబిరం

వేటపాలెం నుంచి సముద్రపుటొడ్డు వరకు 1½ మైలు పొడవున మట్టి రోడ్డు వేయడానికి ఎ. సి సి., సాంఘిక సేవా శిబిరాన్ని 1961 డిసెంబర్‌లో వేటపాలెం వద్ద నిర్వహించారు. బాపట్ల, రేపల్లె, ఒంగోలు తాలూకాలలోని 15 ఉన్నత పాఠశాలలకు చెందిన ఏడు వందల మంది ఎ. సి సి విద్యార్థులు, అధికారులు ఈ శిబిరంలో పాల్గొన్నారు.

సహకార గిడ్డంగికి శంకుస్థాపన

మంగళగిరికి రెండు మైళ్ళ దూరంలోగల చినకాకానిలో ఒక సహకార గిడ్డంగి నిర్మాణానికి 1961 డిసెంబర్‌లో శంకుస్థాపన చేశారు.

సహాయ గృహనిర్మాణ పథకాలు

సహాయ పారిశ్రామిక గృహ నిర్మాణ పథకాల క్రింద గుంటూరు వద్ద ఒకేగదిగల 150 ఇళ్ళను 5.6 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్నారు. భూమి ఖరీదు, నీటి సరఫరా, విద్యుత్, రోడ్డు మొదలైన వాటికయ్యే ఖర్చు ఈ మొత్తంలో చేరదు. ఈ పథకానికి సంబంధించిన ప్రణాళికను, అంచనాలను ప్రభుత్వం అంగీకరించింది.

కుష్ఠువారికి రోటరీక్లబ్ చే దుస్తుల బహూకరణ

బాపట్ల రోటరీక్లబ్, సాల్వేషన్ ఆర్మీ కుష్ఠు ఆస్పత్రిలో వారికి 1961 డిసెంబర్ 25 వ తేదీన బట్టలను పంచిపెట్టింది.

యన్. సి. సి. శిక్షణ శిబిరం

కోటప్పకొండ వద్ద డిసెంబర్ 29 వ తేదీ నుంచి జనవరి 9 వ తేదీ వరకు ఏర్పాటు చేసిన యన్. సి. సి. శిక్షణ శిబిరంలో గోదావరి, కృష్ణ, గుంటూరు, నెల్లూరు, జిల్లాలలోని అనేక కళాశాలలకు చెందిన మూడు వేల మంది పైగా సీనియర్ కేడెట్లు పాల్గొన్నారు.

వజ్రాలపాడు రిజర్వాయర్

గుంటూరుకు వందమైళ్ళ దూరంలో వజ్రాలపాడు రిజర్వాయర్ ప్రాజెక్టుకు రాష్ట్ర ఆర్థిక మంత్రి 1962 జనవరిలో శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుకు 10 లక్షల రూపాయలు ఖర్చు అవుతుంది.

దేవాలయ సంఘంలో ప్రథమ స్త్రీ సభ్యురాలు.

రేపల్లె తాలూకా నిజామ్ పట్నంలోగల శ్రీ ఆంజనేయ

స్వామి ఆలయ ధర్మకర్తల సంఘంలో శ్రీమతి సి. సోమమ్మను సభ్యురాలుగా నియమించారు. ఆంధ్ర ప్రదేశ్‌లోని దేవాలయాల ధర్మకర్తల సంఘంలో ఈమే ప్రప్రథమ స్త్రీ సభ్యురాలు.

హైదరాబాద్

పశువుల ఆస్పత్రి భవనం ప్రారంభోత్సవం

తెలంగాణా ప్రాంతంలో పంచాయతీ సమితి జనరల్ రివెన్యూ నుంచి ప్రప్రథమంగా నిర్మించిన పశువుల ఆస్పత్రి భవనానికి ఇబ్రహీంపట్నం వద్ద 1961 డిసెంబర్‌లో ప్రారంభోత్సవం చేశారు. ఈ భవన నిర్మాణానికి రూ. 10,500 లు వ్యయమైంది

కుంభకళా ప్రదర్శన

అమెరికా కుంభకారిణి కుమారి బియాట్రిస్ వుడ్ రూపొందించిన ఒక కుంభ ప్రదర్శనను 1961 డిసెంబర్ రెండవ వారంలో హైదరాబాద్‌లో ప్రారంభించారు.

జిల్లాకు "రాజ్యకలశ" బహుమతి

1959–60 సంవత్సరం ఖరీఫ్, రాబి పంటలలో ప్రథమంగా అధికోత్పత్తిని సాధించినందుకు హైదరాబాద్ జిల్లాకు పది వేల రూపాయల ప్రథమ బహుమతినిచ్చారు. ఇదిగాక 1959 ఖరీఫ్‌లో 42 శాతం అధికోత్పత్తిని, రాబిలో 60 శాతం అధికాహారోత్పత్తిని సాధించినందుకు జిల్లాకు "రాజ్యకలశ" బహుమతి నిచ్చారు

కొత్త బావులు

జిల్లా పరిషత్ స్థాయీ సంఘం జనవరి 10 వ తేదీన సమావేశమై స్థానికాభివృద్ధి కార్యక్రమాల పథకం క్రింద రాజేంద్రనగర్, మేడ్చల్, వికారాబాద్, పర్గి, హయాత్‌నగర్‌లలో ఒక్కొక్కచోట ఐదు బావుల చొప్పున 50 కొత్త బావుల నిర్మాణాన్ని మంజూరు చేసింది.

కరీంనగర్

భూమిపంపకం

జిల్లాలో భూమిలేని నిరుపేద హరిజనులకు 1960 జూలై నుంచి 1961 డిసెంబర్ 15 వ తేదీ వరకు 37467 ఎకరాల భూమిని పంచి పెట్టారు.

జగిత్యాలలో టెలిఫోన్ ఎక్స్‌చేంజి

50 లైనులతో జగిత్యాలలో డిసెంబర్ 22 వ తేదీన ఒక టెలిఫోన్ ఎక్స్‌చేంజిని ప్రారంభించారు.

నూతనపాఠశాల భవనం

వైరా పంచాయతీ సమితిలోని మునలమడుగు గ్రామంలో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనాన్ని 1962 జనవరి రెండవ వారంలో తెరిచారు. ఆ గ్రామంలో పంచాయతీ భవనానికి గూడా శంఖుస్థాపన చేశారు.

కృష్ణ

పంచాయతీసమితి అధ్యక్షుల సమావేశం

జిల్లాలోని పంచాయతీ సమితి అధ్యక్షుల సమావేశం మైలవరంలో జనవరి 7 వ తేదీన జరిగింది. సమితుల కష్ట నిష్ఠూరాల గురించి, అభివృద్ధి కార్యక్రమాల గురించి ఈ సమావేశాలలో చర్చించారు.

యన్ సి. సి శిక్షణ శిబిరం

9 వ ఆంధ్ర యన్. సి. సి. బెటాలియన్ అధ్వర్యాన మచిలీపట్నం వద్ద జనవరి 3 వ తేదీ నుంచి 10 రోజుల శిక్షణ శిబిరం నిర్వహించారు. కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలోని సెకండరీ పాఠశాలలకు చెందిన 150 మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందారు.

కుటుంబనియంత్రణ దినోత్సవం

1961 డిసెంబర్ 18 వ తేదీన మచిలీపట్నంలో కుటుంబ నియంత్రణ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంలో కుటుంబ నియంత్రణపై ఒక చర్చ జరిగింది.

ఆటోమేటిక్ టెలిఫోన్ ఎక్స్‌చేంజి

ఒక ఆటోమేటిక్ ఎక్స్‌చేంజి కార్యాలయాన్ని కొండపల్లి వద్ద 1961 డిసెంబర్ ఆఖరు వారంలో ప్రారంభించారు.

సైకిల్ స్టాండుల ఉత్పత్తి

సైకిల్ స్టాండులు, కేరీర్లను తయారు చేసే ఒక కేంద్రాన్ని మైలవరం వద్ద జనవరిలో నెలకొల్పారు

పోలీసు సంచార రేడియో స్టేషన్

ఒక సంచార రేడియో స్టేషన్ను విజయవాడలో జనవరి 10 వ తేదీన ప్రారంభించారు. ఈ సంచార శకటం 24 గంటలు గస్తీ తిరుగుతూ నేరస్థులను శాంతికి భంగం కలిగించేవారిని పట్టుకోడానికి సహకరిస్తుంది. ఇట్టి సంచార శకటం రాష్ట్రంలో ఇది రెండవది. మొదటిది హైదరాబాద్‌లో వుంది.

కర్నూలు

సాంస్కృతికోత్సవం

ఎర్రగుండి బ్లాకులోని సోంపల్లి గ్రామంలో జనవరిలో మహిళా, బాలల, సాంఘిక సాంస్కృతికోత్సవాలు మూడు రోజులు జరిగాయి.

మహబూబ్‌నగర్

1961–62 రాబిపంటకు జిల్లాలోని రైతులకు స్వల్పకాలిక ఋణాల క్రింద లక్ష రూపాయలనిచ్చారు.

మెదక్

సిద్దిపేట సమితికి ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం

సిద్దిపేట సమితికి ముఖ్యమంత్రి శ్రీ డి. సంజీవయ్య డిసెంబర్ 22 వ తేదీన ప్రారంభోత్సవం జరిపారు. ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల భవనాలకు కూడా ఆయన శంఖుస్థాపన చేశారు.

నల్గొండ

వ్యవసాయ పనిముట్లు తయారు చేయడానికి ఒక గ్రామీణ వర్క్‌షాపు ప్రారంభించే పథకాన్ని చౌటుప్పల్ పంచాయతీ సమితి మంజూరు చేసింది.

దేవరకొండలో ఆముదం మిల్లు

దేవరకొండ సమీపంలో ఒక ఆముదం మిల్లును స్థాపించే నిమిత్తం సర్వే జరిపే అందుకై దేవరకొండ బ్లాకు నే నిర్ణయించారు.

వడ్రంగులకుపయోగించే ఒక సమాజ సౌకర్య కేంద్రాన్ని మిర్యాలగూడాలో ఇటీవల ప్రారంభించారు.

నాగార్జున సాగర్ ప్రాంతం సర్వే

నాగార్జునసాగర్ ప్రాంతంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం చేపట్టిన సాంఘిక, ఆర్థిక సర్వేపూర్తి అయింది. ఈ సర్వేకు 2.3 లక్షల రూపాయలు ఖర్చు అయింది.

పాఠశాలకు ప్రయోగశాలలు

తృతీయ ప్రణాళికలో జిల్లాలో విద్యా పథకాలను అమలు జరపడానికి రాష్ట్ర ప్రభుత్వం 105 లక్షల రూపాయలను కేటాయించింది.

ఆత్మకూర్, రామన్నపేట, నూటంకల్, హుజూర్‌నగర్ పాఠశాలలలో సైన్సు ప్రయోగశాలలను నిర్మించడానికి జిల్లా పరిషత్ 1.50 లక్షల రూపాయలను కేటాయించింది.

గ్రంథాలయాల ప్రారంభోత్సవం

నక్రేకల్ పంచాయతీ సమితిలోని కోడవర్తి, మధారం గ్రామాలకు చెందిన యువకులు గ్రంథాలను సేకరించి డిసెంబర్ నెలలో తమ గ్రామాలలో గ్రంథాలయాలను తెరిచారు.

విద్యా కార్యక్రమం

చౌటుప్పల్ సమితిలోని గుండ్రాంపల్లి గ్రామంలోని స్త్రీలు తమ పిల్లలను నిర్బంధ విద్యా పథకం క్రింద పాఠశాలలకు పంప నిశ్చయించారు.

ఆ గ్రామంలో ప్రజలు కొన్న ఒక సమాజాభివృద్ధి కేంద్రం రేడియోకు రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి ప్రారంభోత్సవం చేశారు

పరిషత్‌కు ప్రభుత్వ గ్రాంటు

స్థానిక అభివృద్ధి కార్యక్రమాల క్రింద నీటి సరఫరా పథకానికై రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పరిషత్‌కు 53 వేల రూపాయల గ్రాంటును మంజూరు చేసింది.

గ్రామీణ గృహనిర్మాణ పథకంక్రింద గృహాలనిర్మాణానికి ప్రభుత్వం భువనగిరి పంచాయతీ సమితికి 50 వేల రూపాయలను మంజూరు చేసింది.

నూతన ఆరోగ్యకేంద్రం

దేవరకొండ పంచాయతీ సమితిలోని గుడిపల్లి గ్రామంలో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిసెంబర్‌లో ప్రారంభించారు.

హుజూర్‌నగర్ తాలుకా ఎర్రకుంటలో ఒక పాఠశాల భవనానికి శంఖుస్థాపన డిసెంబర్‌లో జరిగింది. ఈ భవన నిర్మాణానికి ప్రజలు ఆరు వేల రూపాయల విరాళాన్ని ఇచ్చారు.

నెల్లూరు

గూడూరులో కుటుంబనియంత్రణ దినోత్సవం

ప్రజల జీవన ప్రమాణాన్ని పెంపొందించడానికి మన దేశంలో కుటుంబ నియంత్రణా విధానాలను ప్రచారం చేయవలసిన అవసరం గురించి కుటుంబ నియంత్రణా కమిటీ అధ్వర్యాన గూడూరు ఆస్పత్రిలో డిసెంబర్‌లో జరిగిన ఉత్సవంలో పలువురు వక్తలు ప్రసంగించారు.

కొవ్వూరు వద్ద, బుచ్చిరెడ్డిపాలెం వద్ద రెండు ఆటోమేటిక్ టెలిఫోను ఎక్స్చేంజీలను డిసెంబర్‌లో ప్రారంభించారు.

పొదిలి గ్రామంలో ఒక భూమి తనఖా బ్యాంకును డిసెంబర్‌లో ప్రారంభించారు.

నిజామాబాద్

కుటుంబ నియంత్రణ దినోత్సవ సందర్భంగా నిజామాబాద్‌లో డిసెంబర్ నెలలో ఒక బహిరంగ సభ జరిగింది. కుటుంబ నియంత్రణకు సంబధించిన ఒక ప్రదర్శన కూడా జరిగింది.

విశాఖపట్నం

నౌకాదినోత్సవాల సందర్భంగా పోలీసు మైదానంలో డిసెంబర్ 16 వ తేదీన జరిగిన విన్యాసాలలో 400 మంది పైగా అధికారులు, నావికులు, మొదలైనవారు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ నూతన భవనం

జిల్లా పరిషత్ అదనపు భవన నిర్మాణానికి 2.5 లక్షల రూపాయలను కేటాయించారు. ఈ మొత్తంలో 1.5 లక్షల రూపాయలను పరిషత్ భరిస్తుంది. మిగతా మొత్తం ప్రభుత్వ గ్రాంటువల్ల లభిస్తుంది. కొత్తగా నిర్మించే ఈ భవనంలో పరిషత్ కార్యాలయమేగాక, ఒక కౌన్సిల్ హాల్ కూడా వుంటుంది.

ఉద్యాన కృషి ప్రదర్శన

విజయనగరం పురపాలక సంఘం జనవరి మొదటివారంలో ఉద్యాన కృషి ప్రదర్శనను ఏర్పాటు చేసింది.

విశాఖపట్నం ఆంధ్ర మెడికల్ కాలేజీలో డిసెంబర్ 18 వ తేదీన కుటుంబ నియంత్రణ దినోత్సవం జరిపారు. పానగల్ భవనాలలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను అనేక మంది ప్రజలు సందర్శించారు.

విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రిలోకూడ డిసెంబర్ 18 వ తేదిన కుటుంబ నియంత్రణ దినోత్సవం జరిగింది. ఒక ప్రదర్శనను కూడ ఏర్పాటు చేశారు.

పారిశ్రామిక వాణిజ్య ప్రదర్శన

స్థానిక ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి అధ్వర్యాన జనవరి 7 వ తేదీన విశాఖపట్నంలో ఒక పారిశ్రామిక, వాణిజ్య ప్రదర్శనం జరిగింది.

సెకండరీ పాఠశాలల భవనాల నిర్మాణం

సెకండరీ పాఠశాలల భవనాల నిర్మాణానికి 50 శాతం విరాళం ఇచ్చే పద్ధతిన 1962-63 జిల్లాపరిషత్ బడ్జెట్‌లో రెండు లక్షల రూపాయలను కేటాయించారు.

1962-63 బడ్జెట్‌లో ఉన్నత పాఠశాలలను హయ్యర్ సెకండరీ పాఠశాలలుగా మార్చి దానికికూడ వసతి కల్పించారు. ఇందు కయ్యే ఖర్చును ప్రభుత్వం సహాయ గ్రాంట్లు క్రింద భరిస్తుంది. మైనర్ నీటి పారుదల సౌకర్యాలకై ఆ బడెట్‌లో 23.9 లక్షల రూపాయలనుగూడా కేటాయించారు.

జిల్లా పంచాయతీ మండలి

జిల్లాలో అన్ని పంచాయతీ సమితులకు చెందిన అధ్యక్షులు, జిల్లాపరిషత్ సభ్యులు డిసెంబర్ నెలలో జిల్లాపరిషత్ కార్యాలయాలలో సమావేశమై జిల్లాపంచాయతి మండలిని ఏర్పరిచారు. గరివిడి సమితి అధ్యక్షులు శ్రీ కె. సూర్యనారాయణ రాజా ఈ మండలి అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సబ్బావరం సమితి అధ్యక్షులు శ్రీ యస్. అప్పలనాయుడు, గజపతి నగరం సమితి అధ్యక్షులు శ్రీ యన్. గంగరాజుగార్లు వరుసగా ఉపాధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నికైనారు.

వరంగల్

వ్యవసాయ పారిశ్రామిక ప్రదర్శనము

వరంగల్‌లో 1961 నవంబర్ 27 నుంచి డిసెంబర్ 23 వ తేదీ వరకు ఏర్పాటు చేసిన ఐదవ అఖిల భారత పారిశ్రామిక వ్యవసాయ ప్రదర్శనం తెలంగాణా జిల్లాలలోని ప్రజలందరిని ఆకర్షించింది. ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన సమాచార శాఖ శాలకు ఆకర్షణీయంగా అలంకరించినందుకు దానికి ప్రథమ బహుమతి లభించింది.

పశ్చిమ గోదావరి

పాలకొల్లు పంచాయతీ సమితికి 1961 డిసెంబర్‌లో ప్రారంభోత్సవం చేశారు.

ఆచంటలో పూర్వ విస్తరణ కేంద్రం

ఆచంటవద్ద డిసెంబర్ 20 వ తేదీన (ప్రీ-ఎక్స్‌టెన్షన్) పూర్వ విస్తరణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా, వెనుక బడిన తరగతుల వారికి పుస్తకాలను పంచి పెట్టారు. ఆయా వృత్తిపనుల వారికి ఆయాపనిముట్లను పంచి పెటారు, ఎద్దులను కొనుక్కోడానికి ఇద్దరు పేద రైతులకు చెరొక మూడు వందల రూపాయల నిచ్చారు.

పాలకొల్లు పద్ద గల మేడపాడులో ఒక ఆరోగ్య కేంద్రాన్ని జనవరి 8 వ తేదీన ప్రారంభించారు. ఈ కేంద్రానికి భూమినిచ్చిన శ్రీ కె. నరసింహామూర్తిని ఈ సందర్భంలో జరిగిన సభలో పరిచయం చేశారు.

పాలకొల్లు బ్లాకులోగల లక్ష్మీనారాయణదేవపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శ్రీ బొమ్మా బాపిరాజు రెండు ఎకరాలభూమిని, గ్రామస్థులు ఆరు వేల రూపాయలను విరాళంగా ఇచ్చారు. ఈ కేంద్రం బ్లాకులోని 24 వేల మంది కోయ వారికి ఉపకరిస్తుంది.

క్షయవార్డుకు సంక్షేమ నిధి

ఏలూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో 50 పడకలతో ఒక క్షయ వార్డును నిర్మించడానికి ఆంధ్రప్రదేశ్ సంక్షేమనిధి జిల్లా శాఖ 93 వేల రూపాయలను మంజూరు చేసింది.

పాలకొల్లులో పురపాలకోన్నత పాఠశాల కొత్త బ్లాకుకు స్థానిక పరిపాలనా మంత్రి జనవరి 6 వ తేదీన ప్రారంభోత్సవం చేశారు. ఈ భవన నిర్మాణానికి 52 వేల రూపాయల ఖర్చు అయింది.

కుటుంబ నియంత్రణ దినోత్సవం

పెంటపాడు సమితి అధ్వర్యాన ముదునూరులో డిసెంబర్ నెలలో కుటుంబ నియంత్రణ దినం జరిగింది. ఈ ఉత్సవం జట్లపాలెం, పిప్పర, అలంపురం, మీనపల్లూరులలో కూడా జరిగింది

వ్యవసాయ వర్క్‌షాపు


వ్యవసాయ వర్క్‌షాపుకు 5 లక్షల రూపాయల వ్యయంతో త్వరలో తాడేపల్లిగూడెం వద్ద స్థాపించనున్నారు ఈ ఖర్చును ఫోర్డ్ సంస్థ భరిస్తుంది.

ఏలూరులోని కిర్బలామైదానం వద్ద పార్కుకు స్థానిక పరిపాలనా మంత్రి జనవరి మొదటి వారంలో ప్రారంభోత్సవం చేశారు

శ్రీకాకుళం

గిరిజన కాలనీకి గవర్నర్ రాక

ఆంధ్రప్రదేశ్ గవర్నర్, ఆయన సతి శ్రీమతి లలితా పచార్ కుడ్డపల్లి గిరిజన కాలనీని డిసెంబర్‌లో సందర్శించారు.



స్వాతంత్ర్యం పరిరక్షింపబడాలంటే కేవలం సమైక్యతే కాదు, సమగ్రాలోచన సదాలోచన కూడా ఉండాలి ప్రజల్లో.

విదేశ వాణిజ్యం: వలసలు

శ్రీ తంగిరాల వెంకట సుబ్బారావు

ఆధునిక యుగంలో మానవుడు ప్రకృతిని తన దానిసగా చేసుకున్నాడు. ఈ విశాల ప్రకృతి గంభీర శక్తుల్ని సునాయాసంగా తన వశం చేసుకున్నాడు. ప్రకృతిని శాసిస్తున్నాడు. భూమి మీద అతి వేగంగా పయనిస్తున్నాడు. సునాయాసంగా సముద్రాలు దాటుతున్నాడు. నీటి పైనే కాదు, నీటి లోపల కూడా చేపలా యీదుతున్నాడు! ఆకాశంలో పక్షిలా ఎగుర గల్గుతున్నాడు! మేఘాలతో దోబూచు లాడుతున్నాడు!!

కాని. ప్రాక్తన మానవునికి ఈ విధమైన సౌకర్యాలేమీ లేవు. ఎట్టి సౌకర్యాలు లేని ప్రాచీన కాలంలో మన ఆంధ్రులు ఏ విధంగా ప్రయాణాలు సాగించేవారు? ఇతర దేశాలతో సంబంధాన్ని కలిగి వుండేవారా? పురాత నాంధ్రులు "కూపస్థ మండూకాల"ని కొందరు అవివేకులు భావించ వచ్చు. అది ఎన్నటికీ సరి కాదు! ఏ విధమైన ప్రయాణ సదుపాయాలు లేని అతి పురాతన కాలం లో సైతం, ఆంధ్రులు వేల కొలది మైళ్ల దూరాన్నున్న వివిధ దేశాలతో వాణిజ్యం సాగించే వారు, ఖండ ఖండాంతరాలకీ వలస వెళ్ళారు. ప్రపంచ నలు మూలల్లో తమ విజ్ఞాన ప్రకర్షను వెదజల్లారు. ఈ విషయాలను పరిశీలిస్తే మనం ఆశ్చర్య చకితులమవుతాము. ఆనందంతో పులకరిస్తాం! గర్వంతో రొమ్ము విరుస్తాం!!

సస్య శ్యామలంగా, అతి శోభాయ మానంగా ఉన్న తెలుగు గడ్డ మీద "కళింగ పట్టణం" దగ్గర నుండి "పులి కాట్" వరకూ విదేశ వాణిజ్యానికి మిక్కిలి లాభ సాటి యైన సదుపాయాలుండేవి. గల గలా కదలి పోయే అఖండ గోదావరి, బిరబిరా పరుగులు తీసే నీలి తరంగాల కృష్ణవేణి, యావదాంధ్ర దేశంలోనూ వాణిజ్యానికీ, ప్రయాణానికీ, మహత్తర రహదారులుగా రాణించేవి. తెలుగు వారి యీ అనుంగు నదుల ముఖ ద్వారాల నుండి ఓడలు, వాణిజ్యం నిమిత్తం వివిధ దేశాలకీ పయనించేవి, నాటి ఓడలు ఆధునిక నౌకల్లా యంత్రాలతో నడుపబడేవి కావు. తెర చాపలే వాటికి ప్రధానం. గాలియే ఆధారం. కాబట్టి అనేక వందల సంవత్సరాలకు పూర్వమే అష్ట కష్టాల కోర్చి నౌకాయానానికి సాహసించినది మన ఆంధ్ర జాతి. అతి దూర దేశాలతో వర్తకాన్ని జరిపి. ధన ధాన్యాలతో తులతూగి, భూతల స్వర్గాన్ని సృష్టించు కున్నారు. ఆంధ్రులు.

విదేశ వాణిజ్యం ఎప్పుడైతే ప్రారంభ మవుతుందో. వలస వెళ్ళడం అప్పుడే ప్రారంభ మవుతుంది. వలసల వెను వెనుకనే నవ నవోన్మేషమైన నాగరికత , విజ్ఞాన ప్రకర్ష, మహత్తర సంస్కృతి అల్లుకుంటాయి. క్రీ॥ పూ॥ ఏడవ శతాబ్దం లోనే బర్మా దేశంలో ద్రావిడ వలస జాతులు నివసించినట్లు తెలియ వస్తోంది. "భట్టిప్రోలు శాసనాలు" ఆంధ్ర దేశంలో ఆనాడు విదేశ వాణిజ్యం ఎంత అమితంగా వృద్ధి పొందిందో వేనోళ్ళ చాటుతున్నవి. ప్రాచీనాంధ్ర దేశం నేత పరిశ్రమకి పెట్టినది పేరు.! ప్రత్తి వస్తువులు రంగు ప్రత్తి, పట్టు వస్త్రాలు ఓడల్లో కొనిపోబడే ముఖ్యమైన సరుకులుగా ఉండేవి. "మచిలీ పట్నం" "సోప్తమ" "కంటశిల" "కొడ్డూర" మొదలైనవి ప్రాచీన కాలంలో ప్రసిద్ధి గాంచిన తెలుగు వారి రేవు పట్టణాలు. "సోప్తమ" అనేది నేటి పెద గంజాము ప్రాంతంలో ఉండి ఉండేది. "కొడ్డూర" నేటి "గూడూరు". అతి దూరంలో ఉన్న పాశ్చాత్య దేశాల నుండి, "ఈజిప్టు" నుండి వచ్చే అన్ని రకాల సరకులు మొట్ట మొదట ఈ ఆంధ్ర రేవులకు చేరేవి. తరువాత ఇక్కడ నుండి చైనా, బర్మాల వంటి తూర్పు దేశాలకు సరఫరా అయ్యేవి. వినుకొండ, నెల్లూరు, కడప, మొదలైన ప్రదేశాల్లో "రోమను నాణెములు" లభించాయి కాబట్టి ప్రాచీనాంధ్ర దేశం అతి దూరాన్నున్న రోమను దేశంతో కూడ విరివిగా వర్తకం సాగించిందన్న మాట. అదిగాక, నాగార్జున కొండ వద్ద లభించిన ఒక శాసనాన్ని బట్టి ప్రాచీనాంధ్ర దేశం కీర్తి ప్రతిష్టలు తూర్పున "చైనా" దేశం మొదలుకొని పశ్చిమాన "రోము" వరకూ వ్యాపించాయని తెలుస్తోంది.

విదేశ వాణిజ్యాన్ని అనుసరించే వలస పోవుటకు కూడా తటస్థించింది పురాత నాంధ్రులు అనేక ప్రాంతాలకు వలస వెళ్ళారని మనం కేవలం నిరాధారంగా ఊహించడం లేదు. ఆంధ్రులు వలస వెళ్ళిన ప్రాంతాల్లో "పాండురంగ" "అమరావతి" "సింహపురం" "కళింగ" "భోజ" మొదలైన పేర్లు నేటికిని నిలిచి పోయాయి. వీనిని బట్టి వలస ప్రాంతాల లోని ప్రజల నాగరికత సంస్కృతి, మొదలగు వానికి మన ఆంధ్ర దేశమే మూల కందమని చెప్పక తప్పదు.

శాత వాహన చక్రవర్తి యైన "యజ్ఞ శ్రీ" నాణెముల మీద, పల్లవ రాజుల నాణెముల మీద ఓడ బొమ్మల్నుండుట— ఆంధ్రుల మహనీయ నౌకా దళాన్ని, బలాన్ని చెప్పకయే చెప్పు చున్నవి. "బంగారు బర్మా", "సువర్ణ మిత్రా", "రాగి చెంపా" ("చెంపా" అంటే నేటి ఇండో-చైనా") అనే విధంగా పురాతన కాలంలో పేరు గాంచిన తూర్పు రాజ్యాలకి, ఆంధ్ర దేశం— సంస్కృతికీ, నాగరకతకీ పట్టు గొమ్మ యైన "గ్రీసు దేశం"లా కనబడేది.

బర్మా దేశంలో రెండు ప్రాంతాలకీ "కళింగ" "ఉత్కళ" అనే పేర్లున్నాయి. ఇవి మన దేశంలోని పేర్లు. ప్రాచీన కాలంలో గోదావరి నదికి ఉత్తరాన "మహేంద్రగిరి" వరకూ ఉన్న తెలుగు దేశాన్ని "కళింగము" అని పిలిచేవారు. దీనిని బట్టి ప్రాచీన కాలంలో ఆంధ్రులు బర్మాదేశానికి వలసవెళ్ళి, ఇక్కడి పేర్లనే అక్కడ తాము నివసించిన ప్రాంతాలకి కూడా పెట్టుకొని ఉంటారని నిస్సంశయంగా చెప్పవచ్చు. అంతే కాకుండా, బర్మాలోని "ప్రోమ్" జిల్లాలో క్రీ. శ. ఒకటవ శతాబ్దికి చెందిన ఒక శాసనం లభించింది. దాని లిపి మన ఆంధ్ర దేశంలోని శాసనాల లిపిలో ఉంది, ఆంధ్రులు ఆనాడే అక్కడికి వలస వెళ్లారనడానికి ఇది తార్కాణం ఇట్టి నిదర్శనాలు వేనవేలుగా లభిస్తున్నాయి. బర్మాలో అనేక స్థూపాలు కనిపిస్తున్నాయి, ఒక స్థూపం చివరచుట్టూ ఒక శాసనం చెక్కి ఉంది. ఆ శాసన లిపి మన తెలుగు లిపికి, కన్నడ లిపికి ఎంతో సన్నిహితంగా వుంది పురాతన కాలంలో తెలుగు రేవుల నుండి బయలు దేరిన ప్రతి నౌకయు బుద్ధ భగవానుని అమర సందేశాన్ని బర్మా, సింహళం, సయాం మొదలైన దూర దేశాలకి గొనిపోయేది. బర్మా దేశంలో బౌద్ధ మతం వ్యాపించడానికి ప్రథమ కారకులు "వేంగి" ని పాలించిన "శాలంకాయనులే".

మలయా ద్వీపకల్పంలో మన "కోరమాండల్" తీరాన్నుంచి వచ్చిన వారిని "క్లింగ్స్" అని పిలిచేవారు, ఇది కళింగులనే అర్థాన్ని సూచిస్తోంది. "సింగపూర్" మొదటిపేరు "సింహపురము" ఇది తెలుగు పేరే! ఇండో చైనాలోని రాష్ట్రాలకి "అమరావతి" "విజయ" "కేతర" "పాండురంగ" అనే పేర్లున్నాయి. ఇవన్నీ ప్రాచీనాంధ్ర దేశంలోని పేర్లే; ఆంధ్రులు ఆయా దేశాలకు వలసవెళ్లి ఉండకపోతే, వానికాపేర్లు వచ్చివుండవు. ఇండో చైనాలోని శిలాశాసనంలోని లిపి క్షత్రప రాజైన "రుద్రదాము"ని "గిర్‌నార్" శాసనాన్ని; శాతవాహన చక్రవర్తియగు "వసిష్ఠీ పుత్రశాతకర్ణి" యొక్క "కన్హేరీ శాసనము"ను పోలి వుంది. మన దేశాన్నుండి వెళ్లిన "కౌండిన్య" దనే బ్రాహ్మణుడు అక్కడ ఒక రాజవంశాన్ని స్థాపించినట్లుకూడా చెపుతారు ఆ రాజ వంశపు జన్మవృత్తాంతము, మన పల్లవ రాజుల జన్మవృత్తాంతము వలెఉంటుంది ద్రోణాచార్యుని పుత్రుడైన "అశ్వత్థామ" సంతతివారనిచెబుతారు ఇండో చైనాలోని శిల్పమంతా మన పల్లవుల మహత్తర శిల్పానికి ప్రతిబింబమే. ఈ విధంగా ఆయాదేశాల్లో మిగిలిన ప్రాచీనాంధ్ర సంస్కృతికి జాడలు నేటికిని కొల్లలుగా లభిస్తాయి.

ఆంధ్రదేశాన్ని సింహళాన్ని కలుపుతూ చెప్పబడిన బౌద్ధ గాథలెన్నో ఉన్నాయి. "పల్లవబొగ్గ (నేటి పలనాడు) నుండి సింహళదేశానికివెళ్లిన బౌద్ధ భిక్షువులను ఆకథలలో పేర్కొన్నారు. "నాగార్జునుడు" అతని శిష్యుడగు "ఆర్యదేవుడు"! వీరి తరువాతి కాలంలో వారైన "బుద్ధఘోషుడు" "బుద్ధదత్తుడు" కూడా సింహళ దేశంతో సంబంధాన్ని కలిగి వుండిన బౌద్ధమతాచార్యులే!!

నేటి తూర్పు ఇండియా దీవులను "సుమత్రా" "జావా" "బోర్నియో" "బాలి" మొదలగు ద్వీపాల్లోకి సైతం పల్లవ సామ్రాజ్యం విస్తరించినట్లు చరిత్రవెల్లడిస్తోంది పల్లవుల కాలంలో బౌద్ధమతం అణిగిపోయి; వైదికమతం పునరుద్ధరింపబడింది. అందుచే, పల్లవరాజ్యంలోనివి కాబట్టి, ఈ ద్వీపాలలోకూడా బౌద్ధ మతం క్షీణించిది. క్రీ. శ. నాలుగవశతాబ్దంలో చైనాయాత్రికుడగు "ఫాహియాన్" ఈ ద్వీపాల్లో బౌద్ధమతం క్షీణిస్తున్నట్లుగా పేర్కొన్నాడు

మొత్తముమీద, బౌద్ధమతవ్యాప్తి అత్యున్నత స్థాయియందున్నకాలం—విదేశ వాణిజ్యం; వలసలు: మతప్రచారం, కళారాధన మొదలగు వానితో—విరామంలేని కాలంగా గోచరిస్తుంది. పెద్ద పెట్టునసాగే విదేశవాణిజ్యంతో పాటు, బుద్ధభగవానుని మహత్తర సందేశాన్ని ప్రపంచం నలుమూలలకీ గొనిపోయే బౌద్ధసంఘాలు; ఆంధ్రసంస్కృతిని, నాగరకతని వివిధదేశాలలో విస్తృతపరచే వలసలు: కమనీయ కళారాధన;—ఇవన్నీ పురాతనాంధ్రదేశ ఆదర్శ సంస్కృతికి నిదర్శనాలు!! విజ్ఞాన ప్రకర్షకి గీటురాళ్ళు!! వాణిజ్యం విరివిగా సాగిందంటే ఆర్థికాభివృద్ధి అమితంగా సాగిందని అర్థం! ఆర్థికాభివృద్ధి జరిగిందంటే, లలితకళలకే, సాహిత్యానికీ విశేషంగా పోషణ జరిగిందని వేరే చెప్పనక్కరలేదు!!

"చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా!!
గత మెంతో ఘనకీర్తి కలవోడా!?"

* * *

ముఖ్యాంశాలు

రాష్ట్రంలో

20-12-1961

ఆంధ్ర ప్రాంతంలోని మునిసిపాలిటీల అధ్యక్షులు, కమీషనర్ల నాలుగవ సంయుక్త సమావేశాన్ని హైదరాబాదులో ముఖ్యమంత్రి ప్రారంభించారు.

22-12-1961

ఉద్యోగ ఖాళీలలో అత్యవసర ప్రాతిపదికపై నియమించ బడిన తాత్కాలికోద్యోగుల స్థానే 1962 జనవరి 1 నాటికి పబ్లిక్ సర్వీసు కమిషను అభ్యర్థులను నియమించివల సిందిగా ప్రభుత్వం వివిధ శాఖాధిపతులను ఆదే శించినట్లు అధికార ప్రతినిధి ఒకరు వెల్లడించారు.

27-12-1961

సమీకృత పాల ప్రాజెక్టుకు సంబంధించిన నాలుగు పాలశీతల కేంద్రాలలో రెండు కేంద్రాల భవనాలకు విజయవాడలో ముఖ్యమంత్రి పునాది రాయి వేశారు.

29-12-1961

మూడవ ప్రణాళిక మొదటి సంవత్స రానికై ఆంధ్రప్రదేశ్‌కు తాను ఇచ్చే మొత్తంలో భారత ప్రభుత్వం రూ. 2 కోట్లు పెంచినట్లు అధికార ప్రతినిధి ఒకరు తెలియజేశారు.

30-12-1961

ప్రభుత్వ ఉద్యోగులు, సవరించిన జీతపు స్కేళ్ళను ఎన్నుకోటానికి రాష్ట్ర ప్రభుత్వం జనవరి నెలాఖరు వరకు గడువు పొడిగించింది.

31-12-1961

గ్రామోద్యోగులకు తాత్కాలిక సహాయం లభింపజేయాలని ఉన్నితన్ కమిటీ చేసిన సిఫార్సులను ప్రభుత్వం పరిశీలించి విర్ణ యాలు గైకొన్నది.

1-1-1962

యూనియన్ ఆర్థిక శాఖామంత్రి శ్రీ మొరార్జీదేశాయ్ 22వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనాన్ని హైదరాబాద్‌లో ప్రారం భించారు.

3-1-1962

సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్ల సమావేశం హైదరాబాద్‌లో ఆరంభమైంది.

5-1-1962

అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించినందుకు రాష్ట్రపతి పోలీసు అధికార్లకు పోలీసు పతకాలను బహూకరించారు. వీరిలో ఒకరు ఆంధ్రప్రదేశ్‌కూ, ఇద్దరు ఉత్తరప్రదేశ్‌కూ చెందినవారు.

9-1-1962

ఎనిమిదవ అఖిలభారత కుష్ఠు కార్యకర్తల సమావేశాన్ని హైదరాబాదులోని జూబిలీహాలులో గవర్నరు ప్రారంభించారు.

8-1-1962

నిమ్న జాతులు, నిమ్న తెగలు, వెనుక బడిన తరగతుల వారికి ఉద్యోగ ఖాళీల రిజర్వే షనుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రాయితీలు ప్రకటించింది.

11-1-1962

ప్రభుత్వోద్యోగులు తమ ఉద్యోగ విష యాలలో శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు మొదలైనవారి పలుకుబడిని వినియోగించుకొన టాన్ని నిషేధిస్తూ రూపొందించిన నిబంధనను కట్టుదిట్టంగా అమలుపరచవలసిందిగా ప్రభుత్వం శాఖాధిపతు లందరినీ ఆదేశించింది.

17-1-1962

ఆంధ్రప్రదేశ్‌లో శాస్త్రీయ పద్ధతిలో అటవీ సంపద అభి వృద్ధి ప్రారంభమై నూరు సంవత్సరాలు అయింది. ఈ సంద ర్భంగా జరిగిన శతజయంత్యుత్సవాలను యూనియన్ ఆహార, వ్యవసాయ శాఖల మంత్రి అధ్యక్షత వహించారు.

18-1-1962

రవాణా శాఖ కమీషనర్లు, కంట్రోలర్ల సమావేశాన్ని జూబిలీహాలులో గవర్నరు ప్రారంభించారు.

19-1-1962

కలప పరిశ్రమ స్థితిగతులను పరిశీలించే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం నలుగురు సభ్యులతో ఒక సంఘాన్ని నియమించింది. అటవీ శాఖ ప్రధానాధికారి సంఘం అధ్యక్షులుగా వ్యవహరిస్తారు.

23-12 1961

1963–1967 సంవత్సరాల మధ్య కాలంలో 11.25 మిలియన్ టన్నుల ముడి ఇనుమును సరఫరా చేసే విషయంలో స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ జపాను ఉక్కు పారిశ్రామికుల మధ్య క్రొత్త ఢిల్లీలో ఒప్పందం కుదిరింది.

26-12-1961

సిక్కుల ఫిర్యాదుల విషయమై యూనియన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించడానికి నియమించబడిన దాస్ కమిషను గడువును మరో నెల పొడిగించారు. *1961* డిసెంబరు మాసాంతం వరకు ఈ కమిషను నివేదిక సమర్పించవలసింది.

27-12-1961

క్రొత్త ఢిల్లీలో రెండు రోజుల పాటు జరిగిన అభివృద్ధి శాఖ కమీషనర్ల సమావేశంలో ఇతర అంశాలతో పాటు ప్రతి బ్లాకులోనూ యువజన సంస్థలను ప్రతిష్ఠ పరచవలసిన అవశ్యకతను నొక్కి చెప్పారు. పంచాయతీ రాజ్య ఉద్యమానికి ఈ అంశాన్ని మూలాధారంగా వారు పరిగణించారు.

28-12-1961

టిబెటు విషయంలో నూత్న సంధి సంప్రదింపులు ప్రారంభించటానికి పూర్వం భారత దేశం పట్ల ప్రదర్శిస్తున్న శత్రుపైఖరిని మార్చుకోవలసిందిగా యూనియన్ ప్రభుత్వం చైనాను కోరినట్లు ప్రధానమంత్రి తెలిపారు.

30-12-1961

లక్నోలో మూడు రోజుల పాటు జరిగిన భారత శాసన సభాధ్యక్షుల సమావేశం సమాప్తమైంది.

1-1-1962

నూన్‌మతి (అస్సాం) లో స్థాపించిన ప్రప్రథమ ప్రభుత్వ రిఫైనరీని ప్రధాన మంత్రి ప్రారంభించారు.

4-1-1962

రాష్ట్ర శాసన సభలకు జరిగే ఎన్నికల తేదీలను ఎలక్షన్ కమిషను ఆమోదించింది.

9-1-1962

క్రొత్త ఢిల్లీలో జరిగిన అఖిల భారత మేయర్ల సమావేశంలో సహాయక మురికిపేటల నిర్మూలన పథకాలను అన్ని మునిసిపల్ కార్పొరేషను ప్రాంతాలలోను అమలుపరచాలని అభ్యర్థించారు.

11-1-1962

బర్మా ప్రధాని శ్రీ యూనూ క్రొత్త ఢిల్లీ చేరుకున్నారు. ఆయన భారతదేశంలో ఆరు రోజులు పర్యటిస్తారు.

14-1-1962

భారతదేశంలో నిర్మించిన చలన చిత్రాలను మరో అయిదు సంవత్సరాల వరకు పాకిస్తాన్‌లో ప్రదర్శించకుండా పాక్ ప్రభుత్వం నిషేధించింది.

17-1-1962

దేశంలో న్యూస్‌ప్రింట్ అమ్మకం, వాడకం మొదలైనవాటిని క్రమబద్ధం చేసేందుకు భారత ప్రభుత్వం న్యూస్‌ప్రింట్ కంట్రోలు ఉత్తర్వును ప్రకటించింది.

విదేశాలలో

21-1-1962

కొటాంగ అధ్యక్షుడు శ్రీ షోంబే, ప్రధాన మంత్రి శ్రీ అదౌలాల మధ్య జరిగిన సంభాషణల ఫలితంగా గత 16 నెలల నుంచి జరుగుతున్న వివాదాలకు స్వస్తి జెప్పటానికి ఒప్పందం కుదిరింది.

22-12-1961

బెర్లిన్ సమస్యపై రాయబారం జరగటానికి, మాస్కోలోని అమెరికా రాయబారి తిరిగి సోవియట్ ప్రభుత్వంతో సంప్రదింపులు కొనసాగిస్తాడని ప్రసిడెంట్ కెన్నెడీ, శ్రీ మాక్మిలన్ ప్రకటించారు. వీరుభయుల మధ్య రెండు రోజుల పాటు చర్చలు జరిగిన అనంతరం ఈ ప్రకటన వెలువడింది.

27-12-1961

900,000 డాలర్ల కంటే ఎక్కువ కేటాయించబడిన వివిధ ప్రాజెక్టులను "యునిసెఫ్" ఆమోదించింది.

29–12–1961

ప్రపంచ బ్యాంకు ఇప్పటి (1961 సం.) వరకు ఆసియా దేశాలకు ఇచ్చిన ఋణం మొత్తం 2000 మిలియన్ డాలర్లకు మించినదని ఆ బ్యాంకు వారు తెలిపారు.

2–1–1962

ఘనాకు సెక్యూరిటీ కౌన్సిల్‌లో సభ్యత్వం లభించింది.

8–1–1962

లావోస్ మితవాద పక్ష ప్రభుత్వానికి అమెరికా తాత్కాలికంగా ఆర్థిక సహాయం నిలిపివేసింది.

10–1–1962


జర్మన్ ఆయుధాల కొనుగోలును పెంచటానికి శ్రీ మాక్మిలన్‌కీ తనకూ జరిగిన సంభాషణలలో డాక్టర్ అడెనార్ అంగీకరించారు.

15–1–1962

ప్రెసిడెంట్ షోంబే, కేంద్ర ప్రధాని అదోలా కుదుర్చుకున్న ఒప్పందాన్ని ధృవపరిచే తీర్మానంలోని అంశాలను కటాంగా అసెంబ్లీ ఆమోదించింది.

16–1–1962

అణ్వాయుధ పరీక్షలను నిషేధించే విషయాన్ని తాము పరిశీలించదలచినట్టు బ్రిటన్, అమెరికాలు ప్రకటించాయి.



సత్యాహింసలు సర్వప్రపంచాన్నీ జయించుతాయి — ఏది సత్యం — ఏదసత్యం — ఏది హింస — ఏదహింస అన్న వాటిని నిర్ణయించి యెన్నుకొనడంలోనే మానవుని దైవ — దానవత్వాలు ప్రస్ఫుటమవుతాయి.

ప్రశ్నలు - సమాధానాలు

శ్రీ కోరా సూర్యారావు గోరింట పెద్దాపురం తాలూకా తూర్పు గోదావరి.

ప్రశ్న:— 214 ఏలేరు రిజర్వాయరు పథకాన్ని ద్వితీయ ప్రణాళికా కాలంలో అమలు పరుస్తారని తెలుపబడింది. కాని తృతీయ ప్రణాళిక ఆరంభమైనప్పటికీ ఇంకా ఈ పథకాన్ని చేపట్టలేదు. అయితే ఎప్పుడు ఈ పథకాన్ని అమలుపరుస్తారు? ఈ ప్రాజెక్టు వల్ల ఏయే గ్రామాలలో రెండవ పంటకు నీరు లభిస్తుంది? మొదటి పంటకు నీటి పారుదల సౌకర్యం పొందే గ్రామాలు ఏవి? కొత్తగా లాభం పొందే గ్రామాలు ఏవి?

సమాధానం:— ఈ పథకాన్ని ద్వితీయ ప్రణాళికలో చేర్చలేదు. ఇది ఇరిగేషన్ పథకమే గాక వరద నిరోధక పథకం కూడా. తృతీయ పంచవర్ష ప్రణాళికలో వరద నిరోధక పథకాన్ని మాత్రమే చేర్చారు. నీటి పారుదల పనిని వచ్చే ప్రణాళికలో చేపడ్తారు.

ఈ పథకాన్ని బహుశా తృతీయ ప్రణాళిక చివరి భాగంలో అమలు పరుస్తారు. వచ్చే ప్రణాళికా కాలంలో ఇది పూర్తవుతుంది. ముందుగానే విరాళం లభించే పక్షంలో అంతకు పూర్వమే పని ప్రారంభమయ్యే అవకాశం వుంది.

పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ తాలూకాల గ్రామాలలో మొదటి పంటకాలంలో ప్రస్తుతపు 74,000 ఎకరాల ఆయకట్టుకే కాకుండా 10,000 ఎకరాల కొత్త ఆయకట్టుకు కూడా నీరు లభిస్తుంది. రెండవ పంట కాలంలో కూడా తడవకు 15,000 ఎకరాల చొప్పున ఇవే గ్రామాలకు లాభం కలుగుతుంది. 10,000 ఎకరాల కొత్త ఆయకట్టును దిగువ ప్రాంతంలో స్థిరపరచ టానికి తలపెట్టారు. ఏయే గ్రామాలలో ఆయకట్టు స్థిరీకరణ జరిగేదీ ఇంకా తెలియదు.

శ్రీ కె. రామచంద్రరావు. కొండగడప
నల్గొండ జిల్లా

ప్రశ్న:— 215 నల్గొండ జిల్లా రామన్నపేట తాలూకాలోని మోత్కూరు నాన్ బ్లాకుప్రాంతాన్ని బ్లాకుక్రింద ఎప్పుడు మారుస్తారు?

సమా: నల్గొండ జిల్లా మోతుకూరు బ్లాకులో 1961 అక్టోబరు 2వ తేదీ నుంచి ప్రీ ఎక్స్టెన్షన్ పనిని ప్రారంభించటానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రీ ఎక్స్టెన్షన్ దశలో ఒక సంవత్సరం గడిచిన తరువాత 1962 అక్టోబరు 2వ తేదీన మొదటి దశ బ్లాకుగా ఈ బ్లాకును పై గ్రేడుకు పెంచుతారు,

శ్రీ సి. హెచ్. వీర రాఘవరావు, నెమిలికల్లు
గుంటూరు జిల్లా

ప్రశ్న: 216 గుంటూరు_ అమరావతి రోడ్డుకు పశ్చిమాన వున్న ఉంగుటూరు నెమిలికల్లు పాములపాడు గ్రామాలకు నాగార్జున సాగర్ ప్రాజెక్టు వల్ల లాభం కలుగుతుందా? అయితే ఎప్పటి నుంచి?

సమా: గుంటూరుజిల్లా నెమిలికల్లు, ఉంగటూరు, పాములపాడు గ్రామాలకుకూడా నాగార్జున సాగర్ ప్రాజెక్టుక్రింద నీటి పారుదల చేయటానికి తలపెట్టారు. తృతీయ ప్రణాళిక ముగింపు నాటికి బహుశా ఈ గ్రామాలకు సేద్యపు నీటి సప్లై జరుగవచ్చు.

శ్రీ టి. జి. రమణారావు 15/600 హనుమేశనగర్
గుంటకల్

ప్రశ్న: 217 ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం గుంటకల్‌లో రీరోలింగ్ మిల్లును స్థాపించ దలచిన సంగతి నిజమేనా?

సమా: గుంటకల్‌లో ప్రైవేటు రంగంలో రీరోలింగ్ మిల్లును స్థాపించే ఒక ప్రతిపాదన పరిశీలనలోవుంది. దరఖాస్తు దార్లకు లైసెన్సు మంజూరు చేసే విషయం భారత ప్రభుత్వ పరిశీలనలో వుంది.

శ్రీ నల్లా దత్తాత్రేయులు, మోరి రాజోలు తాలూకా
తూర్పు గోదావరి జిల్లా

ప్రశ్న: 218 వశిష్ట నదిపై సర్పావూర్ వద్ద వంతెన నిర్మిస్తారా?

సమా: 20 సంవత్సరాల అఖిల భారత రోడ్ల అభివృద్ధి ప్రణాళికలో సర్పావూర్ వద్ద వశిష్ట నదిపై వంతెన నిర్మించే ప్రతిపాదన లేదు.

శ్రీ వి. వి. ఎస్. పి. పి. రావు, మచిలీపట్నం.

ప్రశ్న: 219 చెవిటివారు మూగవారి కొరకు తెరచిన ప్రత్యేక ఉద్యోగ సాధక కేంద్ర చిరునామా తెలపండి.

సమా: మన రాష్ట్రంలో వికలాంగుల నిమిత్తం ప్రత్యేకంగా ఒక ఉద్యోగ సాధక కేంద్రాన్ని ఇంకా తెరవలేదు. ఈ విషయంతో భారత ప్రభుత్వం ఆమోదం లభించాల్సివుంది. అయితే మంజూరీ లభించిన వెంటనే వర్తమాన ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర రాజధాని (హైద్రాబాదు) లో దీనిని తెరవటానికి సంకల్పించారు.

శ్రీ బి. ఈశ్వరరెడ్డి దొన్నికోట, కదిరి తాలూకా.

ప్రశ్న: 220: కదిరి నుంచి దొన్నికోటకు విద్యుచ్ఛక్తి సరఫరా చేసే పథకాన్ని ప్రభుత్వం చాలాకాలం క్రితమే మంజూరు చేసింది. పనిని ఎప్పుడు ప్రారంభిస్తారో తెలుపుతారా?

సమా: దొన్నికోట మొదలైన గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేసే పథకాన్ని 1962-63వ సంగలో బడ్జెటు కేటాయింపును బట్టి చేపడ్తారు.

శ్రీ ఎస్. వీరస్వామి బొలిరెడ్డిపాలెం, నెల్లూరుజిల్లా.

ప్రశ్న: 221 ఆరవ జార్జి ప్రభువు బొమ్మవున్న రూపాయి, అర్ధ రూపాయి, పావలా, అణా, కానీ నాణేలు ఎప్పటివరకు చలామణిలో వుంటాయి

సమా: అశోకస్తంభం గుర్తువున్న నాణేలతోపాటు ఆరవజార్జి ప్రభువు బొమ్మవున్న రూపాయి, అర్ధరూపాయి, పావలా, అణా, పైన నాణేలుకూడా వాటిని చలామణిని రద్దుపరిచే పర్యంతం చలామణిలో వుంటాయి. ఈ నాణేలను చలామణిలోనుంచి ఎప్పుడు ఉపసంహరిస్తారో ఇప్పుడే తెలపటానికి భారత ప్రభుత్వానికి సాధ్యంకాదు. ఎందుచేతనంటే ఇది మింట్లు దశాంశ నాణేలను తయారుచేసే శక్తిపైనా, ఈ నాణేలకు వుండే డిమాండుపైన ఆధారపడివుంది.

శ్రీ గుగ్గిలంపాండు రంగారావు, చీరాల.

ప్రశ్న: 222_1957 వ సం. లో కానీ అంతకు పూర్వం కాని జరిగిన ఎస్. ఎస్. ఎల్. సి. పరీక్షకు హాజరై తప్పి ఆ పరీక్షకు తిరిగి ఇప్పుడు కూర్చునదలచిన అభ్యర్థులు హిందీ పేపరుకూడా వ్రాయవలసి వుంటుందా?

సమా: 1959 మార్చినుంచి ఎస్. ఎస్. ఎల్. సి. హాజరయ్యే అభ్యర్థులు విశ్వవిద్యాలయ విద్యను అభ్యసించటానికి అర్హత పొందే నిమిత్తం మూడవ భాషగా హిందీ చదవటం తప్పనిసరి. 1959 మార్చికి పూర్వం మద్రాసు రాష్ట్రంలో కానీ ఇతర రాష్ట్రాలలో కాని పరీక్షకు కూర్చున్నప్పటికీ వారి విషయంలో ఈ నిబంధన మినహాయించబడదు. మన రాష్ట్రంలోని పాఠశాలలనుంచి మొదటిసారిగా పరీక్ష హాజరైనవారు మాత్రమే పరిగణనలోకి తీసుకో బడతారు. 1959 మార్చికి పూర్వం మన రాష్ట్రపు ఎస్.ఎస్.ఎల్.సి. పబ్లిక్ పరీక్షకు ఒక పర్యాయం హాజరైన అభ్యర్థులకూ అలాగే విభజించిన కోర్సు తీసుకునే అభ్యర్థులకు హిందీ అభ్యాసం నిర్బంధం కాదు.

ఈ విషయం, 1961 అక్టోబరు 5వ తేదీ ఆంధ్రప్రదేశ్ గజెటులో 1962 మార్చి లో జరిగే ఎస్. ఎస్. ఎల్. సి. పబ్లిక్ పరీక్షకు హాజరయ్యే ప్రైవేటు అభ్యర్థులకు ఉద్దేశించిన నోటీసులో ప్రకటించటం జరిగింది.

శ్రీ తోటకూర రాజారావు, సంతవరం, గుంటూరు జిల్లా

ప్రశ్న: 223 (అ) నాగార్జునసాగర్ మొదటిదశ పనులు ఎప్పుడు పూర్తవుతాయి. ఎంత ఖర్చవుతుంది?

(ఆ) కుడికాలువను ఎంతదూరం వరకు త్రవ్వుతారు?

(ఇ) ఎన్ని బ్లాకులకు నీరు లభిస్తుంది?

(ఈ) నెల్లూరు జిల్లాలో 19,20 బ్లాకులకు నీరు లభిస్తుందా?

(ఉ) గుండ్లకమ్మకు అడ్డంగా అక్విడక్టును ఎప్పుడు నిర్మిస్తారు?

(ఊ) కుడికాలువ క్రింద ఉద్దేశించిన ప్రాంతమంతటికీ నీరు లభింప జేస్తారా?

(ఋ) మొదటి దశలో ఎన్ని లక్షల ఎకరాలకు నీటి పారుదల జరుగుతుంది?

(ౠ) ఏ స్టేషన్లమధ్య కుడికాలువ మీటర్‌గేజ్ రైలు మార్గాన్ని దాటుతుంది?

సమా: (అ) ప్రభుత్వం మంజూరు చేసిన ప్రకారం నాగార్జున సాగర్ ప్రాజెక్టు మొదటి దశ పనులను రూ. 91.12 కోట్ల వ్యయంతో 1965_1966 నాటికి పూర్తి చేయవలసివుంది. అయితే ధనాభావం వల్ల ప్రాజెక్టుపనుల ముగింపు నాలుగవ పంచవర్ష ప్రణాళికలో జరగవచ్చు.

(ఆ) మొదటిదశలో 135 మైళ్ళవరకు కుడికాలువను త్రవ్వుతారు

(ఇ) ప్రాజెక్టు మొదటిదశలో కుడికాలువక్రింద ఒకటి మొదలు 22 బ్లాకుల వరకు సేద్యపు నీరు లభింపజేయటానికి తల పెట్టారు.

(ఈ) ప్రాజెక్టు తొలిదశలోనే 19,20 బ్లాకులకు కూడా నీరు ఇవ్వ టానికి ఉద్దేశించారు.

(ఉ) గుండ్లకమ్మపై అక్విడక్టు నిర్మాణం 1963_64 వ సం. లో ప్రారంభించబడుతుంది.

(ఊ) నిర్దేశించిన ప్రాంతమంతటికీ నీరు లభింపజేయటానికి సాధ్యంకాదు. నీటి సరఫరా, భూసారం మొదలైన అంశాల దృష్ట్యా కుడికాలువ క్రింద ఆయకట్టు స్థిరీకరణ మొదటి పంట రెండవపంటకు కలిపి 12.7 లక్షల ఎకరా లకు పరిమితం చేయబడుతుంది.

(ఋ) మొదటి దశలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు (కుడి కాలువ ఎడమ కాలువ) క్రింద, 20.6 లక్షల ఎకరాలకు నీటి పారు దల చేయటానికి తలపెట్టారు.

(ౠ) నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడికాలువ, మాచర్ల_గుంటూరు రైలు మార్గాన్ని ప్లవాయ్ మాచర్ల స్టేషన్ల మధ్య 12/2+520 వద్ద దాటుతుంది.

మామిళ్లశాస్త్రి హుండేశ్వరపురము రాజమండ్రి తాలుకా

ప్రశ్న: 224 రాజమండ్రి తాలుకాలోని హుండేశ్వరపురం, బుచ్చం పేట మధురపూడి గ్రామాలకు తృతీయ ప్రణాళికాకాలంలో విద్యుచ్ఛక్తి సరఫరాజేస్తారా ఈ తాలుకాలో ఈకాలంలో ఏయే గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా జరుగుతుంది. 1962మార్చి మా గ్రామాలకువిద్యుచ్ఛక్తి సరఫరా జరుగుతుందా?

సమా: హుండేశ్వరపురం వరకు సరఫరాను విస్తరింపజేశారు బుచ్చంపేట,మధురపూడి గ్రామాలలో 1961__62వ,సం॥ లో పరిశీలనలు జరపటానికి తలపెట్టారు. వీటికి సంబంధించిన ప్రతిపాదనలు పథకం స్వయంపోషకం కాగలిగే విధంగా ఈ ప్రాంతంలో తగు ప్రోత్సాహం లభించే పక్షంలో రూపొం దించ బడుతాయి. తృతీయ ప్రణాళికా కాలంలో రాజమండ్రి తాలుకా లోని దిగువ గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయ టానికి తలపెట్టారు. వీటికి సంబంధించిన ప్రతిపాదనలు పథకం స్వయం పోషకంకాగలిగే విధంగా ఈ ప్రాంతంలో తగు ప్రోత్సాహం లభించే పక్షంలో రూపొందించ బడతాయి.

తృతీయ ప్రణాళికాకాలంలో రాజమండ్రి తాలూకాలోని దిగువ గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయటానికి తల పెట్టారు: (1) శ్రీరంగపట్నం, (2) రఘుదేవపురం, (3) రాపాక, (4) ముగ్గుల, (5) సీతానగరం, (6) ఇనుగంటివారి పాలెం, (7) డి. ఇర్రపాలెం, (8) పాతతుంగపాడు, (9) కొండగుంటూరు, (10) సంపత్‌నగరం, (11) దామిరెడ్డిపల్లి. (12) మాధవరాయుడుపాలెం, (13) గోకవరం, (14) కోరు కొండ. (15) కేసవరం, (16) కాపవరం, (17) వెలుగు బంద, (18) రంప ఎర్రంపాలెం, (19) కొలమూరు, (20) కొంతమూరు [హెచ్] (21) పలచర్ల, (22) గాదరె. (23) తంటికొండ, (24)కృష్ణునిపాలెం, (25) బొల్లెద్దుపాలెం, (26) పుణ్యక్షేత్రం, (హెచ్) (27) భూపాలపట్నం, (28) శ్రీకృష్ణప ట్నం, (29) రాజన్నపాలెం, (30) తోకద, (31) మల్లంపూడి, (32) ముక్కండ, (33) మధురపూడి, (34) బుచ్చంపేట,

(35) మామిడివాడ, (36) ఇటికాయలపల్లి, (37) గాదెల పాలెం, (38) రాజుపాలెం, (39) కొత్తపల్లి, (40) గునిమల్ల దొడ్డి, (41) సీతారామపురం, (42) జంబూపట్నం, (43) గదరడ, (44) ములకల్లంక, (45) కన్నవరం, (46) కోటి, (47) నల్గొండ, (48) మునిగాల.

ఈ ప్రతిపాదనలు లాభసాటి మైనవిగా తేలి, అవసరమైన నిధులు, వస్తువులు అందుబాట్లో వుండేపక్షంలో పై గ్రామాలకు విద్యుత్ సౌకర్యాలను విస్తరింప జేయటంలో ఇబ్బంది ఏమి వుండదు.

శ్రీ సి. హెచ్. నారాయణమూర్తి, సీతారామపురం,
పశ్చిమ గోదావరి జిల్లా.

ప్రశ్న: 225 కాపులేక తెలగ, సెట్టి బలిజ కులాలను వెనుకబడిన తరగతుల జాబితాలో చేర్చటానికి ప్రభుత్వం నిశ్చయించిందా?

సమా: సెట్టిబలిజ, తెలగ లేక కాపు కులాలను వెనుకబడిన తరగతుల జాబితాలో చేర్చటానికి ప్రభుత్వం ది. 14-10-1961 గల విద్యా (సాంఘిక సంక్షేమం) శాఖ జి. ఒ. ఎమ్. ఎస్. నెం. 2250లో ఉత్తర్వులు జారీ చేసింది.

శ్రీ బి. మల్లేశ్వరరావు, శ్రీకాకుళం.

ప్రశ్న: 226 గులాబి మొక్కలకు ఏయే ఎరువులను వాడాలి?

సమా: గులాబిమొక్కలకు దిగువ విధంగా ఎరువులు వాడవచ్చు:

కుండీ మిశ్రమం:	బాగా కుళ్లిన ఎరువు	ఆరు భాగాలు
	ఆకు ఎరువు	మూడు ,,
	ఇసుక	రెండు ,,
	ఎర్ర మన్ను	నాలుగు ,,
	తోటమన్ను	రెండు ,,

శ్రీ ఎ. గంగయ్య, [illegible]పేట, నిజామాబాదు జిల్లా.

ప్రశ్న: 227. మిరపచెట్లకు వస్తున్న రోగాల నివారణకు ఏమి మందులు వాడాలో తెలుపుతారా?

సమా: దిగువ మిశ్రమాన్ని చల్లవచ్చు:

1. ఆముదం కేకు	5 పా
2. అమోనియం సల్ఫేటు	1 పా.
3. సూపర్ ఫాస్ఫేటు	1 పా.
4. పొటాసియం సల్ఫేటు	1 పా.
5. స్టెర్ మీల్	2 పా.

ఒక పౌను మిశ్రమాన్ని బా[illegible] ఎదిగిన చెట్లపై చల్లాలి. నీరు బాగా పెట్టాలి

శ్రీ నారాయణరెడ్డి, గండిమసానీపేట, ఎల్లారెడ్డి
తాలూకా, నిజామాబాదు జిలా.

ప్రశ్న: 228 తెలంగాణా భూముల సర్వే పార్టీ ప్రధానాధికారి ఎవరు? ఆయన విధులు, అధికారము లేవి?

సమా: సెటిల్మెంట్సు, సర్వే, ల్యాండ్ రికార్డ్సు డైరెక్టరు ప్రధానాధికారి, ఇద్దరు డిప్యూటీ డైరెక్టర్లు— ఒకరు సర్వేలో మరొకరు లాండ్ రికార్డ్ కార్యక్రమాలలో వీరికి సహాయకులుగా వున్నారు. వీరికి సర్వే పార్టీ అనగా సర్వే చేయువారి విధుల పైనా నియామకముల పైన సంపూర్ణాధికారం కలదు.

ప్రశ్న: 229 భూములు సర్వే చేయువారికి ప్రభుత్వ భూములను (పోరంబోకు ఖారజుఖాత) పట్టా చేయుటకూ, కొన్ని భూములను పట్టా చేయుటకు అధికారమున్నదా? ఇందుకు సంబంధించిన అధికారములు తెలియ పరచవలెను. ఈ విషయంలో ఆంధ్ర, తెలంగాణా జిల్లాలకున్న భేదమేమి?

సమా: ప్రస్తుతం భూములు సర్వే చేయువారికి పట్టాలిచ్చు అధికారం లేదు. వీరికి సరిహద్దుల నిర్ణయంపై మాత్రం అధికారం కలదు

ఆంధ్ర తెలంగాణా సర్వేశాఖల, విలీకరణమునకు ముందు తెలంగాణాలో సర్వేపనులు సెటిల్మెంటు పనులు చేయుటకు కావల్సిన పని అనగా మట్టి తరగతి నిర్ణయము, శిస్తునిర్ణయము ఒకే అధికారి చేయుచుండే వారు ఆంధ్ర తెలంగాణా శాఖల విలీకరణ తరువాత సర్వే సెటిల్మెంటు పనులకు వేరువేరు అధికార్లు నియమించబడినారు. ఈ రెండు శాఖలు ఒకే డైరెక్టరు అజమాయిషీ క్రింద వున్నవి

ఆంధ్ర తెలంగాణాలలో పట్టాలనిచ్చు కార్యక్రమం రెవెన్యూ అధికార్ల చేతులలో వుంది. ఆంధ్రలో జమీందారీల రద్దు చట్టం క్రిందకి వచ్చే గ్రామాలలో మాత్రం సెటిల్మెంటు పనులు పూర్తయ్యే వరకు ఈ అధికారం సెటిల్మెంటు అధికార్లకున్నది.

గడ్డిపూలు

శ్రీ కమ్మిశెట్టి వెంకటేశ్వరరావు

రాగమయ కిర్మీరకాంతుల
రంగవల్లుల శోభలీనుచు
విశ్వకవిలేఖిని లిఖించిన
విమల కవితాక్షరములోయన

ఈ ప్రభాతాంగణములో విక
సించు నీచిరు గడ్డిపూవులు
హాయిమై చిరునవ్వులొలికెడు
తీయ తీయదనాలప్రోవులు—

చింతవంతలు సుంతలేని ప్ర
శాంత నిర్మల జీవితమ్ముల
స్వచ్ఛదరహాసాలనే వెద
జల్లగల నిష్కామజీవులు—

అల్పకాల వ్యవధిలోపల
ఆరిపోయిననేమి బ్రతుకులు
సృష్టిసౌందర్య ప్రభల వె
ల్గింప ఆత్మార్పణ మొనర్తురు

ఈ విపుల భూనందనో ద్యా
న వాటికలో కళ్లు విప్పిన
అనుగు నెచ్చెలులార! మీరలు
అమర సందేశాక్షరమ్ములు—

ఎదియో మీ గుసగుసలలో విని
పించు విశ్వరహస్య తత్త్వము—
పురిని విప్పునిదేలో చంద్రకి
వోలె నాలో మానవత్వము— **

సంగ్రహ ప్రకటనలు

ఎన్నికల కరపత్రం, పోస్టరు మొదలైన వాటిని ముద్రించదలచిన వారు ప్రచురణ కర్త గుర్తింపుకు సంబంధించిన వివరాలతో కూడిన పత్రాన్ని ముద్రాపకునికి ఇవ్వాలి. ప్రచురణ కర్త సంతకంతో పాటు దాని మీద అతను వ్యక్తిగతంగా ఎరుగున్న ఇద్దరు వ్యక్తుల సంతకాలు కూడా వుండాలి. ఈ పత్రాన్ని రెండు ప్రతులలో ముద్రాపకునికి అందజేయాలి. గుర్తింపు పత్రం ఇవ్వనిదే ముద్రాపకులు ఎన్నికల కరపత్రం లేదా పోస్టర్ల ముద్రణను చేపట్టకూడదు. పత్రాన్ని ముద్రించిన తరువాత ముద్రాపకుడు గుర్తింపు పత్రం ప్రతినీ దానితో పాటు డాక్యుమెంటు ప్రతిని జిల్లా మెజిస్ట్రేటుకు పంపించాలి. అచ్చొత్తించే పని జిల్లా ప్రాంతంలో కాక రాష్ట్ర రాజధానిలో జరిగే పక్షంలో వాటిని జిల్లా మెజిస్ట్రేటుకు బదులు ఎన్నికల ప్రధానాధికారికి పంపించాలి.

1951 వ సంవత్సరపు ప్రజా ప్రాతినిధ్య చట్టం 127-ఎ సెక్షను నిబంధనల ననుసరించి ఇలా చేయటం అవసరం. దీనిని ఉల్లంఘించిన వారిపై చర్య తీసుకుంటారు.

సమీకృత పాలసరఫరా పథకం

హైదరాబాదు, విజయవాడలలో అమలు పరచే సమీకృత పాల సరఫరా పథకం ముసాయిదాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమోదించింది. భారత ప్రభుత్వం యీ పథకాన్ని ఆమోదించిన తర్వాత ముసాయిదాలోని నిర్దేశించిన స్వల్పకాలిక, దీర్ఘకాలిక కార్యక్రమాలను అమలు చేయడానికి చర్యలు తీసుకుంటారు. ఈ పథకం వల్ల ప్రభుత్వానికి దాదాపు 3.6 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. రు. 78 లక్షల విలువ చేసే యంత్ర పరికరాలను యునిసెఫ్ సరఫరా చేస్తుంది. 1963 నవంబరు నుండి పాల ఉత్పత్తి జరుగుతుందని ఆశిస్తున్నారు.

సమీకృత పాల సరఫరా పథకానికి నాందిగా హైదరాబాదు విజయవాడలలో రు. 8,11,668 ల ఖర్చుతో పైలట్ పథకాన్ని 1959-60 వ సంవత్సరంలో మంజూరు చేశారు. విజయవాడ, హైదరాబాదులలో యీ ప్రాజెక్టును నెలకొల్పడానికి యునిసెఫ్ ప్రతినిధి ఎన్నిక చేసిన స్థలాన్ని సేకరించడానికి ప్రభుత్వం ఆమోదం లభించింది. సమీకృత పాల సరఫరా పథకం అమలుకు సంబంధించిన అన్ని విషయాలలో ప్రభుత్వానికి సూచనలు ఇవ్వడానికి ఒక పాల సలహా సంఘాన్ని కూడా ప్రభుత్వం నియమించింది.

తాత్కాలికోద్యోగుల స్థానే కమిషను అభ్యర్థుల నియామకం

తాత్కాలిక ప్రభుత్వోద్యోగులను తొలగించి ఆ స్థానాల్లో పబ్లిక్ సర్వీసు కమిషను ఆమోదించిన అభ్యర్థులను నియమించే విషయంలో తన విధానానికి సంబంధించి ప్రభుత్వం ఇటీవల దిగువ వివరణను జారీ చేసింది.

తాత్కాలిక నియామకాలను ఎక్కువ కాలం వరకు కొనసాగనివ్వవద్దని ప్రభుత్వం పదే పదే ఆదేశాలు పంపుతూ ఉంది. ఉద్యోగ నియామకాలకు, అభ్యర్థులకొరకై కమీషన్ ప్రతి సంవత్సరం పరీక్షలు ఏర్పాటు చేస్తున్నది. దీర్ఘకాలం నుంచి సర్వీసులో ఉన్న తాత్కాలిక ఉద్యోగుల నిమిత్తం 1960 వ సంవత్సరంలో ప్రత్యేక పరీక్షను కూడా ఏర్పాటు చేసింది. ఐనా తాత్కాలిక ఉద్యోగుల సంఖ్య పెరుగుతూనే ఉంది. దీనివల్ల కమీషన్ పరీక్షలకు ఫీజు చెల్లించి, కష్టపడి పరీక్షలలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఉద్యోగ నియామకావకాశాలు లేకుండా పోతున్నవి. ఉద్యోగ నియామకాలను తక్షణం కేటాయించడానికి కమీషన్ అభ్యర్థుల

తగినంత మంది సిద్ధంగా ఉన్నారు. అందుకే అత్యవసరంగా నియమించబడిన తాత్కాలిక ఉద్యోగుల స్థానే కమీషన్ ధృవపరచిన అభ్యర్థులను నియమించడానికి ఒక తేదీ నిర్ణయించి, దానిని అనుసరించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

తాత్కాలిక ఉద్యోగులకు సంబంధించినంత వరకు, వారి ఉద్యోగ నియామకం తాత్కాలికమనీ, కమీషన్ ఏర్పాటు చేసే పరీక్షలలో ఉత్తీర్ణులై ఎన్నిక కానిదే వారిని ఉద్యోగంలో ఖాయం చేయరనే విషయం వారికి తెలుసు. సర్వీసులో ఉండాలంటే కమీషన్ ఎన్నిక అవసరమనే విషయం కూడా వారికి తెలిసిందే.

అందువల్ల కమీషన్ ఏర్పాటు చేసే పరీక్షలకు అర్హమైన వయస్సు ఉన్నప్పుడే కూర్చొని ఉత్తీర్ణులు కాకపోవటం పూర్తిగా అభ్యర్థుల తప్పిదమే కాగలదు. పబ్లిక్ సర్వీసు కమీషన్ పరీక్షలు ఉత్తీర్ణులైన వారికి, ఆయా ఉద్యోగాలలో నియమించబడటానికి హక్కు ఉంటుంది.

ఈ కారణంగా ఇప్పుడు ఉన్న తాత్కాలికంగా నియమింపబడిన ఉద్యోగులను నిరవధికంగా ఉంచడం గానీ, లేక వారిని యథా స్థానంలో ఉంచడానికి వీలుగా దిగువ స్థాయిలో మళ్ళీ ఒక ప్రత్యేక పరీక్ష ఏర్పాటు చేయడం గానీ న్యాయ సమ్మతం కాదు.

పబ్లికేషన్ బ్యూరో అమ్మకం విభాగం

బషీర్‌బాగ్‌లో గాంధీ వైద్య కళాశాలకు ఎదురుగా 1961 డిసెంబరు 39 వ తేదీన ప్రభుత్వ ప్రచురణల శాఖ విక్రయవిభాగాన్ని తెరిచారు. కేంద్ర ప్రభుత్వ ప్రచురణలు గెజెటు ప్రతులు, వీక్లి క్రేడ్ బ్యులెటన్లు, ఇండియన్ లా రిపోర్టులు ఇక్కడ లభిస్తాయి. ఉదయం 9 గం. నుంచి మధ్యాహ్నం 12 గం. వరకూ తిరిగి సాయం 3-00 గంటల నుంచి రాత్రి 7 గం. వరకు దీనిని తెరిచి వుంచుతారు.

పారిశ్రామిక ఎస్టేట్ల కమిటీలు

రాష్ట్రంలోని పారిశ్రామిక ఎస్టేట్లలో ఫ్యాక్టరీ భవనాలు, ఫ్యాక్టరీ స్థలాల కేటాయింపుకు పెట్టుకునే దరఖాస్తుల విషయంలో సిఫార్సులు చేసే నిమిత్తం జిల్లా కమిటీలను నియమించటానికి ప్రభుత్వం ఆమోదించింది. సనత్‌నగర్‌లోని పారిశ్రామిక ఎస్టేట్లు జంట నగరాలలోని ఇతర పారిశ్రామిక ఎస్టేట్లలో ఫ్యాక్టరీభవనాలు, ఫ్యాక్టరీ స్థలాల కేటాయింపుకు కూడా ఇలాంటి కమిటీ నియమించబడుతుంది.

ప్రాంతీయ భాషలలో పరీక్షలు

పూర్వ హైద్రాబాదు ప్రభుత్వ విద్యాశాఖ ప్రాంతీయ భాషల పరీక్షలను 1961 డిసెంబరు 21వ తేదీ నుండి రద్దుచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ సర్వీసు, ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖా సబార్డినేటు సర్వీసుల అధికారులు ఉత్తీర్ణులు కావలసిన ప్రాంతీయ భాషల పరీక్షల వివరాలను విద్యాశాఖ విడిగా ప్రకటిస్తుంది. పూర్వ హైద్రాబాదు ప్రభుత్వపు ప్రాంతీయభాషలలో ఉత్తీర్ణులుకాని కారణంగా 1959 మే 1వ తేదీ నుండి ఆపుచేసిన విద్యాశాఖ సాంకేతిక, విద్యాశాఖల గెజెటెడు ఉద్యోగుల యింక్రిమెంట్లను తిరిగి మంజూరు చేయాలని కూడా ప్రభుత్వం ఆదేశించింది.

పారిశ్రామిక గృహ నిర్మాణ పథకం

సహాయక పారిశ్రామిక గృహ నిర్మాణ పథకం క్రింద గుంటూరులో సుమారు రూ. 5,62,500ల వ్యయంతో 150 ఒకగది ఇండ్లను (రెండంతస్తులవి) నిర్మించటానికి ప్రభుత్వం ప్రణాళికలనూ, అంచనాలను ఆమోదించింది. భూమి ఖరీదు, నీటి సరఫరా, విద్యుచ్ఛక్తి సరఫరా, పారిశుద్ధ్యపుటేర్పాట్లు, రోడ్లు మొదలైన సదుపాయాలు కల్పించటానికి అయ్యే ఖర్చులను పై అంచనా మొత్తంలో చేర్చలేదు. వర్తమాన సంవత్సరంలో ఈ పథకానికి రూ. 2 43 లక్షలు మంజూరు చేశారు.

సంస్కృత పరీక్ష

ఆంధ్రప్రదేశ్‌లో మరుసటి సంస్కృత ఎంట్రెన్సు పరీక్షలు 1962 ఏప్రిల్ నెలలో జరుగుతాయి. పరీక్షకు హాజరు కాగోరే అభ్యర్థులు తమ దరఖాస్తులను హైద్రాబాదులోని ప్రభుత్వ పరీక్షల కమీషనరు కార్యాలయానికి 1962 ఫిబ్రవరి 28 తేదీ వరకు అందజేయాలి. రూ. 1 విలంబన రుసుంతో 1962 మార్చి 10 వ తేదీ వరకు కూడా దరఖాస్తులు దాఖలు చేయవచ్చు.

మోటారుబండ్ల ఇన్స్పెక్టర్ల యూనిఫారములో మార్పు

ప్రభుత్వ వుత్తర్వులననుసరించి మోటారుబండ్ల ఇన్స్పెక్టర్లు, అసిస్టెంటు ఇన్స్పెక్టర్లు, రీజినల్ మోటారుబండ్ల ఇన్స్పెక్టర్లు

1962 జనవరి 1 వ తేదీ నుండి, నీలవర్ణం టోపీ, తెల్లని యూనిఫారము, విజిల్ కార్డు ధరిస్తారు. ఇంతవరకూ వీరు ఖాకీ యూనిఫారము ధరించెడివారు. పై అధికారులందరూ యెప్పటివలె అయిడెంటిఫికేషన్ వెంట వుంచుకుంటారు.

"రాజకీయ బాధితుడు"

రాజకీయ బాధితుల పిల్లలకు స్కాలర్‌షిప్పులు లేదా ఇతర విద్యా సౌకర్యాలు లభింపజేసే పథకానికి సంబంధించి భారత ప్రభుత్వం, భారత విమోచనానికై జరిగిన జాతీయోద్యమాలలో పాల్గొన్న ఫలితంగా మధ్యమధ్య కొద్దికాలం పాటు జైలు శిక్ష లేక డిటెన్షన్ను అనుభవించిన వారు కూడా రాజకీయ బాధితులుగా పరిగణించ బడతారనీ అయితే ఆవిధంగా అనుభవించిన జైలు శిక్ష లేక డిటెన్షనుల మొత్తం కాలం ఆరు నెలలకు తగ్గకుండా వుండాలనీ వివరణ ప్రకటించారు.

ఇజారా కౌలు భూము చట్టం

1961 ఆంధ్రప్రదేశ్ (తెలంగాణా ప్రాంతం) ఇజారా, కౌలుభూమి అక్రమ పట్టాల రద్దు పన్ను రాయితీల రద్దు చట్టం, 1962 జనవరి మొదటి తేదీ నుంచి అమల్లోనికి రానున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

ఆంధ్రప్రదేశ్

శాలవాహనప్రాజ్య సామ్రాజ్యమునఁ బుట్టి చిఱునవ్వు వెన్నెలం జిలుకునాఁడు
చాళుక్యకులపతి చల్లని యొడిలోన మొదట గంటముఁ బట్టి మురియునాఁడు
కదనపండితులైన కాకతీయులసీమఁ గంటఁ గాటుకనీరు కదుపునాఁడు
కృష్ణరాయనివీటఁ గేలూఁతగాఁ గొని యిభకుంభమెక్కి యూరేఁగునాఁడు

హృద్యపద్యానవద్యగద్యాద్యవిద్య
లెల్ల పుక్కిటఁబట్టి కేరింతలాడె;
నట్టిసద్యశ మీనాఁడు నమరునట్లు
పావ 'నాంధ్రప్రదేశంబు'ఁ గావుదేవ!

— శ్రీ కట్టా చంద్రశేఖర శాస్త్రి

జిగీష

శ్రీ యఱ్ఱమిల్లి చలపతిరావు శ్రీవత్సవ

రమ్యశాంతశరత్ చంద్రికా రుచులలో
విమలమో, స్వచ్ఛమో, వినువీధివెలుగులో
మినుకుమినుకుమని మెరియు, మిన్నేటి మణులలో
ఐక్యమైకలసిపోనా? ఈరేయి అందముగ మెరసిపోనా?


గలగలా పారేటి సెలయేటిపాటలో
మిలమిలా మెరసేటి కెరటాల, మెరపులో
నీలినీలాల బంగారు, నీరమ్ముతో
ఐక్యమైకలసిపోనా? ఈరేయి, అందముగ మెరసిపోనా!

అరవిచ్చు సిరిజాజి పూకన్నెసౌరులో
విరిసేటి సౌగంధాల సుమవీటిలో
అమృతలతికల పరిష్వంగసౌరభమొసగ
పయనించు చిరుగాలి సుడులతో, అలలతో
ఐక్యమైకలసిపోనా? ఈరేయి, అందముగ తేలిపోనా?

అంతులేనట్టి నీలాకాశజలధిలో
అంచలై సాగేటి అందాలమేఘాల
మాలికలదోలలో, జలతారు మబ్బుతో
ఉయ్యాలలూగిపోనా? ఈరేయి, దోబూచులాడుకోనా?

పరతెంచు సెలయేటి, కెరటాల అలలపై
వినిపించువినువీధి వేణుస్వనమ్ములో
సెలయేటి తీరాల విరిసేటికుముదిని
కాంతా పరిష్వంగ గాఢాశ్లేషమ్ములో
మత్తిల్లిపాడేటి మధుపమ్ముపాటలో
ఐక్యమైకలసిపోనా? ఈరేయి, రాగమైకరిగిపోనా?

ఘనపర్వతాగ్ర ప్రదేశ శ్రీగంధ
పాదపము వాసమై పరగేటి మిణ్ణాగు
అలసటతో నిద్రకై ఆవులించిన వేళ
పరతెంచు శ్రీగంధసౌరభశ్రేణితో
ఐక్యమైకలసిపోనా? ఈరేయి ఆకాశ పథమునం దెగిరిపోనా?



పారిశ్రామిక విశేషాలు

(1961 డిసెంబరు)

(రాష్ట్ర పారిశ్రామిక రంగంలో అనుదినం అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టబడుతున్నాయి. పారిశ్రామిక వేత్తలు, ప్రజలు వాటిని గురించి తెలుసుకోవటంఅవసరం అనే దృష్టితో ముఖ్య పారిశ్రామిక విశేషాలు ఈ శీర్షిక క్రింద యివ్వడం జరుగుతున్నది)

కేంద్రపరిశ్రమలు

సనత్‌నగరులో నెలకొల్పబడే సింథటిక్‌డ్రగ్ ఫ్యాక్టరీ ప్రాథమిక పనులు, రామచంద్రాపురం వద్ద నిర్మింపబడే భారీ విద్యుత్పరికరాల కర్మాగారం పనులు చురుకుగా జరుగుతున్నవి.

ప్రైవేటు రంగం

సిమెంటు పరిశ్రమ

నల్లగొండ జిల్లా భువనగిరిలో ఒక సిమెంటు ఫ్యాక్టరీని స్థాపించడానికి ప్రైవేటు బృందానికి భారత ప్రభుత్వం లైసెన్సు జారీ చేసింది. యిందులో సంవత్సరానికి 1,67,620 టన్నుల సిమెంటు తయారు అవుతుంది. 1962–63వ సంవత్సరానికి ముందే దీనిని నెలకొల్పుతారు. రాష్ట్రంలో యింతవరకూ స్థాపించబడిన 5 సిమెంటు ఫ్యాక్టరీలు విజయవాడలో నిర్మించడానికి లైసెన్సు జారీఅయిన సిమెంటుఫ్యాక్టరీలతోడు అదనంగా దీనిని నిర్మిస్తారు.

బొగ్గు గనుల పరిశ్రమ

ప్రభుత్వం ఆధీనంలో ఉన్న సింగరేణి బొగ్గు గనులలో ఉత్పత్తి ఉచ్ఛ స్థితిలో ఉంది. 1961 అక్టోబరు నెలలో 251,779 టన్నుల బొగ్గు ఉత్పత్తికాగా, గత సంవత్సరం యిదే కాలంలో 213,766 టన్నులు, 1962 సెప్టెంబరు మాసంలో 249,195 టన్నుల ఉత్పత్తి అయ్యింది.

చక్కెర పరిశ్రమ

నిజాం చక్కెర ఫ్యాక్టరీ విస్తరణ కార్యక్రమం దాదాపు పూర్తికా వచ్చింది.

జానకంపేట (నిజామాబాదు జిల్లా) లో ఒక చక్కెర ఫ్యాక్టరీని నిర్మించడానికి భారత ప్రభుత్వం లైసెన్సు జారీ చేసింది. రోజుకు 1,000 టన్నుల చెఱకును పిండే శక్తి గలిగి ఉంటుంది. యీ ఫ్యాక్టరీని సహకార రంగంలో నిర్మిస్తారు. దీనికి ప్రభుత్వ సహాయంకూడా లభిస్తుంది. రాష్ట్రంలోని తెలంగాణా ప్రాంతంలో యిది రెండవ చక్కెర ఫ్యాక్టరీ.

పిఠాపురంలో ఉన్న చక్కెర ఫ్యాక్టరీయొక్క రోజుకు 1000 టన్నుల ఉత్పాదక శక్తిని 1,300 టన్నుల పెంచే విస్తరణ కార్యక్రమాన్ని భారత ప్రభుత్వం ఆమోదించింది.

వస్త్ర పరిశ్రమ

రాష్ట్రంలో 4 బట్టల మిల్లులను స్థాపించడానికి అవసరమైన లైసెన్సులను భారత ప్రభుత్వం జారీ చేసింది. ప్రతి దానిలో అదనంగా 6,000 కదుళ్లు ఉంటాయి. వీటి విస్తరణ కార్యక్రమం పూర్తి అయిన తర్వాత కదుళ్ల సంఖ్య 106,936 కు పెరుగుతుంది.

లైసెన్సులు జారీ అయినవి: సిఫారసు చేసిన

దరఖాస్తులు:

రాష్ట్రంలో పత్తి గింజల నూనె ఫ్యాక్టరీల శక్తిని పెంచడానికి లైసెన్సు జారీ చేయడమేగాక హైద్రాబాదులో ఒక ఆటోమాటిక్ బరువుల తెల్పే యంత్రాల ఫ్యాక్టరీని నెలకొల్పడానికి ప్రైవేటు పారిశ్రామికునికి లైసెన్సు మంజూరు చేశారు. రాష్ట్రంలో మరికొన్ని సిమెంటు ఫ్యాక్టరీల స్థాపించడానికి ప్రైవేటు వ్యక్తులనుండి వచ్చిన దరఖాస్తులను భారత ప్రభుత్వానికి సిఫారసు చేయబడ్డాయి.

చేతి పనుల పరిశ్రమ

అఖిలభారత చేతి పరిశ్రమల బోర్డు అధ్వర్యాన అమెరికాకు చెందిన కుమారి బియట్రిస్‌వుడ్ ఒక పింగాణి ప్రదర్శనను హైద్రాబాదులో 1961 డిసెంబరు 12 వ తేది నుండి 18 వ తేది వరకు నిర్వహించారు. లఘు పరిశ్రమల మంత్రి. యీ ప్రదర్శనకు ప్రారంభోత్సవం చేశారు. యిందులో ప్రదర్శించబడ్డ వస్తువులు ప్రేక్షకులను బాగా ఆకర్షించాయి.

విద్యుచ్ఛక్తి సరఫరా

1961 నవంబరు నెలలో శ్రీకాకుళం జిల్లాలోని దిగువ గ్రామాలకు విద్యుచ్ఛక్తి సౌకర్యం కల్గించారు.

(1) వెంకటపతిరాజుపేట (పాలకొండతాలుకా భాసూర శివారు)

(2) సుడిగం (3) ఫత్తూరు (4) మూడెడ్లవలస (5) తాళ్ళవలస (పార్వతీపురం తాలుకా లోవి)

1961 నవంబరులో చిత్తూరు జిలాలోని దిగువ గ్రామాలకు విద్యుచ్ఛక్తి లభించింది.

(1) కుమార బొమ్మరాజుపురం (పుత్తూరు తాలుకా)

(2) తిరుమలకుప్పం (పుత్తూరు తాలుకా)

(3) అత్తూరు (సత్యవీడు తాలుకా)

(4) అల్లపుకృ౦ం (సత్యవీడు తాలుకా)

ఇదే మాసంలో అనంతపురం జిల్లాలోని దిగువ గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేశారు.

(1) బట్టిపల్లె (అనంతపురం తాలుకా)

(2) గాదేకల్లు (3) విదపనకల్లు (4) వేటపుమకుగు (5) సాసికొమ్ములు కొట్టాల (6) హన్‌చనహాలు (యివి ఐదు గుత్తి తాలుకా లోవి)

తెలంగాణా ప్రాంతంలోని దిగువ గ్రామాలకు విద్యుచ్ఛక్తి సౌకర్యం కల్గించారు.

(1) పేకులసోమవరం (నల్లగొండ జిల్లా, భువనగిరి తాలుకా)

(2) హోటికుర్దు (మెదకు జిల్లా, జహీరాబాదు తాలుకా)

(3) కొత్తకొత్తూరు (ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి శివారు)

(4) పోతాయిపల్లి (హైద్రాబాదు జిల్లా, మేడిచల్ తాలుకా)

భారతభాగ్యశ్రీ

శ్రీ పేరాల భరత శర్మ

ఆసముద్రహిమాచల వ్యాప్తఖేల
నోత్సవమెవరీపసితల్లి? మొలక చిరున
గవుల యమృతము భాగ్యరేఖలను దీర్చు
భరత పుత్త్రిల మందిర ప్రాంగణాల.

యుగయుగాలు మాధాత్రి పైనుండు మమ్మ
తల్లి స్వాతంత్ర్యసౌభాగ్య ధర్మవల్లి!
కోటి ముకుళిత హస్తాలగూడి భరత
పుత్త్రిలర్పించు ప్రేమంపు పువులుదాల్చి.

ప్రాచ్యపాశ్చాత్య సంస్కృతీ భవ్యగరిమ
దిగ్దిగంత విశ్రాంతమై తేజరిల్ల
నభ్యుదయమార్గ గమనమ్ము నరయుచున్న
మాకునీనవ్వనన్ చందమామవెలుగు

నీనడల మెత్తదనముచేనౌను! క్రొత్త
పులకరింతలు పొడమెను పుడమికిపుడు
రాలసీమల రసములుజాలు వారె
గర్భమందున్న రత్నముల్ కనుగొనంగ

కలదుహిమాద్రి ధైర్యగుణ గౌరవమీ భరతాళి గుండెలన్
బలపడజేయగా: కలద పాంపతి స్వీయగభీరలక్షణో
జ్జ్వలులనుజేయగా; నలుదెసల్ పరికించిన వీరెరక్షగా
గలభరతోర్వరియొప్పెడు సుఖ ప్రభవాద్భుతదివ్యధామమై

కలదుహిమాద్రి యోషధుల కమ్మదనమ్మున గంధవాహునన్
మలయగజేయభారతుల మానసవీధుల; సాగరుండు నుం
గలడు చిరత్న రత్ననవ కాంతుల భారతభాగ్యసౌధమున్
వెలుగగజేయ; నిర్వ్యరకు పెట్టినపేరిటువంటియోగ్యతన్.

తలచిన సాధుజీవనవిధాన సమంచితవర్తనమ్ములం
దిఁవిహరించుచుః బ్రజల నెల్లరదన్పునదీమతల్లులన్
గలరు ప్రణాళికామధుర కావ్యములన్ రసరాగబంధురో
జ్జ్వలసుషమాకృతిన్ నవ నవమ్ముగ భారతధాత్రిదీర్చుచున్

గగనలక్ష్మికి తనకై నేత పసుపు
కుంకుమపూత నిత్యోత్సవమ్ములకూత,
భువిపైన స్వర్ణలక్ష్మి నవతరింపగజేయు
రథచక్రమే తనలాంఛనమ్ము;
సకలప్రజలు సుఖసౌధమెక్కఁగ తన
వన్నెలు దివ్యసోపానపంక్తి;
తనరూపురేఖలే తనరు భారత యశో
లక్ష్మిమనోజ్ఞచేలాంచలమ్ము

గాగభారతీయుల భాగ్యగరిమమెసగ
నెపుడునాకాశ వీథిలో నెగయుగాత
మీ త్రివర్ణపతాక మెన్నేటినీటి
తుంపురులభిషేకమ్ముగా తొలకరింప



పంచాయతీరాజ్య పురోగమనం

మధ్యాహ్న భోజన కేంద్రం

1961 నవంబరు నెలలో కొడిగనహళ్లి బ్లాకు (అనంతపురం జిల్లా) లోని పులికుంట్ల గ్రామం రైతులు, పాఠశాల బాలబాలికలకు మధ్యాహ్న భోజన కేంద్రాన్ని ప్రారంభించడానికి 60 శేర్ల రాగులు, 2 బస్తాల కట్టెలు విరాళంగా యిచ్చారు.

గ్రామనాయకుల శిక్షణ శిబిరం

కొందుర్గు బ్లాకు పంచాయతీసమితి అధ్వర్యాన ముట్పూరు (మహబూబునగర్ జిల్లా) గ్రామంలో 1961 నవంబరు 26 వ తేదీనుండి 28 వ తేదీ వరకు గ్రామనాయకుల శిక్షణ శిబిరం నిర్వహించారు గ్రామ నాయకులు, బ్లాకు సిబ్బంది శ్రమదానం ద్వారా 70 కంపోస్టు యెరువుల గోతులు త్రవ్వి, హరిజనులకు తోడ్పడ్డారు

యువజన విద్యా కేంద్రాలు

1961 నవంబరు నెలలో అచ్చంపేట సమితి (మహబూబునగర్ జిల్లా)లో 4వ యువజన విద్యా కేంద్రాలను ప్రారంభించారు.

రూ. 32,500 లతో క్రొత్తపనుల నిర్వహణ

చిత్తూరు జిల్లా, మదనపల్లి బ్లాకులో పంచాయతీరాజ్య దినోత్సవం సందర్భంగా 1961 నవంబరు 1 వ తేదీన నిర్వహించిన క్రొత్తపనుల విలువ రూ. 32,500/= లు ఉంటుందని అంచనా వేశారు.

అధికాహారోత్పత్తి

1961 నవంబరు నెలలో కరీంనగర్ జిల్లా, సుల్తానాబాదు బ్లాకులోని గ్రామాలలో 36 మణుగుల మేలురకం మొక్కజొన్న విత్తనాలను పంచిపెట్టారు 8 యినుపనాగళ్లను, 20 పీడర్లనుకూడా పంచారు 85 సాంస్కృతిక, 59 యెరువుల, 35 వివిధ ప్రదర్శనాలను నిర్వహించారు. 83 కంపోస్టు యెరువుల గోతులు త్రవ్వారు:

తారు రోడ్డుకు రు. 40,000 ప్రజల విరాళం

1961 నవంబరులో కంచడం (కృష్ణా జిల్లా, బంటుమిల్లి బ్లాకు) గ్రామస్థులు తారు రోడ్డు వేయడానికి రూ. 40,000 లు విరాళంగా యిచ్చారు.

ప్రజా గ్రంథాలయం

1961 డిసెంబరులో కడపర్తి (నలగొండ జిల్లా, నకిరేకల్లు పంచాయతీ సమితి) యువజనులు, రూ. 270 ల విలువగల పుస్తకాలు విరాళంగా సేకరించి తమ గ్రామంలో ఒక గ్రంథాలయాన్ని నెలకొల్పారు.

మద్యపాన నిరోధంలో యువజన కబ్‌ల సహాయం

కానూరు, యండపల్లి, సీతనపల్లి, సంగమూడి, కొమ్మలపుడి (కృష్ణా జిల్లా బ్లాకులోని) యువజన క్లబ్బులు, పరిసర గ్రామాలలో మద్యం అమ్మకాన్ని త్రాగుడు అలవాటును నిరోధించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు యువజనుల యీ కృషికి గ్రామ పెద్దలు యెంతో హర్షిస్తున్నారు.

పారిశుద్ధ ఉద్యమం

1961 నవంబరు ఆఖరు వారంలో పొలిశెట్టిపాడు గ్రామశివారులోని గోపాలపురం సుగాలి కాలనీలో పారిశుద్ధ ఉద్యమం ప్రారంభించారు. నాదింతిరువూరు, పత్తాతిరువూరు (కృష్ణా జిల్లా, తిరువూరు బ్లాకు) లలోని హరిజనవాడలలో కూడా యీ ఉద్యమాన్ని కొనసాగించారు పారిశుద్ధపు పోటీలు నిర్వహించారు. బాలల ప్రదర్శన జరిపి, ఆరోగ్యంగా ఉన్న బాలలను యెన్నుకొని బహుమతులు యిచ్చారు

124 యెకరాలలో జపాను వరిసాగు

1961 నవంబరు నెలలో మహబూబునగర్ జిల్లా కల్వకుర్తి బ్లాకులో 124 యెకరాలలో జపాను వరిసాగు పద్ధతిని ప్రవేశ పెట్టారు.

రేడియో శ్రోతల సంఘం

1961 నవంబరు నెలలో మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ బాకులో 2 రేడియో శ్రోతల సంఘాలు, 3 భజన మండలులు యేర్పాటు చేశారు.

సమాజ సౌకర్య కేంద్రం

1961 నవంబరు మాసంలో శ్రీహరిపురం గ్రామం (విశాఖపట్నం జిల్లా, కశింకోట బ్లాకు) లో రూ. 9000 ల ఖర్చుతో ఒక సమాజ సౌకర్య కేంద్రాన్ని ప్రారంభించారు. యిందులో గ్రామంలో కమ్మరి, వడ్రంగపు కళాకారులకు ఉత్తమ విధానాలలో శిక్షణనిస్తారు.



దక్కన్ మిశ్రమజాతి

మొక్కజొన్న

ప్రపంచంలో ముఖ్య ఆహారం, పశుగ్రాసం, వ్యాపార పంటలలో మొక్కజొన్న ఒకటి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా ముఖ్య ఆహార పంటలలో మొక్కజొన్న ఒకటి. 4,67,000 యెకరాలలో యీ పంట వేస్తారు. దీని ఉత్పత్తి 1,26,000 టన్నులని అంచనా వేశారు. వరి పంటకు అవసరమైన నీరులో 3 లేక 4 వంతుల నీరు మాత్రమే మొక్కజొన్న పంటకు అవసరం. వరి పంటకు లభించే నిర్ణీత నీటి పారుదల సౌకర్యంతో వరికన్నా మూడు, నాలుగు వంతుల యెక్కువ విస్తీర్ణంలో యీ పంటను వేయవచ్చు. మొక్కజొన్నకు నీటి అవసరం చాలా తక్కువే అయినా ఉత్పత్తి మాత్రం దాదాపు వరితో సమానంగా ఉంటుంది. అందువల్ల క్రొత్త నీటి పారుదల ప్రాజెక్టుల క్రిందకూ యీ పంట విస్తీర్ణాన్ని యెక్కువ చేయవచ్చు. గ్రామీణ ప్రాంతాలలో మొక్కజొన్నను, జావ, రొట్టె రూపంలో ముఖ్య ఆహారంగా వాడినా పారిశ్రామికంగా మొక్కజొన్న యెంతో ఉపయోగకరమైనది. 500 రకాలుగా దీనిని పారిశ్రామిక రంగంలో వాడుతారు. దేశంలో ఆహార పదార్థాల కొరత యెక్కువగా ఉన్న యీ సమయంలోనూ, పారిశ్రామిక ప్రగతికీ మొక్కజొన్న రెండు విధాలుగాను చాలా ఉపయోగ పడుతుంది. యీ విధంగా ఆహార కొరతను తీర్చుటలో పనికివచ్చేదే గాక, మొక్కజొన్న ఉత్పత్తిని అధికం చేయడం వల్ల పరిశ్రమలకు వివిధ ఉపయోగాలకు కావలసిన ముడి సరుకు కొరతను కూడా యిది కొంత వరకు తీరుస్తుంది. పారిశ్రామిక రంగంలో దీనిని ఉపయోగించడానికి వీలుగా రోజుకు 20 టన్నుల చిక్కని గంజిని ఉత్పత్తి చేసే ఒక గంజి ఉత్పత్తి ఫ్యాక్టరీని హైద్రాబాదులో నెలకొల్పారు. రోజుకు 40 టన్నుల మొక్కజొన్న దీనికి కావాల్సి ఉంటుంది. యీ మొక్కజొన్న చిక్కని గంజిని వస్త్ర పరిశ్రమలు, ఔషధాల పరిశ్రమలలో విరివిగా వాడుతారు కాబట్టి యీ ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయిన గంజికి మార్కెటు కూడా సులభంగా లభిస్తుంది. అందువల్ల మొక్కజొన్న ఉత్పత్తిని అధికం చేయడం యెంతో అవసరం.

ఆంధ్రప్రదేశ్ స్థానిక రకం మొక్కజొన్న ఉత్పత్తి యెకరాకు సగటున 674 పౌండ్లు కాగా అఖిల భారత స్థాయిన యెకరాకు సగటున 707 పౌండ్లు ఉంది. యు.యస్.ఏ. ఉత్పత్తి యెకరాకు 2000 పౌండ్లు. దీనితో పోలిస్తే భారత సగటు ఉత్పత్తి చాలా తక్కువగా ఉంది. అమెరికాలో దీని పంట విస్తీర్ణం యెక్కువగా ఉండడం, మేలురకం మిశ్రమ విత్తనాలు వాడడమే అధికోత్పత్తికి కారణాలు. యు.యస్.ఏ. వ్యవసాయిక అభివృద్ధిలో

మిశ్రమజాతి మొక్కజొన్న విత్తనాలు ప్రముఖ పాత్ర వహించింది.

పశువులు మొక్కలు, పెంపుడు జంతువుల అభివృద్ధికి, యీ మిశ్రమ జాతి మొక్కజొన్న వాడకం జీవశాస్త్ర పరిశోధన రంగంలో అభివృద్ధికర కృషిగా భావించబడుతుంది. వ్యవసాయ ఉత్పత్తులను అధికం చేయడంలో మొక్కజొన్నను ఒక నిదర్శనంగా తీసుకోవచ్చు.

గత పది సంవత్సరాలలో అమెరికా, ఆస్ట్రేలియా కెనడా దేశాలలోని ప్రభుత్వం పరిశోధనా కేంద్రాలు, వ్యవసాయదారుల క్షేత్రాలలో జరిపిన పరిశోధనల ఫలితంగా డబుల్ క్రాసు మిశ్రమ జాతి టెక్సాస్ 26 డిక్సీ, 22 యు యస్. 523 డబ్లు, నెబ్రాస్కా 401 మొదలైనవి స్థానిక రకాలైన వాటికన్నా యెక్కువ ఉత్పత్తిని కల్గిస్తుందని తెలుసుకున్నారు. వ్యవసాయదారుల క్షేత్రాలలో ప్రదర్శించిన యీ మిశ్రమజాతిపంట యెకరాకు 6000 పౌండ్ల ఉత్పత్తి జరిగింది.

యీ విధంగా మేలురకం క్షేత్రాలలో యీ మిశ్రమజాతి విత్తనాల వల్ల ఉత్పత్తిని అధికం చేయవచ్చని పై దృష్టాంతరాలు వెల్లడిస్తున్నవి.

అమెరికా మిశ్రమజాతి చీలిక రకం (డెన్ట్) కావడం వల్ల ఆంధ్రప్రదేశ్‌లోను, భారతదేశంలోని ఇతర ప్రాంతాల రైతులు వీటిని సాధారణంగా ఆమోదించరు. పైగా ఇవి రుచి లేకపోవడమే గాక మరపట్టడం కూడా కష్టం భారతదేశంలోని మొక్కజొన్న పంటలో హెచ్చు భాగం తక్కువ ఉత్పత్తి శక్తితో కూడిన గట్టిరకం. అందువల్ల దేశంలో లభించే రకాల నుండి ఎక్కువ ఉత్పత్తి నివ్వగల మిశ్రమ జాతులను తయారు చేసే అవకాశం చాలా తక్కువ.

భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ, రాక్ ఫెల్లర్ సంస్థ కలసి 19,7 లో ప్రారంభించిన సమన్వయ మొక్కజొన్న పెంపక ప్రాజెక్టు వల్ల ప్రపంచంలోని అన్ని ప్రాంతాలలోని మొక్కజొన్న అంటు నమూనాలు భారతదేశంలోని మొక్కజొన్న ఉత్పత్తిదారులకు లభించే అవకాశం కల్గింది. అదృష్టవశాత్తు హైదరాబాదులో ఉత్తర, దక్షిణ అమెరికా రకాలు రెండు బాగా వృద్ధిచెందుతాయి మన దేశంలో ఈ ప్రత్యేకత ఒక్క హైదరాబాదుకే వుంది. భారతదేశం, క్యూబా, దక్షిణ అమెరికాలోని జాతులు ఇచట వృద్ధిపొందుతున్నాయి. వీటికి తగిన గట్టి గింజ, పెంచి పొట్టుపొర వుండడం వల్ల మనదేశంలోని రైతులకు అనువైన మిశ్రమ జాతిని తయారు చేయడానికి వీలవుతుంది. ఒక జాతిని మరొక జాతితో కలిపి అధికంగా పిండిపదార్థం కల్గి, తెగుళ్ళను, క్రిములను బాగా తట్టుకోగల మేలురకం మిశ్రమజాతిని తయారు చేయడానికి చేసిన ప్రయత్నాలు సఫలమయ్యాయి. మిశ్రమ పద్ధతి ద్వారా ఉత్పత్తి చేయబడుతూ అధికంగా పంపిణీ జరుగుతున్న అట్టి జాతుల్లో దక్కన్ మిశ్రమ మక్కా ఒకటి.

దక్కా మిశ్రమ మక్కా :— రెండు అమెరికా చీలిక (డెన్ట్) రకపు జాతులను, రెండు దక్షిణ అమెరికా గట్టిరకం జాతులను మిశ్రమ చేయడం ద్వారా దక్కా మిశ్రమ మక్కా ఏర్పడుతుంది. ఈ జాతి ముఖ్యలక్షణాలివి.

1. గడ 14—16 ఆకులతో 8 అడుగులు మొదలు 9 అడుగుల వరకు ఏపుగా ఎదుగుతుంది.
2. ఆకు వ్యాధిని నిరోధించే శక్తి ఈ జాతిలో బాగా వుంటుంది.
3. గడకు తొలుచుకు పురుగు బెడద దాదాపు వుండదనే చెప్పవచ్చు.
4. కంకిపై 14 మొదలు 16 వరకు పొరలు వుంటాయి కాబట్టి పక్షుల వల్ల పైరుకు ప్రమాదం వుండదు.
5. 60—65 రోజులలో గడ పువ్వు వేసి 100 మొదలు 110 రోజులలోనే పూర్తిగా పండుతుంది.
6. కంకి 8" మొదలు 9' పొడవు వుంటుంది. 12 నుంచి 16 వరకు గింజ వరుసలు వుంటాయి.
7. నిపుణులు సూచించిన పద్ధతిలో ఈ పంట వేసినట్లయితే ఎకరానికి 4000 పౌనులు పండుతుంది. ఇదే పద్ధతిలో పండించిన దేశవాళీ రకం కంటే ఈ దిగుబడి కనీసం 75 శాతం ఎక్కువ వుంటుంది.
8. గింజ గుండ్రంగా, నారింజ రంగులో దేశవాళీ గింజలను పోలి వుంటుంది.
9 ఖరీఫ్, రబ్బీ—రెండు ఋతువులలోనూ ఈ పైరు వేయవచ్చు.
10. ఈ మిశ్రమ జాతి మొక్కజొన్నను ఒక్క మన రాష్ట్రం

లోనే కాకుండా మైసూరు రాష్ట్రంలో గోకక్ కాలువ క్రింద కూడా పండిస్తున్నారు.

మిశ్రమజాతి మొక్కజొన్న విత్తనాల వినియోగం పెరగటం వల్ల, భారత వ్యవసాయ పరిశోధక మండలిఅధ్వర్యంలో కరీంనగరం జిల్లా హుజూరాబాదు తాలూకా మాదేపల్లి గ్రామంలో దక్కన్ మిశ్రమ జాతి మొక్కజొన్న ఉత్పత్తి ప్రారంభించారు విత్తనాల చల్లకం మొదలు పంట కోత వరకు అన్ని పనులు కూడా రాక్ ఫెల్లర్ ఫౌండేషన్ నిపుణులు, భారత వ్యవసాయ పరిశోధక మండలి ఫౌండేషన్ సీడ్ యూనిటు వారి ప్రత్యక్ష పర్యవేక్షణ క్రింద జరుగుతున్నాయి. ఈ విధంగా ఉత్పత్తి చేసిన 19,700 పౌనుల దక్కన్ మిశ్రమ జాతి మొక్కజొన్న విత్తనాలను ఒక ఎకరానికి, రెండు ఎకరాలకు సరిపోయే విధంగా గుడ్డ సంచులలో నింపి సీలు చేశారు. వీటిని పౌనుకు 75 నయాపైసల చొప్పున అమ్ముతున్నారు. స్థానికరకం విత్తనాల ధర పౌనుకు 15 నయాపైసలు మాత్రమే. సరుకు మొత్తం వెంటనే అమ్ముడు పోయింది ఈ విత్తనాలు లభించక అనేక మంది రైతులు నిరాశ చెందవలసి వచ్చింది

దక్కన్ మిశ్రమజాతి మొక్కజొన్న విత్తనాలకు ఎక్కువ గిరాకీ ఉన్నందు వల్ల ప్రస్తుత రాబీ ఋతువులో మాదేపల్లి గ్రామంలో సుమారు 60 ఎకరాలలో ఈ పంట వేయటానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

ఈ ఉత్పత్తి పథకాన్ని పూర్తిగా అమలుపరిచి 1,08,000 ఎకరాలలో దక్కన్ జాతి మొక్కజొన్న పండించే పక్షంలో మొక్కజొన్న ఉత్పత్తి సులభంగా 48 200 టన్నులు పెరుగుతుంది ఈ అదనపు ఉత్పత్తి విలువ సుమారు రూ. 1,73,52,000 అయినా వుంటుంది. ఈ విధంగా రాష్ట్ర వ్యవసాయ సంపద పెంపొందుతుంది.

మధురానుభూతుల మయమై వెలుగొందే దశలు జీవితంకాదు. వెలుగునుంచి చీకటిని చీకటినుంచి వెలుగుని చూచేదే జీవితం.

బ్రిటన్ చరిత్ర దర్పణం

దేశచరిత్రలు ఆయాదేశాలలో నివసించే జాతుల అభివృద్ధి క్షయాలకు దర్పణాలు. ఏ దేశచరిత్ర చూచినా ఏమున్నది గర్వ కారణం? అంతా పరపీడా పరాయణత్వమే కాన్పిస్తుంది, అనే వారు లేక పోలేదు. అవును, మానవునిలో స్వీయ ప్రాబల్యతృష్ణ, అధికారకాంక్ష అధికం, అందుకే ప్రపంచంలో సతతం కాన్పించే యుద్ధాలు, ఘర్షణలూను అనాదిగా అన్ని దేశాలలో బలహీనుల పైన బలవంతులు స్త్రీలపైన పురుషులు ఒక జాతి లేక తెగపై మరో జాతి లేక కులంవారు, ఆధిక్య సాధన కోసం ఘర్షణ పడ్డారు, కృషి సల్పారు, అదే చరిత్రకారులకు రచనా సామగ్రి అయింది, కవులకు కావ్యవస్తువు అయింది; అదే చైతన్యానికి, సజీవత్వానికి పర్యాయపదంగా మారింది.

దేశచరిత్ర అంటే కేవలం యుద్ధాల వర్ణన, ఏ రాజు లేక ప్రభువు ఎప్పుడు అధికారంలోకి వచ్చింది, పదచ్యుతుడైంది? జనన మరణాల పట్టికలా తేదీలు తెలిపే రికార్డు కాదు వివిధ దేశచరిత్రల నుండి గ్రహించాల్సిన అంశాలు ఎన్నో ఉంటాయి. ప్రత్యేకంగా భారతీయులకు తమ దేశ పూర్వపాలకులయిన బ్రిటిష్ వారి చరిత్ర తెలుసుకోవాల్సిన అవసరం ఎంతోఉన్నది. అభివృద్ధిని కాంక్షించే ప్రతిదేశం, దేశీయుడు ఇతర దేశాల చరిత్రల పఠించ డంవల్ల వాని అభివృద్ధి క్షయాలు, ఆ దేశాల ప్రజలు, పాలకులు ఎట్టి వక్రమార్గాల అవలంబించడంవల్ల పతనమైంది లేక ఏ విధంగా కృషి చేయడంవల్ల అభివృద్ధి చెందింది గ్రహించ గల గడమేకాక తమ మార్గాన్ని అభివృద్ధిపథాన్ని నిర్ణయించుకోగలుగు తాడు. ప్రతి దేశచరిత్రలోను ఆకర్షకమైన ఘట్టాలు, సన్నివేశాలు ఉంటాయి.

రచయిత శ్రీ ఖండవల్లి బాలేందు శేఖరం. బ్రిటన్ అనగా ఇంగ్లాండు, వేల్సు, స్కాట్లెండ్లు కలసిన దేశం, ఆధునిక ప్రపంచలో నేటికి బ్రిటన్ అగ్రరాజ్యాల శ్రేణిలోనే ఉన్నది. బ్రిటిష్ జాతీయులే కొన్ని తరాలక్రితం యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా దేశాలకు వలస వెళ్లారు. అందువల్లవానికి మాతృదేశం వంటిది బ్రిటన్, ఒకప్పుడు బ్రిటన్ ప్రపంచంలోని అన్ని ఖండాలలోను రవి అస్తమించని మహా సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నది. ద్వితీయ ప్రపంచ సంగ్రామానంతరం తన పాలిత దేశాలలో ఉప్పొంగిన ప్రజోద్యమాల ఒత్తిడికి లొంగి వానికి స్వాతంత్ర్యాన్ని ఇవ్వక తప్పింది కాదు. ఇప్పటికే సువిశాలమైన ఆంగ్ల సామ్రాజ్యం అంతరించినా ఇంకా కొన్ని వలసలను కీలక స్థానాలను ఆఫ్రికా ఆసియా ఖండాలలో బ్రిటన్ కల్గి ఉన్నది, ఆంగ్లభాష ప్రపంచ ప్రజలందరికీ ప్రధాన అంతర్జాతీయ భాష. భారతీయులమైన మనం ఆగ్నేయ రాజ్యాంగ విధానాన్ని మాతృకగా తీసుకొని స్వతంత్ర భారత విధానాల కొన్నింటిని రూపొందించుకున్నాం.

ఇతర జాతులతో స్నేహసామరస్యాల పెంపొందిచుకునేందుకు, ఆ దేశాల చరిత్రల చదివి వారి సమస్యలను, మంచి చెడ్డలను అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని ప్రస్తావించడంతో పాటు ఈ గ్రంథ రచయిత తమ "విన్నపం"లో పేర్కొనిన విషయాన్ని ఇక్కడ ప్రస్తావించడం అనవసరం కాబోదు. "బ్రిటన్ దేశంలో నివసించే ప్రతి వ్యక్తి యథాశక్తి ప్రజా జీవితం పాల్గొని నిరపేక్షంగా ప్రజాసేవ చేయాలి. ప్రజాసేవకు ఎట్టి ప్రతిఫలాన్ని ఆశించ గూడదు, ప్రజాసేవ చేయగలందులకై ప్రజలు తనకు ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేయగూడదు, స్వప్రయోజనాల సాధించుకోవడానికి ఉపయోగింప రాదు ఆ విధంగా ఉపయోగించిన వ్యక్తి ప్రజాద్రోహి". బ్రిటిష్

గ్రంథ సమీక్ష

శాస్త్రవిజ్ఞానము–చరిత్ర–తెలుగు–ఉర్దూ అకాడమీ, హైదరాబాద్‌వారు ప్రచురించిన ఈ గ్రంథం వెల రు. 6–00,

దేశచరిత్రలోను ప్రజాజీవితంలోను పాదుకొనిపోయిన ఈ భావాల మన దేశంలో ప్రజాసేవారంగంలో ఉన్నవారు ప్రధానంగా గ్రహించాల్సి ఉన్నది.

శ్రీ ఖండవల్లి బాలేందు శేఖరంగారు ఎనిమిది అధ్యాయాలలో బ్రిటిష్‌వారి చరిత్రను సమగ్రంగా సుబోధకంగా వ్రాసినందుకు తెలుగు ఉర్దూ శాస్త్ర విజ్ఞానము చరిత్ర అకాడమీవారు ఆంధ్ర పాఠకలోకానికి అందించినందుకు అభినందనీయులు.

మన పార్లమెంటు

లోకసభ స్పీకర్ శ్రీ మాడభూషి అనంతశయనం అయ్యంగార్ ఆంగ్లంలో వ్రాసిన గ్రంథానికి శ్రీ తెన్నేటి విశ్వనాథం గారి తెలుగు సేత అయిన యీ ఉత్తమ గ్రంథం వెల రు. 1—50 న. పై. శాస్త్ర విజ్ఞానము చరిత్ర తెలుగు అకాడమీ నాల్గవ ప్రచురణయగు దీని ప్రకాశకులు, అజంతా పబ్లికేషన్స్, సికింద్రాబాద్. ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు గారు దీనికి సుదీర్ఘమైన ఉపోద్ఘాతాన్ని వ్రాసి కేంద్ర రాజ్యవిధాన సభల గూర్చి పరిపూర్ణమైన విజ్ఞానాన్ని అందించారు.

పార్లమెంటు స్పీకర్‌గా విశేషానుభవంగల శ్రీఅనంతశయనం అయ్యంగార్ వ్రాసిన ఈ గ్రంథం సామాన్యజనులకు, బాలబాలికలకు సుబోధకమైన రీతిలో సులభశైలిలో సాధారణ రాజకీయ గ్రంథాలవలెకాక క్రొత్త పక్కీలోసాగింది. శ్రీనారాయణ లోకసభ సభ్యుడు. ఒకనాడు తన భార్యా పిల్లలతో సావకాశంగా కూర్చొని తేనీరు సేవిస్తున్న సమయంలో పార్లమెంటు సమావేశానికి హాజరవవలసినదిగా అధికారికాహ్వానం (సమన్) వస్తుంది. ఆతని కొడుకు శేఖర్, కూతురు కుమారి లీల తమనుగూడా ఢిల్లీకి తీసుకొని వెళ్లి పార్లమెంటు విశేషాలను చూపమంటారు. ఈ విధంగా తమ కుటుంబంతో పాటు ఈ గ్రంధాన్ని చదివే పాఠకుల గూడా శ్రీ నారాయణ ఢిల్లీకితీసుకొనివెళ్లి పార్లమెంటునిర్వహణ విశేషాల సంభాషణల రూపంలో తెలుపుతారు తన పిల్లల సంశయాలతో పాటు పాఠకుల సంశయాల గూడా తీర్చి పార్లమెంటును గూర్చిన సంపూర్ణ విజ్ఞానాన్ని అందిస్తారు.

తొమ్మిది ప్రకరణలు కల ఈ గ్రంథంలో మన రాజ్యాంగం అంటే ఏమిటి? అది ఎలా రూపొందింది, మనరాజ్యాంగపుస్వరూప స్వభావాలు, మనదేశం భౌగోళిక విశేషాలు, భారత రాజధాని ఢిల్లీని గూర్చి పూర్వమరియు ప్రస్తుత చరిత్ర వర్ణింపబడింది, పూర్వ భారతదేశంలో గూడా ప్రజారాజ్యం ఉండిందా? ఇప్పటి మన పార్లమెంటు ఎలా ఆవిర్భవించి ప్రస్తుత స్వరూపానికి వచ్చింది? పార్లమెంటు భవనం ఎలా వుంటుంది, పార్లమెంటు సభా ప్రారంభం అందులోజరిగే చర్చలు తీరుతెన్నులు ఏవిధంగా ఉంటాయి, పార్లమెంటు నిర్వహించే కార్యక్రమం ఏమిటోతెలుసుకోవాలన్న ప్రతి ఒక్కరు చదువ వలసిన గ్రంథం ఇది

మన దేశంలో వయసు వచ్చిన ప్రతి స్త్రీకి పురుషునికి ఓటు హక్కు ఉన్నది. రెండు తడువల జనరల్ ఎన్నికల జరుపుకొని మూడవ మారుగా జనరల్ ఎన్నికల జరుపుకుంటున్నాం. వాక్స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యం, సమావేశ స్వాతంత్ర్యం, సంపూర్ణమత స్వేచ్ఛ, రాజకీయ పార్టీల ఏర్పరచుకునే హక్కును ప్రజాస్వామ్యం మనకు ప్రసాదించింది. వర్గ సమన్వయం, సర్వ సమత్వం సౌభ్రాతృత్వాన్ని సాధించుకోడానికి కంకణధారణ చేసిన మనం మనరాజ్యాంగాన్ని పార్లమెంటునుగూర్చి సంపూర్ణ విజ్ఞానాన్ని ఆర్జించుకోవలసి ఉన్నది. కావున తెలుగు ప్రజలకు ఇట్టి గ్రంథాలు ఎంతో ఉపయుక్తంకాగలవని నిస్సందేహంగా చెప్పవచ్చును.

శ్రీ సి. హెచ్. ఆచార్య

గ్రంథ సమీక్ష

పిల్లల శిక్షణా సమస్యలు

పిల్లల మనస్తత్వమును గురించి మృదుమధురముగ వ్రాయబడిన శాస్త్రగ్రంథములు మనకు చాలా తక్కువగా కలవు, తల్లితండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల పెంపకమునకనుసరించవలసిన విషయములు వారిని విజ్ఞానవంతులుగజేసి దేశసేవకు ఉపకరించునట్లు చేయుభాగములు విపులముగా వ్రాయబడినవి. గ్రంథకర్త వ్రాసినట్లు అన్ని హంశముల పేర్కొనుట కష్టసాధ్యము కాని ముఖ్య విషయముల వీరు చక్కగా వెలువడించిరి. నేటి పిల్లలే భావి పౌరులు అను ముఖ్యోద్దేశము అందరూ గ్రహింపనగును. బాలబాలికల మానసిక చిత్తవృత్తుల లెక్కసేయక పెద్దవారు మెచ్చినరీతిన వారలప్రవర్తింపజేసినందున రానున్న అరిష్టముల గుర్తెరుగవలెను. పిల్లలకు క్రమశిక్షణమొసగి వారలదేశమున కుపయోగ కరులుగా మార్చుబాధ్యత సంఘమునకు గూడగలదు. పిల్లలు తెలియజేయు భావముల, పెద్దలు బలవంతముగా అణగద్రొక్కిన వారిమానసిక ఆరోగ్యము చెడును. ప్రోత్సాహము, ఆదరణభావము, సానుభూతి యత్యవసరము. పిల్లలసహజ ప్రవర్తనలను అనుకరణము, వస్తుసేకరణ, కలహించుట, క్రీడా సహజాతము, సంఘ సహజాతము అను భాగములు; భయములు; అవసరాలు, ఇబ్బందులు; ఉత్సాహ ప్రవర్తన; ప్రవర్తనకు మారాంగములు_ వార సత్వము, శరీరస్థితి బుద్ధికుశలత, గృహపరిసరప్రభావములు, ఆర్థిక పరిస్థితులు, సంఘపరిస్థితులు శిక్షణాపరిసితులు, ఆత్మవిచారణా దృష్టి అనుహంశములు బాగుగావివరింపబడిన గ్రంథమే ఈ పిల్లల శిక్షణా సమస్యలు. గ్రంథకర్త_ శ్రీ కె. వేదాంతాచారి M. A. (L nd) M.Ed (Osm.) పేజీలు_212. ప్రచురణ _ శాస్త్ర విజ్ఞానము, చరిత్ర, తెలుగు, ఉర్దూ అకాడమీ, హైదరాబాదు పిల్లల ప్రవర్తనకు తల్లితండ్రుల, పెద్దల, ఉపాధ్యాయుల వైఖరులే ముఖ్యకారణములనుసూత్రము గ్రహింపవలెను. మానసిక వాతావరణము, పిల్లలకు పెద్దలకుగలభేదములతారతమ్యత, ఇంటిమర్యాదను కాపాడవైఖరిని కలిగించు దృష్టితో పిల్లలను పెంచు విధానము ముఖ్యహంశములు, పిల్లల దురలవాట్లు_దుష్ట ప్రవర్తనలు, సమస్యల విధానములు క్రమశిక్షణ _ అందలి సమస్యలు, పిల్లలను దండించుటవలని అపకార ఉపకారములు మొదలగు విషయములు విపులముగానున్నవి. పిల్లల శిక్షణ యందలి విద్యేతర కార్యకలాపములు బుద్ధి వికాసము నకు జెందిన సమస్యలు అందరూ గ్రహించిన. పిల్లలు అభివృద్ధి నొంది భావి ఉత్తమ పౌరులై, వారల కర్తవ్యముల, బాధ్యతల సక్రమముగా నిర్వర్తింప గలరను హంశములు చక్కగా విశదీకరింపబడినవి ఈ గ్రంథము అందరూ చదివిన ఆచరింపవలసిన విధులు అనేకములు గ్రహింప గలరు

శ్రీ వి. యస్. దివాకరుని.

గ్రంథ సమీక్ష:

చూచినకొద్ది చోద్యం గొలిపే చుక్కలతీరు

బైబిల్ ప్రారంభమందున్న సృష్టికథను, సృష్టి క్రమమును నిజముకాదని నిరూపించిన ఈ నాటి వైజ్ఞానికుల పరిశోధనా ఫలితములు ప్రశంసింపదగినవి మన పంచాంగకర్తలు భూగోళము ప్రారంభమై నేటికి నూట తొంబదియైదు కోట్ల, ఏబదియెనిమిదిలక్షల ఎనుబదియైదువేల, నలుబదియెనిమిది సంవత్సరములైనట్లు తెల్పిన విషయములను స్థిరపరచిన విధానము గర్వింపదగిన విషయము. విజ్ఞానాభివృద్ధి జ్యోతిర్విజ్ఞానముతో ప్రారంభమైనది. నక్షత్ర గోళమునకుచెందిన రహస్యములు ఋగ్వేదమందునూ, వ్యాసభాగవతమందునూ గాననగును. వేదఋషి దీక్షితమును ప్రాచీన, నవీన గణకులకు తెల్పిన భూచక్ర వివరములు శాఖోపశాఖలుగా పెరిగి నేటి గణిత, ప్రకృతి, శాస్త్రాభివృద్ధికి ముఖ్యకారణములైనవి. చంద్రచారమానమున మాసములేర్పడుట, గ్రహణములస్థితి, తురీణమనుగణిత యంత్రము వేదకాలము నాటిదని తెలిసిన విషయములు వీటి నన్నిటిని గురించియు సూర్య గోళమునకు, నక్షత్ర గోళములకు గల తారతమ్యత అందు జ్యేష్ఠా నక్షత్ర పరిణామాది విశేషముల గురించి చక్కగా తెలుపు గ్రంథము జ్యోతిర్వేదము గ్రంథకర్త—కీ. శే. శ్రీ గొబ్బూరు వెంకటానంద రాఘవరావు, 210 పేజీలు. వెల—3—00 ప్రచురణ— శాస్త్రవిజ్ఞానము, చరిత్ర, తెలుగు, ఉర్దూ, అకాడమీ హైదరాబాదు. శ్రీ రాఘవరావు గారు వివరించిన జ్యేష్ఠ—మృగశిరా నక్షత్రముల సంబంధము, ఆరుద్ర గంగావతరణ సంబంధము, మేఘముల ఘనతవర్ణించు భాగములు సహేతుకములుగా నున్నవి. గ్రహములు సంచరించు జ్యోతిశ్చక్రము 27 భాగములు గలిగి యుండుట, వానికి 27 నక్షత్రముల పేర్లు గల్గుట అవి చంద్రాచారమును జూపునైయు రాశ్లగుట నక్షత్రనామముల ననుసరించి మాసముల పేర్లేర్పడుట, కార్తెలేర్పడుట, కార్తెదినములలో భూమిమీది వానిప్రభావములు, నక్షత్రముల స్థానవిశిష్టత తెల్పుభాగములు చదువముదము గూర్చుచున్నవి. ద్వాదశరాసులు మనకు గ్రీకుదేశస్థులు నేర్పినదిగాదు. ద్వాదశరాసుల గూర్చిన వేదవిజ్ఞానము విశదీకరించి మనదేశ ఉన్నత స్థితిని తెలియజేసినారు. విశ్వోత్పత్తి వర్ణించు నాల్గవ ప్రకరణము చదివిన అనేక రహస్యములు బయల్పడును విశ్వశిల్పిస్థానము, స్వాతి నక్షత్రవివరములు, విశ్వోత్పత్తి ఇతర వివరములు, సూర్యకుటుంబగతి, ఇతర పురాణ గాథలు ఐదవ ప్రకరణమందు వివరింపబడినవి. గోళబాహుళ్యము, అర్జునుడు సందర్శించిన విశ్వరూప విషయములు ఆరవ ప్రకరమందున్నవి. సూర్యకుటుంబమందలి గ్రహములు, అవల నక్షత్రరూపమున వెలుగు తారా సమూహములు, కాంతిచక్రవిభజన, ధనురాశి గొప్పతనము,

మొదలుగాగల విషయములు ఏడవ ప్రకరణమందున్నవి. హిందువుల పండుగలు, వానికి గల పురాణ సంబంధములు ఎనిమిదవ ప్రకరణమందున్నవి.

శ్రీ రాఘవ రావుగారు వ్రాసిన 'నక్షత్రములు' అనుపుస్తకము అనేకులచే మన్ననపొందినది. వీరికి జ్యోతిర్విద్యావిశారద యను బిరుదము నిచ్చిరి. ప్రాచీన విజ్ఞానాన్ని ఆధునిక శాస్త్రములతో సమన్వయించగల ప్రజ్ఞాధురీణులగు వీరి జ్యోతిర్వేద రచన అమూల్యము. పెక్కు పౌరాణిక గాథలు నక్షత్రవిజ్ఞానముతో వ్యాఖ్యానింపబడినవి. వేద విహిత ధర్మములు చక్కగా విమర్శింపబడినవి ప్రస్తుత నూతనములనబడు అనేక విషయములు మన ప్రాచీనులకు అనాదిగా తెలియుట నిరూపింపబడినది. ఈ గ్రంథము శాస్త్రాభిమానులెల్లరూ ఆ మూలాగ్రముగా చదువవలయును.

శ్రీ వి. యస్. దివాకరుని

రెండు లఘుకృతులు


శ్రీ వేంకటేశప్రపత్తి (గేయకావ్యము). రచయిత:— శ్రీ సామవేదం జానకిరామశర్మ. క్రౌన్ ఆక్టెవో 32 పుటలు. వెల:50 న. పై. ప్రకాశకులు:— శ్రీ గోదా గ్రంథమాల, శ్రీమన్నారాయణపురము, ఉల్లిపాలెము పోస్టు, దివితాలూకా కృష్ణాజిల్లా.

శ్రీ వేంకటేశ ప్రపత్తి ఒక లఘుగేయకావ్యము. ఇందలి రచన అంతయును మాత్రాచ్ఛందస్సులో ఉండుట వలన గాన యోగ్యముగ నున్నది. గానయోగ్యమైనది గేయముకదా. విశిష్టాద్వైతమునకు శరణాగతి పరాకాష్ఠ. అనగా భక్తుడు భగవంతునికి నిర్నిబంధమైన శరణాగతి పొందుట. దీనినే భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు 'సర్వధర్మాన్' అను శ్లోకమున వివరించినాడు. శ్రీ తిరుమల తిరుపతి శ్రీనివాసుడు తెలుగువారల కిష్టదైవము. అతనిని కథావస్తువునుగా జేసుకొని ఎన్నియో రచనలు వెలువడినవి, వెలువడుచున్నవి. శ్రీ సామవేదము జానకిరామ శర్మగారు సులభశైలిలో ఈ పొత్తమును రచించినారు. అంతేగాక వీరు సాహితియను మాస పత్రికను నడపుచు ఆంధ్రభారతికి సేవ చేయుచున్నారు. కలియుగమున వేంకటనాయకుడు ప్రత్యక్ష దైవమని ప్రతీతి (కలౌ వేంకటనాయకః) ఈ రచన ఆ పరమాత్మకునివాళులర్పించుచున్నది. విశిష్టాద్వైతమత సిద్ధాంత ప్రచారమునకీవిధముగ తత్సంబంధమైన గ్రంథములను ప్రకటించు శ్రీ గోదాగ్రంథమాలవారి నభినందించక తప్పదు.

* * *

జడివాన (ఖండకావ్యము) రచయిత:— గోరస వీరబ్రహ్మాచారి, క్రౌన్ ఆక్టెవో ×11+33 పుటలు; మూల్యం ఒక రూపాయి కాపీలకు:— గ్రంథకర్త పేర, విరవ (వయా) పిఠాపురం, తూర్పు గోదావరి జిల్లా అని వ్రాయవలెను. ఈ కావ్య రచన నూతన మార్గమున నడచినది. ఇందలి పద్యము లన్నియు గీతములు. స్ఫూర్తిశ్రీ ఈ చిరుకబ్బమునకు వ్రాసిన పరిచయ వాక్యములవి:— "శ్రీ వీరబ్రహ్మాచారిగారు తమ కావ్యమునకు గాలమునకు గట్టి ముడి వేసిరి. మొదటి జడి, స్మృతులు—గత కాలిక విషయపర్యాలోకనము; రెండవ జడి, విరహము—మధ్యమాన మధ్యమావస్థ; మూడవ జడి, అన్వేషణము—ఆశాకల్పనము. ఆచారిగారు ప్రకృతిని ప్రియురాలుగా దర్శించి చిత్రించిరి." పద్యములన్నియు సులభశైలిలో ఉండుట వలన సుబోధకముగ నున్నవి. 'సంగమే విప్రయోగాంతశ్చ' అనునానుడి ఈ గ్రంథమునకు మూలభావముగా నున్నట్లు తోచుచున్నది. కవి వర్ధిష్ణువు. శ్రీ గోరస వీరబ్రహ్మాచారి ఇంకను పెక్కు కావ్య ఖండికలను రచించి ఆంధ్రభాషా యోషకు వరివస్య గావింతురుగాక.

'వి'



సంవత్సరం పాటు

గురజాడ శత జయంత్యుత్సవాలు

శ్రీ బోయి భీమన్న అధ్యక్షతను కార్యనిర్వాహక ఉపసంఘం

గురజాడ శతజయంత్యుత్సవసంఘం ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్య అధ్యక్షతన గత 27 వ తేదీన "గ్రీన్‌లాండ్సు" లో సమావేశమై వచ్చే సెప్టెంబరునుంచి ఏడాదిపాటు ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించాలని తీర్మానించింది.

గురజాడ శత జయంత్యుత్సవ కార్యక్రమాన్ని రూపొందించి ఆచరణలో పెట్టేందుకు ఈ క్రిందివారితో ఒక ఉపసంఘాన్ని కూడా ఏర్పాటుచేశారు. శ్రీయుతులు బోయి భీమన్న (అధ్యక్షుడు) దేవులపల్లి రామానుజ రావు, అబ్బూరి రామకృష్ణారావు దాశరథి, పెమ్మరాజు వెంకట్రావు, గిడుగు వెంకట సీతాపతి (సభ్యులు).

ఈ సంఘంలోలేని వారిని సమావేశాలకు పిలిచి సహాయం కోరేందుకు, అవసరమైన సిబ్బందిని ఏర్పాటుచేసుకోడానికి ఈ ఉపసంఘానికి అధికారం ఇచ్చారు.

ఇందునిమిత్తం ప్రభుత్వం మంజూరుచేసిన ధనాన్ని శ్రీ భీమన్నకు అప్పగించడానికి నిర్ణయించారు.

కార్యక్రమాలు

కన్యా శుల్కం నాటకాన్ని హైద్రాబాదు, వరంగల్లు, విజయవాడ, విజయనగరం, అనంతపురం, లోను, అవసరమైతే మరి కొన్ని చోట్ల ప్రదర్శిస్తారు.


పూర్ణమ్మ, లవణరాజుకల, కన్యకగేయాలను నృత్యనాటికలుగా తయారుచేసి అనుకూలమైన చోట్ల ప్రదర్శిస్తారు.

టాగూర్ ప్రదర్శన పద్ధతిలో గురజాడ రచనలు, జీవిత చిత్రాలు, మొదలైన వాటితో ప్రదర్శన ఏర్పాటు చేస్తారు.

ఇంగ్లీషు, తెలుగు, భాషలలో స్మారకసంచికను ప్రకటిస్తారు. శతజయంతి సంవత్సరంలో గురజాడ స్మారకార్థం తపాల బిళ్ళను ముద్రించ వలసిందని కేంద్రప్రభుత్వాన్ని కోరుతారు.

గురజాడ రచనలలో కొన్నిటిని ఇంగ్లీషులో పరివర్తన చేయించడానికి కృషి చేస్తారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గురజాడ స్మారకోపన్యాసాలను ఏర్పాటుచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తారు.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

సమాచార, ప్రజాసంబంధశాఖ, హైదరాబాదు

పట్టిక

ఇంగ్లీషు		రూ. న. పై.
1. అరకులోయ	..	0 – 60
2. ఆంధ్రప్రదేశ్—విశేషాలు	..	0 – 25
తెలుగు		
1. శ్రీ అల్లూరి సీతారామరాజు జీవితచరిత్ర		2 – 75
1 'ప్రగతి గీతాలు'	..	0 – 25
ఉరుదు		
1. ఆహారోత్పత్తి	..	0 – 12
2. గిరిజన సంక్షేమం	..	0 – 12
3. మత్స్యసంపద	..	0 – 12

పోస్టేజి అదనం

ప్రతులను సమాచార, ప్రజా సంబంధ శాఖ
సమాచార కేంద్రంనుంచి పొందవచ్చు.

Edited & Published by the Director of Information & Public Relations, Andhra Pradesh, Hyderabad-1
Printed at Vir Milap Press, Mukarramjahi Road, Hyderabad. 1

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం

వైశాల్యం	1,06,052 చదరపు మైళ్ళు
జనసంఖ్య	35,977,999*
పురుషులు	18,175,349*
స్త్రీలు	17,802,650*
సగటు వర్షపాతం	35.65"
అరణ్య ప్రదేశం	1,40,26,000 ఎకరాలు
జిల్లాలు	20
తాలూకాలు	189
రెవిన్యూ సర్కిళ్లు	1,000
పట్టణాలు	223
గ్రామాలు	28,945
పంటలక్రింది ప్రదేశం (58-59)	2,73,02,000 ఎకరాలు
కౌళ్ళ సంఖ్య	42,45,832
1958-59 లో నీటి పారుదలను పొందిన ప్రదేశం ...	86,29,000 ఎకరాలు
1958-59 లో వుత్పత్తి అయిన ఆహారధాన్యాలు ...	61.56 లక్షల టన్నులు
పాల వుత్పత్తి	15.5 లక్షల గ్యాలన్లు
రైలు మార్గాలు	3009.13 మైళ్ళు
జాతీయ రహదార్లు	1,415 ,,
రాష్ట్ర రహదార్లు	3593 ,,
జిల్లా పెద్ద రోడ్లు	8220 ,,
జిల్లా ఇతర రోడ్లు	2852 ,,
గ్రామాల రోడ్లు	3442 ,,
పాఠశాలలు	36,375
కళాశాలలు (1959-60)	113
వృత్తి విద్యా కళాశాలలు	36
తృతీయ పంచవర్ష ప్రణాళిక ప్రమాణం	రూ. 305 కోట్లు

1961-62 బడ్జెటు:

ఆదాయం ...	రూ. 85.12 కోట్లు
వ్యయం	,, 87.62 ,,
పెట్టుబడి ఖర్చు	,, 34.55 ,,

* (1961 జనాభా లెక్కల తాత్కాలిక వివరాల ప్రకారం)

